

'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 సంచిక: 292

SUNDAY Special | ఆదివారం 12-1-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



మొహమ్మద్ షమీ పునరాగమనం

ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్ కోసం ప్రకటించిన జట్టులో పేసర్ షమీకి చోటు దక్కింది. 2023 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్ తర్వాత షమీ గాయంతో జట్టుకు దూరమయ్యాడు.

- వివరాలు 14లో



మన ముంగిళ్లకు పండుగ కళ

ధనుర్మాసంలో ప్రతి ఇంటిముందు తెల్లవారుజామున ఇంటిముందు అందమైన ముగ్గులు వేసి ముగ్గు మధ్యలో గొబ్బెమ్మలు పెట్టి పూజించడం ఆచారం.

- వివరాలు 13లో

27న రాష్ట్రానికి ఖర్గే, రాహుల్

- సంవిధాన్ బచావో కార్యక్రమంలో భాగంగా బహిరంగ సభ
- జనవరి నెలాఖరుకల్లా కార్పొరేషన్ పదవుల భర్తీ
- పీసీసీ కార్యవర్గం కూడా పూర్తి చేస్తాం... ముగ్గురు లేదా నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు
- విలేకరులతో ఇష్టాగోష్టిలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

2లో





సంక్రాంతి నేపథ్యంలో జనం సొంతూళ్లకు వెళ్తుండటంతో శనివారం పెద్ద అంబర్‌పేట–విజయవాడ మార్గంలో వాహనాల రద్దీ

16లో

మేళాకు వేళాయె

కుంభమేళాకు చేరుకునేందుకు దేశవ్యాప్తంగా 13 వేల రైళ్ల రాకపోకలు

- విజయవాడ, సికింద్రాబాద్‌ల నుంచి నేరుగా ప్రయాగ్‌రాజ్‌కు రైళ్లు
- హైదరాబాద్ నుంచి ప్రయాగ్‌రాజ్‌కు నేరుగా విమానసేవలు
- అందుబాటులో టెంట్‌లు, విల్లాలు

www.irctctourism.com, www.upstdc.co.in వెబ్‌సైట్ల ద్వారా బస కోసం బుకింగ్స్

6లో

తెలుగులోనూ కుంభమేళా సమాచారం

రోజూ సరాసరి కోటిమంది హాజరయ్యే అవకాశం ఉన్న మహా కుంభమేళా ప్రాంతంలో సామాన్య భక్తులు సైతం అన్ని కార్యక్రమాల తాజా సమాచారం ఎప్పటికప్పుడు వాట్సాప్, మొబైల్ యాప్‌ల ద్వారా తెలుసుకోవచ్చు. తెలుగు సహా మొత్తం 11 భాషల్లో వాట్సాప్, మొబైల్ యాప్‌ల ద్వారా కుంభమేళా సమాచారం భక్తులు తెలుసుకునేలా ఏర్పాట్లు చేశారు. వాట్సాప్‌లో 88878-47135 ఫోన్ నంబర్‌కు హెచ్‌ఐ (హాయ్) అని మెసేజ్ చేసి 11 భాషల్లో తమకు నచ్చిన బాషను ఎంపిక చేసుకుని ఆ తర్వాత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విధానంలో తమకు కావాల్సిన కుంభమేళా సమాచారాన్ని సులభంగా తెలుసుకోవచ్చు. భక్తుని ఫోన్ నంబర్ 'కుంభ్ సహాయక్ యాప్' (kumbh sahayak app) ద్వారా భక్తులు తాము వెళ్లదలుచుకున్న పుష్కర ఘాట్‌లతో పాటు ఆ ప్రాంతంలో ఉండే ఆలయాలకు ఎలా వెళ్లాలో సూచించే ఏర్పాట్లను సైతం యాప్‌లో పొందుపరిచారు. యాప్ ద్వారా ఎప్పటికప్పుడు భక్తుల రద్దీ సమాచారం సైతంసుదూర ప్రాంతాల్లో ఇంటి వద్దనే ఉండే సామాన్య భక్తులకు సైతం తెలిసేలా ఏర్పాటు చేశారు. భక్తులు తమ ఫోన్లలో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న అనంతరం తమ ఫోన్ నంబర్ యాప్‌లో నమోదు చేయాల్సిన అవసరం లేకుండానే యాప్ ద్వారా సమగ్ర వివరాలను తెలుసుకోవచ్చు.



శనివారం యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో ర్యాలీగా వస్తున్న సాధువులు

కొలువులిస్తే రాయితీ

స్థానికులకు ఉద్యోగాలిచ్చే గ్రీన్ ఎనర్జీ సంస్థలకు సర్కారు సాయం



తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025ను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి జూపల్లి

- 10 శాతం అద్దెకే పరిశ్రమలకు సర్కారీ భూములు
- బ్యాటరీ తయారీ పరిశ్రమలకు 20% పెట్టుబడి రాయితీ
- 2035 నాటికి 50,063 మెగావాట్లకు పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి
- రాష్ట్ర డిస్కంలకు విద్యుత్ విక్రయిస్తే ప్రత్యేక రాయితీలు
- స్టార్టప్‌ల ప్రోత్సాహానికి ప్రత్యేక ఇంక్యుబేషన్ సెంటర్
- రైతు, సహకార సంఘాల ప్లాంట్లకు అదనపు ప్రోత్సాహకాలు
- తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025లో ప్రకటన
- పాలసీని ఆవిష్కరించిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

- వివరాలు 12లో

సాగర్‌కు 'బొల్లపల్లి' గండి

- కుడికాల్వ ద్వారా వరద జలాల తరలింపుపై ఏపీ ప్రతిపాదన
- 150 టీఎంసీలతో బొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణం
- గోదావరి–బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు కింద ఏపీ ప్రతిపాదన
- కేంద్రానికి ఏపీ ప్రతిపాదనలు చేరడంతో తెలంగాణ అప్రమత్తం
- కృష్ణా, గోదావరి బోర్డులు, ఏపీ సీఎస్‌కు లేఖ రాయాలని ఆదేశం

12లో



కొత్త కంపెనీలను పిలవండి

- మద్యం సరఫరాపై ఎక్సైజ్ శాఖకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- మద్యం రేట్ల పెంపు విషయంలో కంపెనీల ఒత్తిళ్లకు తలొగ్గేది లేదు... ధరల నిర్ణాయక కమిటీ నివేదికను వీలైనంత త్వరగా తెప్పించండి

2లో

కొత్త 'ఉస్మానియా'కు నెలాఖరులోగా శంకుస్థాపన

- అత్యాధునిక వసతులతో ఆస్పత్రికి కొత్త భవన నిర్మాణం.. అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం
- ప్రతిపాదిత గోషామహల్ స్టేడియం ప్రాంతం వివరాలపై ఆరా

2లో

ప్రమాదవశాత్తూ పేలిన తుపాకీ.. పంజాబ్ ఆప్ ఎమ్మెల్యే మృతి

పిస్టల్‌ను శుభ్రం చేస్తుండగా గుర్‌ప్రీత్ బస్సి గోగి కణత నుంచి దూసుకెళ్లిన తూటా

6లో



ఇంటి నుంచి బయలుదేరే ముందు యువకుల ఫోటో (సీసీ ఫుటేజ్)

ప్రాణాలు తీసిన సరదా!

కొండపోచమ్మ సాగర్‌లో మునిగి ఐదుగురి మృతి

సెల్ఫీ దిగుతూ నీటిలో పడిన యువకుడు	కాపాడబోయి మరో నలుగురు గల్లంతు	మృతులంతా హైదరాబాద్ వారే

సాక్షి,హైదరాబాద్/గజ్వేల్/ముషీరాబాద్/బన్సీలాల్‌పేట్/ఖైరతాబాద్: పండుగ సెలవుల్లో సరదాగా గడుపుదామని వెళ్లిన ఆ యువకులకు.. అదే చివరి ప్రయాణమైంది. ఆట విడుపే ఆఖరి క్షణమైంది. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్‌లో మునిగి శనివారం ఐదుగురు యువకులు మృతి చెందారు. హైదరాబాద్ నగరంలోని ముషీరాబాద్ ఇందిరానగర్‌కు చెందిన ధనుష్ (20), లోహిత్ అలియాస్ లక్కీ (17) సోదరులు. బన్సీలాల్‌పేటలోని కవాడిగూడకు చెందిన చీకట్ల దినేశ్వర్ (18), ఖైరతాబాద్‌కు చెందిన జతిన్ (17), రాంనగర్‌కు చెందిన మృగాంక్ (17), ఎండీ ఇబ్రహీం (20), అత్తాపూర్‌కు చెందిన సాహిల్ వీరికి స్నేహితులు. శనివారం సెలవు కావడంతో సిద్దిపేట జిల్లా కొమురవెల్లి ఆలయం, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ సందర్శనకు వెళ్లారు. నేరుగా కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్‌కు చేరుకొన్న వీరంతా సరదాగా గడిపేందుకు కట్టపై నుంచి కిందికి దిగారు. సెల్ఫీలు దిగుతున్న సమయంలో లోహిత్ కాలుజారి నీళ్లలో పడ్డాడు. అతన్ని కాపాడే ప్రయత్నంలో ధనుష్, సాహిల్, దినేశ్వర్, జతిన్ సైతం

మిగతా 12వ పేజీలో ▶

ర్యాంకు ఆధారంగా ఇందిరమ్మ ఇల్లు

పేదరిక స్థాయిని బట్టి ర్యాంకులు

- ఏడు ప్రశ్నల ద్వారా అర్హుల నిర్ధారణ
- మొబైల్ యాప్ ద్వారా జాబితా సిద్ధం
- 95 శాతం ప్రక్రియ పూర్తి
- 21 నుంచి 25 వరకు గ్రామ సభల్లో చర్చ
- మార్పులు చేర్పులతో తుది జాబితా ఖరారు

5లో



సంక్రాంతి ముందే

సలసల



భారీగా పెరిగిన నిత్యావసరాల ధరలు

నువ్వులు, శనగపప్పు, బియ్యం పిండి, నూనెల ధరలన్నీ పిరం

బేగంబజార్ మార్కెట్ మొదలు మాల్స్ వరకు మండుతున్న రేట్లు

బియ్యం, కందిపప్పు ధరలు మాత్రం తగ్గుదల

సాక్షి, హైదరాబాద్: సంక్రాంత్రి పండుగ సామాన్యుడికి భారమైంది. పట్టణం నుంచి పల్లె వరకు ప్రజలంతా నిత్యావసర ధరలను చూసి భయపడిపోతున్నారు. పల్లెల్లోని రైతులకు పిండివంటలకు అవసరమైన బియ్యం సొంత పొలాల నుంచే వచ్చినా.. సకినాలు, గారెలకు కావాల్సిన నువ్వులు, వాము(వంద గ్రాములకు రూ. 40), శనగలు, వేరుశనగ వంటి పప్పు, నూనె ధాన్యాల ధరలు భారీగా ఉన్నాయి. పండుగకు తప్పదనే ధోరణితో ఉన్న దాంట్లోనే పొదుపు పాటిస్తూ నిత్యావసరాలను కొనుగోలు చేస్తున్నారు. హైదరాబాద్‌లోని బేగంబజార్ వంటి ప్రధాన మార్కెట్లలో కొనుగోళ్లు తగ్గాయి. పెరిగిన ధరలతోపాటు నగరవాసులు ఊళ్లకు వెళ్లడం కూడా అందుకు కారణంగా చెబుతున్నారు. రాష్ట్రంలో డబ్బు సర్క్యులేషన్ కూడా ఆశించిన స్థాయిలో లేనందున కూడా గిరాకీలు తగ్గినట్టు చెబుతున్నారు. చేతినిండా పనిలేని కారణంగా ఆశించిన మేర డబ్బు ఆడడం లేదన్న వాదన కూడా వినిపిస్తోంది.

కాగుతున్న నూనెలు..

సంక్రాంతి వస్తుందంటే వారం రోజుల ముందు నుంచే ఇళ్లలో పిండి వంటలు ఘుమఘుమలాడేవి. ధరలు పెరిగిన నేపథ్యంలో పేద, మధ్య తరగతి కుటుంబాల వారు పిండి వంటలకు దూరమవుతున్నారు. నాలుగు నెలల్లోనే నూనె లీటర్ ధర రూ.10 నుంచి రూ.15 వరకు, పప్పు ధాన్యాల ధరలు 10 శాతంకు పైగా పెరిగాయి. ఈ తేడా గత ఆగస్టు నెలతో పోలిస్తే రూ. 25 నుంచి రూ.30 వరకు ఉంది. అంతర్జాతీయంగా చోటు చేసుకుంటున్న యుద్ధ వాతావరణంతోపాటు నూనెల దిగుమతిపై కేంద్ర ప్రభుత్వం సుంకం పెంచడంతో పామాయిల్ లీటర్ ధర ఒక్కసారిగా రూ.94 నుంచి రూ.129కి చేరింది. సన్‌ఫ్లవర్ నూనె లీటరుకు రూ.145 నుంచి రూ.150 వరకు, పల్లీ నూనె లీటరుకు రూ.160కి పైగా, రైస్ బ్రాండ్ రూ.147 నుంచి రూ.160 ఉన్నాయి. నెలరోజుల క్రితం నూనె ధరలు ఇంకొంచెం అధికంగా ఉండగా, జనవరి మొదటివారంలో కొంత మేర తగ్గాయి.

ఉడకనంటున్న పప్పు

పిండి వంటలు చేసుకోవడానికి పప్పు ధాన్యాలే ముఖ్యం. ఏ పప్పు ముట్టుకున్నా వాటి ధరలు నిప్పుల్లా కాలుతున్నాయి. ప్రస్తుతం శనగపప్పు కిలోకు రూ.100, నువ్వులు రూ. 170, బెల్లం రూ. 70, గోధుమ పిండి ప్యాకెట్ రూ. 60గా ఉంది. కాగా కందిపప్పు, పెసరపప్పు ధరలు ఈనెల మొదటి వారం నుంచి కొంత తగ్గుముఖం పట్టడం కొంత ఊరట. కందిపప్పు రూ.158, మినప గుండ్లు రూ. 164, పెసరపప్పు రూ. 120కి తగ్గాయి. కొత్త బియ్యం రూ. 60, పాతబియ్యం రూ.70 పైనే ఉండగా, మొన్నటి వానాకాలం సీజన్‌లో పండిన పంటకు సంబంధించిన నాణ్యమైన బియ్యం ధర మాత్రమే కిలో రూ. 60 కన్నా తక్కువగా ఉంది. జైశ్రీరాం, తెలంగాణ సోనా, హెచ్ఎంటీ, బీపీటీ వంటి సన్నబియ్యం ధర పాతవైతే కిలో రూ.70 వరకు పలుకుతోంది. నాణ్యమైన వెల్లుల్లి ధర కిలో రూ. 450 నుంచి రూ. 500 వరకు ఉంది. ఇంత మొత్తంలో చెల్లించి సామాన్యులు వెల్లుల్లి కొనలేకపోతున్నారు. ఉల్లిగడ్డ ధరలు తగ్గుముఖం పట్టినట్టు చెబుతున్నా, హైదరాబాద్‌లో కిలో రూ. 50కి తక్కువగా లేదు. ఇతర కూరగాయ రేట్లు కూడా అదే స్థాయిలో ఉన్నాయి.



ఈ ఫొటోలో కనిపిస్తున్నది జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లోని ఓ కిరాణాకొట్టు. సరుకుల కోసం పండుగ వేళ దుకాణంలోకి వస్తున్న వినియోగదారులు సగం సంబరం–సగం కష్టం అన్నట్టుగా కనిపిస్తున్నారు. ఒకవైపు పిల్లలు పండుగకు వస్తున్న సంతోషం, మరోవైపు ధరలు పెరిగిన అసంతృప్తి వారి ముఖాల్లో స్పష్టంగా కనిపిస్తుంది. సంక్రాంతికి తమ వద్దకు వచ్చే కస్టమర్లలో చాలామంది సంతోషంగా సరుకులను తీసుకుపోవడం లేదని, తప్పనిసరి పరిస్థితుల్లో ఖరీదు చేస్తున్నారని దుకాణ యజమాని చెప్పారు.

పండుగల సమయంలో హెచ్చుతగ్గులు సహజమే



ధరల హెచ్చుతగ్గులకు జాతీయ, అంతర్జాతీయ అంశాలతోపాటు వాతావరణం కూడా ప్రభావం చూపుతుంది. నూనెలు, పప్పుల ధరల గత కొంతకాలంగా పెరిగాయి. పండుగల సమయంలో నిత్యావసర వస్తువుల ధరల్లో 5 నుంచి 10 శాతం హెచ్చుతగ్గులు సహజమే. కొన్నేళ్లుగా పండుగలు వచ్చినప్పుడు హైదరాబాద్ రిటైల్ మార్కెట్‌లో సందడి తగ్గింది. నగరవాసులు సొంతూర్లకు వెళుతుండడంతో బేగంబజార్ దుకాణాల్లో గిరాకీ ఉండడం లేదు.

– జీవన్ భాటి, కిరాణ మర్చంట్స్ అసోసియేషన్, బేగంబజార్

ధరల మంటపై ప్రజాభిప్రాయం.. సాక్షి ప్లస్ (ఈ-పేపర్)లో

పప్పులు (కిలో)	ప్రస్తుతం	ఆరు నెలల క్రితం
శనగపప్పు	రూ.100	రూ.81
బొబ్బరపప్పు	రూ.102	రూ.90
చక్కెర	రూ.38	రూ.34
బెల్లం	రూ.70	రూ.58
గోధుమపిండి	రూ.58	రూ.48

నూనెల ధరలు (లీటర్) ఇలా	ప్రస్తుతం	ఆరు నెలల క్రితం
పల్లీ నూనె	రూ.155	రూ.141
సన్ ఫ్లవర్	రూ. 140	రూ.124
పామాయిల్	రూ.129	రూ.95

నూనె గింజల ధరలు (కిలో)	ప్రస్తుతం	ఆరు నెలల క్రితం
నువ్వులు	రూ.170	రూ. 140
వేరుశనగ	రూ. 150	రూ. 120

కొత్త కంపెనీలను పిలవండి

మద్యం సరఫరాపై ఎక్సైజ్ శాఖకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

- మద్యం రేట్ల పెంపు విషయంలో కంపెనీల ఒత్తిళ్లకు తలొగ్గేది లేదు
- ధరల నిర్ణాయక కమిటీ నివేదికను వీలైనంత త్వరగా తెప్పించండి
- మద్యం విషయంలో ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా చూడాలి
- గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా భూగర్భ విద్యుత్ లైన్లు వేయాలి
- దీనిపై వివిధ దేశాల్లో అత్యున్నత విధానాలను పరిశీలించండి
- ఎక్సైజ్, విద్యుత్ శాఖలపై వేర్వేరుగా సీఎం సమీక్షలు



ఎక్సైజ్ శాఖ అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మద్యం సరఫరా చేయడం కోసం కొత్త కంపెనీలను ఆహ్వానించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మద్యం సరఫరా కంపెనీలను ఎంపిక చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసి, దరఖాస్తులు స్వీకరించాలని.. ఇందుకోసం కనీసం నెల రోజులు గడువు ఇవ్వాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న కంపెనీల నాణ్యత ప్రమాణాలు, సరఫరా సామర్థ్యాన్ని పరిశీలించి పారదర్శకంగా ఎంపిక చేయాలని.. ఇప్పటికే సరఫరా చేస్తున్న కంపెనీల కోసం సులభతర వాణిజ్య విధానం అనుసరించాలని స్పష్టం చేశారు. మద్యం విషయంలో ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చేలా వ్యవహరించవద్దని హెచ్చరించారు. శనివారం సాయంత్రం జూబ్లీహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎక్సైజ్ శాఖపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. యునైటెడ్ బ్రూవరీస్ (యూబీ) కంపెనీ బీర్ల ధరల పెంపు డిమాండ్, బకాయిలు చెల్లించనందున తెలంగాణలో తమ బ్రాండ్ మద్యాన్ని సరఫరా చేయబోమని ప్రభుత్వానికి లేఖ రాసిన అంశంపై చర్చించినట్టు తెలిసింది.

కంపెనీల ఒత్తిడికి తలొగ్గేది లేదు

యూబీ కంపెనీ వాదనను అధికారులు వివరించగా.. మద్యం కంపెనీల ఒత్తిడికి తలొగ్గేది లేదని సీఎం స్పష్టం చేశారు. ఈ క్రమంలో పొరుగునే ఉన్న ఏపీ, మహారాష్ట్రలతోపాటు ఇతర రాష్ట్రాల్లో ఉన్న రేట్లను పరిశీలించాలని సూచించారు. కంపెనీలకు ఇచ్చే రేట్లను హైకోర్టు రిటైర్డ్ జడ్జి నేతృత్వంలోని ధరల నిర్ణాయక కమిటీ నిర్ధారిస్తుందని, ఆ కమిటీ నిర్ణయం తీసుకోవాల్సి ఉందని గుర్తు చేశారు. ఆ కమిటీ తన నివేదికను త్వరగా ఇచ్చేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి క్రమం తప్పకుండా ఎక్సైజ్ బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలోని బకాయిలను కూడా క్రమంగా క్లియర్ చేయాలని అధికారులను ఆదేశించారు. గతంలో మద్యం తయారీ, సరఫరా కోసం ఐదు సంస్థలకు అనుమతినిచ్చి, నిలిపివేసిన నేపథ్యంలో ఇప్పుడు వాటి గురించి పరిశీలించాలని సీఎం సూచించినట్టు సమాచారం. అయితే ఈ ఐదు సంస్థల్లో ఒక సంస్థకు డిస్టిలరీ ఏర్పాటుతోపాటు మద్యం తయారీకి గతంలో అనుమతినిచ్చారు. విమర్శలు రావడంతో అనుమతులను నిలిపివేశారు. ఇప్పుడు సీఎం ఆదేశాలతో పునః పరిశీలించే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

హైదరాబాద్ అంతటా భూగర్భ విద్యుత్ కేబుల్స్

గ్రేటర్ హైదరాబాద్‌లో, ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతమంతా పూర్తిగా భూగర్భ విద్యుత్ కేబుళ్లు వేసే అంశంపై అధ్యయనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. దీనితో విద్యుత్ చౌర్యాన్ని అరికట్టడమేకాక, విద్యుత్ అంతరాయాలను కూడా అధిగమించడానికి వీలవుతుందని సూచించారు. దీనికి సంబంధించి వివిధ దేశాల్లోని ఉత్తమ విధానాలను పరిశీలించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. రాష్ట్ర రాజధాని నగరంలో వేసే భూగర్భ విద్యుత్ కేబుల్ వ్యవస్థ దేశంలోనే అత్యుత్తమంగా ఉండాలని పేర్కొన్నారు. విద్యుత్ మాత్రమే గాక.. వివిధ రకాల కేబుళ్లు కూడా అండర్ గ్రౌండ్‌లోనే ఉండేలా ప్రత్యామ్నాయాలను పరిశీలించాలని ఆదేశించారు. శనివారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో 'క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ– 2025' పాలసీని ఆవిష్కరించిన అనంతరం విద్యుత్ రంగంపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఉన్నతాధికారులతో సీఎం సమీక్షించారు.

ప్రభుత్వ భవనాలపై సోలార్ ప్లాంట్లు

రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, భవనాలు, పాఠశాలలపై సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు వెంటనే చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఈ మేరకు కంపెనీలను ఆహ్వానించి, ఏ విధానంలో వారికి పనులు అప్పగించాలనే అంశంపై ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసీ గూడేలలో గృహాలకు సోలార్ విద్యుత్, సోలార్ పంపుసెట్లు ఉచితంగా అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అటవీ, గిరిజన సంక్షేమం, ఇతర శాఖలతో సమావేశమై నివేదిక రూపొందించాలన్నారు. ఇక రానున్న వేసవిలో విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా పక్కా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. గత ఏడాది మార్చిలో రాష్ట్రంలో విద్యుత్ గరిష్ట(పీక్) డిమాండ్ 15,623 మెగావాట్లకు చేరిందని.. అది ఈసారి 16,877 మెగావాట్లకు చేరుతుందని అంచనా వేశామని అధికారులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. దీనితో గరిష్ట విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా విద్యుదుత్పత్తి, సరఫరా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సీఎం సూచించారు.

కొత్త 'ఉస్మానియా'కు నెలాఖరులోగా శంకుస్థాపన

అత్యాధునిక వసతులతో ఆస్పత్రికి కొత్త భవన నిర్మాణం..

అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

ప్రతిపాదిత గోషామహల్ స్టేడియం ప్రాంతం వివరాలపై ఆరా

భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా డిజైన్లు సిద్ధం చేయాలని సూచన



కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణ ప్రాంత మ్యాపులను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా ఆస్పత్రి కోసం నూతన భవన నిర్మాణానికి ఈ నెలాఖరులోగా శంకుస్థాపన చేయాలని, ఇందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ అంశంపై శనివారం తన నివాసంలో అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. కొత్త ఆస్పత్రిని నిర్మాణం కోసం ప్రతిపాదించిన గోషామహల్ స్థలానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ శాఖ పరిధిలో ఉన్న ఆ స్థలాన్ని వీలైనంత త్వరగా వైద్యారోగ్య శాఖకు బదిలీ చేయాలని అధికారులను ఆదేశించారు. రెండు శాఖల మధ్య భూబదలాయింపు ప్రక్రియ, ఇతర పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రతిపాదిత స్థలంలో చేపట్టాల్సిన నిర్మాణాలకు సంబంధించిన నమూనా మ్యాపులను అధికారులు సీఎంకు వివరించారు. అందులో సీఎం పలు మార్పులు, చేర్పులను సూచించారు. అన్ని రకాల ఆధునిక వసతులతో ఆస్పత్రి నిర్మాణం జరపాలని స్పష్టం చేశారు. రోడ్లు, పార్కింగ్, మార్చురీ, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. భవిష్యత్తులో సమీపంలో రోడ్ల విస్తరణ, ఫ్లైఓవర్ల వంటి నిర్మాణాలు చేపట్టినా ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా ముందుచూపుతో డిజైన్లను తయారు చేయాలని ఆదేశించారు. రోగుల సహాయకులు సేదతీరేందుకు గ్రీనరీ, పార్క్ వంటి సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా అత్యాధునిక వసతులతో ఆస్పత్రి నిర్మాణం జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని.. ఈ మేరకు పూర్తిస్థాయి డిజైన్లను రూపొందించాలని ఆదేశించారు.

భూ కబ్జాదారులపై ఉక్కుపాదం మోపండి

కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్



సిరిసిల్ల: 'రాష్ట్ర ప్రభుత్వాన్ని, జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నా... పేదల భూములను కబ్జాలు చేసిన వారిపై, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన వారిపై ఉక్కుపాదం మోపండి' అని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన దివ్యాంగులకు పరికరాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత బీఆర్ఎస్ పాలకులు, కేసీఆర్ కుటుంబం ధరణి పేరుతో ప్రభుత్వ భూములను ప్రైవేట్‌పరం చేశారని మండిపడ్డారు. 'కలెక్టర్ గారూ... ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ ప్రభుత్వం కబ్జా చేసిన స్థలాలు, భవనాలన్నీ స్వాధీనం చేసుకోండి. ఎకరాలకు ఎకరాలు కబ్జా చేసి దోచుకుంటామంటే చూస్తూ ఊరుకోవడానికి సిద్ధంగా లేము' అని సంజయ్ పేర్కొన్నారు. గతంలో ధరణి పేరుతో భూములన్నీ దోచుకున్నారని, ఒక కుటుంబమే ఎక్కువగా లాభపడ్డదని బండి ఆరోపించారు. రాజన్నసిరిసిల్ల జిల్లాకు నవోదయ స్కూల్ త్వరలో మంజూరు కాబోతోందని, ఆ మేరకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. త్వరలోనే వేములవాడ రాజన్న ఆలయాన్ని ప్రసాద్ స్కీంలో చేర్చుతామని సంజయ్ ప్రకటించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, కరీంనగర్ జిల్లాలో బడుగు, బలహీన వర్గాలకు చెందిన నాయకులు గొప్పస్థాయికి చేరినందుకు తనకు సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ సందీప్‌కుమార్, గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాము తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 27న రాష్ట్రానికి ఖర్గే, రాహుల్

సంవిధాన్ బచావో కార్యక్రమంలో భాగంగా బహిరంగ సభ

జనవరి నెలాఖరుకల్లా కార్పొరేషన్ పదవుల భర్తీ

విలేకరులతో ఇష్టాగోష్టిలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: ఈనెల 27వ తేదీన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీలు రాష్ట్రానికి వచ్చే అవకాశముందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు. ఏఐసీసీ పిలుపు మేరకు నిర్వహించనున్న జైబాపూజీ, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించే సంవిధాన్ బచావో బహిరంగ సభకు వీరు హాజరవుతారని చెప్పారు. ఈనెల 27న వీలుకాకుంటే వచ్చే నెల మొదటి వారంలో ఖర్గే, రాహుల్‌లు వస్తారని అన్నారు. శనివారం గాంధీభవన్‌లో విలేకరులతో ఆయన ఇష్టాగోష్టి మాట్లాడుతూ, ఈనెలాఖరుకల్లా మిగిలిన కార్పొరేషన్ చైర్మన్లు, అన్ని కార్పొరేషన్లకు డైరెక్టర్ల నియామకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూర్తి చేస్తారని, ఈ మేరకు కసరత్తు జరుగుతోందని చెప్పారు. దీంతో పాటు పార్టీ కార్యవర్గాన్ని కూడా ఈ నెలాఖరుకు ప్రకటిస్తామని చెప్పారు. ఈసారి టీపీసీసీకి ముగ్గురు లేదా నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు ఉంటారని, ఎంతమందికి ఆ పదవి ఇవ్వాలన్న విషయాన్ని అధిష్టానం నిర్ణయిస్తుందన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను కూడా మారుస్తామని, సమర్థులైన నాయకుల కోసం చూస్తున్నామని చెప్పారు. పార్టీ కార్యవర్గం నియామకంలో అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఏం మాట్లాడారన్నది పరిశీలించాల్సి ఉందని, క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. బీఆర్ఎస్‌తో పాటు ఇతర పార్టీల నుంచి త్వరలోనే చేరికలుంటాయని, ఎమ్మెల్యేలు కూడా చేరతారని మహేశ్‌గౌడ్ వెల్లడించారు. ఈనెల 14వ తేదీన ఢిల్లీకి వెళ్తున్నామని, 15వ తేదీన ఏఐసీసీ నూతన కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొంటామన్నారు.

'గ్రాడ్యుయేట్' అభ్యర్థి ఎంపికపై కాంగ్రెస్ కసరత్తు

వారం, పది రోజుల్లో ప్రకటన

సాక్షి, హైదరాబాద్: క రీంనగర్ – ఆదిలాబాద్ – నిజామాబాద్ – మెదక్ ఉమ్మడి జిల్లాల ని యోజకవర్గ గ్రాడ్యుయే ట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోంది. ఈ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి ఎంపిక కోసం మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహలతో ఏర్పాటు చేసిన కమిటీ కసరత్తు ప్రారంభించిందని, వారం నుంచి పదిరోజుల్లో అభ్యర్థిని ప్రకటిస్తారని తెలుస్తోంది. కాగా, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి, గత ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన రాజేందర్, రిటైర్డ్ పోలీసు అధికారి ముదసం గంగాధర్ లతో పాటు హరికృష్ణ ఇక్కడ అభ్యర్థిత్వంకోసం పోటీ పడుతున్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి అభ్యర్థిని నిల బెడతామని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మిత్రపక్ష ఉపాధ్యాయ సంఘాలకు మద్దతిస్తామని పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ వెల్లడించారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలు చేసే బాధ్యత నాదే

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నాగార్జునసాగర్: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను సహచర మంత్రులతో కలిసి సంపూర్ణంగా అమలు చేసే బాధ్యత తానే తీసుకుంటానని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. శనివారం నాగార్జునసాగర్ లో ఏర్పాటు చేసిన ఆదివాసీ, గిరిజన ప్రజాప్రతినిధుల శిక్షణ శిబిరం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌కు సంబంధించి తాను చీఫ్‌విప్‌గా ఉన్నప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను సమావేశపరిచి అధిష్టానానికి నివేదిక ఇచ్చి అమలు చేయాలని కోరానని చెప్పారు. ఆ తర్వాత తాను డిప్యూటీ స్పీకర్‌గా ఉన్నప్పుడు ఈ చట్టం ఆమోదం పొందిందన్నారు. చట్టాన్ని మొదలుపెట్టిన వ్యక్తిగా, బిల్లును ఆమోదింపచేసిన వ్యక్తిగా తనకు సంపూర్ణ అవగాహన ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం అన్ని శాఖల సెక్రటరీలను సమావేశపరిచి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ ప్రకారం నిధుల కేటాయింపు జరుగుతుందా? లేదా అని నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశించినట్టు చెప్పారు. ఇప్పటికే రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు నివేదికలు సమర్పించారని, మిగిలిన శాఖల నుంచి నివేదికలు త్వరలో తెప్పించి సమగ్రంగా సమీక్షిస్తానని తెలిపారు. రాష్ట్రంలో పీసా, అటవీ హక్కుల చట్టాలను 100 శాతం సంపూర్ణంగా అమలు చేస్తామన్నారు. అటవీ హక్కుల చట్టం ద్వారా వచ్చిన భూముల్లో విద్యుత్ సౌకర్యం పొందేందుకు లైన్లు వేసే క్రమంలో ఆ శాఖ నుంచి ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో సోలార్ పవర్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసి మోటార్ల ద్వారా ఆయా భూములు సాగులోకి తెచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉందని తెలిపారు.

బడ్జెట్‌లో ఆదివాసీ, గిరిజనులకు పదిశాతం

రాష్ట్ర బడ్జెట్‌లో ఆదివాసీ, గిరిజనులకు పదిశాతం కంటే తక్కువ కాకుండా కేటాయిస్తామని మంత్రులు ఉత్తమ్‌కుమా ర్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివాసీ, గిరిజన బిడ్డలను నాయకులుగా తీర్చిదిద్దడానికే ఈ శిక్షణ తరగతులను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. గిరిజన, ఆదివాసీ సంక్షేమ చట్టాలను తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అని అన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ కార్యకర్తల దాడి

పోలీస్‌స్టేషన్ ఎదుట గులాబీ శ్రేణుల ధర్నా.. భువనగిరిలో ఉద్రిక్తత



భువనగిరి బీఆర్ఎస్ కార్యాలయంలో ఫర్నిచర్ ధ్వంసం చేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

సాక్షి, యాదాద్రి/హైదరాబాద్: భువనగిరిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై యువజన కాంగ్రెస్ కార్యకర్తలు దాడిచేసి ఫర్నిచర్ ధ్వంసం చేశారు. కాంగ్రెస్ అనుబంధ సంఘాల నేతల దాడిని ఖండిస్తూ భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ధర్నాకు దిగారు. దీంతో భువనగిరిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. శనివారం మధ్యాహ్నం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ విమర్శలు గుప్పించారు. అయితే, సీఎం రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ నాయకులు పరుష పదజాలంతో దూషించడాన్ని నిరసిస్తూ యువజన కాంగ్రెస్ భువనగిరి జిల్లా అధ్యక్షుడు మంగ ప్రవీణ్, మరికొందరు కార్యకర్తలు బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంపై దాడికి దిగారు. ఫర్నిచర్, టీవీ, కిటికీల అద్దాలు ధ్వంసం చేశారు. కేసీఆర్, కేటీఆర్‌ల చిత్రపటాలను కిందవేశారు. కార్యాలయం ఎదుట కొద్దిసేపు ధర్నా చేశారు. పోలీసులు వచ్చి వారిని అక్కడి నుంచి పంపించారు. కాగా, తమ పార్టీ కార్యాలయంపై దాడి జరిగిన విషయం తెలిసిన వెంటనే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి పైళ్ల శేఖర్‌రెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. భువనగిరి రైతు బజార్ ఎదురుగా ప్రధాన రహదారిపై కొద్దిసేపు ధర్నా చేశారు. దాడి సందర్భంగా పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. ధర్నాలో బీఆర్ఎస్ నేతలు జడల అమరేందర్, కొలుపుల అమరేందర్, ఎనబోయిన ఆంజనేయులు, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ గూండా రాజ్యం: కేటీఆర్

తెలంగాణలో కాంగ్రెస్ గూండా రాజ్యం చెలాయిస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ ఆదేశాలతోనే బీఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ గూండాలు దాడి చేశారని ఆరోపించారు. ఈ మేరకు శనివారం కేటీఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి వేసిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక కాంగ్రెస్ భౌతికదాడులకు పాల్పడుతోందన్నారు. దాడులతో బీఆర్ఎస్ ఆత్మస్థైర్యం దెబ్బతీయలేరని, దాడి చేసిన కాంగ్రెస్ గూండాలు, సూత్రధారులైన నేతలను అరెస్టు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ పాలనలో దాడుల సంస్కృతి: హరీశ్‌రావు

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ దాడుల సంస్కృతిని ప్రోత్సహిస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. విపక్ష నేతల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక దాడులు చేయించడం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. ఇదేనా మీరు చెబుతున్న ఇందిరమ్మ రాజ్యం, ప్రజాపాలన అని ప్రశ్నించారు. మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత, బీఆర్ఎస్ నేతలు మేడే రాజీవ్‌సాగర్, దూదిమెట్ల బాలరాజు యాదవ్ తదితరులు వేర్వేరు ప్రకటనల్లో దాడి ఘటనను ఖండించారు.

బాబు బినామీ ముఠా గుప్పిట్లో శ్రీవారి ఆలయం

తిరుపతి తొక్కిసలాటకు అసలు కారణం బట్టబయలు

తిరుమలపై పూర్తి ఆధిపత్యానికి తెగించిన చంద్రబాబు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పేరుతో టీటీడీలోకి బినామీలను ప్రవేశపెట్టిన సీఎం

పూర్తి వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఇదంజగత్



గతంలో లడ్డూపై చేసిన వ్యాఖ్యలకా? నిన్న జరిగిన సంఘటనకా చెప్పేదీ!

క్లుప్తంగా...

డిసెంబర్‌లో హైదరాబాద్‌లో పీఎస్సీల జాతీయ సదస్సు

- సదస్సును సమన్వయం చేయనున్న టీజీపీఎస్సీ

సాక్షి, హైదరాబాద్‌: ప్రభుత్వ శాఖల ఉద్యోగ నియామకాల్లో కీలక భూమిక పోషించే పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ (పీఎస్సీ)ల జాతీయ సదస్సుకు హైదరాబాద్‌ వేదిక కానుంది. ఈ ఏడాది డిసెంబర్‌లో రాష్ట్ర పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ జాతీయ సదస్సు నిర్వహించాలని బెంగళూరు సదస్సులో నిర్ణయం తీసుకున్నారు. శనివారం బెంగళూరులో దేశంలోని పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ల 25వ జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఉపరాష్ట్రపతి జగదీప్‌ ధన్‌ఖడ్‌ ముఖ్యఅతిథిగా హాజరై సదస్సును ప్రారంభించారు. ఆయనతో పాటు కర్ణాటక గవర్నర్‌ థవర్‌చంద్‌ గెహ్లోట్‌, ముఖ్యమంత్రి సిద్దరామయ్య, యూపీఎస్సీ చైర్‌పర్సన్‌ ప్రీతి పాల్గొన్నారు. తెలంగాణ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ చైర్మన్‌ బుర్రా వెంకటేశం ఈ సదస్సులో పాల్గొని టీజీపీఎస్సీ నిర్వహిస్తున్న పరీక్షల్లో అనుసరిస్తున్న పద్ధతులను వివరించారు. దేశవ్యాప్తంగా పీఎస్సీలు తీసుకొచ్చిన సంస్కరణలు ఈ సందర్భంగా చర్చకు వచ్చాయి. ఈ ఏడాది డిసెంబర్‌లో హైదరాబాద్‌లో జాతీయ సదస్సు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సదస్సును తెలంగాణ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ సమన్వయం చేయనుంది.

ప్రభుత్వానికి సింగరేణి రూ.88.55 కోట్ల డివిడెండ్‌



రేవంత్‌రెడ్డి, భట్టికి చెక్‌ అందజేస్తున్న అధికారి. చిత్రంలో జూపల్లి, సుదర్శన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్‌: సింగరేణి కాలరీస్‌ సంస్థ 2023–24 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వానికి రూ.88,55,99,147ల డివిడెండ్‌ చెల్లించింది. ఈ మేరకు డివిడెండ్‌ చెక్కును సింగరేణి సీఎండీ ఎన్‌.బలరామ్‌ శనివారం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు అందజేశారు. సింగరేణి కాలరీస్‌ చెల్లింపు మూలధనంలో 10 శాతాన్ని డివిడెంట్‌గా చెల్లించాలని నిర్ణయించారు. ఈ మొత్తం సుమారు రూ.173 కోట్లు కాగా.. సింగరేణిలో 51 శాతం వాటా కలిగిన రాష్ట్ర ప్రభుత్వానికి రూ.88.55 కోట్ల డివిడెండ్‌ చెల్లించారు. కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌ రెడ్డి, సీఎస్‌ శాంతికుమారి, ఉన్నతాధికారులు రామకృష్ణారావు, సందీప్‌కుమార్‌ సుల్తానియా పాల్గొన్నారు.

3 వైరస్‌ల ముప్పు!

- పెరుగుతున్న ఇన్‌ఫ్లుయెంజా, ఆర్‌ఎస్‌వీ, హెచ్‌ఎంపీవీ కేసులు
- పిల్లలు, వృద్ధుల్లోనే వైరస్‌ ప్రభావం ఎక్కువ
- 15 - 59 ఏళ్ల మధ్య వయస్కుల్లో ప్రభావం తక్కువే
- తీవ్రత పెరిగితే న్యుమోనియా బారిన పడే ప్రమాదం

అధ్యయన నివేదిక విడుదల చేసిన డబ్ల్యూహెచ్‌ఓ

సాక్షి, హైదరాబాద్‌: దేశంలో సీజనల్‌ వ్యాధుల బారిన పడుతున్నవారి సంఖ్య పెరుగుతోంది. ఇటీవల దేశంలోని వివిధ ప్రాంతాల్లో హ్యూమన్‌ మెటాన్యుమో వైరస్‌ (హెచ్‌ఎంపీవీ) కేసులు వెలుగుచూశాయి. ఈ వైరస్‌ పాతదే అయినప్పటికీ అది సోకితే వచ్చే వ్యాధుల ప్రభావం పిల్లలు, వృద్ధుల్లో అధికంగా ఉంటుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) చెబుతోంది. చైనాలో హెచ్‌ఎంపీవీ వ్యాప్తిపై ఈ ఏడాది మొదటివారంలో ఈ సంస్థ అధ్యయనం చేసింది. చైనాతోపాటు, భారత్‌లో వైరస్‌ వ్యాప్తి గురించి వివరిస్తూ తాజాగా నివేదిక విడుదల చేసింది. హెచ్‌ఎంపీవీతోపాటు ఇన్‌ఫ్లుయెంజా, ఆర్‌ఎస్‌వీల వ్యాప్తి కూడా పెరిగినట్లు వెల్లడించింది.

పాతవే.. అయినా జాగ్రత్త ముఖ్యం..

మనదేశంలో హెచ్‌ఎంపీవీ 2015 - 2017 మధ్య కాలంలో వ్యాప్తి చెందినట్లు ఆరోగ్య శాఖ గణాంకాలు చెబుతున్నాయి. 60 ఏళ్లలోపు వయసున్న ప్రతి లక్ష మందిలో సగటున 220 మందికి ఈ వైరస్‌ సోకినట్లు గుర్తించారు. 60–74 ఏళ్ల మధ్య వయస్కుల్లో వైరస్‌ వ్యాప్తి వేగంగా ఉంది. 80 ఏళ్లకు పైబడిన వారిలో రెట్టింపు స్థాయిలో ఉంది. 2018లో ప్రపంచవ్యాప్తంగా 1.1 కోట్ల హెచ్‌ఎంపీవీ కేసులు నమోదైనట్లు డబ్ల్యూహెచ్‌ఓ తెలిపింది. వీరిలో ఆస్పత్రిలో చేరిన వారి రేటు 5% ఉండగా, మరణాల రేటు ఒకశాతం ఉంది. హెచ్‌ఎంపీవీతోపాటు ఇన్‌ఫ్లుయెంజా, ఆర్‌ఎస్‌వీలు యువకుల్లో పెద్దగా ప్రభావం చూపవని డబ్ల్యూహెచ్‌ఓ చెబుతోంది. నాలుగేళ్లలోపు చిన్నారులు, 60 సంవత్సరాలు పైబడినవారిలో వైరస్‌ వ్యాప్తి వేగంగా ఉందని వెల్లడించింది. 15 నుంచి 59 సంవత్సరాల మధ్య వయసు వారిలో వైరస్‌ను తట్టుకునే శక్తి ఎక్కువగా ఉందని పేర్కొంది.

2015 - 2017 మధ్యకాలంలో హెచ్‌ఎంపీవీ వ్యాప్తి (ప్రతి లక్ష మందిలో)

వయసుల వారీగా పాజిటివిటీ

220 — 60 కంటే తక్కువ	60 నుంచి 64 మధ్య — 60
250 — 65 నుంచి 74 మధ్య	80 ఏళ్లకు పైబడి — 480

న్యుమోనియా ప్రమాదం..

హెచ్‌ఎంపీవీ, ఇన్‌ఫ్లుయెంజా, ఆర్‌ఎస్‌వీ వైరస్‌లు సోకినప్పుడు అత్యధికుల్లో రోగ నిరోధక శక్తి క్రియాశీలమై వైరస్‌ను జయిస్తున్నారు. అయితే, ఇన్‌పేషెంట్‌ కేటగిరీ రోగుల్లో ఇన్‌ఫ్లుయెంజా బారిన పడిన వారు 30 శాతం ఉండగా, హెచ్‌ఎంపీవీతో 6.2 శాతం, ఎడినో వైరస్‌తో 3.7 శాతం, రినో వైరస్‌తో 4.9 శాతం ఆసుపత్రుల పాలవుతున్నారని డబ్ల్యూహెచ్‌ఓ తెలిపింది. శ్వాస, ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలున్న వారికి ఈ వైరస్‌లు హాని తలపెట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. దీర్ఘకాలంగా దగ్గు, జలుబు ఉన్న వారిలో ఊపిరితిత్తుల్లో నిమ్ము చేరుతుందని, అది క్రమంగా న్యుమోనియాకు దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు.

జాగ్రత్తలు పాటించాలి

చిన్న పిల్లల్లో, వృద్ధుల్లో వైరస్‌ ప్రభావం అధికంగా ఉండడంతో బయటి వ్యక్తులతో ఎక్కువగా కలువొద్దు. కోవిడ్‌-19 సమయంలో సోషల్‌ డిస్టెన్స్‌ పాటించడంతో వైరస్‌ వ్యాప్తి తగ్గింది. దీంతో వాటికి సంబంధించిన యాంటిబాడీస్‌ క్షీణించాయి. ఇప్పుడు వైరస్‌ వ్యాప్తితో సమస్యలు వస్తున్నట్లు తెలుస్తోంది. దీర్ఘకాలిక సమస్యలు, శ్వాసకోశ సంబంధిత సమస్యలున్నవారు వైద్యుడి సలహా మేరకు ఫ్లూ వ్యాక్సిన్‌ తీసుకోవడం మంచిదే. – డాక్టర్‌ కిరణ్‌ మాదల, క్రిటికల్‌ కేర్‌ హెచ్‌ఓడీ, గాంధీ మెడికల్‌ కాలేజీ

‘ఫార్మా సిటీ’ రైతుల నిరసనకు గ్రీన్‌సిగ్నల్‌

సాక్షి, హైదరాబాద్‌: రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలో గ్రీన్‌ ఫార్మాసిటీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ రైతులు చేపట్టే నిరసనకు అనుమతి ఇవ్వాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్‌ 19, 21 ప్రకారం రైతులకు కూడా నిరసన తెలియజేసే హక్కు ఉందని అభిప్రాయపడింది. ఫార్మాసిటీని వ్యతిరేకిస్తూ కరపత్రాలు పంచి నిరసన తెలిపే, పాదయాత్రలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించే వారి హక్కును ఎవరూ హరించలేరని తేల్చిచెప్పింది. సాధారణంగా రైతులు నిరసనలు వ్యక్తం చేయరని, పిటిషనర్లు ఫార్మాసిటీ ఏర్పాటుకు అవసరమైన భూములకు సంబంధించిన వారేనని గుర్తు చేసింది. నేర చరిత్ర ఉన్న వ్యక్తులు నిరసనలో పాల్గొనకుండా పిటిషనర్లు (రైతులు) చర్యలు తీసుకోవాలని సూచించింది. శాంతిభద్రతల పరంగా ఏదైనా సమస్య తలెత్తితే.. ఇబ్రహీంపట్నం ఏసీపీ, గ్రీన్‌ఫార్మా సిటీ పోలీస్‌ స్టేషన్‌ ఇన్‌స్పెక్టర్‌కు సహేతుకమైన ఆంక్షలు విధించే స్వేచ్ఛ ఇచ్చింది. తదుపరి విచారణ ఈనెల 31కి వాయిదా వేసింది. పాదయాత్రకు, అవగాహన కార్యక్రమానికి పోలీసులు అనుమతి ఇవ్వకపోవడాన్ని సవాల్‌ చేస్తూ నానక్‌నగర్‌కు చెందిన రైతులు సాయిరెడ్డితో పాటు మరో ఇద్దరు హైకోర్టులో పిటిషన్‌ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్‌ విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్‌ తరఫున న్యాయవాది సీహెచ్‌ రవికుమార్‌ వాదనలు వినిపిస్తూ.. ఫార్మాసిటీకి వ్యతిరేకంగా, దాంతో వచ్చే నష్టాలను వివరిస్తూ కరపత్రాల పంపిణీ, పాదయాత్ర కార్యక్రమాలు చేపట్టేందుకు అనుమతి ఇవ్వాలని ఈ నెల 2న పిటిషనర్లు కోరినా పోలీసులు నిరాకరించారని చెప్పారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ రైతుల వినతి పత్రాన్ని తిరస్కరించారన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. రైతుల నిరసనకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

‘అగ్నివీర్‌’కు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్‌ : అగ్నివీర్‌ వాయు ఉద్యోగాల్లో చేరాలని ఆసక్తి ఉన్నవారి నుంచి అధికారులు దరఖాస్తులు ఆహ్వానించారు. పదవ తరగతి విద్యార్హతగా పేర్కొంటూ 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు ఈ ఉద్యోగాల్లో చేరడానికి అర్హులని తెలిపారు. దరఖాస్తుల ప్రక్రియ ఈనెల 7వ తేదీనే ప్రారంభమైందని, జనవరి 27వ తేదీ దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ అని శనివారం ఒక ప్రకటనలో వివరించారు, ఆన్‌లైన్‌ పరీక్షకు మూడు రోజుల ముందు అర్హత పరీక్ష అడ్మిట్‌కార్డులు అభ్యర్థుల వ్యక్తిగత ఈ-మెయిల్‌కు పంపిస్తామని వివరించారు. ఇందులో చేరే ఉద్యోగులకు శిక్షణ కాలంలోనే నెలకు రూ. 40 వేల వరకు వస్తుందని వివరించారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను అధికారిక వెబ్‌సైట్‌ https://agnipathvayu.cdac.in/AV/ చేసుకోవాలని వివరించారు.

ఇంక్యుబేటర్లకు దన్ను

- నాయకత్వ శిక్షణ ప్రోగ్రాం ప్రారంభించిన టీ హబ్‌
- భారతీయ ఇంక్యుబేటర్లను అంతర్జాతీయ స్థాయికి చేర్చటమే లక్ష్యం



సాక్షి, హైదరాబాద్‌: దేశంలో ఆవిష్కరణలను వేగవంతం చేయడం, వాణిజ్య వాతావరణాన్ని మరింత విస్తరించడం ద్వారా అంతర్జాతీయంగా భారతీయ స్టార్టప్‌లు రాణించేలా ‘టీ హబ్‌’ ప్రణాళికలు రూపొందిస్తోంది. అందులో భాగంగా అటల్‌ ఇంక్యుబేషన్‌ సెంటర్‌ (ఏఐసీ) సహకారంతో టీ హబ్‌ ఫౌండేషన్‌ ‘బిజినెస్‌ ఇంక్యుబేషన్‌ మేనేజ్‌మెంట్‌, లీడర్‌షిప్‌ ప్రోగ్రామ్‌’ (బీఐఎంఎల్‌) పేరుతో కొత్త కార్యక్రమాన్ని ఇటీవల ప్రారంభించింది. ఈ ప్రోగ్రామ్‌ ద్వారా వివిధ సంస్థల్లో మేనేజ్‌మెంట్‌ అధిపతులుగా పనిచేస్తున్నవారికి ఇంక్యుబేషన్‌ వ్యవస్థల ఏర్పాటు, నిర్వహణపై శిక్షణ ఇస్తారు. శిక్షణ, వాణిజ్య వ్యాపార సంస్థలతో వ్యూహాత్మక భాగస్వామ్యాలు, సాంకేతిక, మార్కెటింగ్‌ నెట్‌వర్క్‌తో అనుసంధానం వంటి అంశాల్లో సహకారం అందిస్తారు.

ఇంక్యుబేషన్‌ వ్యవస్థలో పరివర్తన

బీఐఎంఎల్‌ ద్వారా శిక్షణలో పాల్గొనేవారికి ప్రపంచ స్థాయిలో ఇంక్యుబేషన్‌ కార్యకలాపాలను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం లభిస్తుంది. మెంటార్లు, కార్పొరేషన్లు, విధాన నిర్ణేతలతో టీ హబ్‌కు ఉన్న విస్తృత నెట్‌వర్క్‌ ద్వారా భారతీయ ఇంక్యుబేటర్లు అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దే అవకాశాలు మెరుగవుతాయి. బీఐఎంఎల్‌ కార్యక్రమాన్ని విస్తృతం చేసేందుకు ఇప్పటికే టీ హబ్‌ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌, అస్సాం, తమిళనాడులోని 15 సాంకేతిక విద్యా సంస్థలతో కలిసి పనిచేస్తోంది. ఎడ్యుటెక్‌, క్రీడలు, టెక్నాలజీ, మేనేజిమెంట్‌ రంగాల్లో ఇంక్యుబేటర్ల ఏర్పాటును వేగవంతం చేయడమే బీఐఎంఎల్‌ ప్రోగ్రామ్‌ లక్ష్యమని టీ హబ్‌ వర్గాలు వెల్లడించాయి.

వచ్చేనెల 28లోపు అమల్లోకి ‘భూభారతి’

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి



సాక్షిప్రతినిధి, ఖమ్మం: ధరణి స్థానంలో భూభారతి చట్టాన్ని వచ్చేనెల 15 నుంచి 28వ తేదీలోపు అమల్లోకి తీసుకొచ్చేలా విధి విధానాలు ఖరారు చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఖమ్మంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మేధావులు, ఉద్యోగులు, రైతులు, పార్టీల నాయకుల అభిప్రాయాలను సేకరించి భూభారతి చట్టం తీసుకు వచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వాలు ఏ చట్టం చేసినా కొన్ని నిబంధనలు ఉంటాయని, అయితే గత ప్రభుత్వం తీసుకొచ్చిన ‘ధరణి’లోపభూయిష్టంగా ఉందని అన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల కోసం 80.60 లక్షల దరఖాస్తులు..

ప్రజాపాలన సభల్లో రాష్ట్రవ్యాప్తంగా 1.15 కోట్ల దరఖాస్తులు వస్తే.. అందులో ఇందిరమ్మ ఇళ్ల కోసం 80.60 లక్షల దరఖాస్తులు ఉన్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు. ఇందులో అర్హులను గుర్తించేందుకు ఇప్పటి వరకు జీహెచ్‌ఎంసీ మినహా సుమారు 72 లక్షల దరఖాస్తులపై సర్వే చేపట్టామని, ఈ పథకానికి సంబంధించిన అర్హులను ఈనెల 26న గ్రామసభల్లో నిర్ణయిస్తామని చెప్పారు. అదేరోజు రైతుభరోసాతో పాటు తెల్లరేషన్‌ కార్డుల ప్రక్రియ, భూమి లేని నిరుపేదలకు ఏటా రూ.12 వేలు ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని వివరించారు. ఈ పథకాలకు అర్హుల గుర్తింపునకు ఈనెల 16 నుంచి కసరత్తు చేపట్టనున్నట్లు తెలిపారు. ఏ వ్యక్తిపై లేదా పార్టీపై తమ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించదని, తప్పుడు కేసులు పెట్టబోదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రిజిస్ట్రేషన్ల విషయంలో అవకతవకలు జరగదొద్దనే తపన ప్రభుత్వానికి ఉన్నందున బయటకు వస్తున్న ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. చట్టాన్ని ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని, ఇటీవల వైరా సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయంలో జరిగిన రిజిస్ట్రేషన్లపై విచారణ జరుగుతోందని స్పష్టం చేశారు.

ఓయూ పీహెచ్‌డీ కేటగిరీ-2 ప్రవేశాలకు ప్రకటన

24 నుంచి దరఖాస్తుల స్వీకరణ



ఉస్మానియా యూనివర్సిటీ: ఎట్టకేలకు ఓయూ పీహెచ్‌డీ కేటగిరీ-2 ప్రవేశాలకు అధికారులు నోటిఫికేషన్‌ విడుదల చేశారు. పీహెచ్‌డీ ప్రవేశాలకోసం నిర్వహించే ఎంట్రన్స్‌టెస్ట్‌-2025కు ఈ నెల 24 నుంచి వచ్చే నెల 23 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పీజీ అడ్మిషన్స్‌ డైరెక్టర్‌ ప్రొ.పాండురంగారెడ్డి శనివారం పేర్కొన్నారు. రూ.2000 అపరాధ రుసుముతో మార్చి 5 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థుల ఆందోళనల ఫలితంగా ఆరేళ్ల తర్వాత కేటగిరీ-2 పీహెచ్‌డీ ప్రవేశాలకు మోక్షం లభించింది. అధ్యాపకుల కొరత వలన పీహెచ్‌డీ కేటగిరీ-2 ప్రవేశాలను నిలిపివేశారు. పీహెచ్‌డీ పూర్తి చేయకుండా వదిలేసిన విద్యార్థులకు గత వీసీ ప్రొ.రవీందర్‌ వన్‌టైం చాన్స్‌ (లాస్ట్‌టైం) ఇవ్వడంతో సుమారు 1,300 మంది విద్యార్థులు పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్‌ పట్టాలను అందుకున్నారు. దీంతో పీహెచ్‌డీ ప్రవేశాలకు అవకాశం లభించింది. ఓయూలో 45 సబ్జెక్టులకు, పీహెచ్‌డీ కోర్సులో 656 సీట్లలో ప్రవేశాలకు ప్రవేశ పరీక్షతో పాటు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు ప్రొ.పాండురంగారెడ్డి తెలిపారు. పూర్తి వివరాలకు ఉస్మానియా.ఏసీ.ఇన్‌ వెబ్‌సైట్‌ చూడవచ్చు.

మూడేళ్ల సర్వీసున్న అధ్యాపకులకు నో గైడ్‌షిప్‌

యూజీసీ నూతన నిబంధనల ప్రకారం 3 సంవత్సరాల సర్వీస్‌ గల అధ్యాపకులకు పీహెచ్‌డీ విద్యార్థుల గైడ్‌షిప్‌ను (పర్యవేక్షణ) రద్దు చేశారు. గతంలో రిటైర్మెంట్‌ అయిన అధ్యాపకులకు సైతం పీహెచ్‌డీ గైడ్‌షిప్‌ ఇచ్చారు. కొత్త నిబంధనల కారణంగా పీహెచ్‌డీ సీట్లు తగ్గనున్నాయి.



మేలుచేయుట నీ చేతనైనప్పుడు
దాని పొందదగినవారికి చేయకుండ వెనుకతియ్యకుము.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు పుష్య మాసం, **తిథి:** శు.చతుర్దశి తె.4.46 వరకు (తెల్లవారితే సోమవారం) తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** మృగశిర ఉ.11.33 వరకు తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** రా.7.47 నుండి 9.19 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.16 నుండి 5.05 వరకు, **అమృత ఘడియలు:** రా.1.11 నుండి 2.44 వరకు.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం : 5.39
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

ఎలాన్ మస్క్ (బిజినెస్ టైకూన్)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

డాడ్ నాపై చాలా కోపంగా ఉన్నారు! ఆయనలో నా పట్ల అంత నిజమైన కోపాన్ని నేను నా చిన్నప్పుడు కూడా చూడలేదు.

"ఎలాన్, ఆఫ్టాల్ నువ్వొక ప్రపంచ కుబేరుడివి మాత్రమేనన్న సంగతి మర్చిపోకు..." అన్నారు డాడ్ ఫోన్ చేసి!

"కానీ డాడ్, మీ కుమారుడిగా ఉండటం కంటే ఎక్కువా నేను ప్రపంచ కుబేరుడిగా ఉండటం?! ఎక్కువ అని నేను అనుకుంటు న్నప్పుడు కదా మీరు నన్ను 'ఆఫ్టాల్ నువ్వొక కుబేరుడివి మాత్రమే' అని అనాలి..." అన్నాను.

"సోది ఆపు" అన్నారాయన!

ఏడేళ్ల తర్వాత, ఏడాది క్రితమే ఇద్దరం ఒకర్నొకరం చూసుకున్నాం. ఏడాది తర్వాత మళ్లీ ఇప్పుడే ఆయన ఫోన్ చేయటం.

"విను ఎలాన్, నీ దగ్గర 500 బిలియన్ డాలర్ల సంపద ఉండొచ్చు. నీ టెస్లా కార్లు ఈ భూగోళమంతటా తిరుగుతుండొచ్చు. నీ స్పేస్ఎక్స్ రాకెట్లు భూకక్ష్యను దాటి చంద్రుడి పైకి, మార్స్ మీదకు, ఇంకా అవతలికి కూడా పోతే పోతుండొచ్చు. నువ్వు మాత్రం మనిషివే. చేతిలో ఐ–ఫోన్ ఉన్న ఒక మామూలు మనిషివి. బ్రిటన్ ప్రధానిలా నువ్వేమీ ఒక దేశాన్ని, లేదంటే బ్రిటన్ రాజులా ఓ 14 దేశాలను పరి పాలించటం లేదు..." అన్నారు డాడ్!



"కానీ డాడ్, అభిప్రాయాలను ట్వీట్ చెయ్యటం తప్పెలా అవుతుంది?!" అన్నాను.

"చెయ్, ట్వీట్ చెయ్. కానీ ట్విట్టర్ మాత్రమే నీది. బ్రిటన్ నీది కాదు. ఫ్రాన్స్ నీది కాదు. జర్మనీ నీది కాదు. నార్వే నీది కాదు. అసలు ఐరోపాలోనే ఏదీ నీది కాదు. నీదంటూ ఉంటే అమెరికా ఒక్కటే. అది కూడా అమెరికా మొత్తం కాదు. అమెరికాలో ఉండే ట్రంప్ మాత్రమే..." అన్నారు డాడ్ చాలా నెమ్మదిగా!

కోపాన్ని ఎంతగా అణచుకుంటేనో తప్ప ఆయన ఇంత నెమ్మదిగా మాట్లాడరు. స్కూల్‌కు వెళ్లనని నేను స్కూల్ బ్యాగ్‌ను విసిరికొట్టినప్పుడు కూడా ఆయన ఇంతగా కోపాన్ని అణచుకోలేదు. నా చెంప పగల గొట్టారు. కాలేజ్ నుండి నేను నేరుగా ఇంటికి రావటం లేదని తెలిసినప్పుడు కూడా ఇంతగా కోపాన్ని అణచుకోలేదు. లాగిపెట్టి చెంప చెళ్లుమనిపించారు. చెయ్యి చేసుకోలేనంత కోపం వచ్చినప్పుడే... ఆయనిలా నిశ్శబ్దంగా మాట్లాడతారు.

"ఎలాన్, నీకు గుర్తుందా? నీ ఆరేళ్ల వయసులో నిన్ను మొదటిసారి బ్రిటన్ తీసుకెళ్లాను. ఆ దేశం నీకెంతో నచ్చింది. కేరింతలు కొట్టావు. నీ 30వ బర్త్‌డేని అక్కడే ఒక రాజభవంతిలో వారం రోజుల పాటు నీకై నువ్వే జరుపుకున్నావ్! నీకూ నాకూ మధ్య కూడా లేనంత అనుబంధం నీకు బ్రిటన్‌తో ఉంది. డాడ్ 'దుష్టుడు' అని లోకానికి నువ్వు చాటినప్పుడు కూడా నేను పట్టించుకోలేదు. కానీ, నాతో సమానంగా బ్రిటన్‌కు నువ్వు దుష్టత్వాన్ని ఆపాదిస్తుంటే పట్టనట్లు ఉండలేక పోతున్నాను.." అన్నారాయన!

"అందుకేనా డాడ్, 'ఎలాన్ ఒక పిచ్చివాడు, అతడిని తరిమికొట్టండి' అని మీరు బ్రిటన్‌కు చెబుతున్నారు!" అన్నాను నవ్వుతూ.


డాడ్ నవ్వలేదు. "లోపలేం జరిగిందో తెలియకుండా బయటి నుంచి ఎలా మాట్లాడతావ్? తెలిసినా అసలు మనమెందుకు మాట్లాడటం?" అన్నారు.

ఆశ్చర్యపోయాన్నేను! ఏళ్ల తర్వాత 'మన' అన్నారు డాడ్!! ఆయనకెప్పుడూ 'నేను', 'నువ్వు' అనటమే అలవాటు. మామ్‌తో కూడా అలానే అనేవారు.

"ఎలాన్, బీ లైక్ ఎ బిజినెస్‌మేన్. దేశాలతో బిజినెస్ చెయ్యి. బిజినెస్ పోగొట్టుకునే పనులు చెయ్యకు. నీకు యాభై దాటి ఉండొచ్చు. నాకింకా నువ్వు చిన్న పిల్లాడివే. నేను, మీ మామ్, నువ్వు, నీ తమ్ముడు, నీ చెల్లెలు కలిసి అమెజాన్ రెయిన్‌ఫారెస్టు టూర్‌కి వెళ్లినప్పుడు నీ వయసెంతో ఇప్పుడూ అంతే నా దృష్టిలో..." అన్నారు డాడ్!

చప్పున చెంపను తడుముకున్నాను! ఆయన చెయ్యి తాకితే ఎంతగా చుర్రు మంటుందో నాకు తెలుసు. అది ఎన్ని రెయిన్ ఫారెస్టుల వర్షానికైనా చల్లారని మంట!

ఏడు చేపల కథ!



జనతంత్రం

వర్ధెల్లి మురళి

"చేపా చేపా ఎందుకు ఎండలేదు? గడ్డిమోపు అడ్డమొచ్చింది. మోపూ మోపూ ఎందుకు అడ్డమొచ్చావ్? ఆవు మేయలేదు". ఈ చేప సాకుల కథ తెలుగు వారందరికీ సుపరిచితమే. ఏడు మాసాల కింద ఏపీలో ఏర్పడిన కిచిడీ సర్కార్ పరిపాలనకూ, ఈ సాకుల కథకూ కొంత సాపత్యం కుదురుతుంది. ఒకపక్క జనానికి షాకుల మీద షాకులిస్తూనే మరోపక్క తన వైఫల్యాలకు సాకుల మీద సాకులు వెతుకుతున్న తీరు న భూతో న భవిష్యతి!

పరిపాలన చేతగానితనం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. శాంతి భద్రతల గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మేలు. రూల్ ఆఫ్ లా స్థానాన్ని రూళ్లకర్ర పెత్తనం ఆక్రమిం చింది. విద్యారంగం గుండెల మీద విధ్వంసపు గునపాలు దిగు తున్నాయి. ప్రజా వైద్యరంగాన్ని ప్రైవేట్ బేహారుల జేబులో పెట్టబోతున్నారు. సాగునీటి గేట్ల తాళాలు కంట్రాక్టర్ల చేతుల్లో పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆర్థిక వ్యవస్థ అప్పులు చింపిన విస్తరిలా తయారైంది. ఇదీ కిచిడీ సర్కార్ ఏడు మాసాల సప్తపది.

ప్రభుత్వ వైఫల్యాలు బట్టబయలైన ప్రతి సందర్భంలో దాన్నుంచి జనం దృష్టిని మళ్లించడం కోసం గోబెల్స్ ప్రచారాలను చేపట్టడం నిత్యకృత్యంగా మారిపోయింది. అవినీతికీ, అసమర్థతకూ ఏపీ కిచిడీ సర్కార్‌ను కేరాఫ్ అడ్రస్ అనుకోవచ్చు. కొద్దిపాటి సమీక్షా ప్రణాళికలతో నివారిం చగలిగిన విజయవాడ వరద ముంపును ముందుచూపు లేక పెను ప్రమాదంగా మార్చారు. సాకును మాత్రం పాత ప్రభుత్వం మీదకు నెట్టేందుకు శతవిధాల ప్రయత్నించారు. తిరుపతిలో జరిగిన తాజా విషాదంలోనూ అధినేతది అదే ధోరణి. కనీస ముందస్తు సమీక్షలు చేయకపోవడం, ఏర్పాట్లు లేకపోవడం, వ్యూహ రాహిత్యం, సమన్వయ లోపం, పోలీసు యంత్రాంగం మొత్తం ముఖ్యమంత్రి సేవలోనే తరించడం... ఈ దుర్ఘటనకు ప్రధాన కారణాలు.

తమది రియల్‌టైమ్ గవర్నెన్సనీ, ఎక్కడేమి జరుగుతున్నదో ఎప్పటికప్పుడు తన కంప్యూటర్ దుర్భిణి ద్వారా తెలిసిపోతుం దనీ చంద్రబాబు చెప్పుకుంటారు. లక్షలాదిమంది తరలివచ్చే వైకుంఠ ద్వార దర్శన కార్యక్రమానికి ఏర్పాట్లు సరిగ్గా జరగ లేదని ఎందుకు కనిపెట్టలేకపోయారో మరి! తీరా దుర్ఘటన జరిగిన తర్వాత సాకు వెతుక్కోవడానికి ఆయనకు జగన్ సర్కారే కనిపించింది. కాంగ్రెస్ పార్టీకి దేశంలో ఎదురులేని రోజుల్లో ఎక్కడ ఏ దుర్ఘటన జరిగినా, ప్రభుత్వ వైఫల్యం బయటపడ్డా వెంటనే 'విదేశీ హస్తం' మీదకు నెట్టేసేవారు. ఇప్పుడు చంద్ర బాబుకు జగన్ సర్కార్‌లో ఆ విదేశీ హస్తం కనిపిస్తున్నది.

వైకుంఠ ద్వార దర్శనం టిక్కెట్లను తిరుమలకు బదులుగా తిరుపతిలోనే అందజేసే కార్యక్రమాన్ని వైసీపీ సర్కార్ ప్రారం భించిందనీ, అందువల్లనే తొక్కిసలాట జరిగిందనేది ఆయన ఉవాచ. తిరుపతిలోనే టిక్కెట్లివ్వడమనేది పనికిమాలిన కార్య క్రమం అయితే, దివ్యదృష్టీ – దూరదృష్టీ... రెండూ కలిగిన చంద్రబాబు సర్కార్ ఎందుకు దాన్ని రద్దు చేయలేదనేది సహ జంగా ఉద్భవించే ప్రశ్న. రద్దు చేయకపోగా, గతంలో ఎన్నడూ లేనివిధంగా అస్మదీయ పత్రికల్లో భారీ ప్రకటనలు గుప్పించి భక్తకోటిని ఎందుకు ఆహ్వానించినట్టు? పైగా మూడు రోజుల టిక్కెట్లు ఒకేసారి ఇస్తామని ఏపీతోపాటు పొరుగు రాష్ట్రాల్లో కూడా ఎందుకు దండోరా వేయించినట్టు?

వైసీపీ ప్రభుత్వం ఉన్న రోజుల్లోనే తిరుమలలోని ఒక కేంద్రంతోపాటు తిరుపతిలో తొమ్మిది సెంటర్లు ఏర్పాటు చేసి, వైకుంఠ ద్వార దర్శనం టిక్కెట్లు అందజేసిన మాట వాస్తవం. కానీ అప్పుడెటువంటి తొక్కిసలాటలూ, దుర్ఘటనలూ జరగ లేదు. సాఫీగా జరిగిపోయింది. ఎందుకని? వైకుంఠ ద్వార దర్శనం సదవకాశాన్ని స్థానిక ప్రజలను దృష్టిలో ఉంచుకొని పది రోజులపాటు ఏర్పాటు చేశారు. తిరుపతికి వెలుపల ఎక్కడా ఎటువంటి ప్రకటనలూ ఇవ్వలేదు. స్థానికులు తీసుకోగా మిగిలితేనే ఇతర ప్రాంత ప్రజలు అడిగితే ఇచ్చే ఏర్పాట్లను చేశారు. ఇతర ప్రాంతాల వారికి ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని వచ్చే సౌకర్యం ఉండేది.

> వైకుంఠ ద్వార దర్శనం టిక్కెట్లను తిరుమలకు బదులుగా తిరుపతిలోనే అందజేసే కార్యక్రమాన్ని వైసీపీ సర్కార్ ప్రారంభించిందనీ, అందువల్లనే తొక్కిసలాట జరిగిందనేది చంద్రబాబు ఉవాచ. తిరుపతిలోనే టిక్కెట్లివ్వడమనేది పనికిమాలిన కార్యక్రమం అయితే, దివ్య దృష్టీ – దూరదృష్టీ... రెండూ కలిగిన చంద్రబాబు సర్కార్ ఎందుకు దాన్ని రద్దు చేయలేదనేది సహజంగా ఉద్భవించే ప్రశ్న. రద్దు చేయకపోగా, గతంలో ఎన్నడూ లేని విధంగా అస్మదీయ పత్రికల్లో భారీ ప్రకటనలు గుప్పించి భక్తకోటిని ఎందుకు ఆహ్వానించినట్టు? పైగా మూడు రోజుల టిక్కెట్లు ఒకేసారి ఇస్తామని ఏపీతో పాటు పొరుగు రాష్ట్రాల్లో కూడా ఎందుకు దండోరా వేయించినట్టు?

ఈసారి రాష్ట్రంతో పాటు వెలుపల కూడా 'రండహో' అంటూ దండోరా వేయించిన పెద్దమనుషులు... చేయాల్సిన ఏర్పాట్లను మాత్రం గాలికొదిలేశారు. ఎనిమిది కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి. ఎనిమిదో తేదీ మధ్యాహ్నానికే లక్షల సంఖ్యలో భక్తులు కౌంటర్ల దగ్గరకు చేరుకున్నారు. వాళ్లకు ఏ రకమైన వసతులూ కల్పించలేదు. మంచినీళ్లిచ్చే దిక్కు కూడా లేదు. ఎని మిది కేంద్రాలకు గాను బైరాగిపట్టెడ, శ్రీనివాసం, రామచంద్ర పుష్కరిణి, విష్ణు నివాసం అనే నాలుగు కేంద్రాల దగ్గర భక్తుల సంఖ్య పెరిగిపోయి తొక్కిసలాట జరిగింది. బైరాగిపట్టెడ పరిస్థితి మరీ ఘోరం.

అంతకంతకూ భక్తుల సంఖ్య పెరగడంతో కౌంటర్‌కు ఎదురుగా ఉన్న పార్కులోకి వారిని మళ్లించి తాళాలు వేశారు. అన్నపానీయాలు లేకుండా, కనీస వసతులు లేకుండా దాదాపు పది గంటలు ఉగ్గబట్టుకొని ఉండాల్సి వచ్చింది. మహిళలూ, వృద్ధుల పరిస్థితి వర్ణనాతీతం. శత్రు దేశాల ప్రజల్నీ, సైనికుల్ని నిర్బంధించడానికి నాజీలు ఏర్పాటుచేసిన కాన్సంట్రేషన్ క్యాంపులకు ఈ పార్కు జైలు భిన్నమైనదేమీ కాదు. ఇన్ని లక్షల మందిని నిర్బంధ శిబిరాల్లో కుక్కి మానవ హక్కులను హరించి నందుకు టీటీడీ అధికారులే కాదు ప్రభుత్వ పెద్దలు కూడా శిక్షార్హులే!

ప్రజలను గంటల తరబడి నిర్బంధంగా అన్న పానీయా లకూ, కనీస అవసరాలకూ దూరం చేయడం మానవ హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుంది. ఇటువంటి నిర్బంధ శిబిరాల గేట్లను హఠాత్తుగా తెరిచినప్పుడు తొక్కిసలాటలు జరుగుతాయని, ప్రమాదాలు జరుగుతాయని ఊహించడానికి 'డీప్ టెక్' పరి జ్ఞానం అవసరం లేదు కదా! కామన్‌సెన్స్ చాలు. ప్రజల ప్రాణా లకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని తెలిసి కూడా ఎటు వంటి ప్రకటనలూ చేయకుండా, అప్రమత్తం చేయకుండా అకస్మాత్తు చర్య ద్వారా తొక్కిసలాటకు దారితీయడం కూడా మానవ హక్కుల ఉల్లంఘనే!

ఈ నేరానికి పెద్ద తలలే బాధ్యత వహించవలసి ఉంటుంది. మొక్కుబడిగా ఎవరో ఇద్దర్ని సస్పెండ్ చేసి, మరో ముగ్గుర్ని బదిలీ చేసి చేతులు దులిపేసుకుంటే సరిపోతుందా? అందు లోనూ వివక్ష. ఘటనకు సంబంధించి ప్రత్యక్షంగా బాధ్యత లేని వారిపై చర్యలు తీసుకొని, కీలక బాధ్యుల్ని వదిలేశారన్న విమ ర్శలు వెంటనే వెలువడ్డాయి. కీలక బాధ్యులు ప్రభుత్వ పెద్దలకు బాగా కావలసినవారు. వెంటనే తరుణోపాయాన్ని ఆలోచించిన చంద్రబాబు బంతిని పవన్ కల్యాణ్ కోర్టులోకి నెట్టారు. అధినేత మనసెరిగిన పవన్ ఓ గంభీరమైన సూచన చేశారు.

జరిగిన ఘటన విషాదకరమైనదనీ, తనకు బాధ్యత లేకపోయినా క్షమాపణలు చెబుతున్నాననీ, అలాగే టీటీడీ ఛైర్మన్, ఈవో, తిరుమల జేఈవోలు కూడా క్షమాపణలు చెప్పాలనీ సూచించారు. అంటే ఇంత తీవ్రమైన నేరానికి క్షమాపణలు చెబితే సరిపోతుందన్న సూచన. బారా ఖూన్ మాఫ్! వారిపైన ఎటువంటి చర్యలూ లేకుండా క్షమాపణలతో సరిపెడతారన్నమాట! వారి శిరస్సుల మీద పవన్ కల్యాణ్ చేత మంత్ర జలం చల్లించి పాప ప్రక్షాళనం చేయించారనుకోవాలి. ఈ ఘటనతో ఏ సంబంధం లేని, కేవలం అడ్మినిస్ట్రేషన్ పనులకు మాత్రమే పరిమితమయ్యే తిరుపతి జేఈవో ఎందుకు బదిలీ అయ్యారో, ప్రధాన బాధ్యత తీసుకోవలసిన తిరుమల జేఈవో, ఈవో, టీటీడీ ఛైర్మన్‌లకు పాప విమో చనం ఎందుకు లభించిందో ఆ దేవదేవుడికే తెలియాలి.

> జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో తిరుమల దేవస్థానం ప్రతిష్ఠ జాతీయంగా, అంత ర్జాతీయంగా కూడా ఇనుమడించింది. టీటీడీ ఆధ్వ ర్యంలో దేశవ్యాప్తంగా వందలాది దేవాలయాల నిర్మాణం జరిగింది. స్వల్పకాలంలో ఇన్ని ఆలయాల నిర్మాణాన్ని ఇంకెవరి హయాంలోనూ టీటీడీ చేపట్ట లేదు. హిందువులకు పవిత్రమైన గోమాత సంరక్షణ కోసం వందల సంఖ్యలో గోశాలల నిర్మాణం కూడా జరిగింది. శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాలు దేశదేశాల్లో వైభవంగా జరిగాయి. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా పెద్ద జాబితానే ఉన్నది.

పాప విమోచనం దొరికిన ముగ్గురిలో కూడా ఇద్దరు మాత్రమే ప్రభుత్వాధినేతకు కావలసిన వారట! ఈవో శ్యామల రావుపై మాత్రం కత్తి వేలాడుతున్నదనీ, త్వరలోనే ఆయనను తప్పించడం ఖాయమనీ సమాచారం. ఇప్పుడే చర్య తీసుకుంటే తమకు కావలసిన వారిపై కూడా తీసుకోవలసి ఉంటుంది. కనుక కొంతకాలం తర్వాత ఆయనకు స్థానచలనం తప్పదం టున్నారు. తిరుపతి లడ్డూలో వాడే నెయ్యిలో కల్తీ జరిగిందనీ, దీనికి జగన్ సర్కారే బాధ్యత వహించాలనీ ఆమధ్య చంద్ర బాబు ఒక ప్రహసనాన్ని నడిపిన సంగతి తెలిసిందే. ఆ నాట కాన్ని రక్తి కట్టించడంలో ఈవో శ్యామలరావు విఫలమయ్యారనీ, ఫలితంగానే నాటకం రసాభాసగా మారిందనే అభిప్రాయం అధినేతకు ఉన్నదట!


గత సెప్టెంబర్ మాసంలో విజయవాడ వరదల సంద ర్భంగా ప్రభుత్వ యంత్రాంగం దారుణ వైఫల్యం దరిమిలా ప్రజల దృష్టిని మళ్లించేందుకు తిరుపతి లడ్డుకు ఉపయోగించే నెయ్యిలో కల్తీ జరిగిందనీ, ఇందుకు జగన్ పాలనలోనే బీజం పడిందనే ప్రచారాన్ని కిచిడీ సర్కార్‌తోపాటు యెల్లో మీడియా కూడా పెద్ద ఎత్తున చేపట్టిన సంగతి తెలిసిందే. చివరకు అదంతా బోగస్ ప్రచారంగా తేలడానికి రెండు మాసాలు కూడా పట్టలేదు.

జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో తిరు మల దేవస్థానం ప్రతిష్ఠ జాతీయంగా, అంతర్జాతీయంగా కూడా ఇనుమడించింది. టీటీడీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా వందలాది దేవాలయాల నిర్మాణం జరిగింది. స్వల్పకాలంలో ఇన్ని ఆలయాల నిర్మాణాన్ని ఇంకెవరి హయాంలోనూ టీటీడీ చేపట్టలేదు. హిందువులకు పవిత్రమైన గోమాత సంరక్షణ కోసం వందల సంఖ్యలో గోశాలల నిర్మాణం కూడా జరిగింది. శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాలు దేశదేశాల్లో వైభవంగా జరిగాయి. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా పెద్ద జాబితానే ఉన్నది.

తిరుమలను అపవిత్రం చేస్తున్నారనే ప్రచారాన్ని ఈ కిచిడీ గ్యాంగ్ ఆ రోజుల్లోనే ప్రారంభించింది. కానీ, ఎవరూ దాన్ని విశ్వసించలేదు. వారు అధికారంలోకి వచ్చిన తర్వాత లడ్డూ కల్తీ పేరుతో మరోసారి బురద చల్లాలని ప్రయత్నించి భంగ పడ్డారు. ఇప్పుడు తమ బాధ్యతా రాహిత్యానికి ఆరుగురు భక్తులు బలైతే... దాన్ని వైసీపీ ప్రభుత్వానికి చుట్టేందుకు చంద్రబాబు ప్రయత్నించడం, ప్రజల విజ్ఞతపై ఆయనకున్న చిన్న చూపుకు నిదర్శనం. అధికారంలోకి వచ్చిన ఏడు మాసాల్లో ఆయన ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయలేదు. పైగా అన్ని రంగాల్లో వైఫల్యం! వాటినుంచి దృష్టి మళ్లించేం దుకు నెలకోసారైనా ఒక పెద్ద డైవర్షన్ స్కీమ్‌ను రంగంలోకి దించుతున్నారు. ఇప్పటివరకు ఏడు మాసాల్లో ఎండబెట్టిన ఏడు డైవర్షన్ చేపల్లో ఒక్కటీ ఎండలేదు. చీమ కుట్టడంతోనే చేపల కథ ముగుస్తుంది. ఈ డైవర్షన్ చేపల కథ ముగింపు కూడా అలాగే ఉండనుంది.

vardhelli1959@gmail.com

యువత శక్తిమంతంగా ఎదగాలంటే...



సందర్భం

శ్రీ శ్రీ రవిశంకర్

మన యువతలో పెరుగుతున్న ఆత్మహత్యలు, ఆత్మహత్యా ధోరణులు నేటి సమాజపు మానసిక ఆరోగ్య స్థితికి దర్పణం పడుతున్నాయి. మన యువత ఒంటరిగా లేరని, వారి చుట్టూ తగినంత మానవత్వం ఉందని, వారికి సహాయపడేందుకు ఈ ప్రపంచంలో చాలామంది సిద్ధంగా ఉన్నారనే భరోసా మనం వారికి కల్పించాలి.

కుంగుబాటు అయినా, మానసిక ఆందోళన అయినా, లేక జీవితంలోని వివిధ రంగాలలో గెలవాలనే తపన వల్ల కలిగే మానసిక ఒత్తిడి అయినా సరే, యువత తాము ఎదు ర్కొంటున్న మానసిక ఆరోగ్య సమస్యల గురించి సాధార ణంగా ఎవరితోనూ పంచుకోరు. మానసిక ఆరోగ్యాన్ని గురించి ఇతరులతో చర్చించడం పట్ల ఉన్న దురభిప్రాయాన్ని, నిషేధాన్ని వదిలించుకుని, ఇతర శారీరక రుగ్మతలలాగానే వీటి గురించి కూడా బహిరంగంగా చర్చించడం ఈ రోజుల్లో చాలా ముఖ్యం. ప్రజలను తమ మానసిక ఆరోగ్యం, క్షేమం గురించి మాట్లాడేలా మనం ప్రోత్సహించాలి.

ఎవరైనా సంతోషంగా లేరని మనం గుర్తించినపుడు, వారిని అలా వదిలేసి మనం వెళ్లిపోకూడదు. వారివద్ద తప్పక ఆగి, 'అంతా బాగానే ఉందా? నేను మీకు ఏ విధంగానైనా సహాయం చేయగలనా?' అని అడగాలి. ప్రజలతో సంబం ధాలు ఏర్పరచుకోవడం, సహాయం అందించడం చాలా అవసరం. అలా చేయడం ద్వారా, మనం చాలామంది ప్రజల హృదయాలను, మనస్సులను తేలిక పరచగలుగుతాము. ప్రజల మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించే దిశలో ఇది మొదటి అడుగు కాగలదు.

దాదాపు పదేళ్ల క్రితం, 2014లో మేము హ్యాపీనెస్ సర్వేను ప్రారంభించాం. మా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి, ఆనందంగా ఉన్నారా, ఏవైనా సమస్యలు ఎదుర్కొంటు న్నారా అని అడిగారు. మా కార్యకర్తలు ఇలా ప్రశ్నించడమే వారిలో చాలామందికి ఎంతో ఉపశమనాన్ని కలిగించింది. ఈ సర్వేపై ఒక యువతి స్పందిస్తూ, తనను ఎవరైనా సంతోషంగా ఉన్నారా అని, తనకు ఏదైనా అవసరమా అని అడగడం ఇదే మొదటిసారి అని ఎంతో ఆనందించారు. నిజానికి ఆ సంభాషణకు ముందు, ఆమె తీవ్ర భావో ద్వేగానికి, అసంతృప్తికి లోనై ఉన్నారు. కాబట్టి, ఒకరికొ కరు మద్దతు ఇవ్వడం, ఒకరికొకరు అండగా నిలబడటం – మన సమాజం అంతా సిద్ధంగా ఉండి పనిచేయాల్సిన విషయం ఇది.

సేవ చేయండి

తమ జీవితానికి ముగింపు పలకాలనే ఆలోచన ఎవరి మనసులో కలుగుతుందో, వారు ఒక విషయాన్ని గ్రహించాలి. తాము ఇతరులకు సహాయం చేసేందుకే ఇక్కడ (భూమిపై) ఉన్నామని, తాము ఎవరో ఒకరికి ఉపయోగపడతామని వారు తెలుసుకోవాలి. ఏదో ఒక సేవా కార్యక్రమంలో చేరండి. సేవ చేసినప్పుడు, మనం ఒక విభిన్నమైన ఆనందాన్ని – ఇవ్వ టంలో ఉండే ఆనందాన్ని– కనుగొంటాము.

మీకు కుంగుబాటు కలిగిన ప్రతిసారీ, మీ ఇంటి నుండి బయటకు వెళ్లి, ఎవరో ఒకరిని కలిసి, 'నేను మీ కోసం ఏమి చేయగలను?' అని అడగండి. వెనువెంటనే మీ మానసిక స్థితిలో మార్పు రావటాన్ని మీరే గమనిస్తారు. ఉదయం నిద్ర లేచినప్పటి నుండీ ఇతరులకు సేవ చేయడంలో, ఇతరుల పట్ల శ్రద్ధ వహించడంలో తీరిక లేకుండా గడపండి. రాత్రయ్యేసరికి



మీరు అలసిపోయి, గాఢమైన, ప్రశాంతమైన నిద్రకు సిద్ధంగా ఉంటారు.

ప్రాణశక్తిని పెంచుకోవడం

ప్రజలు కుంగిపోయినప్పుడు, లేదా ఆత్మహత్యా ధోరణిలో ఉన్నప్పుడు, ఆ ఆలోచనలు కలిగినప్పుడు, వారిలో ప్రాణశక్తి స్థాయిని పెంచడం చాలా సహాయకారిగా ఉంటుం దని గమ నించడం జరిగింది. ప్రజలు తమను తాము తక్కువగా భావించినప్పుడు, వారిలోని ప్రాణం లేదా ప్రాణ శక్తి సాధారణంగా క్షీణిస్తుంది. ఇది నిరాశకు, లేదా ఆత్మహత్య ధోరణులకు దారి తీస్తుంది. అటువంటప్పుడు శారీరక వ్యాయామం చేయడం కొంతమేరకు సహాయపడుతుంది. కానీ ఆ సమయంలో శారీరక వ్యాయామాల వలన వారు అలసిపోయే అవకాశం ఉంది. వ్యాయామాలు చేయడం కష్టంగా అనిపించేవారికి, అలసిపోతామని భావించేవారికి యోగాసనాలు, ధ్యానం మంచి మార్గాలు. అవి వారిని శారీరకంగా అలసటకు గురిచేయకుండానే ప్రాణశక్తిని పెం చుతాయి. మంచి ఉత్తేజ కరమైన సంగీతం కూడా ఈ పరిస్థితికి వైద్యంలా పనిచేస్తుంది. 'సుదర్శన క్రియ' వంటి శ్వాస పద్ధతులు శరీరంలో ప్రాణశక్తిని తక్షణమే పెంచుతాయి. మానసిక ఆరోగ్యం అనేది ప్రతి వ్యక్తికీ, ముఖ్యంగా యువతకు జన్మహక్కు. దీనిని కాపాడుకునేందుకు చేసే పోరాటంలో సుదర్శన క్రియ దీర్ఘ కాలంపాటు సమర్థవంతమైన పాత్ర పోషించగలదు. మనలో ప్రాణశక్తి హెచ్చుగా ఉన్నప్పుడు, మన మనస్సులోప్రతికూల ఆలోచనలు రావటం తగ్గుతుంది.


అంతే కాదు, మనం జీవితం పట్ల మన దృష్టిని విస్తృతం చేసుకోవాలి. దానితోబాటు మన సాంస్కృతిక, ఆధ్యాత్మిక మూలాలను మరింత లోతుగా వేళ్ళూనుకునేలా చేయాలి. మన మూలాలను లోతుగా ఉంచడం అనేది మన బాధ్యతను పెంచి, 'ఇది నా సొంత పని' అనే భావన కలిగిస్తుంది. జీవితంపట్ల విశాల దృక్పథం కలిగి ఉన్నపుడు అది మనకు ఒక రకమైన విశ్రాంతిని కలుగజేస్తుంది. విశాల దృక్పథం, లోతైన మూలాలు అంటే మన బాధ్యతలను సులభంగా, ప్రశాంతతతో, సమబుద్ధితో స్వీకరించటం అన్నమాట.

విద్యార్థులుగా, యువతగా మనం సమాజానికి తిరిగి ఏమి ఇవ్వగలమనే దాని గురించి ఇప్పటినుండే కలలు కనాలి. ఈ ప్రపంచం నుండి మనం ఏమి పొందబోతున్నాం అనే దాని గురించే ఆలోచిస్తూ ఉంటే, మన విచారాలకు ఇక అంతం ఉండదు. కానీ మనం ఆ పరిధి నుండి బయటకు, సహకారం అందించే వైపుకు వచ్చి, మనచుట్టూ ఉన్నవారిలో ఆనందాన్ని తీసుకురాగలిగే మార్గాలు, ఆర్థిక వ్యవస్థకు మద్దతునిచ్చే ఆలోచనలు, ప్రజలను సంఘటితం చేసే విధానాలు, వారి లోని భేదాభిప్రాయాలను నిర్మూలించే ప్రయత్నాలు– వీటి గురించి ఆలోచించినపుడు, మీ ఆలోచనా విధానంలోని ఈ మార్పు మీ చిన్నచిన్న చింతలన్నింటినీ కరిగించివేసి, మీ ద్వారా అద్భుతాలను సృష్టించగలదు.

భవిష్యత్తు గురించి ఆందోళన, లేదా ఆతృత కలిగి నప్పుడు ఒక్కసారి జీవితంలో వెనక్కి తిరిగి చూసుకోండి. మనం ఇలా ఆందోళన చెందటం ఇదే మొదటిసారి కాదు. ఇంతకు ముందు కూడా ఆందోళన చెందాము. కాలేజీల్లో అడ్మిషన్ పొందడం, పరీక్షల్లో ఉత్తీర్ణత, లేదా ఉద్యోగాలు పొందడం గురించి ఆందోళన చెందాము. ఆ సందేహాలు, ఆందోళనల క్షణాలన్నిటినీ అధిగమించి ముందుకు వచ్చాము. అలాగే ఈనాటి ఆందోళనలను కూడా మనం తప్పక అధిగ మించగలం. ఆ ధైర్యమే మనకు శ్రీరామ రక్ష!

వ్యాసకర్త ఆధ్యాత్మిక గురువు । (నేడు స్వామి వివేకానంద జయంతి; జాతీయ యువజన దినోత్సవం)

ఒక ఝంఝూ మారుతం



స్వామి వివేకానంద

మహోన్నత ప్రాచీన భారతీయ సంస్కృతిని, దేశభక్తిని, జాతీయ భావాన్ని ప్రతి ఎదలో ప్రతిధ్వనించేట్లుగా చేసిన మహనీయుడు వివేకానందుడు. విలక్షణ జీవన శైలి, విశిష్టమైన ఆయన సేవలు నేటి యువతకు మార్గదర్శకం.

ఆయన ప్రసంగం ఎంతటి వారినైనా అలరించేది. దేశ సముద్ధరణకు అహర్నిశలూ తపించారు. ఆయనను ఆ రోజులలో 'లైట్నింగ్ ఆరేటర్' అని పిలిచేవారు. 1893 సెప్టెంబరులో అమెరికాలోని చికాగోలో జరిగిన సర్వమత సమ్మేళనంలో అయన చేసిన ప్రసంగం ఈ రోజుకూ ప్రపంచ దేశాలంతటా ప్రతిధ్వనిస్తోంది. ఈ సభలో హిందూ వేదాంత భేరిని మోగించిన ఆయన వాక్పటిమకు, అనంత మేధా సంపత్తికి శ్రోతలు ముగ్ధ లయ్యారు. నాలుగు సంవత్సరాల పాటు అమెరికా, ఐరోపా ఖండాలలో పర్యటించి వేదాంత కేంద్రాలు నెలకొల్పారు. అనేకు లను శిష్యులుగా స్వీకరించి 1897లో స్వదేశానికి తిరిగి వచ్చారు. రాగానే 'రామకృష్ణ మిషన్'ను స్థాపించారు.

1863 జనవరి 12న కలకత్తాలో జన్మించిన వివేకానందుని తొలినామం నరేంద్రుడు. కళాశాలలో చదువుతుండగా తండ్రి విశ్వ నాథ దత్తా మరణించటంతో కుటుంబ భారం ఆయన భుజాలపై పడింది. చిన్నప్పటి నుంచి నరేంద్రుడి కలల్లో ఒక దివ్య శక్తి వెలుగు రూపంలో కనిపించేది. ఆ సమయంలో దక్షిణేశ్వరంలోని రామకృష్ణ పరమహంసతో పరిచయమేర్పడింది. అనతి కాలంలో నరేంద్రుడు రామకృష్ణుని ముఖ్య శిష్యులయ్యారు. ఆయన మనోహర గానం రామకృష్ణుని ఆనందసాగరంలో ముంచెత్తేది. 1886లో పరమహంస నిర్యాణం అనంతరం నరేంద్రుడు పరివ్రాజకుడుగా యావత్ భారతం పర్యటించారు. 'వివేకానంద' నామం స్వీకరించారు.

అయన ప్రసంగాలు యువతలోని శక్తిని మేల్కొలిపాయి. ఆయన ఓ ప్రచార కర్త కాదు. ఓ మతం. ప్రతి మనిషి ఆత్మలో దైవత్వాన్ని చూడడం ఆ మత సూత్రం. 'పేదవాని సేవే భగవంతుని సేవ' అని చెప్పిన యుగకర్త. మతానికి కొత్త అర్థాన్ని, సేవకు పరమార్థాన్ని నిర్వచించి 'నరుడే నారాయణుడ'నీ, 'మానవ సేవయే మాధవసేవ' అనీ చాటిచెప్పిన మహోన్నత మూర్తి. యువ తరాన్ని ప్రేరేపించిన మహాశక్తి. అందుకే వివేకానందుని పుట్టిన రోజును 'జాతీయ యువజన దినోత్సవంగా' ప్రకటించింది భారత ప్రభుత్వం. నలభై ఏళ్లకే 1902 జులై 4న తనువు చాలించడంతో దేశం ఒక ఆధ్యాత్మిక మేధావిని కోల్పోయింది.

– నందిరాజు రాధాకృష్ణ
సీనియర్ జర్నలిస్ట్ । 98481 28215

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువకుడు బలి


రాజ్‌కుమార్

వర్ధన్నపేట: ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనంతో అప్పులు చేసి.. అవి తీర్చే మార్గం కనిపించక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో శనివారం ఈ ఘటన జరిగింది. లైశెట్టి రాజ్‌కుమార్ (28) అనే యువకుడు డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలో రెండేళ్ల నుంచి ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడ్డాడు. గత ఏడాది బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్‌లు ఆడుతున్నాడని తల్లిదండ్రులకు తెలిసి మందలించారు. అయినా అతను మానలేదు. ఈ క్రమంలో తల్లిదండ్రుల నుంచి రూ.లక్ష తీసుకుని ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పెట్టిన రాజ్‌కుమార్.. నాలుగు రోజుల క్రితం తండ్రిని మరో రూ.4 లక్షలు కావాలని అడిగ్గా.. అన్ని లేవని కొంత ఇస్తానని చెప్పాడు. శనివారం ఉదయం తండ్రి కూరగాయలు అమ్మడానికి మార్కెట్‌కు వెళ్లగా, తల్లి ఇంటి ముందు కూరగాయలు విక్రయిస్తోంది. ఈ క్రమంలో రాజ్‌కుమార్ గదిలో తాడుతో ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని గమనించి అతడిని కిందికి దించే సరికే మృతి చెందాడు. రాజ్‌కుమార్ ఆన్‌లైన్ బెట్టింగ్ కోసం సుమారు రూ.30 లక్షలు అప్పు చేసినట్లు కుటుంబ సభ్యులు చెబుతుండగా.. తండ్రిమాత్రం ఆన్‌లైన్ బెట్టింగ్ కోసం రూ.4 లక్షలు అప్పు చేసిన రాజ్‌కుమార్ మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడని వర్ధన్నపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఎస్సై చందర్ తెలిపారు.

'గేమ్‌ఛేంజర్'కు ఇచ్చిన మినహాయింపులు 16 నుంచి బంద్

సాక్షి, హైదరాబాద్: సినిమాలకు ఉదయం పూట ప్రత్యేక షోలకు ఇకపై అనుమతించేది లేదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గేమ్‌ఛేంజర్‌కు ప్రత్యేక మార్నింగ్ షోలు, టికెట్ ధరల పెంపుపై హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు తెలిపారు. గేమ్‌ఛేంజర్ సినిమా కోసం ఇచ్చిన ఉపసంహరణ ఉత్తర్వులు ఈనెల 16వ తేదీ నుంచి అమలులోకి వస్తాయని ఆయన ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గేమ్‌ఛేంజర్ సినిమాకు సింగిల్ స్క్రీన్స్‌కు రూ.100 నుంచి రూ.150 పెంచుతూ జనవరి 8న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి విదితమే. హైకోర్టు తాజా ఉత్తర్వుల నేపథ్యంలో సంక్రాంతి సినిమాలకు ప్రత్యేక షోలు, టికెట్ల ధరల పెంపు ఆగిపోయింది.

సంక్రాంతి తర్వాత బీసీలకు 'స్వయం ఉపాధి'!

సబ్సిడీ కార్యక్రమాల ప్రణాళికను సిద్ధం చేసిన బీసీ కార్పొరేషన్

- రూ.2,100 కోట్లతో ప్రతిపాదనలు.. సీఎం సూత్రప్రాయ అంగీకారం
- ఎంబీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలోనూ పథకాల అమలు
- మార్చి చివరికల్లా యూనిట్ల గ్రౌండింగ్ లక్ష్యంగా కార్యాచరణ
- స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వేగంగా అడుగులు
- త్వరలోనే ఉత్తర్వులు వెలువడే అవకాశం



సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన తరగతుల్లోని నిరుద్యోగ యువతను స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టిపెట్టింది. బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల మంజూరుకు సన్నద్ధమవుతోంది. ఈ మేరకు తెలంగాణ బీసీ కార్పొరేషన్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.2,100 కోట్లతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల దీనిపై ప్రత్యేకంగా చర్చించి సూత్రప్రాయంగా ఆమోదించినట్టు తెలిసింది. ఈ మేరకు సంక్రాంతి పండుగ తర్వాత ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని అధికారవర్గాలు చెప్తున్నాయి. ఉత్తర్వులు రాగానే క్షేత్రస్థాయి నుంచి దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగంగా చేపట్టేందుకు బీసీ కార్పొరేషన్ కార్యాచరణ రూపొందించింది. ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి అంటే మార్చి చివరినాటికి లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి యూనిట్లు గ్రౌండింగ్ చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు.

దశాబ్దకాలం నుంచీ నిరీక్షణే..

తెలంగాణ బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాల కల్పన చాలా ఏళ్లుగా అటకెక్కింది. దీనికి బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నట్టు చూపుతూ వచ్చినా, విడుదల చేయలేదు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో బీసీ సబ్సిడీ రుణాల కోసం పెద్ద సంఖ్యలో దరఖాస్తులు స్వీకరించారు. అప్పుడు దాదాపు 7.5 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. కానీ మంజూరు కాలేదు. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో రూ.50వేల లోపు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న కొందరికి మంజూరు చేసినా.. తర్వాత రుణాల పంపిణీ ఊసేలేదు. తాజాగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో బీసీ కార్పొరేషన్‌కు భారీగా బడ్జెట్ కేటాయింపులు జరిపారు. ఆర్థిక సంవత్సరం ముగింపునకు వస్తున్న క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం బీసీ స్వయం ఉపాధి పథకాలను పట్టాలెక్కించాలని నిర్ణయించింది.

స్థానిక సంస్థల ఎన్నికల ముందు..

త్వరలో రాష్ట్రంలో పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌ల ఎన్నికలు జరగనున్నాయి. ఈ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సబ్సిడీ పథకాలను తెరపైకి తెచ్చేందుకు కాంగ్రెస్ సర్కారు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగానే బీసీ కార్పొరేషన్ రూపొందించిన కార్యాచరణ ప్రణాళికకు ఆమోదం తెలిపినట్టు సమాచారం. ఇక ఎంబీసీ కార్పొరేషన్ ద్వారా కూడా సబ్సిడీ పథకాలను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఎంబీసీ కార్పొరేషన్ అధికారులకు సైతం పలు సూచనలు చేసింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులు కూడా వారంలో వెలువడే అవకాశం ఉన్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు చెప్తున్నాయి.

ర్యాంకు ఆధారంగా ఇందిరమ్మ ఇల్లు

పేదరిక స్థాయిని బట్టి ర్యాంకులు

- ఏడు ప్రశ్నల ద్వారా అర్హుల నిర్ధారణ
- మొబైల్ యాప్ ద్వారా జాబితా సిద్ధం
- 95 శాతం ప్రక్రియ పూర్తి
- 21 నుంచి 25 వరకు గ్రామ సభల్లో చర్చ
- మార్పులు చేర్పులతో తుది జాబితా ఖరారు



సాక్షి, హైదరాబాద్: ఏడు ప్రశ్నలతో పేదరిక స్థాయి నిర్ధారణ.. దాని ఆధారంగా ర్యాంకుల కేటాయింపు.. ఆ ర్యాంకులను బట్టి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక.. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి స్థూలంగా చేపట్టిన ప్రక్రియ ఇది. ఏడాది క్రితం ప్రజా పాలన కింద అందిన 80.63 లక్షల దరఖాస్తుల నుంచి గ్రామాలవారీగా అర్హుల జాబితాను మొబైల్‌యాప్ ద్వారా సిద్ధం చేసే ప్రక్రియ దాదాపు పూర్తయింది. ఈ నెల 21 నుంచి 25 వరకు జరిగే గ్రామ సభల్లో ఈ జాబితాపై చర్చించి మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్లను కేటాయించే లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నిరుపేదల నిర్ధారణకు ఏడు ప్రశ్నలు

అసలైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇళ్లు దక్కాలని కృత నిశ్చయంతో ఉన్న ప్రభుత్వం.. దరఖాస్తులను మాన్యువల్‌గా కాకుండా మొబైల్ యాప్ ద్వారా జల్లెడ పట్టి ప్రాథమిక జాబితాలు సిద్ధం చేసింది. ఈ యాప్‌లో ఏడు రకాల ప్రశ్నలను నిక్షిప్తం చేశారు. దరఖాస్తుదారుల ఇళ్ల వద్దకు వెళ్లి అందులోని వివరాలను, క్షేత్రస్థాయి పరిస్థితులను సరిచూసి యాప్‌లో పొందుపరిచారు. అందరికంటే పేదలు, ఇందిరమ్మ ఇల్లు అవసరం ఉన్నవారి వివరాలను ప్రాధాన్యత క్రమంలో సిద్ధం చేశారు. గ్రామాలవారీగా అర్హులు.. వారిలో ముందు వరుసలో ఉన్నవారిని గుర్తించి ఓ జాబితాను రూపొందించారు. ఈ ప్రక్రియ ఇప్పటికే 95 శాతం పూర్తయింది. మరో ఐదారు రోజుల్లో మొత్తం పూర్తి చేసేందుకు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

పేదరిక స్థాయి ఆధారంగా ర్యాంకులు..

పేదల్లో నిరుపేదలు, ఇంటి అవసరం ఎక్కువగా ఉండి.. దానిని సమకూర్చుకునే స్తోమత లేనివారి జాబితాను ప్రాధాన్యతా క్రమంలో రూపొందించారు. వారి సామాజిక, ఆర్థిక పరిస్థితి ఆధారంగా యాప్‌లో కొన్ని ర్యాంకులు కేటాయించారు. తొలుత ఏడు ప్రశ్నలకు సమాధానాలు సేకరించటం ద్వారా పేదరికాన్ని నిర్ధారిస్తారు. సొంత ఇల్లు ఉందా లేదా? ఉంటే దాని పైకప్పు ఎలాంటిది? ఇంటి విస్తీర్ణం, కుటుంబ ఆదాయం, వృత్తి, ఆదాయ మార్గం లాంటి వివరాలతో కుటుంబ స్థాయిని ధ్రువీకరిస్తారు. ఈ ప్రశ్నలతోపాటు ఆధార్ కార్డు ఆధారంగా ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి, గతంలో ప్రభుత్వ పథకంలో ఇల్లు పొందిందీ లేనిదీ.. తదితర వివరాలు సేకరిస్తారు. ఇంటి పన్ను, ఆదాయ పన్ను చెల్లింపు, కారు లాంటి పెద్ద వాహనం ఉందీ లేనిదీ, బ్యాంకు రుణాల వంటివాటిని గుర్తిస్తారు. పట్టాదారు పాసుపుస్తకం ఉంటే భూమి వివరాలను కూడా సేకరిస్తారు. ఇలా 360 డిగ్రీల కోణంలో వివరాల సేకరణ ఉంటుంది. నిరుపేద వితంతువు, సంపాదన మార్గం లేనివారు, దివ్యాంగులు, సఫాయి కర్మచారీలు, పనికి ఆహార పథకం కూలీలు, వ్యవసాయ కూలీలు, సాధారణ కూలీలకు ర్యాంకులు కేటాయించటం ద్వారా పేదల్లో నిరుపేదలకు ఎక్కువ ర్యాంకు ఇస్తారు.

21 నుంచి గ్రామ సభలు..

యాప్ ద్వారా రూపొందించిన జాబితాను అధికారులు జిల్లా కలెక్టర్లకు పంపుతున్నారు. కలెక్టర్లు వాటిని సరిచూసుకుని ప్రాధాన్యతా క్రమంలో అర్హుల జాబితాను రూపొందించి జిల్లా ఇన్‌చార్జి మంత్రికి అందిస్తారు. గ్రామాలవారీగా లబ్ధిదారుల జాబితాను రూపొందించి గ్రామ సభలో ప్రదర్శనకు ఉంచుతారు. ఈ నెల 21 నుంచి 25 వరకు జరిగే గ్రామ సభల్లో ఆ జాబితాపై చర్చిస్తారు. అందులో వచ్చే అభ్యంతరాల ఆధారంగా అవసరమైన మార్పులు చేసి తుది జాబితాను ఖరారు చేసి గ్రామ సభ ఆమోదం తీసుకుంటారు. ఆ వివరాలను కేంద్ర ప్రభుత్వానికి కూడా పంపి.. జాబితాలోని వారికి ఇళ్లను మంజూరు చేస్తారు. ఈ ప్రక్రియను ఈ నెలాఖరుకల్లా పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఆ తర్వాత ఇళ్ల నిర్మాణం ప్రారంభమవుతుంది. పునాదుల ప్రక్రియ పూర్తయ్యాక తొలివిడత రూ.లక్షను విడుదల చేస్తారు.

పరిశీలించే అంశాలు..

360 డిగ్రీల వెరిఫికేషన్
ఇంటి పన్ను, ఆదాయపన్ను కడుతున్న వారు.. కారు ఉన్నవారు.

ఆధార్ ద్వారా..
పట్టాదారు పాసుపుస్తకం ఆధారంగా భూమి వివరాలు

పేదరిక ర్యాంకు
వితంతువు, సింగిల్ చైల్డ్, దివ్యాంగులు, సఫాయి కర్మచారీ, పనికి ఆహారపథకం కూలీలు, వ్యవసాయ కూలీలు.

● మంచిర్యాల జిల్లా జైపూర్ మండల కేంద్రంలోని ఎస్టీపీపీకు గోవాలో మిషన్ ఎనర్జీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాటర్ ఆప్టిమైజేషన్ అవార్డు-2025 విభాగంలో రెండు అవార్డులు లభించాయి. 500 మెగావాట్లకు పైగా సామర్థ్యం గల థర్మల్ విద్యుత్ కేంద్రాల విభాగంలో తక్కువ నీటి వినియోగంతో విద్యుదుత్పత్తి చేసే విభాగంలో బెస్ట్ వాటర్ ఎఫిషియెంట్ అవార్డు, వివిధ విభాగాల నుంచి విడుదలయ్యే అపరిశుభ్ర నీటిని జీరోలిక్విడ్ డిశ్చార్జ్ వ్యవస్థలను ఉపయోగించి శుద్ధి చేయడం వల్ల బెస్ట్ జీరో లిక్విడ్ డిశ్చార్జ్ ప్లాంటు ఆఫ్ ద ఇయర్ అందుకుంది.





మేళాకు వేళాయె

మహా కుంభమేళాకు 13వేల రైళ్ల రాకపోకలు

- విజయవాడ, సికింద్రాబాద్‌ల నుంచి నేరుగా ప్రయాగ్‌రాజ్‌కు రైళ్లు
- హైదరాబాద్ నుంచి ప్రయాగ్‌రాజ్‌కు నేరుగా విమానసేవలు
- అందుబాటులో టెంట్‌లు, విల్లాలు



మహా కుంభమేళాను పురస్కరించుకుని శనివారం ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలాచరిస్తున్న భక్తులు

సాక్షి, న్యూఢిల్లీ: అశేష జనవాహినితో భగవన్నామ స్మరణలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న పుణ్యస్నానాలనగరి, త్రివేణి సంగమస్థలిలో మహాకుంభమేళాకు భక్తకోటి బారులుతీరింది. భక్తిపారవశ్యంతో పోటెత్తే కోట్లాది మందికి 'మహా కుంభమేళా'ప్రాంతంలో విడిదిసహా రాకపోకలు, ఇతర సౌకర్యాల కోసం యోగి ఆదిత్యనాథ్ సారథ్యంలోని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం విస్తృతస్థాయి ఏర్పాట్లు చేసింది. ఈ నెల 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు ప్రపంచం నలుమూలల నుంచి సుమారు 40కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో సకల సౌకర్యాలపై రాష్ట్ర సర్కార్ దృష్టిసారించింది. మహా కుంభమేళాకు వచ్చిన ఏ ఒక్క భక్తుడికీ అసౌకర్యం కలగకుండా ఉండేందుకు చర్యలు చేపడుతున్నారు. అధునాతన ప్రపంచ ఆధ్యాత్మిక ఘట్టంగా మహా కుంభమేళా నిలిచిపోయేలా యోగీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దేశం నలుమూలల నుంచి మహాకుంభ మేళాకు వచ్చే భక్తులు www.irctctourism.com తోపాటు www.upstdc.co.in వెబ్‌సైట్‌లో విడిది, ఇతర టూర్ ప్యాకేజీల కోసం బుక్ చేసుకునే ఏర్పాట్లు చేశారు.

తెలుగు ప్రాంతాల నుంచి రైళ్లు

దేశంలోని వేర్వేరు ప్రాంతాల నుంచి కుంభమేళా సమీప రైల్వేస్టేషన్లకు 50 రోజుల్లో మొత్తంగా 10,000 సాధారణ రైళ్లు, 3,000 ప్రత్యేక రైళ్లు నడవనున్నాయి. విజయవాడ, సికింద్రాబాద్‌ల నుంచి నేరుగా ఉత్తరప్రదేశ్‌లోని మహాకుంభ మేళా జరిగే ప్రయాగ్‌రాజ్ ప్రాంతానికి రైల్వేశాఖ రైళ్లను నడుపుతోంది. కొన్ని రైళ్లు ప్రయాగ్‌రాజ్ చెయోకీ రైల్వేస్టేషన్ వరకు వెళతాయి. మరికొన్ని ప్రయాగ్‌రాజ్ రైల్వే జంక్షన్ వరకు వెళుతున్నాయి. హైదరాబాద్ నుంచి నేరుగా ఒకే ఒక్క విమాన సౌకర్యం ఉంది. విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం నుంచి విమానంలో వెళ్లే వారు హైదరాబాద్‌లో ఇదే విమానం ఎక్కాల్సి ఉంటుంది. ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళా జరిగే ప్రాంతానికి వేల కొద్దీ ఆటోలు, క్యాబ్‌లు, ద్విచక్రవాహనాలు, రిక్షా సౌకర్యాలు ఉన్నట్లు యూపీ ప్రభుత్వం పేర్కొంది.

వెలసిన టెంట్ సిటీ: మహాకుంభ మేళా జరిగే ప్రాంతంలో ఉండేందుకు రైల్వేశాఖకు చెందిన ఐఆర్‌సీటీసీ పలు ఏర్పాట్లు చేసింది. అక్కడ ఉండాలనుకునే వారు www.irctctourism.com వెబ్‌సైట్‌లలో బుక్ చేసుకోవచ్చు. చెక్ ఇన్ టైం మధ్యాహ్నం 12గంటలకు, చెక్ అవుట్ టైం మరుసటి రోజు ఉదయం 10గంటలుగా నిర్ణయించారు. టెంట్ అయితే రూ.18,000, విల్లా అయితే రూ.20,000 ధర నిర్ణయించారు. 'ఐఆర్‌సీటీసీ మహాకుంభ్ గ్రామ టెంట్ సిటీ'పేరుతో బస సౌకర్యం అందిస్తున్నారు. అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజన సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. స్నానాల గది, వేడి, చల్లటి నీరు, కుంభమేళాను వీక్షించేందుకు ఎల్‌ఈడీ టీవీ, ఏసీ సౌకర్యాలూ అందిస్తున్నారు. ఒక టెంట్‌లో ఇద్దరు పెద్దలు, ఇద్దరు చిన్న పిల్లలు ఉండేందుకు మాత్రమే అనుమతిస్తున్నారు. ఒకసారి బుకింగ్ పూర్తయ్యాక రద్దు చేసుకుంటే బుకింగ్ డబ్బులు తిరిగి ఇవ్వరు.

రూ.1500తో కూడా ఉండొచ్చు

ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర పర్యాటక శాఖ సైతం బస ఏర్పాట్లు ప్రత్యేకంగా చేసింది. ఒక్క రాత్రి విడిదికి రూ.1,500 నుంచి రూ.35,000 ధరలో వేర్వేరు రకాల భిన్న బస సౌకర్యాలు ఏర్పాటు చేశారు. విల్లా అయితే ఇద్దరు ఉండేందుకు రోజుకు రూ.35,000 చెల్లించాల్సి ఉంటుంది. అదనపు వ్యక్తికి మరో రూ.8,000 చెల్లించాల్సి ఉంటుంది. మహారాజా విభాగంలో ఇద్దరికి రూ.24,000, అదనంగా మరో వ్యక్తి బసచేయాలంటే మరో రూ.6,000 చెల్లించాలి. స్విస్ కాటేజ్ కేటగిరీలో ఇద్దరు భక్తులకు కలిపి రూ.12,000, అదనంగా మరో వ్యక్తి బసచేస్తే రూ.4,000 చెల్లించాలి. ఈ సౌకర్యాల కోసం www.upstdc.co.in వెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. తక్కువ ఖర్చులో యాత్ర ముగించాలనుకునే వారికీ ఆయా ప్రాంతాల్లో రూ.1500కే బస ఏర్పాట్లు ఉన్నాయి. హోటల్స్, లాడ్జిలు బస నిమిత్తం రోజుకు రూ.1500 నుంచి చార్జ్ వసూలు చేస్తున్నారు. స్థానికుల ఇళ్లల్లో బసకూ ప్రభుత్వం అనుమతించింది. హోం స్టేకి కూడా రూ.500 నుంచి రూ.10వేల వరకు ధరలు ఉన్నట్లు తెలుస్తోంది. క్యారవాన్‌లో సైతం బస ఏర్పాట్లు చేస్తున్నారు. యూపీ ప్రభుత్వం ఒక్కో క్యారవాన్ 8మందికి అనుమతి ఇస్తోంది. ఒక్క రోజుకు రూ.18,000 వసూలు చేస్తున్నారు. రోజుకు 350 కిలోమీటర్లు ఈ క్యారవాన్‌లో ప్రయాణించొచ్చు. అంతకు మించితే ఒక్కో కిలోమీటర్‌కు రూ.70 వసూలు చేయనున్నారు. ఎక్కడైనా ఓ గంటపాటు నిలిపి ఉంచితే మాత్రం ఒక్కో గంటకు రూ.700 చెల్లించాలి. వీటితో పాటు గంగా నదిలో పడవ ప్రయాణ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. స్పీడ్ బోటు అయితే ఒక్కో వ్యక్తికి రూ.5,000, మినీ క్రూయిజ్ బోట్ అయితే ఒక్కో భక్తుడి నుంచి రూ.900 వసూలుచేయనున్నారు.



కుంభమేళా వేడుకల కోసం ప్రయాగ్‌రాజ్‌లోని సంగం వద్దకు చేరుకున్న విదేశీ పర్యాటకులు

యోగాసనాలకూ అవకాశం

ప్రయాగ్‌రాజ్‌లో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6గంటల మధ్య యోగా టూర్ ప్యాకేజీ కూడా అందుబాటులో ఉంది. దీనికి ఒక్కో వ్యక్తి రూ.500 చార్జ్ చేస్తున్నారు. యోగా టూర్ ప్యాకేజీలో భాగంగా ఉదయం 6గంటలకు ఫ్లోటింగ్ రెస్టారెంట్ నుంచి టూర్‌ను ప్రారంభించి 'రహీ త్రివేణి'కి తీసుకెళ్తారు. 6.30గంటలకు నైనీలోని అరైల్ వద్ద యమునా నది ఒడ్డున ఉన్న త్రివేణి పుష్ప, పర్మార్థ్ నికేతన్ అనే ఆకర్షణీయమైన ప్రాంతాలను చూపిస్తారు. 9.30గంటల నుంచి 10.30గంటల వరకు యోగా, ధ్యానం చేసుకోవచ్చు. విరామం, విశ్రాంతిలో భాగంగా మధ్యాహ్నం ఒంటి నుంచి 2 గంటలకు భోజన సౌకర్యాలు కల్పిస్తారు. 3 గంటల నుంచి 4.30 గంటల మధ్య యోగా, ధ్యానం, సాయంత్రం 5.30గంటలకు సంగం హారతి సదుపాయం కల్పిస్తారు. సాయంత్రం 6 గంటలకు తిరిగి ఫ్లోటింగ్ రెస్టారెంట్ వద్దకు తీసుకురావడంతో టూర్ ముగుస్తుంది. రూ.5,000 ప్యాకేజీలో బోట్ సౌకర్యం, పానీయాలు, అల్పాహారం, భోజనం, పర్యావరణహిత చేతి సంచులు, నీళ్ల సీసాలు, కుంభమేళా మ్యాప్‌లు ఉచితంగా ఇస్తారు.

వీవీఐపీల డిజిటల్ భద్రత బాధ్యత కాన్పూర్ ఐఐటీకి

భక్తుల సౌకర్యార్థం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశాయి. సాంకేతిక పరిజ్ఞానంతో మహాకుంభలో భద్రతను పటిష్టం చేశారు. పుణ్య స్నానమాచరించడానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ సహా దేశ, విదేశాలకు చెందిన వీవీఐపీలు ప్రయాగ్‌రాజ్ రానున్నారు. దీంతో వీవీఐపీల డిజిటల్ భద్రతను సమీక్షించే బాధ్యతను ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కాన్పూర్ ఐఐటీకి అప్పగించింది. మేళాలో వీవీఐపీల భద్రతలో ఐఐటీ కాన్పూర్ కీలక పాత్ర పోషిస్తోంది. ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ మనీంద్ర అగర్వాల్ పర్యవేక్షణలో పది మందికి పైగా సీనియర్ శాస్త్రవేత్తల బృందం డిజిటల్ భద్రతను పరిశీలిస్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, సైబర్ సెక్యూరిటీతో సహా అత్యాధునిక సాంకేతికతను వీవీఐపీల భద్రత కోసం ఉపయోగిస్తున్నారు. మహాకుంభ్ జరిగే ప్రాంతాల్లో వివిధ చోట్ల సెన్సర్లను, స్కానర్లను ఏర్పాటు చేశారు. డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా కొనసాగుతోంది. డిజిటల్ భద్రతకు సంబంధించిన పనులను కాన్పూర్ ఐఐటీ బృందం రెండు నెలల క్రితమే మొదలెట్టింది.

అభివృద్ధిని గవర్నర్ జీర్ణించుకోలేకున్నారు

- ఆయనవి చిన్న పిల్లల చేష్టలు
- సీఎం ఎంకే స్టాలిన్ వ్యాఖ్యలు

చెన్నై: తమిళనాడు అభివృద్ధిని గవర్నర్ ఆర్‌ఎన్ రవి జీర్ణించుకోలేకపోతున్నారని సీఎం ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. గవర్నర్‌గా ఆయన బాధ్యతలు చేపట్టాక తమిళనాడు అసెంబ్లీ కొన్ని విడ్డూరమైన ఘటనలకు వేదికగా మారిందన్నారు. శనివారం సీఎం స్టాలిన్ అసెంబ్లీలో మాట్లాడారు. జాతీయ గీతం బదులు తమిళనాడు రాష్ట్ర గీతాన్ని వినిపించినందుకు నిరసనగా గత వారం అసెంబ్లీలో ప్రసంగించకుండా గవర్నర్ వాకౌట్ చేయడాన్ని చిన్న పిల్లల చేష్టగా అభివర్ణించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 176 ప్రకారం అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా గవర్నర్ ప్రసంగించాల్సి ఉంటుందన్నారు. అయితే, ఆయన ఉద్దేశపూర్వకంగానే నిబంధనలను ఉల్లంఘించారని ఆరోపించారు.2022లో తామిచ్చిన ప్రసంగాన్ని గవర్నర్ రవి యథాతథంగా చదివారని, మూడేళ్ల నుంచి సంబంధం లేని సాకులు చూపుతూ తప్పించుకుంటున్నారని విమర్శించారు. అసెంబ్లీని, ప్రజల మనోభావాలను గౌరవించకుండా గవర్నర్ రాజకీయ ఉద్దేశాలతో వ్యవహరిస్తున్నారన్నారు. విధులను నిర్వర్తించని, తమిళ గీతాన్ని గౌరవించని గవర్నర్ తీరుపై సభ నిరసిస్తుందని తెలిపారు. సభలో ఇటువంటివి పునరావృతం కారాదని స్టాలిన్ పేర్కొన్నారు.

మళ్లీ అధ్యక్ష పదవికి పోటీ.. ఆ సమర్థత కమలకు ఉంది


అమెరికా అధ్యక్షుడు బైడెన్

వాషింగ్టన్: అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌కు వచ్చే నాలుగేళ్లలో మరోసారి అధ్యక్ష పదవికి పోటీ చేసే సత్తా ఉందని అధ్యక్షుడు జో బైడెన్ చెప్పారు. ఈ విషయమై అంతిమ నిర్ణయం తీసుకోవాల్సింది ఆమెనే అన్నారు. శనివారం బైడెన్ మీడియాతో మాట్లాడారు. అమెరికా ఉపాధ్యక్ష పదవిని చేపట్టిన మొట్టమొదటి భారత సంతతి మహిళగా 2020లో కమలా హారిస్ చరిత్ర సృష్టించడం తెలిసిందే. ఇటీవల జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో అధ్యక్ష రేసు నుంచి బైడెన్ తప్పుకోవడంతో ఆయన స్థానంలో కమల డెమోక్రాటిక్ అధ్యక్ష అభ్యర్థిగా నామినేట్ అయ్యారు. నవంబర్ 5న జరిగిన ఎన్నికల్లో ట్రంప్ చేతిలో ఓటమి పాలయ్యారు. భవిష్యత్ ప్రణాళికలను కమల ప్రకటించాల్సి ఉంది.

మరో నాలుగు హెచ్‌ఎంపీవీ కేసులు

గుజరాత్‌లో రెండు, పుదుచ్చేరి, అస్సాంల్లో ఒక్కొక్కటి

- బాధితులకు ఎలాంటి ప్రమాదం లేదన్న అధికారులు



అహ్మదాబాద్/డిబ్రూగఢ్/పుదుచ్చేరి: దేశంలో మరో నాలుగు హ్యూమన్ మెటాన్యూమోవైరస్(హెచ్‌ఎంపీవీ) కేసులు బయటపడ్డాయి. గుజరాత్‌లో రెండు, పుదుచ్చేరి, అస్సాంలలో ఒక్కోటి చొప్పున గుర్తించారు. బాధితుల్లో ముగ్గురు చిన్నారులు కాగా ఒకరు 59 ఏళ్ల వ్యక్తి. తాజాగా నిర్ధారణైన కేసులతో కలిపితే గుజరాత్‌లో వారం వ్యవధిలో ఈ వైరస్ బారిన పడిన వారి సంఖ్య ఐదుకు చేరినట్లయింది. అహ్మదాబాద్‌కు చెందిన 9 నెలల మగ శిశువుకు జలుబు, దగ్గు, శ్వాస తీసుకోవడం కష్టం కావడంతో ఈ నెల 6న ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. ఎలాంటి ప్రయాణ చరిత్ర లేని అతడికి హెచ్‌ఎంపీవీ సోకినట్లు నిర్ధారణైందని మున్సిపల్ అధికారులు తెలిపారు. అదేవిధంగా, కచ్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి అహ్మదాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడికి హెచ్‌ఎంపీవీ సోకినట్లు గుర్తించారు. ఈ బాధితుడికి కూడా ఎలాంటి ప్రయాణ చరిత్రా లేదని చెప్పారు. గుజరాత్‌లో ఈ నెల 6న మొదటి హెచ్‌ఎంపీవీ కేసు వెలుగులోకి వచ్చింది. అదేవిధంగా, అస్సాంలోని డిబ్రూగఢ్‌కు చెందిన 10 నెలల చిన్నారికి హెచ్‌ఎంపీవీ వైరస్ సోకినట్లు తేలింది. జలుబు సంబంధిత లక్షణాలతో నాలుగు రోజులుగా డిబ్రూగఢ్‌లోని అస్సాం మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉందని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు వెల్లడించారు. ఇంకా, కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కొన్ని రోజులుగా చికిత్స పొందుతున్న మూడేళ్ల చిన్నారికి హెచ్‌ఎంపీవీ సోకినట్లు వెల్లడైంది. ఆరోగ్యం మెరుగవడంతో ఇతడిని శనివారం డిశ్చార్జి చేశారని అధికారులు చెప్పారు. హెచ్‌ఎంపీవీ బాధితుల కోసం ప్రత్యేకంగా గొరిమేడులోని ప్రభుత్వ ఆస్పత్రిలో 10 పడకలతో కూడిన ప్రత్యేక ఐసీయూ విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు.

బిధూరీకి అభినందనలు

బీజేపీ సీఎం అభ్యర్థి ఆయనేనట

- ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ వ్యాఖ్యలు
- తనతో బహిరంగ చర్చకు రావాలంటూ సవాల్



న్యూఢిల్లీ: బీజేపీ ఢిల్లీ సీఎం అభ్యర్థి మాజీ ఎంపీ రమేశ్ బిధూరీకి ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ అభినందనలు తెలిపారు. బిధూరీని ఒకట్రెండు రోజుల్లోనే ముఖ్యమంత్రి అభ్యర్థిగా బీజేపీ అధిష్టానం ప్రకటించవచ్చంటూ తనకు సమాచారముందని చెప్పారు. బిధూరీ అయినా మరెవరైనా సరే తనతో బహిరంగ చర్చకు రావాలంటూ ఆయన సవాల్ విసిరారు. శనివారం కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడారు. సీఎం అతిశీ పోటీ చేసే కల్కాజీ నియోజకవర్గం నుంచి బీజేపీ రమేశ్ బిధూరీని పోటీకి నిలిపింది. శుక్రవారం సీఎం అతిశీ ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ..త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఢిల్లీ సీఎం అభ్యర్థిగా బీజేపీ 'దుర్భాషలాడటంలో ఆరితేరి'న రమేశ్ బిధూరీని ఎంపిక చేసిందని చెప్పారు. సీఎం అతిశీ తన ఇంటి పేరును మర్లెనా నుంచి సింగ్‌కు మార్చుకోవడం ద్వారా తండ్రిని కూడా మార్చేశారని బిధూరీ అన్నారు. అదేవిధంగా, ఢిల్లీలో రోడ్లను కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ బుగ్గల్లా మారుస్తామంటూ బిధూరీ వ్యాఖ్యానించడం తెలిసిందే. కాగా, తను పోటీ చేసే న్యూఢిల్లీ నియోజకవర్గంలో ఓటర్ల జాబితాను తారుమారు చేసేందుకు బీజేపీ ఎంపీలు ఓట్లను దేశవ్యాప్తంగా ఉన్న తమ సొంత నియోజకవర్గాలకు మార్చేస్తున్నారని కేజ్రీవాల్ ఆరోపించారు. ఈ మేరకు కేజ్రీవాల్ ఈసీకి లేఖ రాశారు. బీజేపీ న్యూఢిల్లీ అభ్యర్థి పర్వేశ్ వర్మ అధికార నివాసం పేరుతో 33 ఓట్లను బదిలీ చేశారని ఆరోపించారు. విచారణ చేపట్టి, వర్మను అనర్హుడిగా ప్రకటించాలన్నారు. పోలింగ్ బూత్‌లను కబ్జా చేసుకోవడం కంటే ఇది అధ్వానమైన చర్యగా అభివర్ణించారు.

ప్రమాదవశాత్తూ పేలిన తుపాకీ.. పంజాబ్ ఆప్ ఎమ్మెల్యే మృతి



లూధియానా: పంజాబ్‌కు చెందిన ఆప్ నేత, లూధియానా (వెస్ట్) ఎమ్మెల్యే గుర్‌ప్రీత్ బస్సి గోగి(58) ప్రమాదవశాత్తూ బుల్లెట్ గాయంతో చనిపోయారు. శుక్రవారం రాత్రి 11.30 గంటల సమయంలో ఆయన తన లైసెన్స్‌డ్ పిస్టల్‌ను శుభ్రం చేస్తుండగా అనుకోకుండా పేలి కణత నుంచి బుల్లెట్ దూసుకెళ్లడంతో చనిపోయారని కుటుంబసభ్యులు, ఆప్ నేతలు తెలిపారు. తీవ్రంగా గాయపడిన గుర్‌ప్రీత్‌ను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారని జాయింట్ పోలీస్ కమిషనర్ జస్‌కరణ్ సింగ్ తేజ తెలిపారు. ఇది అనుకోకుండా జరిగిన ఘటన అని కుటుంబసభ్యులు తెలిపారన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని చెప్పారు. ఎమ్మెల్యే గుర్‌ప్రీత్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనకు కొద్ది గంటలకు ముందు గుర్‌ప్రీత్ బుద్ధా నల్లాలో వ్యర్థాల తొలగింపుపై స్పీకర్ కుల్తార్ సింగ్, ఎంపీ బల్బీర్ సింగ్‌పై చర్చలు జరిపారని ఆప్ నేత ఒకరు వెల్లడించారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో లూధియానా(వెస్ట్)నియోజకవర్గం నుంచి పోటీ చేసిన గుర్‌ప్రీత్ రెండు పర్యాయాలు ఆ సీటును గెలుచుకున్న భరత్ భూషణ్‌పై విజయం సాధించారు. అంతకుముందు, లూధియానా మున్సిపల్ కౌన్సిలర్‌గా రెండు పర్యాయాలు ఎన్నికయ్యారు. గత నెలలో లూధియానా మున్సిపల్ ఎన్నికల్లో ఆయన భార్య సుఖ్‌చెయిన్ కౌర్ గోగి పోటీ చేసి ఓటమి చెందారు. బుద్ధా నల్లా నవీకరణ పనుల్లో జాప్యం అవుతున్నందుకు నిరసనగా గతేడాది శంకుస్థాపన ఫలకాన్ని ధ్వంసం చేసి గుర్‌ప్రీత్ వార్తల్లో కెక్కారు. ఎమ్మెల్యే గుర్‌ప్రీత్ ఆకస్మిక మృతిపై సీఎం భగవంత్ సింగ్‌మాన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మాజీ సీఎం, బీజేపీ నేత అమరీందర్ సింగ్, పంజాబ్ కాంగ్రెస్ చీఫ్ అమరీందర్ వారియర్ తదితరులు సంతాపం తెలిపారు.

ఢిల్లీకి రూ. 2,026 కోట్ల నష్టం

- ఆప్ సర్కార్ మద్యం పాలసీ నిర్వాకమిది
- లీక్ అయిన కాగ్ నివేదిక !

న్యూఢిల్లీ: మూడేళ్ల క్రితం ఢిల్లీ రాష్ట్ర పరిధిలో అమలుకోసం కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం విధానంతో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.2,026 కోట్ల భారీ నష్టం వాటిల్లిందని తెలుస్తోంది. సంబంధిత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) నివేదికను జాతీయ మీడియా బయటపెట్టింది. లీక్ అయిన కాగ్ నివేదికలో పలు విస్మయకర విషయాలు ఉన్నాయని మీడియాలో కథనాలు వెలువడ్డాయి. రాష్ట్ర ఎక్సైజ్ విధానంలో అడుగడుగునా అక్రమాలు జరిగాయని, నిబంధనలకు నీళ్లొదిలేశారని, ధనార్జనే ధ్యేయంగా మద్యం పాలసీ రూపకల్పన చేశారని కాగ్ నివేదిక పేర్కొంది. తమకు అనుకూలంగా పనిచేసే మద్యం విక్రయ సంస్థలకు అయాచిత లబ్ధిచేకూరేలా ఎక్సయిజ్ పాలసీలో మార్పులుచేర్పులు, సవరణలు చేశారని కాగ్ నివేదిక కుండబద్దలు కొట్టింది.

కాగ్ నివేదికలో ఏముంది?

లీక్ అయిన కాగ్ నివేదిక ప్రకారం.. 2021 నవంబర్‌లో అమల్లోకి తెచ్చిన పాలసీని తొలుత కేబినెట్ నుంచి గానీ, ఆ తర్వాత లెఫ్టినెంట్ గవర్నర్ నుంచిగానీ అనుమతి తీసుకోలేదు. మద్యం విక్రయ లైసెన్సులు పొందిన లిక్కర్ సంస్థల ఆర్థిక స్థితిగతులు, గత చరిత్ర, పూర్వాపరాలను ప్రభుత్వం పట్టించుకోలేదు. నష్టాల్లో ఉన్న సంస్థలకూ లైసెన్సులు మంజూరుచేశారు. కొన్నింటికి లైసెన్సులను ఉద్దేశపూర్వకంగా పునరుద్ధరించారు. కీలక నిబంధనలను మార్చే సందర్భాల్లో ఢిల్లీ శాసనసభలో ప్రవేశపెట్టాలి. కానీ అలాంటిదేమీ జరగలేదు. కొందరు రిటైలర్లు ఆ విధానం ముగియకముందే తమ లైసెన్సులను ప్రభుత్వానికి సమర్పించి వెనుతిరిగారు. ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వం మళ్లీ టెండర్లు పిలవకపోవడంతో ప్రభుత్వం రూ. 890 కోట్ల ఆదాయం నష్టపోయింది. జోనల్ లైసెన్సుల్లో మినహాయింపులు ఇవ్వడంతో మరో రూ.941 కోట్ల ఆదాయం తగ్గిపోయింది. కోవిడ్‌ను సాకుగా చూపి కొందరికి లైసెన్స్ ఫీజులను మాఫీచేయడంతో మరో రూ144 కోట్ల ఆదాయం కోల్పోయింది. కోవిడ్ వంటి అనూహ్య పరిస్థితులు తలెత్తితే ఆ నష్టాలను వ్యాపారులే భరించాలన్న నిబంధన ఉన్నప్పటికీ ప్రభుత్వం దానిని పట్టించుకోలేదు. నష్టాలను చవిచూసేందుకే మొగ్గుచూపింది. అయితే కాగ్ నివేదిక ఇంకా అధికారికంగా వెల్లడికాలేదు.

కేజ్రీవాల్ సమాధానం చెప్పాలి: బీజేపీ

ఆప్ తెచ్చిన మద్యం విధానం లోపభూయిష్టమని కాగ్ నివేదించిన నేపథ్యంలో శనివారం బీజేపీ నేత అనురాగ్ ఠాకూర్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. 'లిక్కర్‌గేట్'కు సూత్రధారి, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సమాధానం ఇవ్వాలి. 11 ఏళ్ల క్రితం అవినీతిపై సమాధానం చెప్పాలని సోనియాగాంధీని పదేపదే డిమాండ్‌చేసిన కేజ్రీవాల్ ఇప్పుడు సమాధానం చెప్పకుండా తప్పించుకుంటున్నారు'' అని ఠాకూర్ అన్నారు.


ఢిల్లీలోని మురికివాడల కంటే.. శీష్ మహల్‌లో టాయిలెట్ల ఖరీదే ఎక్కువ: అమిత్ షా

న్యూఢిల్లీ: ఢిల్లీ సీఎంగా ఉన్న సమయంలో ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అధికార నివాసం 'శీష్ మహల్'ను అత్యంత విలాసవంతంగా నిర్మించారని బీజేపీ సీనియర్ నేత, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆరోపించారు. ఢిల్లీలోని అన్ని మురికివాడల కంటే శీష్ మహల్‌లోని టాయిలెట్లే అత్యంత ఖరీదైనవని ఆయన వ్యాఖ్యానించారు. దేశంలోని పేదల కోసం ప్రధాని మోదీ 3.58 కోట్ల ఇళ్లు నిర్మించి ఇస్తే..కేజ్రీవాల్ మాత్రం ప్రజల సొమ్ముతో ఆర్భాటంగా ఖరీదైన నివాసాన్ని నిర్మించారని విమర్శించారు. మంత్రి అమిత్ షా శనివారం జేఎల్ఎన్ స్టేడియంలో మురికివాడల నివాసితులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వస్తే మురికివాడల్లోని ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు నిర్మించి ఇస్తుందని భరోసా ఇచ్చారు. ఢిల్లీలో మౌలిక వనరుల కల్పనకు మోదీ ప్రభుత్వం రూ.68వేల కోట్లను వెచ్చించిందన్నారు. మురికివాడల్లో సమస్యలు, వాటి పరిష్కారంపై ఇప్పటికే ప్రధాని మోదీకి, బీజేపీ చీఫ్ జేపీ నడ్డాకు వివరాలను అందజేశామన్నారు. అధికారం చేపట్టిన వెంటనే వీటన్నిటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలను పట్టించుకోకుండా, ఢిల్లీ అభివృద్ధికి కేజ్రీవాల్ 'ఆపద'ప్రభుత్వం అడ్డంకిగా మారిందన్నారు. గత పదేళ్లుగా ఢిల్లీ ఎలాంటి అభివృద్ధికీ నోచుకోలేదని చెప్పారు. కనీసం తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ వసతులు కూడా లేని మురికివాడలు చెత్తకుప్పల్లా మారాయని చెప్పారు. సుమారు 5.25 లక్షల మంది ఢిల్లీ విద్యార్థులకు పాఠశాల విద్య అందడం లేదంటూ కేజ్రీవాల్‌ను నిలదీశారు.

దుమ్ము దుప్పట్లో విలాస నగరం

లాస్ ఏంజెలెస్‌లో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించిన ప్రభుత్వం

- అదుపు చేయలేని స్థితిలో కొత్తగా మరోచోట కార్చిచ్చు
- అగ్నిమాపక సిబ్బందికి నీటి కష్టాలు



లాస్‌ఏంజెలెస్‌లోని పసిఫిక్ పాలిసేడ్స్‌లో అగ్ని ప్రమాదంతో ఆకాశాన్ని కమ్మేసిన దట్టమైన పొగలు

వాషింగ్టన్: ఆరు చోట్ల ఆరని పెను జ్వాలలు, కమ్మేసిన దుమ్ము, ధూళి మేఘాలు, నిప్పుకణికల స్వైర విహారంతో లాస్ ఏంజెలెస్ నగర కొండప్రాంతాలు నుసిబారిపోతున్నాయి. వేల ఎకరాల్లో అటవీప్రాంతాలను కాల్చిబూడిదచేసిన వేడిగాలులు అదే బూడిదను జనావాసాల పైకి ఎగదోస్తూ మిగతా పరిసరాలను దుమ్ముకొట్టుకుపోయేలా చేస్తున్నాయి. పొగచూరిన వాతావరణంలో సరిగా శ్వాసించలేక లక్షలాది మంది స్థానికులు ఆపసోపాలు పడుతున్నారు. దీంతో జనం బయట తిరగొద్దని, హెల్త్ ఎమర్జెన్సీ విధిస్తున్నామని స్థానిక యంత్రాంగం శనివారం ప్రకటించింది. 10,000 భవనాలను కూల్చేసి, 11 మంది ప్రాణాలను బలిగొన్న కార్చిచ్చు ఇంకా చల్లారకపోగా తూర్పు దిశగా దూసుకుపోతుండటంతో స్థానిక యంత్రాంగం, అగ్నిమాపక సిబ్బందికి తలకు మించిన భారమైంది. ఇప్పటికే మూడు లక్షల మంది స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించగా ఆస్తి నష్టం లక్షల కోట్లను దాటి లాస్‌ఏంజెలెస్ నగర చరిత్రలోనే అత్యంత దారుణ దావాగ్ని ఘటనగా మిగిలిపోయింది. పర్వత సానువుల గుండా వేడి గాలుల ఉధృతి ఏమాత్రం తగ్గకపోవడంతో మంటలు మరిన్ని కొత్త ప్రాంతాలకు విస్తరించవచ్చన్న భయాందోళనలు పొరుగు ప్రాంతాలైన ఎన్‌సినో, వెస్ట్ లాస్‌ఏంజెలెస్, బ్రెంట్‌వుడ్‌వాసులను కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. మంటలు ఆపేందుకు అవిశ్రాంతంగా పోరాడుతున్న అగ్నిమాపక సిబ్బందికి నీటి కష్టాలు మొదలయ్యాయి. ఫైరింజన్లకు సరిపడా నీటి సౌకర్యాలు లేకపోవడంపై కాలిఫోర్నియా రాష్ట్ర గవర్నర్ గవిన్ న్యూసమ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. శాంటా యెంజ్ రిజర్వాయర్ నుంచి నీటి సరఫరా పూర్తిస్థాయిలో లేకపోవడంపైనా ఆయన 'ఎక్స్'వేదికగా ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉన్న మంటలకుతోడు కొత్తగా గ్రనడా హిల్స్‌లో అంటుకున్న అగ్గిరవ్వలు 'ఆర్చర్ ఫైర్'గా విస్తరిస్తూ ఇప్పటికే 32 ఎకరాలను దహించివేసింది. ఈ ప్రాంతంలోనే ఎంటర్‌టైన్‌మెంట్ దిగ్గజ కిమ్ కర్దాషియాన్ సోదరీమణుల ఇళ్లు, డిస్నీ కార్పొరేట్ ఆఫీస్ ఉన్నాయి.

కార్చిచ్చులో కళాకారుల కలల సౌధాలు: వెనుక కొండలు, ముందు వినీలాకాశం, కింద సముద్ర తీరంతో అద్భుతంగా కనిపించే లాస్ ఏంజెలెస్‌లో చాలా మంది హాలీవుడ్ సినీ ప్రముఖులు ఎంతో ఇష్టంతో ఇళ్లు కొన్నారు. వాటిల్లో చాలా మటుకు ఇప్పుడు కాలిపోయాయి. 76 ఏళ్ల అమెరికన్ కమేడియన్ బిల్లీ క్రిస్టల్ 1979లో పసిఫిక్ పాలిసేడ్స్‌లో కొనుగోలుచేసిన విలాసవంత భవనం తాజా మంటల్లో కాలిబూడిదైంది. మ్యాడ్ మ్యాక్స్ స్టార్ మేల్ గిబ్సన్, మరో నటుడు జెఫ్ బ్రిడ్జెస్, సెలబ్రిటీ టెలివిజన్ పర్సనాలిటీ ప్యారిస్ హిల్టన్, 'ప్రిన్సెస్ బ్రైడ్'నటుడు క్యారీ ఎల్వీస్, ప్రముఖ నటుడు మ్యాండీ మూర్, మీలో వెంటిమిగ్లియా, లీటన్ మీస్టర్, ఆడమ్ బ్రాడీ, ఆంటోనీ హాప్‌కిన్స్, జాన్ గుడ్‌మాయ్న్, మైల్స్ టెల్లర్, అన్నా ఫారిస్, పాలిసేడ్స్ గౌరవ మేయర్ ఎజీన్ లేవీ, క్రిస్సీ టీగెన్, జాన్ లెజెండ్, మార్క్ మరోన్, మార్క్ హామిల్‌ల ఇళ్లు సైతం మంటల్లో పూర్తిగా కాలిపోయాయి. లిడియా, హర్స్ట్, ఆర్చర్, ఈటన్, కెన్నెత్, పాలిసేడ్స్ ఫైర్ దావాగ్నులు మొత్తంగా 37,579 ఎకరాల్లో విస్తరించాయి.

సాక్షి హైదరాబాద్

ఆదివారం। 12। జనవరి। 2025



సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టొద్దు

'సంక్రాంతి పండగకు సొంతూరికి వెళ్తున్నామని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టకండి. ఎందుకంటే.. మీరు తిరిగొచ్చేసరికి మీ ఇల్లు గుల్లయ్యే ప్రమాదముంది.

-8లో



గమ్యం.. చేరే వరకూ..

'లేవండి.. మేల్కోండి.. గమ్యం చేరేవరకూ ఆగకండి..' ప్రపంచ యువతకు స్వామి వివేకానంద ఇచ్చిన మహోన్నతమైన సందేశం ఇది.

- సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
28.0/18.0

వాతావరణం

నగరంలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం వేళ పొగమంచు ఎక్కువగా ఉండవచ్చు. గరిష్టంగా 28, కనిష్టంగా 18 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.





అమీర్‌పేట్‌లో కిక్కిరిసిన ప్రయాణికులు

ఎస్‌ఆర్ నగర్‌లో కిటకిటలాడుతూ..



శనివారం రాత్రి ఎస్‌ఆర్ నగర్ వద్ద వాహనాల రద్దీ

పల్లెకు పయనం!

సొంతూళ్లకు తరలిన నగరవాసులు

- 3 రోజుల్లో 30 లక్షల మందికి పైగా..
- కిక్కిరిసిన బస్సులు, రైళ్లు
- శివార్లలో ప్రయాణికుల రద్దీ

సాక్షి, సిటీబ్యూరో: మహా నగరం పల్లెబాట పట్టింది. సంక్రాంతి సందర్భంగా నగర వాసులు భారీ సంఖ్యలో సొంతూళ్లకు తరలివెళ్లారు. శనివారం నగరంలోని బస్ స్టేషన్‌లు, రైల్వేస్టేషన్‌లు, శివారు ప్రాంతాలు ప్రయాణికుల రద్దీతో పోటెత్తాయి. నాలుగైదు రోజుల నుంచి కొనసాగుతున్న సంక్రాంతి రద్దీ శనివారం తారస్థాయికి చేరింది. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సులు, రైళ్లు కిక్కిరిశాయి. సొంత వాహనాల్లోనూ భారీ ఎత్తున తరలి వెళ్లారు. దీంతో విజయవాడ, బెంగళూర్, కరీంనగర్, వరంగల్ తదితర ప్రధాన రహదారులు వాహనాలతో నిండిపోయాయి. ప్రైవేట్ బస్సులు, టాటాఏస్ వంటి వాహనాలు, మ్యాక్సీక్యాబ్‌లు ప్రయాణికులపైన నిలువుదోపిడీ కొనసాగించాయి. అడ్డగోలుగా వసూళ్లకు పాల్పడ్డాయి. సంక్రాంతి సందర్భంగా సుమారు 6000కు పైగా ప్రత్యేక బస్సులను నడిపేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. ఈ బస్సుల్లో 50 శాతవ అదనపు చార్జీలు విధించారు. మూడు రోజులుగా సుమారు 30 లక్షల మందికి పైగా నగరవాసులు సొంత ఊళ్లకు తరలివెళ్లినట్లు అంచనా. ఆదివారం కూడా ప్రయాణికుల రద్దీ ఎక్కువగానే ఉండనుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

చర్లపల్లి నుంచి ప్రత్యేక రైళ్లు...

సంక్రాంతి, శబరిమల సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని దక్షిణమధ్య రైల్వే నగరంలోని సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ స్టేషన్‌లతో పాటు చర్లపల్లి నుంచి ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. 17 జతల రైళ్లు చర్లపల్లి నుంచి రాకపోకలు సాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మరోవైపు నగరవాసులు వివిధ ప్రాంతాల నుంచి చర్లపల్లికి చేరుకొనేందుకు సిటీ బస్సులు, ఎంఎంటీఎస్ రైళ్లను ఏర్పాటు చేశారు. చర్లపల్లి నుంచి బయలుదేరే ప్రత్యేక రైళ్లతో పాటు మిగతా వాటికీ హాల్టింగ్ సదుపాయం కల్పించారు.

ఎంఎంటీఎస్ రైళ్లు, సిటీ బస్సులు

రామచంద్రాపురం – ఘట్‌కేసర్, సనత్‌నగర్–ఘట్కేసర్ మార్గాల్లో చర్లపల్లి మీదుగా ఎంఎంటీఎస్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. సికింద్రాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి చర్లపల్లి టెర్మినల్‌కు 146 బస్సులను నడిపేందుకు ఆర్టీసీ చర్యలు చేపట్టింది. హబ్సిగూడ, నాచారం, మల్లాపూర్ నుంచి ఒకటో నెంబర్‌ప్లాట్‌ఫామ్ వరకు ప్రతి 10 నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉంటుంది. చర్లపల్లి టెర్మినల్ 9వ ప్లాట్‌ఫాం వైపు 12 బస్సులు అందుబాటులో ఉన్నాయి. చర్లపల్లి నుంచి సికింద్రాబాద్, బోరబండ, మెహిదీపట్నం, ఈసీఐఎల్ తదితర ప్రాంతాలకు సిటీ బస్సులను ఏర్పాటు చేశారు.

కిక్కిరిసిన మెట్రో రైళ్లు...

సంక్రాంతి రద్దీ మెట్రో రైళ్లను సైతం తాకింది.. వివిధ ప్రాంతాల నుంచి బస్‌స్టేషన్‌లు, రైల్వేస్టేషన్‌లు, ఉప్పల్, ఎల్‌బీనగర్, జేబీఎస్, ఎంజీబీఎస్ తదితర ప్రాంతాలకు చేరుకొనేందుకు నగరవాసులు మెట్రో రైళ్లలో పెద్ద ఎత్తున ప్రయాణం చేశారు. దీంతో నాగోల్, ఉప్పల్, అమీర్‌పేట్, ఎంజీబీఎస్, రామదుర్గం, ఎల్‌బీనగర్ స్టేషన్‌లలో రద్దీ నెలకొంది. వివిధ మార్గాల్లో నడిచే మెట్రోల్లోనూ లక్షలాది మంది ప్రయాణం చేశారు. శనివారం ఒక్కరోజే 5 లక్షల మందికి పైగా మెట్రోల్లో ప్రయాణం చేసినట్లు అధికారుల అంచనా.

పర్యాటకానికి పండగే!

సంక్రాంతిని సొమ్ము చేసుకున్న టీటీడీసీ

- పండగల స్పెషల్ పేరుతో ఏపీకి స్టేజీ క్యారియర్లు
- టికెట్ ధరలను నిర్ణయించి మరీ సర్వీసుల నిర్వహణ

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ పర్యాటక విభాగం సంక్రాంతి పండగను 'క్యాష్' చేసుకుంది. పండగ స్పెషల్ పేరుతో ఏపీకి స్టేజీ క్యారియర్లు నడిపింది. ఏకంగా టికెట్ ధరలను నిర్ణయించి హైదరాబాద్ టు విజయవాడ, విశాఖపట్నం, ఏలూరు, కాకినాడలకు రోజుకు 12 సర్వీసుల చొప్పున ఆపరేట్ చేసింది. పర్యాటక, దర్శనీయ ప్రదేశాలకు మాత్రమే ఈ బస్సులను నడపాల్సి ఉంది. కానీ.. ఏకంగా సంక్రాంతి పేరుతో సర్వీసులను నడపడం వివాదాస్పదంగా మారింది. హైదరాబాద్‌లోని పర్యాటక భవన్ నుంచి ప్రతి రోజూ ఏపీ సహా పలు రాష్ట్రాల్లోని సందర్శనీయ ప్రదేశాలకు ప్రత్యేక సర్వీసులను నడుపుతున్న విషయం తెలిసిందే. అయితే.. డిసెంబర్‌లో తిరుమల– తిరుపతి దేవస్థానం తెలంగాణ టూరిజానికి స్లాట్ బుకింగ్ సర్వీసులను నిలిపివేసింది. అప్పటి నుంచి ఆ ప్రాంతానికి వెళ్లే ఓల్వా, ఏసీ, నాన్ ఏసీ బస్సులు ఖాళీగా ఉన్నాయి. సంక్రాంతి కోసం హైదరాబాద్ నుంచి ఏపీకి పెద్ద ఎతున వెళ్తుంటారు. ప్రయాణికుల నిష్పత్తి మేరకు ఏపీఎస్ ఆర్టీసీ, టీజీఆర్టీసీ సర్వీసులు లేక పోవడంతో ప్రవేట్ ట్రావెల్స్‌పై ఆధారపడుతుంటారు. పండుగ నేపథ్యంలో ప్రత్యేక సర్వీసుల పేరుతో ప్రభుత్వ సంస్థలే కాదు ప్రైవేటు ట్రావెల్స్ ఏజెన్సీలు దోపిడీకి పాల్పడుతున్న విషయం తెలిసిందే. ప్రయాణికుల రద్దీని 'క్యాష్' చేసుకోవాలని తెలంగాణ టూరిజం కూడా భావించింది. ఆ మేరకు శుక్ర, శనివారాల్లో యాత్రి నివాస్, బషీర్‌బాగ్, ఎల్బీనగర్‌ల నుంచి సాయంత్రం వేళ విజయవాడ, విశాఖ పట్నం, ఏలూరు, కాకినాడలకు ఒక్కో ప్రాంతానికి మూడు సర్వీసుల చొప్పున బస్సులను నడిపింది. హైదరాబాద్ నుంచి విశాఖ పట్నం ప్రయాణ చార్జీ పెద్దలకు జీఎస్టీతో కలిపి రూ.3,150, చిన్నలకు రూ.2,520 చొప్పున వసూలు చేసింది. ఇక కాకినాడకు పెద్దలకు రూ.2,205, చిన్నలకు రూ.1754, ఏలూరుకు పెద్దలకు రూ.1575, చిన్నలకు రూ.1260, విజయవాడ పెద్దలకు రూ.1260, చిన్నలకు రూ.1008 చొప్పున చార్జీలు వసూలు చేసింది.

పండగ పూట విషాదం

అయిదుగురు నగర యువకుల జల సమాధి

- సిద్దిపేట జిల్లా కొండపోచమ్మ సాగర్‌లో మునిగి మృత్యువాత
- కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న మృతుల కుటుంబాలు

సాక్షి, సిటీబ్యూరో: రెండ్రోజుల్లో సంక్రాంతి పండగ. అందరి ఇళ్లల్లో సంతోషాలు నిండుకునే సమయం. కానీ.. ఆ అయిదు కుటుంబాల్లో మాత్రం విషాదమే మిగిలింది. నగరంలోని ముషీరాబాద్ ఇందిరానగర్ వాసి ధనుష్ (20), ఇతని సోదరుడు లోహిత్ అలియాస్ లక్కీ (17), కవాడిగూడకు చెందిన చీకట్ల దినేశ్వర్ (18), ఖైరతాబాద్‌కు చెందిన జతిన్ (17), అత్తాపూర్‌లోని జనప్రియనగర్ కాలనీకి చెందిన సాహిల్ (18) శనివారం సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్‌లో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృత్యువాత పడ్డారు. కాగా.. మృగాంక్, ఇబ్రహీంలు అనే యువకులు గట్టునే ఉండి కేకలు వేస్తూ రిజర్వాయర్ కట్టపైకి పరుగెత్తారు.

లోహిత్, దినేశ్వర్, జతిన్‌లు మీర్‌పేటలోని టీకేఆర్ కళాశాలలో డిప్లొమా చేస్తుండగా.. సాహిల్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ధనుష్ ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తున్నాడు. గట్టున ఉన్న మృగాంక్, ఇబ్రహీంలు సైతం విద్యార్థులే. ఉన్నత విద్య అభ్యసించి కుటుంబాలను ఆదుకుంటారనుకున్న కుమారులు చిన్న వయసులోనే అసువులు బాయడంతో మృతుల తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



రోదిస్తున్న మృతుల బంధువులు

కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ వద్ద పోలీసులు



మృత్యు దారం!

యమ పాశాలుగా మారుతున్న చైనా మాంజా

- చెట్లు, స్తంభాలకు చిక్కుకుని.. ప్రమాదకారిగా మారి..
- వాహన చోదకులకు సంకటం.. పక్షుల పాలిట ప్రాణాంతకం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పక్షి ప్రేమికులు



సాక్షి, సిటీబ్యూరో: చైనా మాంజా ప్రాణ సంకటంగా మారుతోంది. మనుషులు, పక్షుల పాలిట మృత్యు పాశమే అవుతోంది. దైనందిన జీవితంలో భాగంగా బయటికి వెళ్లే ద్విచక్ర వాహన చోదకుల గొంతుకు ఇది ఉరితాడులా మారుతోంది. నగరంలో ఈ సమస్య ప్రతి ఏడాదీ మరింత తీవ్రతరమవుతోంది. ఈ నేపథ్యంలో అటు గాలిపటాలు ఎగురవేసే వారు, ఇటు నగరవాసులు చైనా మాంజాపై జాగ్రత్త వహించాల్సిన అవసరముంది.

గొంతులు కోస్తున్నాయి..

గతేడాది జనవరి 15న కోటేశ్వర్ అనే జవాన్.. నగరంలోని టోలీచౌకీ ఫ్లై ఓవర్ మీదుగా బైక్‌పై వెళుతున్నాడు. ఫ్లైఓవర్‌పై చిక్కుపడి ఉన్న చైనా మాంజా దారం అతడి గొంతుకు చిక్కుకుని ప్రాణాలు కోల్పోయిన ఘటన తెలిసిందే. ఈ ఉదంతమే కాదు.. ఎల్‌బీ నగర్, ఓల్డ్ సిటీ, బేగం పేట్ తదితర ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు గతంలో అనేకం జరిగాయి. అంతేకాదు.. స్వేచ్ఛగా గాలిలో ఎగురుతూ తమ గూటికి చేరుకునే పక్షలకూ ఈ మాంజా యమపాశంలా మారుతోంది. సంక్రాంతి ముగిసేలోపు నగరంలోని చెట్లకు, కరెంట్ స్తంభాల తీగలకు, ఫ్లై ఓవర్ల వద్ద ఎన్నో రకాల పక్షులు చైనా మాంజా కోతకు రెక్కలు, గొంతులు తెగి పాణాలు కోల్పోతున్నాయి. ఇలాంటి హృదయ విదారక ఘటనలకు మనం సంతోషంగా ఎగురవేసే చైనా మాంజా కారణం. చైనా మాంజానే కాదు.. కొన్ని సార్లు సాధారణ పతంగి దారాలు కూడా ప్రమాదకరమే.



మాంజా నుంచి రక్షణగా ద్విచక్ర వాహన చోదకుల జాగ్రత్తలు

జాగ్రత్తలు తీసుకోవాలి..

సంక్రాంతి పండగ సందడి ముగిసేంత వరకూ ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరి పలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముంది. ముఖ్యంగా హెల్మెట్ లేకుండా బయటకు వెళ్లకూడదు. హెల్మెట్ ఉన్నప్పటికీ ఈ దారాలు గొంతు కోస్తున్నాయి. కాబట్టి.. విధిగా రుమాలు లేదా మఫ్లర్ మెడ, గొంతు చుట్టూ చుట్టుకోవాలి. ఇటీవల కాలంలో కొన్ని నగరాల్లో వాహనానికి ముందు భాగంలో మనిషి ఎత్తు కన్నా పైభాగం వరకు ఉండేలా 2 ఇనుప చువ్వలను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. వేగంగా వెళుతున్న సమయంలో ప్రమాద ఘంటికలుగా మారుతున్న మాంజాను చువ్వలు అడ్డుకుని సంరక్షణను అందిస్తాయి. ఇవి ఆన్‌లైన్‌లో సైతం లభిస్తున్నాయి. ఫ్లైఓవర్ మీదుగా, రోడ్డు పక్కన విస్తరించిన చెట్లు, స్తంభాలకు తీగలు వేలాడుతున్న ప్రాంతాల్లో ప్రమాదకర పతంగి దారాలను గమనిస్తూ వెళ్లాలి.



మాంజాలో చిక్కిన పక్షి

వేడుకలు వేదనగా మారొద్దు..



వైల్డ్‌లైఫ్ ఎన్‌జీఓ సభ్యుల ఆధ్వర్యంలో గతేడాది సంక్రాంతి సమయంలో మాంజా కారణంగా గాయపడిన దాదాపు 1100కుపైగా పక్షులను రక్షించారు. ఇందులో సగం వరకు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డాయి. మాంజా కారణంగా పక్షులు గాయాలతో రెక్కలు, కాళ్లు, తలలు తెగిపోయి చెట్లకు వేలాడుతుండటం బాధాకరం. గాజు పూత పూసిన మాంజా, నైలాన్ మాంజాను ఉపయోగించకుండా ఉండటానికి తాము అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. కానీ.. అది మార్కెట్లలో వేగంగా అమ్మకాలు జరుగుతున్నాయి. దీనిని నివారించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడం లేదు. గతేడాది నేను వ్యక్తిగతంగా 3 రోజుల్లో 40 కి పైగా పక్షులను రక్షించాను. ఎవరైనా చైనా మాంజాను అమ్ముతున్నట్లు గమనిస్తే 94906 16555లో పోలీసులను సంప్రదించవచ్చు. పక్షులు ఆపదలో ఉన్నా, మాంజాకు చిక్కుకున్నా వాటి సంరక్షణ కోసం 96978 87888లో ఎనిమల్ వారియర్స్‌కు సమాచారం అందించండి.

– డాక్టర్ సింధూర పోతినేని, జంతు ప్రేమికురాలు

రేపు తాగునీటి సరఫరాలో అంతరాయం

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి తాగునీరు సరఫరా చేసే మంజీరా ప్రాజెక్టు ఫేజ్–2 పరిధిలోని కలబ్ గూర్ నుంచి హైదర్‌నగర్ వరకు ఉన్న 1500 ఎంఎం డయా పీఎస్సీ పంపింగ్ మెయిన్‌కు లీకేజీల మరమ్మతు పనుల నేపథ్యంలో సోమవారం ఉదయం 6 నుంచి మంగళవారం ఉదయం 6 గంటల వరకు నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని శనివారం జలమండలి వర్గాలు పేర్కొన్నాయి. ఎర్రగడ్డ, యూసుఫ్‌గూడ, బోరబండ, కేపీహెచ్‌బీ కాలనీ, మూసాపేట్, నిజాంపేట్, హైదర్‌నగర్, పటాన్‌చెరు, రామచంద్రాపురం, దీప్తి శ్రీ నగర్, మదీనాగూడ, మియాపూర్, హఫీజ్‌పేట్, బీరంగూడ, అమీన్‌పూర్, బొల్లారం పారిశ్రామిక ప్రాంతాలల్లో నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొంది.

టెక్స్‌పెడైట్‌లో సిటీ స్టార్టప్స్‌కు స్థానం..

సాక్షి సిటీబ్యూరో: సమర్థమైన స్టార్టప్‌లను గుర్తించి, విభిన్న రకాల మార్గాల్లో వాటిని ప్రోత్సహించేందుకు నిర్వహిస్తున్న టెక్స్‌పెడైట్ కార్యక్రమంలో నగరానికి చెందిన రెండు స్టార్టప్స్‌కు స్థానం లభించింది. ఈ విషయాన్ని నిర్వాహక సంస్థ గేమ్స్ 24 ఇంటూ 7 ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. గత అక్టోబర్‌లో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా 330 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో 17 సంస్థలు ఎంపిక కాగా వాటిలో నగరానికి చెందిన 'బీ ఏబుల్ హెల్త్', 'హోమ్ గ్రౌండ్ స్టార్టప్స్ కూడా ఉన్నాయని వివరించారు.

వాటర్ ట్యాంకర్ @ ప్రీ పెయిడ్?

- **ముందస్తు చెల్లింపులతోనే బుకింగ్**
- వచ్చే వేసవి నుంచే అమలు యోచన

సాక్షి, సిటీబ్యూరో: ఇక వాటర్ బోర్డు ట్యాంకర్ బుకింగ్ ప్రీ పెయిడ్ కానుంది. ఆన్‌లైన్‌లో ముందస్తు చెల్లింపులతోనే ట్యాంకర్ బుకింగ్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. పెరిగిపోతున్న ట్యాంకర్ల బుకింగ్ రద్దును తీవ్రంగా పరిగణించిన జలమండలి వచ్చే వేసవి నుంచి ప్రీ పెయిడ్ ట్యాంకర్ బుకింగ్ విధానాన్ని అమలు చేయాలని యోచిస్తోంది. మహా నగరంలో గతేడాది సుమారు 30,500కుపైగా ట్యాంకర్ల బుకింగ్ రద్దయినట్లు గుర్తించింది. దీంతో ముందస్తు రుసుం చెల్లిస్తేనే ట్యాంకర్ బుకింగ్ జరిగే విధంగా సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్‌కు కసరత్తు చేస్తోంది. ఇందుకోసం కొన్ని నిబంధనలు రూపొందించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ట్యాంకర్‌ను బుక్ చేసి షెడ్యూల్ డెలివరీకి 24 గంటల ముందు రద్దు చేయమని అభ్యర్థిస్తే బుకింగ్ మొత్తం 100 శాతం రీఫండ్ చేయాలని, డెలివరీ 12 గంటల ముందు రద్దు కోసం అభ్యర్థించినట్లయితే 50 శాతం, ఆ తర్వాత 6 గంటల ముందు అభ్యర్థన పెడితే 25 శాతం రీఫండ్ చేయాలని భావిస్తోంది. ట్యాంకర్ డెలివరీ సమయంలో అంటే ఇంటి వద్దకు వచ్చిన తర్వాత బుకింగ్ రద్దు చేసుకుంటే మాత్రం రుసుం తిరిగి చెల్లింపు లేకుండా నిబంధన అమలు చేయాలని యోచిస్తోంది. ఇప్పటి వరకు ట్యాంకర్ బుకింగ్‌కు ఎలాంటి ముందస్తు రుసుం లేకపోవడంతో చివరి క్షణంలో ట్యాంకర్ల రద్దు వ్యవహారం బాగా పెరిగి పోయింది. ఇలాంటి అనవసర బుకింగ్‌లను కట్టడి కోసం ప్రీ పెయిడ్ విధానాన్ని అమలు చేయాలని భావిస్తోంది. ఇటీవల ముందస్తు వేసవి కార్యాచరణపై జరిగిన సమావేశంలో ఈ మేరకు పలువురు సీనియర్ అధికారులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసినట్లు సమాచారం.

ట్యాంకర్ల మేనేజ్‌మెంట్‌పై దృష్టి

గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ట్యాంకర్ల మేనేజ్‌మెంట్‌పై జలమండలి దృష్టి సారించింది. ప్రస్తుతం నగరంలోని పలు ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటడంతో ట్యాంకర్లకు డిమాండ్ పెరుగుతోంది. ఇప్పటికే ప్రగతి నగర్, వైశాలి నగర్, కొండాపూర్ తదితర ప్రాంతాలో ట్యాంకర్లకు తాకిడి పెరిగింది. వాస్తవంగా గత వేసవిలో ట్యాంకర్ల డిమాండ్ తారస్థాయికి చేరింది. సగటున నెలవారీగా 1.50 లక్షల నుంచి 2.45 లక్షలు వరకు ఎగబాకింది. ఈసారి అలాంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని భావిస్తోంది. గతేడాది సుమారు ఆరు డివిజన్లలోని 20 సెక్షన్ల నుంచి అధికంగా ట్యాంకర్లు బుక్ అయినట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గత వేసవిలో వంద కుటుంబాలు 31 వేల ట్రిప్పులను బుక్ చేసినట్లు గుర్తించింది. మొత్తమ్మీద 40 వేల కుటుంబాలు 70 శాతం ట్యాంకర్ బుక్ చేసుకున్నట్లు వెల్లడైంది. దీంతో ట్యాంకర్ల పెండెన్సీ లేకుండా క్రమ పద్ధతిలో సరఫరా చేసేందుకు చర్యలకు సిద్ధమైంది.



'యమధర్మ రాజ శతకం' ఆవిష్కరణ



యమధర్మ రాజ శతకంను ఆవిష్కరిస్తున్న జస్టిస్ కాశీ విశ్వేశ్వరరావు తదితరులు

చిక్కడపల్లి: చాలా వరకు శతక పద్యాలు, సూక్తులు, హిత వచనాలు దేవతలను స్తుతిస్తూ వుంటాయని.. అలా కాకుండా ప్రాణాలు తీసుకొని పోయే యముడి గురించి శతకం రాయటం విశిష్ట కార్యమని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు అన్నారు. శనివారం చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయగానసభలో రచయిత డాక్టర్ శంకరనారాయణ రచించిన 'యమధర్మ రాజ శతకం' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ కాశీవిశ్వేశ్వర్‌రావు సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. శతకంలోని ప్రతి పద్యం భాషా సౌందర్యంతో కూడి వుందని అన్నారు. శంకర నారాయణ తన శతకాన్ని చిత్తూరుకు చెందిన ప్రొఫెసర్ సాంబశివరావుకు అంకితమిచ్చారు. కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: ఒడిశా నుంచి ధూల్‌పేట్‌కు తరలిస్తున్న 21 కిలోల గంజాయిని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. దీని విలువ రూ.5.25 లక్షల వరకు ఉంటుంది. దిల్వార్ గంజ్ ప్రాంతంలోని ఆకాశ్ సింగ్ అనే వ్యక్తి ఇంట్లో తనిఖీలు నిర్వహించగా ఈ గంజాయి పట్టుబడినట్లు అధికారులు తెలిపారు. ఈ కేసులో ఆకాశ్ సింగ్‌తో పాటు, దుర్గేష్ సింగ్, ఆనంద్ సింగ్, శంకర్ సింగ్రా, హాల్ సింగ్, లలిత్ కుమార్లను అరెస్టు చేశారు. వీరికి గంజాయి సరఫరా చేసే ఒడిశాకు చెందిన సురేష్ యాదవ్, ఉదయ్ సురేష్ దాలి, సరోజిత్ మరిదా, రాహుల్ సర్కార్, లంకా కుమార్, లాంప్ అనే వ్యక్తులపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ అంజిరెడ్డి తెలిపారు. నిందితుల వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లు, స్కూటీని కూడా స్వాధీనం చేసుకున్నారు.

లింగమంతుల జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించాలి



సదస్సులో అభివాదం చేస్తున్న అతిథులు

ప్రొ.కంచ ఐలయ్య

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన గొల్లగట్టు లింగమంతుల జాతరను రాష్ట్ర పండగగా గుర్తించాలని ఓయూ విశ్రాంత అధ్యాపకుడు, సామాజికవేత్త ప్రొ.కంచె ఐలయ్య ప్రభుత్వాన్ని కోరారు. శనివారంలో ఓయూ క్యాంపస్‌లోని ఇంజినీరింగ్ కాలేజీ ఈసీఈ ఆడిటోరియంలో 'గొల్లగట్టు సాంస్కృతిక చరిత్ర' అనే అంశంపై సదస్సు జరిగింది. యాదవ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు నూకల మధుయాదవ్ అధ్యక్షత వహించగా ప్రొఫెసర్లు కంచ ఐలయ్య, సింహాద్రి, రామ్ షఫర్డ్ తదితరులు పాల్గొని ప్రసగించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు హాజరయ్యే లింగమంతుల జాతర పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. జాతర నిర్వహణకు అధిక నిధులు మంజూరు చేయాలని, ఫుల్‌టైం ఛైర్మన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. యాదవ ఆశ్రిత బైకాని కులాన్ని ప్రభుత్వం గుర్తించి అక్కడ పని చేసేవారికి వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వట్టి జానయ్యయాదవ్, క్యామ మల్లేష్, గడ్డం శ్రీనివాస్ యాదవ్, తెలంగాణ ఉద్యమకారుడు డా.పృధ్వీరాజ్ యాదవ్, క్రిష్ణయాదవ్, మన అశోక్ యాదవ్, కదారి రమేష్ యాదవ్, శ్రవణ్, సిద్ధూ, సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సులపై ఆర్టీఏ కొరడా



సాక్షి, సిటీబ్యూరో: నిబంధనలకు విరుద్ధంగా తిరిగే ప్రైవేట్ బస్సులపైన ఆర్టీఏ కొరడా ఝుళిపించింది. వివిధ మార్గాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి 250కి పైగా బస్సులపైన కేసులు నమోదు చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండలోని వివిధ ప్రాంతాల్లో వాహన తనిఖీ అధికారులు బృందాలుగా ఏర్పడి ఈ తనిఖీలు కొనసాగిస్తున్నట్లు రవాణా శాఖ కమిషనర్ తెలిపారు. సరుకు రవాణా వాహనాలు, పర్మిట్ నిబంధనలు ఉల్లంఘించి ప్రయాణిస్తున్న వాహనాలు, ఇతర నిబంధనలు ఉల్లంఘించిన ప్రైవేట్ బస్సులపై ఇప్పటి వరకు 250 పైగా కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. తనిఖీలను మరింత ఉధృతం చేయనున్నట్లు హెచ్చరించారు.

సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టొద్దు!

పండక్కి ఊరెళ్తే..జాగ్రత్తలు తప్పనిసరి
- సామాజిక మాధ్యమాలను ఫాలో అవుతున్న నేరస్తులు
- తిరిగొచ్చేసరికి ఇళ్లు గుల్లవుతుందని పోలీసుల హెచ్చరిక



సాక్షి, సిటీబ్యూరో: 'సంక్రాంతి పండగకు సొంతూరికి వెళ్తున్నామని, ఫ్యామిలీతో లాంగ్ టూర్‌లో ఉన్నామని.. ఇలా రకరకాలుగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టకండి. ఎందుకంటే మీరు తిరిగొచ్చేసరికి మీ ఇల్లు గుల్లయ్యే ప్రమాదముంది. ఈ మధ్య నేరస్తులు ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగామ్ వంటి సామాజిక మాధ్యమాలను ఫాలో అవుతూ.. ఊర్లకు వెళ్లిన వారి ఇళ్లలో దొంగతనాలు చేసినట్లు వెల్లడైంది. కాబట్టి జాగ్రత్త సుమా...' అంటూ నగర ప్రజలను పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు సంక్రాంతి పండగకు ఊర్లకు వెళ్లే నగరవాసులకు సైబరాబాద్ పోలీసులు పలు సూచనలు చేశారు.

- మీరు ఊరెళుతున్న విషయాన్ని స్థానిక పోలీసుస్టేషన్‌లో సమాచారం అందించాలి.
- ఇంటి లోపల సీసీ కెమెరాలు అమర్చుకొని, వాటి డీవీఆర్‌లు బయటికి కనిపించకుండా రహస్య ప్రదేశంలో ఉంచాలి. సీసీ కెమెరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు చూసుకుంటూ ఉండాలి.
- బంగారు, వెండి ఆభరణాలు, నగదును బ్యాంకు లాకరులో భద్రపర్చుకోండి. లేదా ఇంట్లోనే రహస్య ప్రదేశంలో దాచుకోండి.
- అల్మారా తాళాలు కామన్ ఏరియాలో కాకుండా ఇంట్లోనే రహస్య ప్రదేశంలో ఉంచడం మంచిది.
- ఇంటికి సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సార్లను ఏర్పాటు చేసుకోవటం ఉత్తమం.
- ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్ ఉండే తాళం అమర్చుకోవటం మంచిది. ప్రధాన ద్వారానికి వేసిన తాళం బయటికి కనిపించకుండా కర్టెన్స్‌తో కవర్ చేయాలి.
- మీ వాహనాలను తాళం వేసి ఇంటి ఆవరణలోనే పార్క్ చేసుకోండి. వీలైతే చక్రాలకు చైన్స్‌తో కూడా లాక్ వేయడం మంచిది.
- మీరు ఇంట్లో లేనప్పుడు ఇంటి ముందు చెత్త చెదారం, న్యూస్ పేపర్లు, పాలప్యాకెట్లు జమ కానివ్వొద్దు. వాటిని గమనించి కూడా నేరస్తులు దొంగతనాలకు పాల్పడుతారు.
- ఊరెళ్లే ముందు ఇంటి లోపల, బయట కొన్ని లైట్లు వేసి పెట్టండి.
- మీకు నమ్మకమైన ఇరుగు పొరుగు వాళ్లకు ఇంటిని గమనిస్తూ ఉండమని చెప్పడం మంచిది. కాలనీలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా 9490617444 వాట్సాప్ నంబరులో సమాచారం ఇవ్వాలి.
- కాలనీల్లో దొంగతనాల నివారణకు స్వచ్ఛందంగా కమిటీలను ఏర్పాటు చేసుకోవాలి.
- నమ్మకమైన వాచ్‌మెన్‌లను మాత్రమే సెక్యూరిటీ గార్డులుగా నియమించుకోవాలి.

వేడి నీళ్లు మీద పడి బాలుడి మృతి



మృతి చెందిన బాలుడు ధీరజ్ (ఫైల్)

గచ్చిబౌలి: తల్లి స్నానం కోసం పెట్టుకున్న వేడి నీళ్ల బకెట్‌ను పట్టుకోవడంతో ప్రమాదవశాత్తు నీళ్లు మీదపడి తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా దోమ మండలం గొడుగోనిపల్లికి చెందిన దంపతులు మైసం రాజు, సోనీ బతుకు దెరువు కోసం వచ్చి మణికొండలోని శివపురి కాలనీలో నివాసం ఉంటున్నారు. రాజు వాచ్‌మెన్‌గా పని చేస్తూనే కారు డ్రైవింగ్ చేస్తుంటాడు. ఈ నెల 6న సాయంత్రం 4.40 గంటల సమయంలో సోనీ స్నానం చేసేందుకు బకెట్‌లో హీటర్ పెట్టి నీళ్లను వేడి చేసింది. ఆమె కొడుకు ధీరజ్ (04) ఆడుకుంటూ బకెట్‌ను పట్టుకున్నాడు. బకెట్ కిందపడటతో నీళ్లన్నీ శరీరంపై పడి బాలుడికి 60 శాతం కాలిన గాయాలయ్యాయి. వెంటనే గమనించిన తల్లి హుటాహుటిని సమీపంలోని ఓ ప్రైవేట్ అస్పత్రికి తరలించింది. అక్కడి నుంచి నిలోఫర్‌కు వెళ్లగా ఉస్మానియా ఆస్పత్రికి పంపించారు. ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ధీరజ్ శుక్రవారం రాత్రి 11 గంటలకు మృతి చెందాడు. వేడి నీళ్లు మీదపడి ఒక్కగానొక్క మృతి చెందడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా విలపించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గృహిణి అదృశ్యంపై కేసు నమోదు



శిరీష (ఫైల్)

పహాడీషరీఫ్: గృహిణి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి శ్రీరాం కాలనీకి చెందిన సంపంగి గణేష్ ఏడాది క్రితం శిరీష(21) అనే యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. అప్పటి నుంచి శిరీష కుటుంబ సభ్యులు ఆమెతో మాట్లాడడం లేదు. తాజాగా ఆమె తల్లితో మాట్లాడుతుంది. ఈ క్రమంలోనే ఈ నెల 9న తల్లి వద్దకు వెళ్లొస్తానని చెప్పి శిరీష బయటికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఈ విషయమై గణేష్ అత్తగారింటిలో వాకబు చేయగా, అక్కడికి రాలేదని తెలిపారు. దీంతో పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లోగాని 87126 62367 నంబర్‌లో గాని సమాచారం అందించాలని తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

పహాడీషరీఫ్: అనారోగ్యంతో బాధ పడుతూ చికిత్స పొందుతున్న వారికి సీఎం రిలీఫ్‌ఫండ్ ఆసరాగా ఉంటుందని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 11, 12 డివిజన్ల కార్పొరేటర్లు చుక్క శివకుమార్, యాతం పవన్ కుమార్ పేర్కొన్నారు. మామిడిపల్లి గ్రామంలోని నలుగురు లబ్ధిదారులకు శనివారం చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ.. గడిచిన ఐదేళ్ల కాలంలో మామిడిపల్లి, రంగ నాయకుల కాలనీలో అనారోగ్యంతో చికిత్స పొందిన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చొరవతో మంజూరు చేయించామన్నారు. బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవాలయ మాజీ చైర్మన్ బండారి గోపాల్ యాదవ్, ముదిగొండ శంకర్ యాదవ్ పాల్గొన్నారు.

హక్కుల సాధనకు కృషి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

మహేశ్వరం: వీరశైవ లింగాయత్, లింగ బలిజలు ఐక్యంగా ఉండి హక్కుల సాధనకు కృషి చేయాలని రాష్ట్ర వీర శైవ లింగాయత్, బలిజ సంఘం కేంద్ర కమిటీ సభ్యులు శెట్టి శివకుమార్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీశివగంగా రాజరాజేశ్వర ఆలయ ప్రాంగణంలో వీర శైవ లింగాయత్, లింగ బలిజ సంఘం 2025 క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీర శైవ లింగాయత్, లింగ బలిజలు విద్యా, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని ఆయన సూచించారు. సమాజంలో అన్ని రంగాల్లో ఎదిగినప్పుడే గుర్తింపు వస్తుందన్నారు. అంతకు ముందు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వీరశైవ లింగాయత్, లింగ బలిజ సంఘం అధ్యక్షుడు అనిల్‌కుమార్, కార్యదర్శి సుంకరి సురేష్, గౌరవ అధ్యక్షుడు మోదిని ఆనందప్ప, మన్సాన్‌పల్లి మాజీ సర్పంచ్ కంది అరుణ, మండల అధ్యక్షుడు సలేంద్ర శివకుమార్, ప్రధాన కార్యదర్శి శివానందం, మండల గౌరవ అధ్యక్షుడు మోదిని శంకరప్ప, సలహాదారు మోదిని శ్రీశైలం, సీనియర్ నాయకులు కంది రమేష్, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'పట్టుతప్పిన' ప్రాణం

ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలపై పడి వలస కార్మికుడి మృతి



తీగలపై వేలాడుతున్న గుల్ఫాన్ మృతదేహం

పహాడీషరీఫ్: నూతన భవనానికి పీఓపీ (ప్లాస్టర్ ఆఫ్ పారిస్) పనులు చేస్తున్న కార్మికుడు ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు తగిలి మృతి చెందిన సంఘటన రంగారెడ్డి జిల్లా బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..బిహార్‌కు చెందిన మహ్మద్ గుల్ఫాన్(23) కొంతకాలం క్రితం బోరబండ ప్రాంతానికి వలస వచ్చాడు. బాలాపూర్‌లోని సాదత్‌నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఓ ఇంట్లో గుల్ఫాన్ ఇరవై రోజులుగా పీఓపీ పనులు చేస్తున్నాడు. ఇందులో భాగంగా శనివారం ఇంటి మొదటి అంతస్తు ముందు భాగంలో ఏర్పాటు చేసిన తడకలపై మరో ఇద్దరితో కలిసి పనిచేస్తుండగా అదుపుతప్పి 11కేవీ విద్యుత్ వైర్లపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. తోటి కార్మికులు చూస్తుండగానే ప్రాణాలు కోల్పోయాడు. గమనించిన స్థానికులు బాలాపూర్ పోలీసులకు సమాచారం అందించగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. ఈ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

డైరీ ఆవిష్కరణ



లేబర్ కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సర డైరీని శనివారం హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో లేబర్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.రఘురాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.మధుసూదన్, ఉపాధ్యక్షులు వచ్చ తిరుపతిరెడ్డి, వై.రంజిత్‌రెడ్డి, కోశాధికారి బి.కిరణ్‌కుమార్, కార్యవర్గ సభ్యుడు రమేష్ పాల్గొన్నారు. – చిక్కడపల్లి

22న మున్సిపల్ కార్మికుల 'చలో జీహెచ్‌ఎంసీ'



సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు సుధాకర్

సంతోష్‌నగర్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 22న 'చలో జీహెచ్‌ఎంసీ ఆఫీస్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్, నాయకుడు ఎం.శ్రావణ్ కుమార్ అన్నారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ హైదరాబాద్ సౌత్ కమిటీ విస్తృతస్థాయి సమావేశం శనివారం సంతోష్‌నగర్‌లో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారుతున్నాయే తప్పా..కార్మికుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని..వేతనాలు పెంచుతామని చెప్పినా ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. బయోమెట్రిక్ హాజరు పట్టికలో జరుగుతున్న అవకతవకలను అరికట్టాలని.. మాన్యువల్ పద్ధతిని కొనసాగించాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా నాయకులు ఎస్.కిషన్, బాలు నాయక్, యాదమ్మ, అరుణ్, లక్ష్మి, కవిత, సంతోష్, మహేశ్, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు డీసీఎం వ్యాన్‌లో మంటలు



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



మైలార్‌దేవ్‌పల్లి: ఆగి ఉన్న డీసీఎం వ్యాన్‌కు మంటలు అంటుకున్న సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ఘటనలో వాహనం పూర్తిగా అగ్నికి ఆహుతైంది. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బుద్వేల్ రైల్వే స్టేషన్ ఇందిరాగాంధీ సొసైటీలో మహా మంగళ కార్టూన్ వేస్టేజ్ గోదామును నిర్వహిస్తున్నారు. ఈ వేస్టేజ్ తీసుకోవడానికి శనివారం రాత్రి ఓ డీసీఎం వాహనం వచ్చింది. సరుకు లోడ్ చేస్తున్న సమయంలో వాహనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. విషయాన్ని గమనించిన డ్రైవర్ కంపెనీకి ఎలాంటి ప్రమాదం జరగకూడదని భావించి..డీసీఎంను స్టార్ట్ చేసి కంపెనీ బయట ఉన్న రోడ్డుపై నిలిపి వేశాడు. నిమిషాల వ్యవధిలో వాహనం పూర్తిగా అగ్నికి ఆహుతైంది. స్థానికులు విషయాన్ని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తీసుకువచ్చారు.

క్లుప్తంగా...

నూతన యంత్రాలు ప్రారంభం



నూతన యంత్రాలను ప్రారంభిస్తున్న రమణకుమార్ తదితరులు

ఖైరతాబాద్: మింట్ కాంపౌండ్‌లోని తెలంగాణ పాఠ్య పుస్తక ముద్రణాలయంలో శనివారం నూతన పాఠ్యపుస్తక ముద్రణ యంత్రాలను పాఠ్యపుస్తక ముద్రణాలయం డైరెక్టర్ రమణ కుమార్ ప్రారంభించారు. డీఎస్సీ కమిషనర్ ఈవీ నర్సింహారెడ్డి నూతన యంత్రాలను అందజేసినట్లు తెలిపారు.నూతన యంత్రాలు మంజూరు కావడం పట్ల కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

శివప్రసాద్‌కు గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ తీసుకుంటున్న శివప్రసాద్ శర్మ

పంజగుట్ట: చిన్నతనం నుంచి జ్యోతిష్యంలో ఎంతో పట్టు సాధించి గత 20 సంవత్సరాలుగా ఎంతో మందికి జ్యోతిష్య సలహాలు, వారి సమస్యలకు పరిష్కారాలు చూపిన ప్రముఖ జ్యోతిష్యులు యం.శివప్రసాద్ శర్మకు చెన్నైకి చెందిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ వారు గౌరవ డాక్టరేట్ ఇచ్చారు. ఈ సందర్భంగా శనివారం సోమాజిగూడలో ఆయన మాట్లాడుతూ తనకు ఈ గౌరవం దక్కడం సంతోషంగా ఉందని, ఇదే స్ఫూర్తితో తన విద్యను సమాజానికి అందిస్తూ సమస్యలతో తనవద్దకు వచ్చినవారికి తగిన పరిష్కారం చూపుతానని తెలిపారు.

రోడ్డు భద్రతా నియమాలను పాటించండి



బంజారాహిల్స్: రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాష్‌గౌడ్ వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కలిగించారు. బంజారాహిల్స్ కేన్సర్ ఆస్పత్రి వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానంగా ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలను తెలియజేశారు. ఆటోలను ఆటోస్టాండ్‌లో మాత్రమే పార్కు చేయాలని, అంబులెన్స్‌లకు దారి ఇవ్వాలని, ఆటోలను రాంగ్‌రూట్‌లో నడపవద్దని, సామర్థ్యానికి మించి ప్రయాణికులను, పాఠశాల విద్యార్థులను అనుమతించవద్దని, మద్యం సేవించి వాహనం నడపవద్దని సూచించారు.

సంక్రాంతి సంబురం





రంగవల్లులు తీర్చిదిద్దుతున్న మహిళలు...



విజేతలతో మామిడి నర్సింగ్‌రావు



సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో..

- ముందస్తుగా పాఠశాలల్లో సంక్రాంతి వేడుకలు
- వేడుకల్లో ఆడిపాడిన విద్యార్థులు
- బస్తీలు, కాలనీల్లో ముగ్గుల పోటీలు

నగరంలో సంక్రాంతి సందడి నెలకొంది. పాఠశాలలకు వరుసగా సంక్రాంతి సెలవులు రావడంతో రెండురోజుల ముందుగానే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సాంస్కృతి కార్యక్రమాలతోపాటు ముగ్గుల పోటీలు నిర్వహించగా పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. విద్యార్థులు రంగురంగుల పతంగులను ఎగురవేసి సరదాగా గడిపారు. అదేవిధంగా పలు కాలనీలు, బస్తీల్లో కూడా కాలనీ నిర్వాహకులు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. – బంజారాహిల్స్





భారతీయ విద్యా భవన్ ఆత్మకూరి రామరావు స్కూల్లో..



సంక్రాంతి వేడుకల్లో సంస్కార్ ది లైఫ్ స్కూల్ చిన్నారులు



ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న సభ్యులు





సాయిసరస్వతి విద్యానికేతన్‌లో..

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు







బీవీబీపీ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో...

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–45లోని భారతీయ విద్యాభవన్స్ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో శనివారం గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. తాతయ్య, నాన్నమ్మ, అమ్మమ్మలతో కలిసి చిన్నారులు వివిధ క్రీడాంశాల్లో పాల్గొని సందడి చేశారు. తాతయ్య, బామ్మలు కుటుంబానికి గొప్ప నిధి అని, ప్రేమపూర్వక వారసత్వానికి పునాది అని, వారిని గౌరవించుకోవాల్సిన ఆవశ్యకతను ఈ వేడుకలను తెలియజెప్పారు. తాతయ్య, బామ్మలు మనుమలు, మనురాళ్లతో సెల్ఫీలు దిగుతూ మరుపురాని జ్ఞాపకాలను పదిలం చేసుకున్నారు. అలాగే సంప్రదాయ బొమ్మల అలంకరణ ఆకట్టుకుంది. మనుమలు, మనుమరాళ్లతో కలిసి తాతయ్య, బామ్మలు ర్యాంప్‌పై నడిచి సందడి చేశారు. పాటలు పాడడం, కథలు చెప్పడం వంటి అద్భుతమైన నైపుణ్యాలను ప్రదర్శించి ఆలోచింపజేశారు. అందమైన గ్రీటింగ్ కార్డులను తయారు చేసి సృజనను చాటి చెప్పారు. రంగోలీ పోటీలలో బామ్మలు తమలోని నైపుణ్యాన్ని వెలికితీశారు.

దేవాలయ ఈఓ శ్రీనివాసశర్మవి ఒంటెద్దు పోకడలు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ఈఓ శ్రీనివాస శర్మ స్థానిక ప్రజాప్రతినిధులు, స్థానిక సీనియర్ నేతలకు కనీస సమాచారం లేకుండా ప్రోటోకాల్ పాటించకుండా ఒంటెద్దు పోకడలతో ప్రవర్తిస్తున్నారని సీనియర్ కాంగ్రెస్ నేతలు మనోజ్ యాదవ్, కిరణ్ యాదవ్ ఆరోపించారు. ఎల్లారెడ్డిగూడలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ స్థానికంగా ఉండే అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు దేవాలయ అభివృద్ధి, ముఖ్య దినాల్లో సమాచారాన్ని ఇవ్వడం లేదని, తానే అన్ని అంటూ పోకడలకు పోవడం తగదన్నారు. పర్వదినాల్లో భక్తులకు మౌలిక వసతుల కల్పనలో పూర్తిగా విఫలం అవుతున్నారని విమర్శించారు. కనీసం వైకుంఠ ఏకాదశి పర్వదినాన కూడా స్థానిక అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు ప్రత్యేక పూజలకు ప్రోటోకాల్‌ని పాటించడం లేదని ఆరోపించారు. ఈ విషయమై ఎండోమెంట్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నేతలు శరత్‌గౌడ్, బోడ రాంచందర్, చిన్నా ముదిరాజ్, రాము, సురేష్, హరి, వేణు పాల్గొన్నారు.

వడ్డే ఓబన్న గొప్ప పోరాట యోధుడు

రాష్ట్ర ఎంబీసీ ఛైర్మన్ జెరపేటి జయపాల్

రహమత్‌నగర్: స్వాతంత్ర్య ఉద్యమంలో గొప్ప యోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర ఎంబీసీ ఛైర్మన్ జెరిపేటి జయపాల్ హర్షం వ్యక్తం చేశారు. వడ్డే ఓబన్న జయంతిని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర వడ్డెర ఐక్య వేదిక వ్యవస్థాపకుడు వేముల యాదయ్య ఆధ్వర్యంలో శనివారం ఎస్పీఆర్‌హిల్స్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయపాల్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో వడ్డే ఓబన్న చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. అలాంటి మహాయోధుని సేవలను గుర్తించి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఓబన్న జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. అంతకు ముందు స్థానికంగా ఉన్న ఓబన్న విగ్రహానికి పూల మాలలు వేసి, కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల వెంకటేశ్, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భవాని శంకర్, గౌలుసుల ఎల్లయ్య, ముద్దంగుల శేఖర్, నాగమ్మ, వెంకటేశ్, సురేష్‌లతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన వడ్డెర సంఘం నాయకులు పాల్గొన్నారు.



ఓబన్న విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న ఎంబీసీ ఛైర్మన్ జయపాల్

కేలండర్ ఆవిష్కరణ

బంజారాహిల్స్: తెలుగు టెలివిజన్ డిజిటల్ మీడియా టెక్నీషియన్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (టీవీ–ఓటీటీ ఫెడరేషన్) ఆధ్వర్యంలో రూపొందించిన కేలండర్‌ను రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆవిష్కరించారు. బంజారాహిల్స్‌లోని మంత్రి నివాసంలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షులు రాకేష్ (నాని), ప్రధాన కార్యదర్శి పి.విజయ్‌కుమార్, కోశాధికారి కే నరేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు రమేష్ మాస్టర్, సంపత్ లతోపాటు ఫెడరేషన్ సలహాదారులు మురళీ, గిరిరాజ్, ఈశ్వర్, మధు, ఇరిగి నర్సింగ్ రావు, సురేష్, రాము, రాంగోపాల్‌రెడ్డి, మహిపాల్, తాజోద్దీన్, సుదర్శన్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

డ్రగ్స్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం



ప్రసంగిస్తున్న బాబాఫసియుద్దీన్, ఎస్‌హెచ్‌ఓ వీరశేఖర్

రహమత్‌నగర్: డ్రగ్స్ వల్ల కలిగే అనార్థాలను గుర్తించిన సీఎం రేవంత్‌రెడ్డి డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నారని, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణ కావాలని ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారని కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ స్పష్టం చేశారు. డివిజన్‌లోని భారత్‌నగర్ కమ్యూనిటీ హాల్లో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డ్రగ్స్‌కు ఒక్కసారి అలవాటు పడితే జీవితాలను సర్వనాశనం అవుతాయన్నారు. ముఖ్యంగా టీనేజీ యువత డ్రగ్స్‌కు అలవాటు పడుతుండటం బాధాకరమని వాపోయారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను నిత్యం గమనించాలని ఆయన సూచించారు. ఎస్‌హెచ్‌ఓ వీరశేఖర్ మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగించిన, విక్రయించిన చట్టపరంగా చర్యలు తీసుకుంటాయని హెచ్చరించారు. ఈ సందర్భంగా కళాబృందాలు ఆలపించిన చైతన్య గీతాలు ఆకట్టుకున్నాయి. బస్తీ జీహెచ్‌ఎంసీ అధికారి, వెంకటకృష్ణ, బస్తీ అధ్యక్షులు ఖలీల్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న చేనేత వస్త్ర ప్రదర్శన



బంజారాహిల్స్: చేనేత కళాకారులకు చేయూతనందించేందుకు హస్త కళాఆర్టిషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్డునెంబర్–1లోని లేబుల్స్ పాప్ ఆఫ్ స్పేస్‌లో సిలాయి పేరుతో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శన ఆకట్టుకుంటుంది. ఈ సందర్భంగా హస్తకళా ఆర్టిషన్ ఫౌండేషన్ ఫౌండర్ శ్రీదేవి విజయదాస్ మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీ వరకు కొనసాగుతున్న ఈ ప్రదర్శనలో చేనేత కళాకారులు నేసిన బనారస్, హ్యాండ్ పెయింటెడ్ టస్సార్, కంచిపట్టు, పెన్ కలంకారి, జామధాని, మట్కా చీరలు అందుబాటులో ఉన్నాయన్నారు. తమవంతు కృషిగా తమ ఫౌండేషన్ ద్వారా చేనేత కళాకారుల కోసం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు.

బీసీ కమిషన్ వెంటనే ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలి

లిబర్టీ: బీసీ కమిషన్ వెంటనే రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి కోరారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాలంటే బీసీ కమిషన్ నివేదికనే కీలకంగా కానున్నదని ఆయన పేర్కొన్నారు. శనివారం దళ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీల పట్ల చిత్తశుద్ధితోనే వ్యవహరిస్తూనే రాష్ట్ర శాసన సభలో శాసన మండలిలో పంచాయతీరాజ్ సవరణ బిల్లును తీసుకు వచ్చిందని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కులగణన చేసిన నేపథ్యంలో బీసీ కమిషన్ ఇంకా నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందించలేదని ఆయన తెలిపారు.

యువకుడి అరెస్టు

బంజారాహిల్స్: గంజాయి సేవిస్తున్న ఓ యువకుడిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే... బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12 ఏసీబీ కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఓ వ్యక్తి గంజాయి సేవిస్తున్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. శనివారం ఆ ప్రాంతానికి చేరుకుని అక్కడ అనుమానిత వ్యక్తిని అదుపులోకి తీసుకుని సోదాలు జరపగా అతని వద్ద 2 గ్రాముల డ్రై గంజాయి లభ్యమైంది. తాను గంజాయి సేవించినట్లుగా పోలీసుల విచారణలో ఒప్పుకున్నాడు. నిందితుడు బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని ఎన్‌బీటీనగర్‌కు చెందిన జీవన్‌గా పోలీసులు గుర్తించారు. నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి రెండు గ్రాముల డ్రై గంజాయి, ఒక వివో ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



పంజగుట్ట: గుర్తు తెలియని మృతదేహాన్ని పంజగుట్ట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గురువారం ఉదయం బేగంపేట, కంట్రీక్లబ్ సమీపంలో ఫుత్‌పాట్‌పై ఓ వ్యక్తి పడి ఉన్నాడని పంజగుట్ట పోలీసులకు సమాచారం రావడంతో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. సదరు వ్యక్తిని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉంటుందని, బ్లూకలర్ చొక్కా, బ్రౌన్ కలర్ పాయింట్ వేసుకున్నాడని తెలిపారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రిలో ఉంచినట్లు ఆచూకీ తెలిసిన వారు పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో, లేదా 8712661097 నెంబర్‌లో సంప్రదించాలని ఎస్సై శివ శంకర్ తెలిపారు.

నగదు డిపాజిట్ కోసం వచ్చి నానా హంగామా

బ్యాంకు ఫర్నిచర్‌పై రాళ్లతో దాడి.. మహిళపై కేసు నమోదు

వెంగళరావునగర్: ఖాతాలో నగదు జమ చేయడానికి వచ్చిన మహిళ బ్యాంకు ఆస్తులను ధ్వంసం చేయడంతో మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కథనం ప్రకారం... ఎం.లావణ్య ఈనెల 8వ తేదీ మధురానగర్‌లోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్‌కు వచ్చింది. తన వద్ద ఉన్న 7 లక్షలు డిపాజిట్ చేయడానికి క్యాషియర్‌కు అందించింది. ఆమె ఇచ్చిన నగదు బండిల్స్‌లోని మొదటి రెండు బండిల్స్ లెక్కించగా రూ.1000 తక్కువ ఉన్నాయని చెప్పాడు. ఆమె అతని నుంచి క్యాష్ మొత్తం తీసుకుని రూ. 21వేలు తక్కువ ఉన్నాయని, తక్షణ మే వాటిని ఇవ్వాలని డిమాండ్ చేసింది. వారు ఇవ్వలేమని అనడంతో 100కు ఫోన్ చేసి హడావుడి చేసింది. సీసీటీవీ ఫుటేజీలో పరిశీలించగా రూ.21 వేలు తక్కువగా ఉన్నాయి. దీంతో ఆమె అక్కడ నుంచి వెళ్లిపోయి మరుసటి రోజు వచ్చి తనకు రూ.21 ఇవ్వాలని డిమాండ్ చేసింది. దీనికి బ్యాంకు సిబ్బంది తిరస్కరించారు. 10వ తేదీన మళ్లీ బ్యాంకుకు వచ్చి నానా గొడవ చేసి రాళ్లతో క్యాష్ మిషన్, క్యాష్ కౌంటర్, ఏటీఎం, మేనేజర్ టేబుల్స్ తదితర వాటిపై దాడి చేసింది. దీంతో రూ.1.20 లక్షల ఖరీదైన వస్తువులు ధ్వంసమయ్యాయి. మేనేజర్ పోలీసులకు ఫోన్ చేయగా పారిపోయింది. డిప్యూటీ బ్రాంచ్ హెడ్ వై.మురళీ ఫణికుమార్ ఆమెపై మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోగొట్టుకున్న బ్యాగు అందజేత



గాయిత్రికి బ్యాగును అందజేస్తున్న పోలీసులు

రహమత్‌నగర్: పోగొట్టుకున్న బ్యాగును బాధితురాలికి అందజేసిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌ఓ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... మోతీనగర్‌లోని వినాయక రెసిడెన్సిలో నివాసముండే గాయత్రి సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. గాయత్రి శనివారం ఉదయం తన భర్త విజయ్‌తో కలిసి నటరాజ్‌నగర్‌లో రామాలయానికి బైక్ వెళుతున్న క్రమంలో తన వెంట తెచ్చుకున్న హ్యాండ్ బ్యాగు కిందపడిపోయింది. అయితే అక్కడే ఉన్న సుల్తాన్‌నగర్‌కు చెందిన గురుమూర్తి రోడ్డుపై పడి ఉన్న బ్యాగును తీసుకొని వెంటనే బోరబండ పోలీ స్టేషన్‌లో అప్పగించాడు. బ్యాగులో ఉన్న సెల్‌ఫోన్ నుంచి తరుచూ కాల్స్ రావడం గమనించిన పోలీసులు బ్యాగుకు పోగొట్టుకున్న బాధితురాలికి సమాచారం అందించి ఆమెకు బ్యాగును అందించారు. ఈ సందర్భంగా గాయత్రి మాట్లాడుతూ హ్యాండ్ బ్యాగులో విలువైన బంగారు ఆభరణాలతోపాటు సెల్‌ఫోన్ కూడా ఉందని తెలిపారు. దొరికిన బ్యాగును నిజాయితీగా అందజేసిన గురుమూర్తిని ఎస్‌హెచ్‌ఓ వీరశేఖర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఐ భూపాల్‌గౌడ్, అడ్మిన్ ఎస్సై నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

లాల్ బహదూర్ శాస్త్రి సేవలు చిరస్మరణీయం



లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సదానందు

లిబర్టీ: నిజాయితీ, నిబద్ధతకు నిలువుటద్దం మాజీ ప్రధాన మంత్రి లాల్ బహదూర్ శాస్త్రి అని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వి.సదానందు అన్నారు. లాల్‌బహదూర్ శాస్త్రీ ఆశయాలు సాధించాల్సిన అవసరం ఉందన్నారు. లాల్ బహదూర్ శాస్త్రీ వర్ధంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సదానందు మాట్లాడుతూ భారత ప్రధాన మంత్రిగా దేశానికి విశిష్ట సేవలు అందించారని గుర్తు చేశారు. దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం వివిధ ప్రభుత్వ రంగ సంస్థల స్థాపన కోసం ఎంతగానో కృషి చేశారన్నారు. ఆయన సేవలు ఎనలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి



వడ్డే ఓబన్న చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

ఫిలింనగర్: స్వాతంత్ర్య ఉద్యమంలో వడ్డే ఓబన్న చేసిన పోరాటం చిరస్మరణీయమని జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ అన్నారు. శనివారం ఒడ్డే ఓబన్న 218వ జయంతి వేడుకలను ఫిలింనగర్‌లోని గౌతమ్‌నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించిన అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ వడ్డెరుల సంఖ్య అధికంగా ఉన్న ఫిలింనగర్‌లో త్వరలోనే ఓబన్న విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. ఒడ్డె ఓబన్న ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆర్. ఎల్లయ్య, నియోజక వర్గం అధ్యక్షుడు యాదయ్య, ప్రధాన కార్యదర్శి వి. కుమార్, తిరుపతి, బసవరాజు, తన్నీరు రాములు, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇందిరానగర్‌లో...

బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఇందిరానగర్ బస్తీలో వడ్డే ఓబన్న జయంతి వేడుకలను స్థానిక నేత శ్రీను ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒడ్డే ఓబన్న స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు శంకర్, నరేష్ పాల్గొన్నారు.



ఇందిరానగర్‌లో..

బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా శ్రీకాంత్ యాదవ్



పంజగుట్ట: భారతీయ జనతా పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యునిగా ప్రేమ్‌నగర్‌కు చెందిన శ్రీకాంత్ యాదవ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ యాదవ్ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి పదవి బాధ్యతలు ఇచ్చినందుకు సంతోషమని, ఖైరతాబాద్ నియోజకవర్గంలో తిరిగి బీజేపీ జెండా ఎగరవేసేందుకు కష్టపడి పని చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.గౌతమ్ రావుకు ధన్యవాదాలు తెలిపారు.

నుమాయిష్ @ 2 లక్షల మంది



అబిడ్స్: 84వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన శాల(నుమాయిష్) సందర్శకులతో కిక్కిరిసింది. శనివారం సెలవురోజు కావడంతో పెద్ద ఎత్తున సందర్శకులు తరలివచ్చారు. ఈ నెల 3వ తేదీన ప్రారంభమైన ఎగ్జిబిషన్‌కు సందర్శకుల సంఖ్య పెరిగింది. శుక్రవారం ఒక్కరోజే దాదాపు 50 వేల మంది సందర్శకులు ఎగ్జిబిషన్‌ను సందర్శించారని సొసైటీ ఉపాధ్యక్షుడు కె.నిరంజన్, కార్యదర్శి సురేందర్‌రెడ్డి తెలిపారు. 84వ ఎగ్జిబిషన్‌లో సందర్శకుల సౌకర్యార్థం పలు రకాల ఏర్పాట్లు చేశామన్నారు. 8 రోజుల్లో దాదాపు 2 లక్షల మంది సందర్శించారని వారు వివరించారు. ఎగ్జిబిషన్ పరిసరాలు, ప్రధాన గేట్ల వద్ద సీసీ కెమెరాలతో నిఘా పెంచామన్నారు. తమ సెక్యూరిటీతో పాటు పోలీసులు భారీ ఎత్తున బందోబస్తు నిర్వహించారని పేర్కొన్నారు.

సూపర్ సంక్రాంతి సేల్ ఆవిష్కరణ

సాక్షి, సిటీబ్యూరో: సెలెక్ట్ మొబైల్స్ సంక్రాంతి పండగ సందర్భంగా 'సెలెక్ట్ సూపర్ సేల్'ని ఆ కంపెనీ సీఎండీ వై గురు శనివారం ఆవిష్కరించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర వినియోగదారులకు బంపర్ ఆఫర్లను ప్రకటించారు. స్మార్ట్ ఫోను కొనుగోలుపై స్కాన్ అండ్ విన్ ద్వారా 10 శాతం వరకు ఇన్సెంటివ్ డిస్కౌంట్, ఎస్‌బీఐ కార్డుతో కొనుగోలుపై 7.5 శాతం ఇన్సెంటివ్ క్యాష్ బ్యాక్, ప్రతి కొనుగోలుపై బహుమతులు ప్రకటించింది. స్మార్ట్ ఫోన్ల ఎక్స్చేంజీతో పాటు ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్, టీవీలపై కూడా పలు ఆఫర్లు ఉన్నట్లు వెల్లడించింది. ఈ నెల 12 నుంచి అన్ని ఆఫర్లు అందుబాటులో ఉంటాయని ప్రకటించింది.



పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రమణాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: నవలలో రచయిత విహారి చేసిన వర్ణనలు అందరినీ చదివించేలా ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఎంవీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విహారి రచించిన వైజయంతి, కవి సుధామ సంకలనం చేసిన సప్తశతి పుస్తకావిష్కరణ సభ శనివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండిత జగన్నాథ రాయుల తెలిపిన ఊహాత్మక నవల రచనలో శిల్పం, భాష, రచన ఎంతో గొప్పగా ఉందని కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ జి.వల్లీశ్వర్, సాహితీవేత్త డాక్టర్ వై.రామకృష్ణారావు, ఆకాశవాణి పూర్వ సహాయ సంచాలకులు టీఎస్.రాంబాబు, ఫౌండేషన్ సభ్యులు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఆహార భద్రతలో అధమం

- ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్వేలో రాష్ట్రానికి 23వ స్థానం
- అయినా మారని హోటళ్ల తీరు

ఆ మధ్య కాలంలో నగరంలోని బడా హోటళ్లపై ఒక్కసారిగా ఫుడ్‌సేఫ్టీ అధికారులు విరుచుకుపడ్డారు. వారి తనిఖీల్లో విస్తుపోయే అంశాలు వెలుగులోకి వచ్చాయి. దాదాపు అన్ని పెద్ద హోటళ్లు, రెస్టారెంట్లలో నాణ్యత జాడ కరువైందని వారు తేల్చారు. వెంటనే నోటీసులు అందించారు. ఇకపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతే.. ఆ తర్వాత ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు అంతంతమాత్రంగానే తయారయ్యాయి. వారి నాలుగు రోజుల హడావుడిని హోటళ్లు, రెస్టారెంట్స్ నిర్వాహకులు పట్టించుకోలేదు. దాంతో బయట ఏది తినాలన్నా నగరవాసులు భయపడాల్సిన దుస్థితి. హోటళ్లు, రెస్టారెంట్స్‌లోని కిచెన్స్ అస్తవ్యస్తంగా తయారయ్యాయి. – సాక్షి, సిటీబ్యూరో





కల్తీ సరుకులు, వంట నూనెలు, హానికరమైన రంగులు, కుళ్లిన మాంసం, క్రిమికీటకాలు, స్వీట్ షాప్స్, బేకరీలు సైతం బేకార్‌గా తయారయ్యాయి. స్వగృహ ఫుడ్స్‌లోనూ కల్తీ సరుకులే.. ఇక బిర్యానీల్లో బొద్దింకలు.. ఇవన్నీ ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్లు నిర్వహించిన వందల తనిఖీల్లో కనిపించిన దృశ్యాలు.. ఇటీవల నగర మేయర్ విజయలక్ష్మి సందర్శించిన రెండు, మూడు హోటళ్లలోనూ అనారోగ్యకర పరిస్థితులే. ఎవరెన్ని తనిఖీలు నిర్వహించినా, ఫుడ్ వ్యాపారాల్లోని వారు ఏ మాత్రం ఖాతరు చేయకపోవడమే ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇలాంటి పరిస్థితుల తోనే ఎఫ్ఎస్ఎస్ఏఐ(ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) ఇటీవల వెల్లడించిన ఫుడ్ సేఫ్టీ సర్వే ఇండెక్స్‌లోనూ రాష్ట్రం అధమంగా ఉంది. పేరుకు రాష్ట్ర ర్యాంకు అయినా, అది హైదరాబాద్ ర్యాంకే. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న హోటళ్లు, ఈటరీల్లో అగ్రస్థానం హైదరాబాద్‌దే కావడం తెలిసిందే.

23వ ర్యాంకు..

ఎఫ్ఎస్ఎస్ఏఐ ఇటీవల వెలువరించిన ఫుడ్‌సేఫ్టీ ఇండెక్స్‌లో దేశంలోని 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాల్లో రాష్ట్రానికి 23వ ర్యాంక్ మాత్రమే దక్కింది. వివిధ అంశాలవారీగా వంద మార్కులకు గాను రాష్ట్రానికి వచ్చింది 35.75 మార్కులే. అంటే ఎంత అధమ స్థాయిలో ఉన్నామో ఊహించుకోవచ్చు. అధికార యంత్రాంగం అప్పుడప్పుడూ తనిఖీలు నిర్వహిస్తున్నా, హోటళ్ల నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. శుచి శుభ్రత పాటించడం లేరు. అడపాదడపా ప్రజలు ప్రశ్నించినా పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితి వల్లే వినియోగదారుల సాధికారత అంశంలో 2 మార్కులు రాగా, సిబ్బంది శిక్షణ సామర్థ్యం అంశంలో 1 మార్కు లభించింది. మానవ వనరులు, మౌలిక సదుపాయాలు, తనిఖీలు, పర్యవేక్షణ తదితర అంశాల్లో మిగతా రాష్ట్రాల కంటే తెలంగాణ బాగా దిగజారిపోయింది. ఆహార పదార్థాల పరీక్షలు, నిఘా వంటి అంశాల్లో మాత్రం 18 మార్కులొచ్చాయి.

కేరళ టాప్

ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రతిఏటా వివిధ పరీక్షలు, పరిశీలనల ద్వారా ఈ ర్యాంకుల్ని ప్రకటిస్తుంది. ఆహార రంగంలో వస్తున్న మార్పులు, తీసుకుంటున్న చర్యలు, తాజా పరిణామాలు వంటివి కూడా పరిగణనలోకి తీసుకొని ర్యాంకులు ప్రకటిస్తారని ఫుడ్‌సేఫ్టీ అధికారులు చెబుతున్నారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి వెల్లడైన ర్యాంకుల్లో కేరళ 73.74 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది. తొలి 10 స్థానాల్లో నిలిచిన మిగతా రాష్ట్రాలు వరుసగా.. తమిళనాడు(67మార్కులు), జమ్ము కశ్మీర్ (64.25మార్కులు), గుజరాత్(61.75 మార్కులు), పంజాబ్(56.75 మార్కులు), రాజస్థాన్ (54.75మార్కులు), పశ్చిమబెంగాల్ (54.75మార్కులు), గోవా(52.75మార్కులు), మధ్యప్రదేశ్ (51.25మార్కులు), హిమాచల్‌ప్రదేశ్ (48.5 మార్కులు).

మెరుగుపడాలంటే..

రాష్ట్రంలో ఫుడ్‌సేఫ్టీ మెరుగుపడాలంటే సిబ్బందికి శిక్షణ, నాణ్యత పరీక్షల నిర్వహణకు ఆధునిక సాంకేతికత, మెరుగైన స్టోరేజీ సదుపాయాలు, తయారీలో తగిన జాగ్రత్తలు తదితరమైనవి అవసరమని ఎఫ్ఎస్ఎస్ఏఐ అభిప్రాయపడింది. ప్రథమస్థానం పొందిన కేరళలో తనిఖీలు వంద శాతం లక్ష్యాన్ని మించాయని, ఆహార పదార్థాల పరీక్షలకు సంబంధించి సదుపాయాలు పెంపొందించుకున్నారని, శిక్షణ, అవగాహన కార్యక్రమాలు సైతం విస్తృతంగా నిర్వహించారని ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రస్తావించింది. అక్కడ నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాల వల్ల రిజిస్ట్రేషన్లు, లైసెన్సులు పెరిగాయంది. అంతర్జాతీయ మిల్లెట్ సంవత్సరాన్ని పురస్కరించుకొని 'ఈట్ రైట్ మిల్లెట్' మేళాలూ నిర్వహించిందని తెలిపింది. రాష్ట్రంలో ఇటీవల చేపట్టిన కార్యక్రమాల ఫలితాలు వచ్చే సంవత్సరం తెలుస్తాయని సంబంధిత అధికారులు అంటున్నారు. వెల్లడైన ర్యాంకులు రాష్ట్రంలో విస్తృత తనిఖీలు చేపట్టకముందు నిర్వహించిన సర్వే తాలూకువని తెలిపారు.

నగరంలో నేడు

- బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో జరుగుతున్న ఉద్యాన్ ఉత్సవ్ కార్యక్రమాలు ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతాయి.
- నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు ఇండస్ట్రీయల్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా వింటర్ ఉత్సవ్ మేళా సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులోని ప్యారడైజ్ ఫుడ్ కోర్టు ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 10 గంటల వరకు రాయల్ ఫుడ్ ఫెస్టివల్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటలకు ఇండియన్ ఫొటో ఫెస్టివల్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో అంతర్జాతీయ హస్తకళా మేళా ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్.విద్యాసాగర్‌రావు ఆటోగ్రఫీ 'యూనిక పుస్తకాన్ని బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ కృష్ణా హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు.
- తెలుగింటి పండగ సంక్రాంతిని పురస్కరించుకుని స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తెలంగాణ పోలీసు అకాడమీ సమీపంలోని ద వెన్యూ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తారు.
- సిరికొన సాహితీ అకాడమీ ఆధ్వర్యంలో విశిష్ట ప్రతిభా పురస్కారాలు– పుస్తకావిష్కరణలు కార్యక్రమం రవీంద్రభారతిలో సాయంత్రం 4 గంటలకు జరుగుతుంది.
- బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక జ్ఞానం ద్వారా మెరుగుపర్చడం అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమం సిక్ విలేజ్ రోడ్‌లోని ఇంపీరియల్ గార్డెన్‌లో సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రత్యేక కార్యక్రమం ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

కులగణన సర్వే 95 శాతం పూర్తి

- బీసీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్

గన్‌ఫౌండ్రీ: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల అభివృద్ధికి కట్టుబడి ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, వడ్డెర సంఘాల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత్ జోడో యాత్ర సమయంలో రాహుల్‌గాంధీ ప్రజల ఆక్రందనలను అర్థం చేసుకున్నారని, కులగణన సర్వే రాహుల్ గాంధీ చలవేనన్నారు. రాష్ట్రంలో కులగణన సర్వే 95 శాతం పూర్తయ్యిందని, కులగణన సర్వే రిపోర్ట్ ఆధారంగా బీసీలు హక్కులను అడిగేందుకు ఆస్కారం ఉంటుందని తెలిపారు. కులగణన సర్వే ఆధారంగా రిజర్వేషన్లను సైతం డిమాండ్ చేయవచ్చన్నారు. వడ్డెర కులస్తులు కార్పొరేషన్ చైర్మన్ల పదవులతో సరిపెట్టుకోవద్దని, ఎమ్మెల్యేలుగా పోటీచేసే స్థాయికి ఎదగాలని సూచించారు. కులాలను పక్కన పెట్టి బీసీలంతా ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాలకు చెందిన వడ్డె ఓబన్న దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన తీరు చాలా గొప్పదని కొనియాడారు. కార్యక్రమంలో మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబెదుల్లా కొత్వాల్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, అఖిల భారత వడ్డెర సంఘం అధ్యక్షుడు వేముల వెంకటేశం, వడ్డెర సంఘం తెలంగాణ గన్నుదెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు అంతయ్య, వడ్డె ఓబన్న జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ జె.జైపాల్, వడ్డెర సంఘం ప్రతినిధులు వేముల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



వడ్డె ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్

విద్యార్థులకు నైపుణ్యం అందించేందుకు..

- టెక్ మహీంద్రా, కేసీ పుల్లయ్య ఫౌండేషన్స్‌తో కేఎల్‌హెచ్ ఒప్పందం

సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థులకు విభిన్న అంశాల్లో నైపుణ్యాన్ని అందించేందుకు నగరానికి చెందిన కేఎల్‌హెచ్ విద్యా సంస్థ కేసీ పుల్లయ్య ఫౌండేషన్, టెక్ మహేంద్ర కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుంది. నగరంలో శనివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో మూడు సంస్థల ప్రతినిధులు పాల్గొని ఈ విషయాన్ని ప్రకటించారు. ఈ ఒప్పందం యువతకు విద్యార్థి దశలో అలవర్చుకోవాల్సిన నాయకత్వ లక్షణాలు, సమస్యల్ని పరిష్కరించే సామర్థ్యం తదితర అంశాలపై నైపుణ్యాలను అందించేందుకు ఉపకరిస్తుందని వీరు తెలిపారు.



కార్యక్రమంలో కేఎల్‌హెచ్ అజీజ్‌నగర్ క్యాంపస్ ప్రిన్సిపాల్ డా.రామకృష్ణ ఆకెళ్ల, కేసీ పుల్లయ్య ఫౌండేషన్ సీఈఓ సుధా చల్లా, టెక్ మహేంద్రా ఫౌండేషన్ మేనేజర్ సుమన్ కొత్తపల్లి పాల్గొని మాట్లాడారు.

వినియోగదారులకు సత్వర సేవలు అందించాలి



బంజారాహిల్స్‌లోని తట్టికాన రిజర్వాయర్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

- జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

బంజారాహిల్స్: ప్రతి సంవత్సరం ఎక్కువగా వాటర్ ట్యాంకర్లు వినియోగిస్తున్న నివాసితులను గుర్తించి ఆ ప్రాంతాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించి ట్యాంకర్ల వినియోగాన్ని తగ్గించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి సూచించారు. బంజారాహిల్స్‌లోని తట్టికాన వాటర్ సెక్షన్ రిజర్వాయర్‌ను ఆయన జలమండలి సీజీఎం ప్రభు, జీఎం హరిశంకర్‌తో కలిసి శనివారం పరిశీలించారు. ఈ ఎండాకాలంలో నీటి ట్యాంకర్ల వినియోగం మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ట్యాంకర్ల లభ్యతను పెంచుకోవాలని సూచించారు. ట్యాంకర్ బుక్ చేసుకున్న వినియోగదారులకు తక్కువ సమయంలో డెలివరీ చేసే విధంగా చూసుకోవాలన్నారు. తట్టికాన సెక్షన్‌లో 20 ట్యాంకర్లతో సుమారు 150 ట్రిప్పులు డెలివరి చేస్తున్నారు. ఇదే డిమాండ్ కొనసాగితే వేసవి నాటికి రోజుకు 400 ట్రిప్పులు అవసరం వస్తాయని ఫిల్లింగ్ పాయింట్స్ నిర్మాణ పద్ధతి వల్ల ఒక్కో ట్యాంకర్ నింపడానికి 15 నిమిషాల సమయం పడుతుందని, ఈ సమయాన్ని 5 నిమిషాలకు తగ్గించే విధంగా పలు మార్పులు చేయాలని సూచించారు. గతేడాది భూగర్భజలాలు అడుగంటడంతో ఫిబ్రవరి నెల నుంచే ట్యాంకర్లకు డిమాండ్ పెరగడం ప్రారంభమైందన్నారు. ఏప్రిల్ నెలలో డిమాండ్ తారాస్థాయికి పెరిగి లక్షా 70 వేల ట్యాంకర్లు డెలివరి చేసే పరిస్థితి వచ్చిందన్నారు. ఈసారి అలాంటి సమస్యలు రాకుండా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కమర్షియల్ విధానంలో ట్యాంకర్లు బుక్ చేసుకునే మాల్స్, హోటల్స్, హాస్టళ్లు, హాస్పిటల్స్ తదితర వాణిజ్య సముదాయాలతో అగ్రిమెంట్ చేసుకోవాలని సూచించారు.

గేమ్ ఛేంజర్ కాదు.. టంగ్ ఛేంజర్ సీఎం

మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపణ

బంజారాహిల్స్: అందరికీ సమానంగా ఉండాల్సిన నిబంధనలు నచ్చిన వారికి ఒకలా.. నచ్చని వారికి మరోలా ఉండకూడదని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో కల్పరా వీఎఫ్ఎక్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో చెప్పిన మాటకు కూడా విలువ లేకపోతే ఎలా ముఖ్యమంత్రి.. అని ప్రశ్నించారు. గేమ్ ఛేంజర్ సినిమాకు ముఖ్యమంత్రి రేవంత్ టంగ్ ఛేంజర్ అయ్యాడని దుయ్యబట్టారు. సీఎం అనాలోచిత నిర్ణయాల వల్లే ఇటీవల సంధ్య థియేటర్ తొక్కిసలాటలో ఓ మహిళ చనిపోయిందని ఆరోపించారు. చిత్ర పరిశ్రమ లక్షల మందికి ఉపాధి కల్పించే పరిశ్రమ అని, తెలుగు సినిమా హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో నిలబెట్టిందన్నారు. ఇలాంటి పరిశ్రమ పట్ల రేవంత్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడకూడదని హితవు పలికారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చిత్ర పరిశ్రమకు కేసీఆర్ ప్రోత్సాహాన్ని ఇచ్చి అద్భుతంగా అభివృద్ధి చెందేలా చేశారన్నారు. ఆర్ఆర్ఆర్ సినిమాకు ఆస్కార్ అవార్డు రావడం తెలుగు ప్రజలందరికీ గర్వకారణమన్నారు. తెలుగు ప్రజల గౌరవం ప్రపంచవ్యాప్తంగా పెరగాలని, మరిన్ని మంచి చిత్రాలు విజువల్ ఎఫెక్ట్స్‌లో రావాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగు చిత్ర పరిశ్రమ మరింత బలపడి ప్రపంచ స్థాయి గుర్తింపు పొందాలన్నారు. కల్పరా వీఎఫ్ఎక్స్ సీఈఓ మల్లీశ్వర్ సిద్దిపేటవాసి కావడం తనకెంతో గర్వకారణంగా ఉందని, ఐటీ కంపెనీని పెట్టి ఎంతోమంది యువతను ప్రోత్సహించారన్నారు. ఏఐ విజువల్ ఎఫెక్ట్స్ టెక్నాలజీ తెలుగు పరిశ్రమకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

పరిశోధనలతో దేశాభివృద్ధికి పాటుపడాలి



పీహెచ్‌డీ ప్రోగ్రామ్ ప్రారంభోత్సవంలో మాజీ సీఎస్ సమీర్ శర్మ, డాక్టర్ సి.రంగరాజన్

బంజారాహిల్స్: పబ్లిక్ పాలసీ పరిశోధనాత్మక అంశాలు సామాన్య ప్రజానీకానికి ఏ విధంగా ఉపయోగపడుతున్నాయనే అంశంపై పరిశోధనలు చేసి దేశ అభివృద్ధికి పాటుపడాలని వర్కింగ్ ప్రొఫెషన్స్‌కు రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్, ఇక్ఫాయ్ చాన్స్‌లర్ డాక్టర్ సి.రంగరాజన్ సూచించారు. ఇక్ఫాయ్ క్యాంపస్‌లో ఆయన శనివారం వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం డెవలప్‌మెంట్ స్టడీస్ అండ్ పబ్లిక్ పాలసీలో పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌ను ఆయన ఏపీ మాజీ చీఫ్ సెక్రటరీ డాక్టర్ సమీర్‌శర్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రంగరాజన్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా చాలా తక్కువ సంస్థలు మాత్రమే డొమైన్ పరిజ్ఞానాన్ని డేటా ఆధారిత విశ్లేషణాత్మక నైపుణ్యాలతో మిళితం చేశాయన్నారు. సమీర్ శర్మ మాట్లాడుతూ వర్కింగ్ ప్రొఫెషనల్స్ ఉత్సాహంగా పీహెచ్‌డీ పూర్తి చేసి ముందుకు సాగాలని, తాను సివిల్ సర్వెంట్‌గా ఉన్న సమయంలో పీహెచ్‌డీ స్కాలర్‌గా తన అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో ఇక్ఫాయ్ ఉపకులపతి గణేష్, ఇక్ఫాయ్ సోషల్ సైన్సెస్ డైరెక్టర్ సీఎన్.శైలజన్ తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ చికిత్సకు అత్యాధునిక ప్రొటాన్ బీమ్ థెరపీ

సాక్షి, సిటీబ్యూరో: కేన్సర్ చికిత్స కోసం కొత్తగా వందలాది పడకలతో పాటు అత్యాధునిక విప్లవాత్మక ప్రొటాన్ బీమ్ థెరపీని అందుబాటులోకి తెస్తున్నట్లు నగరానికి చెందిన ప్రముఖ ప్రైవేటు ఆస్పత్రి ఏఐజీ హాస్పిటల్స్ వెల్లడించింది. కేన్సర్ వ్యాధి చికిత్స సౌకర్యాల కోసం మొత్తం రూ.800 కోట్లను వెచ్చించనున్నట్లు, ఇందులో భాగంగా బెల్జియంకు చెందిన వైద్య పరికరాల సరఫరా సంస్థ ఐబీఏతో ఒప్పందం కుదుర్చుకున్నామని ప్రకటించింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న రేడియేషన్ థెరపీలలో అత్యంత అత్యాధునికమైన ఈ ప్రొటాన్ బీమ్ థెరపీని దక్షిణాసియాలోనే తొలిసారిగా దీన్ని అందుబాటులోకి తెస్తున్నట్లు తెలియజేసింది. ఈ సందర్భంగా ఆస్పత్రి చైర్మన్ డా.డి.నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తమ గచ్చిబౌలి ఆస్పత్రి ఆవరణలో కొత్తగా 300 పడకల ఆంకాలజీ సెంటర్ ఏర్పాటు, అదేవిధంగా అత్యాధునిక ప్రొటాన్ బీమ్ థెరపీ సిస్టమ్‌ను కూడా తేవడం ద్వారా ప్రపంచంలోనే అత్యుత్తమ కేన్సర్ చికిత్సను అందుబాటులోకి తెచ్చినట్లు అవుతుందన్నారు.



జేఎన్‌టీయూహెచ్ హాస్టల్‌లో వీసీ ఆకస్మిక తనిఖీలు



జేఎన్‌టీయూహెచ్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న వైస్ చాన్స్‌లర్ డా.వి.బాలకిష్టారెడ్డి

కేపీహెచ్‌బీకాలనీ: జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీలోని వసతి గృహాలను వైస్ చాన్సలర్ డా.వి.బాలకిష్టారెడ్డి, రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డా.జి.వి.నరసింహారెడ్డితో కలిసి శనివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. మంజీర, కిన్నెర, కృష్ణ, గౌతమి బాయ్స్ హాస్టల్స్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వసతి సౌకర్యాలు ఎలా ఉన్నాయంటూ ఆరా తీశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా భావించాలని సూచించారు. అనంతరం మెస్‌లోని వంటశాలలను పరిశీలించారు. అక్కడి సిబ్బందికి పరిశుభ్రత పాటించి నాణ్యమైన పదార్థాలను వంటల కోసం వినియోగించాలని సూచించారు. అనంతరం డైనింగ్ హాలులో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

విద్యార్థుల వినతి..

గౌతమి హాస్టల్ సెల్లార్‌ను వాహనాల పార్కింగ్ కోసం వినియోగించడానికి అనుమతించాలని విద్యార్థులు కోరగా వీసీ వెంటనే స్పందించారు. అక్కడే ఉన్న సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

హైకోర్టును రాజేంద్రనగర్‌కు మార్చడం సరికాదు

- హైకోర్టు పరిరక్షణ సమితి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ హైకోర్టును రాజేంద్రనగర్‌కు మార్చడం సరైంది కాదని హైకోర్టు పరిరక్షణ సమితి ప్రతినిధి మామిడి వేణుమాధవ్ అన్నారు. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన హైకోర్టును రాజేంద్రనగర్‌కు తరలించడం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హైకోర్టు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం శనివారం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన హైకోర్టు న్యాయవాది మామిడి వేణుమాధవ్ మాట్లాడుతూ.. హైకోర్టును మార్చడం వెనుక ఒక పెద్ద కుట్రకోణం ఉందన్నారు. 100 ఎకరాలు హైకోర్టుకు ఇచ్చినట్లు చేసి రాజేంద్రనగర్‌లో ఉన్న అగ్రికల్చర్ యూనివర్సిటీని ఎత్తివేసే ప్రయత్నం జరుగుతోందన్నారు. హైకోర్టును మలక్‌పేటలోని రేసు కోర్సు మైదానానికి మార్చాలని ఆయన కోరారు. మలక్‌పేట రేస్ కోర్సు 168 ఎకరాల విస్తీర్ణంలో ఉందని, అక్కడే నగరంలోని కింది కోర్టులన్నింటికీ ఆ స్థలం సరిపోతుందని చెప్పారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు లబ్ధి చేకూర్చే ప్రయత్నంలో భాగంగానే రాజేంద్రనగర్‌కు మార్చడం జరుగుతుందని అనుమానం వ్యక్తం చేశారు. దాన్ని హైకోర్టు పరిరక్షణ సమితి అడ్డుకుంటుందని తెలిపారు. బార్ కౌన్సిల్ సభ్యుడు ఫణీంద్రాభార్గవ్ మాట్లాడుతూ.. కొందరు స్వార్థపర న్యాయవాదుల వల్ల హైకోర్టు షిఫ్ట్ అవుతోందన్నారు. కార్పొరేటర్ సంస్థలకు ప్రయోజనం కల్పించే దిశగా రాజేంద్రనగర్‌కు తరలిస్తున్నారని విమర్శించారు. హైకోర్టు న్యాయవాదులు భానుమూర్తి, బర్ల మల్లేష్, రామకృష్ణ కులకర్ణీ, కటకం శారద, దొంతు లక్ష్మీనారాయణ, గంజి యాదగిరి, నర్సింగ్‌రావు, వెంకటేశ్వర ప్రసాద్, శివకుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మామిడి వేణుమాధవ్, ఇతర న్యాయవాదులు

'లేవండి.. మేల్కోండి.. గమ్యం చేరేవరకూ ఆగకండి..' ప్రపంచంలోని యువతకు స్వామి వివేకానంద ఇచ్చిన మహోన్నతమైన సందేశం ఇది. అనేక రకాల వైఫల్యాలు, వైకల్యాల నడుమ బందీ అయిన జీవితాన్ని సమున్నతమైన లక్ష్యం, ఆశయం దిశగా ముందుకు నడిపించేందుకు యువతకు ఆయన ఒకే ఒక ఆయుధాన్ని అందజేశాడు. అదే ధైర్యం.. సాహసం.. నిస్వార్థంగా.. నిర్భయంగా జీవించడం. భయపడకుండా బతకడమే దైవత్వమని చెప్పారు. తమను తాము తెలుసుకోవడం ద్వారా మాత్రమే ఆ దైవత్వాన్ని ఆవిష్కరించడం సాధ్యమవుతుంది.'గొర్రెల గుంపులో పెరిగితే సింహమైనా సరే తన సహజ లక్షణమైన ధీరత్వాన్ని కోల్పోతుంది. పిరికితనంతో బతుకుతుంది. తమ నిజస్వరూపాన్ని మరిచిపోతే యువత కూడా అలాగే భీరువులా బతకాల్సి వస్తుంది.' అని వివేకానంద చెప్పిన మాటలను నేడు ఆయన జయంతి సందర్భంగా గుర్తుచేసుకుంటూ..మరిన్ని విశేషాలు..

- సాక్షి, సిటీబ్యూరో

గమ్యం..

చేరే వరకూ..!



- ఆశయం దిశగా ముందుకు కదలు
- నేడు జాతీయ యువజన దినోత్సవం
- యువశక్తికి వివేకానందుని కీలక సందేశం
- నవ భారత నిర్మాణానికి యువశక్తి కీలకం
- విభిన్న రంగాల్లో సత్తా చాటుతున్న యువత
- స్వామి వివేకానంద 163వ జయంతి
- ట్యాంక్‌బండ్ నుంచి రామకృష్ణ మఠం వరకూ ప్రదర్శన



స్వామి వివేకానంద 163వ జయంతి సందర్భంగా ఈ నెల 12న దేశవ్యాప్తంగా యువజన దినోత్సవంగా పాటించనున్నారు. రామకృష్ణమఠంలో ప్రత్యేక వేడుకలు నిర్వహించనున్నారు. జాతి నిర్మాణంలో యువశక్తి ఎంతో కీలకమైందనే సందేశాన్నిస్తూ ట్యాంక్‌బండ్ నుంచి రామకృష్ణ మఠం వరకూ ప్రదర్శన నిర్వహించనున్నారు. అనంతరం జరిగే నేషనల్ యూత్ డే వేడుకల్లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పాల్గొనున్నారు. 'ఛేంజింగ్ యూత్ పవర్ ఫర్ నేషనల్ బిల్డింగ్' అనే ఇతివృత్తంతో ఈ ఏడాది యువజన ఉత్సవాలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం ఇది..

సృజన శక్తులన్నీ నీలోనే..

మనం బలహీనులం, అపవిత్రులం అని అనుకోవద్దు. ప్రతి ఒక్కరూ బలవంతులు, శక్తిసంపన్నులే. అనంతశక్తి మీలోనే దాగివుంది. జీవితంలోని ప్రతి సందర్భంలో ఆ శక్తిని ఎలా అభివ్యక్తం చేయాలో వివేకానందుడు ప్రబోధించాడు. 'మీ సత్య స్వరూపాన్ని మీరు తెలుసుకోండి' అన్నారు. నిద్రలో ఉన్న వ్యక్తి మేల్కొని స్వరూపజ్ఞానంతో కార్యాచరణ చేపట్టినప్పుడు గొప్ప శక్తి, తేజస్సు లభిస్తాయి. ఉత్కృష్టమైనదంతా అతన్ని వరిస్తుంది. ప్రతి ఒక్కరికీ వారి నిజస్వరూప జ్ఞానాన్ని తెలియజేయడమే ఔన్నత్యానికి మార్గం. పౌరుషాన్ని ప్రకటించడం అంటే దౌర్జన్యం, హింస వంటి వాటి కోసం శక్తియుక్తులను వినియోగించటం కాదు. సాధువర్తనం కలిగి ఉండడం. నిర్మాణాత్మకమైన, ఫలవంతమైన సర్వోశక్తి స్వభావాన్ని కొనసాగించడం, అదే మనం చూపవలసిన నిజమైన పరాక్రమమని వివేకానంద బోధించారు. యువత తమలోని సృజనశక్తులను ఆవిష్కరించేందుకు ఆ బోధనలు ఎంతో స్ఫూర్తినిస్తాయని రామకృష్ణమఠం అధ్యక్షులు స్వామి బోధమయానంద చెప్పారు.

'విశ్వ' భావన ఉండాలి..


ప్రతి ఒక్కరూ 'విశ్వవ్యాపిత భావన'ను కలిగి ఉండాలి. 'పరిమితమైన నేను' 'నేను ఫలానా', 'ఇది నాది' వంటి అనేక స్వార్థబంధాల వల్ల ఎంతో నష్టం జరుగుతుంది. ఈ 'పరిమిత నేను' నుండి విడివడి 'విశ్వవ్యాపిత నేను' అనే భావనతో తాదాత్మ్యం చెందితే ఎంతో అద్భుతంగా ఉంటుంది. ప్రతి మనిషి ఉన్నతమైన స్థానానికి చేరుకుంటాడు. ఇప్పుడు కావలసింది మనుషులు మాత్రమే అంటారు స్వామి వివేకానంద. బలవంతులు, చక్కటి నడవడిక కలిగినవాళ్లు, గొప్ప ఆత్మవిశ్వాసమున్న యువకులు కావాలని చెబుతారు. అలాంటివారు వంద మంది దొరికినా ప్రపంచం పూర్తిగా మారిపోతుందంటారు. అలాంటి యువత కావాలి ఇప్పుడు.



నేషనల్ యూత్ డే..

ఈ నెల 12న రామకృష్ణమఠంలోని వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్సీ సిల్వర్‌జూబ్లీ ఉత్సవాలతో పాటు, జాతీయ యువజన దినోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు జరుగనున్న ఈ కార్యక్రమంలో స్వామి బోధమయానంద 'ఛేంజింగ్ యూత్ ఫర్ నేషనల్ బిల్డింగ్' పై తమ సందేశాన్ని ఇవ్వనున్నారు. రాష్ట్ర మంత్రి డి.శ్రీధర్‌బాబుతో పాటు చెన్నైకి చెందిన తుగ్లక్ మేగజైన్ సంపాదకులు ఎస్.గురుమూర్తి, పలువురు ప్రముఖులు పాల్గొనున్నారు. ఈ సందర్భంగా 18 అడుగుల ఎత్తైన స్వామి వివేకానంద మ్యూరల్‌ను ఆవిష్కరించనున్నారు.








సహనమే సరైన లక్షణం..

శాస్త్ర సాంకేతిక విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందింది. దీంతో ఏదైనా సాధించగలమనే విశ్వాసం పెరిగింది. కానీ అతి ముఖ్యమైన అంశం మరొకటి ఉంది. అదే సహనం. ఎందుకంటే సాంకేతిక పరిజ్ఞానం వల్ల చుట్టూ ఉన్న పరిస్థితులు మారాయి. కానీ వ్యక్తిగత శక్తిసామర్థ్యాలు కాదు. అనుకున్నదే తడవుగా అన్నీ జరిగిపోవాలనుకుంటారు, కానీ ప్రతికూలత ఎదురు కాగానే కుదేలయిపోతున్నారు. ప్రతికూలత ఎదురైనపుడు సహనంతో, ఓర్పుతో దానిని ఎదుర్కొనే సామర్థ్యం అలవర్చుకోవాలి. బంగారాన్ని గీటురాయి పరీక్షిస్తుంది. అలాగే మనిషి మానసిక స్థైర్యాన్ని ప్రతికూలతలు పరీక్షిస్తాయి. అందుకే వేచివుండాల్సిన సమయంలో నిరాశ నిస్పృహలకు లోనవకుండా ఓర్పుతో నిరీక్షించటం ఎంతో అవసరం. 'అసహనం ప్రకటించటం వల్ల ఒనగూరే ప్రయోజనమేమీ లేదు. ఓర్పు వహించండి. విజయం తప్పక మిమ్మల్ని వరిస్తుంది' అని చెప్పిన వివేకానందుడి మాటలను గుర్తుంచుకోండి.

– స్వామి బోధమయానంద, రామకృష్ణమఠం అధ్యక్షులు

చిత్రమయిలో ప్రదర్శన

- ఆకట్టుకుంటున్న పెయింటింగ్స్
- 16 వరకూ సందర్శకులకు అందుబాటులో ఆనంద్ చిత్రాలు
- నేటితో ముగియనున్న రాజేశ్‌జవేరీ ప్రదర్శన





మాదాపూర్ : మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పలువురు కళాకారుల చిత్రాలతో రెండు ప్రదర్శనలను శనివారం ఏర్పాటు చేశారు. ఇందులో కళాకారుడు ఆనంద్ పనిగిరి వేసిన చిత్రాలను బుద్ధిస్ట్ సైట్ పేరిట ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో 70కి పైగా బుద్ధ చిత్రాలను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శన ఈనెల 16వ తేదీ వరకూ కొనసాగనుందని నిర్వాహకులు తెలిపారు.

రాజేశ్‌జవేరీ చిత్రాలు..

మరో కళాకారుడు రాజేశ్‌జవేరీ వేసిన చిత్రాల్లో 25 పేయింటింగ్‌లను ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. ఈ ప్రదర్శన నేటితో ముగియనుంది. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకూ అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

స్వీట్ ఫెస్ట్..

సనత్‌నగర్ : దేశంలోని విభిన్న రాష్ట్రాల సంప్రదాయ స్వీట్స్ ఒకే చోట కొలువుదీరాయి. సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని పండుగ వేళ చేసుకునే ఆయా రాష్ట్రాల తీపి వంటకాలను బేగంపేట టూరిజం ప్లాజా హోటల్‌లో ప్రదర్శించారు. పశ్చిమ బెంగాల్ ముంగ్ దాలర్ భజ పులిపిత్తి, పాటి సప్తజ్, రాజస్థాన్ కటలి, ఆగ్రా పేతా, మహరాష్ట్ర పురాన్‌పోలి, ఆంధ్రప్రదేశ్ అరిసెలు, బీహార్ అమ్లా కా హల్వా, అట్టాకా ఖజుర్.. ఒడిస్సా బక్రి చట్నీ, ఉత్తరఖండ్ శ్రీఖండ్, అమర్‌ఖండ్, కేరళ ఆవల్ విలయిచతు, మనోహరం.. ఇలా ఒక్కో రాష్ట్రంలోని రకరకాల తీపి వంటకాలను ఆయా ప్రాంత మహిళలు తయారుచేసి ఇక్కడ ప్రదర్శించారు. ఈ నెల 13 నుంచి 15 వరకూ సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే స్వీట్ ఫెస్టివల్ సన్నాహక కార్యక్రమంలో భాగంగా ఆయా రకాల స్వీట్స్‌ను ప్రదర్శించి సందర్శకులకు రుచి చూపించారు. ఈ వంటకాల స్టాల్స్‌ను పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సందర్శించి రుచిచూశారు. ఆయనతో పాటు పర్యాటక, సాంస్కృతిక శాఖ సెక్రటరీ స్మితసబర్వాల్ ఉన్నారు.







భాగ్యనగరి.. సంగీత ఝురి!

మే 26 నుంచి జూన్ 1 వరకూ కార్యక్రమం

బంజారాహిల్స్: జాతీయ, అంతర్జాతీయ ప్రఖ్యాత సంగీత కళాకారుల ప్రదర్శనకు ఆతిథ్యం ఇవ్వనున్నది. దేశ, విదేశాల నుంచి 250 మంది కళాకారులు ఈ వేదికపై తమ సంగీత పాటవాన్ని ప్రదర్శించనున్నారు. నగరవాసులను అలరించేందుకు 'స్పిక్ మెకే' ఆధ్వర్యంలో పదో ఇంటర్నేషనల్ కన్వెన్షన్–2025 పేరుతో మే 26 నుంచి జూన్ 1వ తేదీ వరకూ ఐఐటీ హైదరాబాద్‌లో జరగనున్నది. ఇందుకు సంబంధించిన సన్నాహక కార్యక్రమం బంజారాహిల్స్‌లోని సప్తపర్ణి సాంస్కృతిక కళా కేంద్రంలో శనివారం నిర్వహించారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ కిరణ్ సేత్ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి సదస్సుపై మాట్లాడారు. భారతీయ సంస్కృతి, కళలు నేటి తరం పిల్లలకు తప్పనిసరిగా తెలియాలనే ఉద్దేశంతో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ, అహ్మదాబాద్ నుంచి గౌహతి వరకూ 14,000 కిలో మీటర్లు సైకిల్ యాత్ర చేసి దారిలో విద్యార్థులకు ఈ కళాకారుల గురించి పరిచయం చేస్తూ సదస్సుపై అవగాహన కలిగించారు. హైదరాబాద్‌లో మొట్టమొదటిసారి ప్రఖ్యాత సంగీత, సాహిత్య కళాకారులతో ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. భారతీయ కళాకారుల్లో ఈ కార్యక్రమానికి హాజరవుతున్న వారంతా పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ, వంటి సంగీత, సాహిత్య నాటక అకాడమీ పురస్కార గ్రహీతలు కావడం గమనార్హం. అన్ని రాష్ట్రాల కళలూ అందరికీ తెలియాలన్నదే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశ్యం. ఈ సదస్సులో క్రాఫ్ట్స్, క్లాసికల్ అండ్ ఫోక్, ఇన్‌టెన్సివ్, గుర్బానీ, ఖవ్వాలీ, క్లాసికల్ థియేటర్, వర్క్‌షాప్‌లు, టాక్‌షోలు, హెరిటేజ్ వాక్‌లు, నేచర్ వాక్‌లు నిర్వహించనున్నారు. యోగా మరో ఆకర్షణగా నిలువనున్నది. పిల్లల్లో మానసిక పరివర్తన కళల ద్వారానే సాధ్యపడుతుందని, ఏకాగ్రత కూడా పెరిగి మానసిక ప్రశాంతత లభిస్తుందని డాక్టర్ కిరణ్ సేత్ వెల్లడించారు.



రాజా రాధారెడ్డి

హాజరయ్యే కళాకారులు..

పండిట్ హరిప్రసాద్ చౌరాసియా, రాజా రాధా రెడ్డి, బేగం పర్వీన్ సుల్తానా, డాక్టర్ ఎన్.రాజం, పండిట్ విశ్వమోహన్ భట్, షేక్ మహబూబ్ సుభాని అండ్ ఖలీషాబీ మహబూబ్, గుల్జార్, జావేద్ అక్తర్ అండ్ షబాన అజ్మీ, అశ్విని బిడే దేశ్ పాండే, ఉస్తాద్ షాహిద్ ఫర్వేజ్‌ఖాన్, పండిట్ ఉల్హాస్ కషాల్కర్, విదూషి ఏ కన్యాకుమారి, పండిట్ వెంకటేష్‌కుమార్, ఉస్తాద్ బహుద్దీన్ దాగర్, ఉస్తాద్ వసీఫుద్దీన్ దాగర్, ప్రహ్లోద్‌సింగ్ తిప్పానియా, విద్వాన్ జీజేఆర్ కృష్ణన్ అండ్ లాల్‌గుడి విజయలక్ష్మి, విద్వాన్ టీఎం కృష్ణన్, విద్వాన్ కపిల వేణు, గుస్సాడీ, దేబాసిస్ రియాంగ్–హోజాగిరి, పురూలియా చౌ, భాయ్ గురుదేవ్‌సింగ్, శ్రీ రోమేంద్రసింగ్, వార్సి బ్రదర్స్.

హెచ్‌సీయూ నీడలో.. పక్షుల జాడ..



- 50 ఏళ్లలో 233 రకాల పక్షి జాతులు
- పది రోజుల్లో 21 రకాల అరుదైన జాతుల గుర్తింపు

రాయదుర్గం: పక్షుల కిలకిలా రావాలు నగరంలో అత్యధికంగా అగుపిస్తున్న వాటిలో ఒకటి గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ అని చెప్పకతప్పదు. క్యాంపస్‌లోని విద్యార్థులు, ఫ్యాకల్టీ, అధికారులు పక్షి ప్రేమికులు కావడంతో అవి స్వేచ్ఛగా ఇక్కడ స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నాయి. అరుదైన పక్షి జాతులు అగుపిస్తుండడమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. క్యాంపస్‌లో 50 ఏళ్లుగా గ్రీనరీ పెంచుతూ జీవ వైవిధ్యాన్ని కాపాడడంతోనే రకరకాల పక్షులకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. పక్షి జాతులపై అధ్యయనాలు చేసేవారు వీటిని గుర్తిస్తున్నారు. ఎప్పటికప్పుడు అందించే లెక్కల ప్రకారం 50 ఏళ్ల కాలంలో అరుదైన 233 రకాల పక్షి జాతులను గుర్తించినట్లు రికార్డుల్లో నమోదు చేశారు.



ఇటీవల గుర్తించిన పక్షులు..

వైట్‌బ్రౌడ్ బుల్‌బుల్– 10, బ్రాంజ్ వింగ్డ్ జకానా– 5, గ్రేహెడెడ్ శ్వాంఫెన్–5, ఇండియన్ పీఫోల్, బ్లాక్ డ్రోంగో, ఎల్లో బిల్డ్‌బాబ్లర్–2, మిగతా వాటిలో టికెల్స్ బ్లూ ఫ్లై క్యాచర్, బాయావీవర్, నార్తన్ షోవ్లర్, వైట్ బ్రెస్టెడ్ వాటర్‌హెన్, ఇండియన్ కార్మొరాంట్, ఈస్ట్రన్ క్యాటిల్ ఈగ్రెట్, ఏషియన్ గ్రీన్ బీ ఈటర్, శిక్రా వంటి వాటితోపాటు మొత్తం 15 రకాలు ఒక్కొక్కటి చొప్పున హెచ్‌సీయూ క్యాంపస్‌లో గుర్తించినట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. 2024లో 131 రకాల పక్షులను క్యాంపస్‌లో గుర్తించగా, 2023లో మూడింటిని, 2022లో 27 రకాల పక్షులను గుర్తించారు. ఇలా ఏటా కొత్త వాటిని గుర్తిస్తూ వస్తున్నారు.

పక్షి ప్రేమికుల సందడి..



క్యాంపస్‌లో గ్రీనరీ జీవవైవిధ్యానికి అద్దం పడుతోంది. దీంతో పక్షి ప్రేమికులేకాకుండా ఇక్కడి విద్యార్థులు సైతం అరుదైన పక్షి జాతులను తమ కెమెరాల్లో బంధించడం హాబీగా మార్చుకున్నారు. దీంతో ఇటీవల కాలంలో పది రోజుల్లోనే దాదాపు అనే పక్షి జాతులను హెచ్‌సీయూలో గుర్తించారు. ముఖ్యంగా 2025 జనవరి పదో తేదీ వరకూ హెచ్‌సీయూ క్యాంపస్‌లో పక్షి ప్రేమికులు, నిష్ణాతులు 21 రకాల పక్షులు ఉన్నట్లు గుర్తించారు.

డ్రోన్ ఓడింది.. కోడి గెలిచింది!

కోడి పందేలను అడ్డుకుని తీరుతామన్న పోలీసులు
ఈసారి డ్రోన్లను రంగంలోకి దించిన వైనం

- బరుల గుర్తింపు.. నిర్వాహకుల ఏర్పాట్లపై నిఘా
- మూడు రోజులుగా కోళ్లకు కత్తులు కట్టేవారి బైండోవర్
- తీరా వారి ఆంక్షలను కాదని జోరుగా కోడి పందేల ఏర్పాట్లు
- అధికార పార్టీ నేతల ఆశీస్సులతో రంగంలోకి దిగిన నిర్వాహకులు
- ఉమ్మడి గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో బరులు సిద్ధం
- పొరుగు రాష్ట్రాల నుంచి తరలివస్తున్న పందేల రాయుళ్లు
- ఈ మూడు రోజులు ఎక్కడి పోలీసులక్కడే గప్‌చుప్!



సాక్షి, అమరావతి : టెక్నాలజీతో పేరుతో హడావుడి చేయడంలో రాష్ట్ర పోలీసులు ముఖ్యమంత్రి చంద్రబాబును మించిపోయారు. చంద్రబాబు మాట్లాడితే డ్రోన్ల ప్రస్తావన చేస్తుంటారు. ఆయన కంటే తామేమి తక్కువ తినలేదన్నట్టుగా పోలీసులు ఈసారి కోడి పందాల కట్టడికి డ్రోన్లను రంగంలోకి దించారు. ప్రతి యేటా సంక్రాంతికి ముందు కోడి పందాల కట్టడి పేరుతో పోలీసులు హడావుడి చేయడం తెలిసిందే. ఇందులో భాగంగా ఈ ఏడాది సంక్రాంతి కోడి పందేలను అడ్డుకుంటామని విజయవాడ పోలీస్ కమిషనరేట్‌తోపాటు ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలోని పోలీసులు డ్రోన్లను ఎగుర వేశారు. బరుల గుర్తింపు, వాటి వద్ద నిర్వాహకుల ఏర్పాట్లను వాటితో చిత్రీకరించారు. పలు ప్రాంతాల్లో కోళ్లకు కత్తులు కట్టే వారిని, నిర్వాహకులను అదుపులోకి తీసుకుని బైండోవర్ చేశారు. కోడి పందేలు చట్ట రీత్యా నేరం అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతోపాటు మైక్ ప్రచారాన్ని నిర్వహించారు. రెండు రోజులుగా కొన్ని చోట్ల కోడి పందేల బరులను ట్రాక్టర్లతో దున్నించి ధ్వంసం చేశారు. ఇంతా చేసి చివరకు చేతులెత్తేయాల్సిన పరిస్థితి నెలకొంది. శనివారం సాయంత్రం నుంచి ఆయా ప్రాంతాల్లో బరులు సిద్ధమైపోతుండటం గమనార్హం.

సీన్ కట్ చేస్తే..

కోడి పందేల నిర్వాహకులు పోలీసుల ఎత్తుకు పై ఎత్తు వేస్తూ అధికార పార్టీ నేతలను రంగంలోకి దించి వారి ఆశీస్సులతో ఏర్పాట్లు పూర్తి చేశారు. చిన్నపాటి బరుల నుంచి భారీ బరుల వరకు వందల సంఖ్యలో సిద్ధం చేశారు. భోగి రోజునే పందేలు మొదలుపెట్టి మూడు రోజులపాటు అడ్డు అదుపు లేకుండా నిర్వహించుకునేలా ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రధానంగా కోడి పందేలకు బ్రాండ్‌గా నిలిచిన భీమవరం, ఐభీమవరం, వెంప, ఏలూరు, అమలాపురం, కోనసీమ కొబ్బరి తోటల్లో భారీ బరులు సిద్ధం చేశారు. ఒక్కొక్క బరిని రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల ఖర్చుతో తీర్చిదిద్దారు. బరుల్లో భారీ స్క్రీన్‌లు, ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయగా, బరులకు ఆనుకుని మద్యం బెల్ట్ షాపులు, గుండాట, పేకాట నిర్వహించుకునే ఏర్పాట్లతోపాటు కూల్ డ్రింక్స్, బిర్యానీ, కోడి పకోడి స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. కోడి పందేలను చూసేందుకు, బెట్టింగ్‌లు వేసేందుకు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి పందేల రాయుళ్లు ఈ ప్రాంతాలకు తరలి వస్తున్నారు. వారి కోసం భీమవరం తదితర పట్టణాల్లో మూడు నెలల ముందు నుంచే లాడ్జీలు, హోటళ్లు బుక్ చేశారు. పలు ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు గెస్ట్‌హౌస్‌లకు తోడు చేపల చెరువుల వద్ద మకాంలను కూడా సిద్ధం చేశారు. ఇప్పటి దాకా ఇంత చేసిన పోలీసులు ఆ మూడు రోజులు మాత్రం గప్‌చిప్ అని నిర్వాహకులు బాహాటంగా చెబుతున్నారు.

నిషేధాన్ని కఠినంగా అమలు చేయండి



చైనా మాంజాపై సర్కార్‌కు హైకోర్టు ఆదేశం

- పక్షులు, ప్రజల భద్రతకు చర్యలు చేపట్టండి
- సంక్రాంతి నేపథ్యంలో ఈ చర్యలు తప్పనిసరి
- 'మాంజా'పై పిటిషన్‌లో జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ఉత్తర్వులు
- తదుపరి విచారణ ఈ నెల 31కి వాయిదా

సాక్షి, హైదరాబాద్: పక్షులు, ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన చైనా మాంజాపై నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. సంక్రాంతి నేపథ్యంలో వెంటనే చర్యలు చేపట్టాలని స్పష్టం చేసింది. 2017లో జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్‌జీటీ) ఇచ్చిన ఉత్తర్వులను పాటించాలని చెప్పింది. అంతేకాదు, కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సీపీసీబీ) ఆదేశాలను కూడా అమలు చేయాలని పేర్కొంది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ, తదుపరి విచారణ ఈ నెల 31కి వాయిదా వేసింది. చైనా మాంజా వినియోగంపై 2017లో ఎన్‌జీటీ ఇచ్చిన ఉత్తర్వులు పాటించేలా పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీని ఆదేశించాలని కోరుతూ హైదరాబాద్ కాచిగూడకు చెందిన సంజయ్ నారాయణ్ పంజరి హైకోర్టులో లంచ్‌మోషన్ రూపంలో పిటిషన్ దాఖలు చేశారు. సింథటిక్ నైలాన్ దారానికి గ్లాస్ పౌడర్ లేదా మెటల్ వంటి రాపిడి పదార్థాలతో కోటింగ్ వేసి మాంజా తయారు చేస్తున్నారు.. ఇది వన్యప్రాణుల, ప్రజాభద్రతతో పాటు పర్యావరణానికి పెనుముప్పుగా మారిందని పేర్కొన్నారు. ఇప్పటికే అనేక ప్రమాదాలు జరిగాయని చెప్పారు. ఎన్‌జీటీ నిషేధం విధించినా సంక్రాంతి పండుగ సందర్భంగా విరివిగా మార్కెట్‌లో విక్రయం చేస్తున్నారని వెల్లడించారు. విక్రయాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ న్యాయవాది శ్రీరమ్య వాదనలు వినిపిస్తూ.. 'సంక్రాంతిని దేశవ్యాప్తంగా విస్తృతంగా జరుపుకుంటారు. గాలిపటాలను ఎగురవేయడం పండుగలో అంతర్భాగంగా వస్తోంది. కాటన్ దారాలతో గాలిపటాలను ఎగురవేసే సంప్రదాయం ఉండేది. పోటీ పెరగడంతో కాలక్రమేణా సింథటిక్, గాజు పూతతో కూడిన మాంజాలు విస్తృతంగా వినియోగిస్తున్నారు. స్తంభాలు, చెట్లతోపాటు పలుచోట్ల చిక్కుకున్న మాంజా గాలిలో వేలాడుతూ ఉండటం పక్షులు, మనుషుల మరణాలకు దారితీస్తోంది. మాంజాతో మనుషులు తీవ్రంగా గాయపడిన, చనిపోయిన సంఘటనలున్నాయి. బీఎన్ఎస్ సెక్షన్ 223 ప్రకారం చైనీస్ మాంజా వాడితే రూ.5 వేల జరిమానా కూడా విధించవచ్చు'అని పేర్కొన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఎన్‌జీటీ ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేశారు.



మాంజాపై 2017లోనే నిషేధం
సాక్షి ఫ్లస్ (ఈ- పేపర్)లో

రెండో విడత వైకుంఠ ద్వార దర్శన టోకెన్లు జారీ

తిరుపతిలో మూడు కేంద్రాల్లోనే పంపిణీ



సాక్షి ప్రతినిధి, తిరుపతి: తిరుమల ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాల కోసం నుంచి రెండో విడత టోకెన్లను టీటీడీ జారీ చేస్తోంది. ఈనెల 10న వైకుంఠ ఏకాదశి నుంచి 19 వరకు తిరుమల ఆలయంలో వైకుంఠ ద్వారం తెరిచి ఉంచుతారు. ఈ నేపథ్యంలో 10-12 వ తేదీ వరకు దర్శనాలకు వెళ్లేవారి కోసం బుధవారం తిరుపతిలోని 8 కేంద్రాల్లో భక్తులకు టోకెన్లు జారీ చేశారు. తిరిగి 13-19వ తేదీ వరకు దర్శనాలకు వెళ్లే వారికి దర్శనానికి వెళ్లే ముందు రోజు తిరుపతిలో టోకెన్లు జారీ చేస్తామని టీటీడీ ముందుగా ప్రకటించింది. ఆ మేరకు తిరుపతిలో కేవలం 3 కేంద్రాలు (తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణునివాసం, భూదేవి కాంప్లెక్స్)ల్లో ఏర్పాట్లు చేసింది. అయితే 13న దర్శనానికి వెళ్లే భక్తులు శనివారం రాత్రే తిరుపతిలోని కేంద్రాలకు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో రాత్రి 9 గంటల నుంచే టోకెన్లు జారీ చేయడం ప్రారంభించారు. ఈ కేంద్రాల్లో 18వ తేదీ వరకు టోకెన్లు జారీ చేస్తారు.




శనివారం కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా

సాగర్‌కు 'బొల్లపల్లి' గండి!

నాగార్జున సాగర్ ప్రాజెక్టు కుడికాల్వ ద్వారా వరద జలాల తరలింపుపై ఏపీ ప్రతిపాదన

- 150 టీఎంసీలతో బొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణం
- గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు కింద తెరపైకి తెచ్చిన ఏపీ
- కేంద్రానికి ఏపీ ప్రతిపాదనలు చేరడంతో అప్రమత్తమైన తెలంగాణ
- భవిష్యత్‌లో రెగ్యులేటర్, కాల్వ సామర్థ్యం పెంచేస్తారనే ఆందోళన
- కృష్ణా, గోదావరి బోర్డులు, ఏపీ సీఎస్‌కు లేఖ రాయాలని ఆదేశం
- ప్రాజెక్టు వివరాలను అందించాలని గోదావరి బోర్డును కోరిన తెలంగాణ



సాక్షి, హైదరాబాద్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి వరద జలాలను కుడికాల్వ ద్వారా తరలించి గుంటూరు జిల్లాలో నిర్మించబోయే బొల్లపల్లి రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తామని తాజాగా ఏపీ ప్రతిపాదించింది. ఇందుకోసం కుడికాల్వ(జవహర్ కాల్వ)ను 96.5 కి.మీ.ల వరకు వెడల్పు పెంచి అక్కడి నుంచి వరద జలాలను లిఫ్ట్ చేస్తామని ఏపీ చెప్పడంతో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. తక్షణమే తమ వ్యతిరేకతను తెలపడంతోపాటు ఈ ప్రాజెక్టు చేపట్టే ఆలోచనను విరమించుకోవాలని కోరుతూ ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, గోదావరి, కృష్ణా బోర్డులకు తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శి లేఖలు రాయనున్నారు. మరోవైపు ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలను అందజేయాలని గోదావరి బోర్డుకు ఇప్పటికే ప్రభుత్వం లేఖ రాసింది.

కుడికాల్వ హెడ్ రెగ్యులేటర్ ద్వారా తరలింపు

నాగార్జునసాగర్ కుడికాల్వ కింద ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో 11.18 లక్షల ఎకరాలు, ఎడమ కాల్వ కింద ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లో 10.39 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. కుడికాల్వ హెడ్ రెగ్యులేటర్‌కు 9 స్లూయిస్ గేట్లు ఉండగా, గేట్లన్నింటినీ 520 అడుగుల మేర పైకి లేపితే గరిష్ఠంగా 33,147 క్యూసెక్కుల నీటిని విడుదల చేసుకోవచ్చు. ప్రస్తుతం కుడి కాల్వ సామర్థ్యం 11 వేల క్యూసెక్కులు మాత్రమే ఉంది. హెడ్‌రెగ్యులేటర్ సామర్థ్యం పెంచకుండానే కుడికాల్వ సామర్థ్యాన్ని 33 వేల క్యూసెక్కులకు పెంచుకున్నా, 11 వేల క్యూసెక్కులను యథాతథంగా ఆయకట్టుకు సరఫరా చేసి మిగిలిన 22 వేల క్యూసెక్కులను బొల్లపల్లి రిజర్వాయర్‌కు తరలించవచ్చని ఏపీ ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. 2019 నుంచి 2024 వరకు గడిచిన ఆరేళ్లలో ఏకంగా ఐదేళ్లు కృష్ణానదిలో మిగులు జలాల లభ్యత ఉందని, ప్రకాశం బరాజ్ నుంచి సముద్రంలోకి నీరు వృథాగా పోయిందని కేంద్రానికి తెలిపింది. పోలవరం ప్రాజెక్టు నుంచి బొల్లపల్లి రిజర్వాయర్‌కు నీటి తరలింపుతో పోల్చితే నాగార్జునసాగర్ నుంచి తరలిస్తేనే తక్కువ వ్యయం అవుతుందని స్పష్టం చేసింది. నీటి లభ్యత బాగా ఉన్న సమయాల్లో సాగర్ నుంచి (తమ వాటా) జలాలను తరలించి బొల్లపల్లి రిజర్వాయర్‌లో నిల్వ చేసుకుంటే వర్షాభావ సీజన్లలో క్యారీ ఓవర్ జలాలుగా వాడుకోగలమని తెలిపింది. కృష్ణా, గోదావరి పరీవాహకంలో చిట్టచివరి రాష్ట్రం కావడంతో తమకు రెండింటి మిగులు జలాలను వాడుకునే హక్కు ఉందని స్పష్టం చేసింది. రెండు నదుల మిగులు జలాలను నిల్వ చేసే సామర్థ్యం ఈ ప్రాజెక్టుకు ఉంటుందని తెలియజేసింది.

నికర జలాల తరలింపునకే!

వరదల సమయంలో నాగార్జునసాగర్ నుంచి మిగులు జలాలను బొల్లపల్లి రిజర్వాయర్‌కు తరలించడానికి మాత్రమే ఈ ప్రాజెక్టును ప్రతిపాదించినట్టు ఏపీ పేర్కొంటున్నా, నికర జలాలను సైతం తరలించుకుంటుందని తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. భవిష్యత్‌లో సాగర్ కుడికాల్వ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పెంచుకునే ప్రయత్నాలు జరగొచ్చని ఆందోళన వ్యక్తం చేస్తోంది. నాగార్జునసాగర్ నిర్వహణ తెలంగాణ పరిధిలో ఉండగా, ఏడాది కింద ఏపీ సగం ప్రాజెక్టును తన అధీనంలోకి తీసుకోవడంతో రెండు రాష్ట్రాల మధ్య వివాదం నడుస్తోంది. గోదావరి-కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టులో భాగంగా సాగర్‌ను బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా వాడుకుంటామని కేంద్రం ప్రతిపాదించగా, తెలంగాణ తీవ్రంగా వ్యతిరేకించింది. మళ్లీ తాజాగా సాగర్‌ను బొల్లపల్లి రిజర్వాయర్‌తో అనుసంధానం చేయాలని ఏపీ ప్రతిపాదించడంతో భవిష్యత్‌లో సాగర్ కింద ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లోని 8.1 లక్షల ఎకరాల ఆయకట్టు ప్రమాదంలో పడుతుందని రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారవర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

కృష్ణా, గోదావరి నుంచి ఏకకాలంలో తరలింపు

గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును మూడు విభాగాల్లో (సెగ్మెంట్స్) విభజించి ఏపీ ప్రతిపాదించింది. తొలి విభాగం కింద పోలవరం ప్రాజెక్టు కుడి ప్రధాన కాల్వ సామర్థ్యాన్ని 17,500 నుంచి 38,000 క్యూసెక్కులకు, తాడిపూడి ఎత్తిపోతల పథకం కాల్వ సామర్థ్యాన్ని 1,400 నుంచి 10,000 క్యూసెక్కులకు పెంచనుంది. అనంతరం పోలవరం ప్రాజెక్టు నుంచి ఈ రెండు కాల్వల ద్వారా నీటిని సమాంతరంగా తరలించి బుడమేరు డైవర్షన్ కెనాల్‌లోకి వేసి అక్కడి నుంచి కృష్ణా నదిలోకి విడుదల చేస్తామని ఏపీ తెలిపింది. రెండో సెగ్మెంట్ కింద కృష్ణానది నుంచి 28,000 క్యూసెక్కులను ఆరు దశల్లో మొత్తం 127 మీటర్లు లిఫ్ట్ చేసి బొల్లపల్లి రిజర్వాయర్‌కు తరలించనుంది. ఇందుకోసం 150 టీఎంసీల భారీ సామర్థ్యంతో బొల్లపల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని ఏపీ ప్రతిపాదించింది. భవిష్యత్ అవసరాలను తీర్చడానికి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 400 టీఎంసీలకు పెంచే వీలుందని తెలిపింది. ఈ ప్రాజెక్టుకు అనుబంధంగా నాగార్జునసాగర్ కుడికాల్వ నుంచి బొల్లపల్లి రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తామని మరో లింక్‌ను ప్రతిపాదించింది. ఇక మూడో సెగ్మెంట్ కింద బొల్లపల్లి రిజర్వాయర్ నుంచి 3 దశల్లో లిఫ్ట్ చేసి బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు తరలిస్తామని పేర్కొంది.

ప్రాజెక్టు వ్యయం రూ.80 వేల కోట్లు

రోజుకు 2 టీఎంసీల చొప్పున 100 రోజుల్లో 200 టీఎంసీలను తరలించడానికి ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టు నిర్మాణానికి 40,500 ఎకరాల భూసేకరణ, 17,000 ఎకరాల అటవీ భూములు కావాలి. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.80,112 కోట్లు కాగా, లిఫ్టుల నిర్వహణకు 4,125 మెగావాట్ల విద్యుత్ అవసరం అవుతుంది.

ప్రాణాలు తీసిన సరదా!



ధనుష్ | లోహిత్ | సాహిల్ | దినేశ్వర్ (ఫైల్)

▶ మొదటి పేజీ తరువాయి



జతిన్ (ఫైల్)

నీళ్లలో పడి మునిగిపోయారు. భయకంపితులైన మృగాంక్, ఇబ్రహీంలు గట్టిగా కేకలు వేస్తూ కట్టపైకి పరుగులు తీశారు. 100 నంబర్‌కు డయల్ చేసి విషయాన్ని పోలీసులకు తెలిపారు. దీంతో ములుగు, మర్కూక్ పోలీసులు వెంటనే స్పందించారు. గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి, సిద్దిపేట సీపీ అనురాధ సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. అదే సమయంలో ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఫోన్ రావడంతో మరింత అప్రమత్తమై గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. రెస్క్యూ టీమ్‌ను, గజ ఈతగాళ్లను రప్పించి డ్రోన్‌ల సాయంతో మృతదేహాలను గుర్తించి వెలికితీసే ప్రక్రియను చేపట్టారు. మధ్యాహ్నం నుంచి రాత్రి 7 గంటల వరకు శ్రమించి నీటిలో 30 అడుగుల లోతులో మునిగిన ఐదు మృతదేహాలను వెలికితీశారు. లోహిత్, దినేశ్వర్, జతిన్‌లు మీర్‌పేటలోని టీకేఆర్ కళాశాలలో డిప్లొమా చేస్తున్నారు. సాహిల్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుండగా, ధనుష్ ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. ఘటనా స్థలానికి డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి చేరుకొని మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు.

తండ్రి జన్మదినం రోజే కొడుకు మృతి

కొండపోచమ్మ సాగర్‌లో మునిగి చనిపోయిన చీకట్ల దినేశ్వర్ (17) తండ్రి కిషన్‌దాస్ జన్మదినం శనివారమే. తన పుట్టినరోజు నాడే కుమారుడు చనిపోవటంతో ఆ తండ్రి బాధ వర్ణనాతీతంగా ఉంది. మరోవైపు చేతికంది వచ్చిన ఇద్దరు కొడుకులూ ఒకేసారి చనిపోవటంతో ధనుష్, లోహిత్‌ల తల్లిదండ్రుల రోదనలు ఆపటం ఎవరితరం కాలేదు.

'తండ్రి లేని బిడ్డ.. చదివిస్తే బాగుపడతాడని అనుకుంటే ప్రాణాలు పోగొట్టుకుండు..అంటూ సాహిల్ తల్లి అనిత గుండెలవిసేలా రోదించింది. అత్తాపూర్ ముష్క్ మహల్ ప్రాంతానికి చెందిన సాహిల్ దీపక్ సుతార్ (18) చిన్నతనంలోనే అతడి తండ్రి మృతి చెందాడు. తల్లి అనిత స్థానికంగా చిన్నచిన్న పనులు చేస్తూ జీవిస్తోంది. అనిత ఇద్దరు కొడుకుల్లో పెద్ద కుమారుడు డిగ్రీ చదువుతుండగా, సాహిల్ ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. కుమారుడి మృతితో ఆమె తల్లడిల్లిపోయింది.

సీఎం రేవంత్ విచారం

కొండపోచమ్మ సాగర్ ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. యువకులు గల్లంతైన విషయం తెలియగానే గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలకు ఆయన ఆదేశించారు. అనంతరం యువకుల మరణవార్త తెలుసుకొని దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

కేసీఆర్ దిగ్భ్రాంతి

కొండపోచమ్మ సాగర్ జలాశయంలో నీట మునిగి ఐదుగురు యువకులు మరణించడం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈత రాకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోవడం విచారకరమని తన సంతాపాన్ని వ్యక్తంచేశారు. మరణించిన యువకుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలన్నారు.

యువకుల మృతి కలచి వేసింది: హరీశ్‌రావు

కొండపోచమ్మ సాగర్‌లో యువకుల మృతి తనను కలచివేసిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఎంతో భవిష్యత్తు ఉన్న యువకులు అకాల మరణం చెందటం మనస్సును కలిచి వేసిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మృతుల కుటుంబాలకు రూ.15 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



మృతదేహాలను బయటకు తీస్తున్న దృశ్యం

కొలువులిస్తే రాయితీ!

పాలసీని ఆవిష్కరించిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: గ్రీన్ ఎనర్జీ రంగంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి.. స్థానిక యువతకు ఉద్యోగాలిచ్చే సంస్థలకు భారీగా రాయితీలు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. సౌర, పవన, డిస్ట్రిబ్యూటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ, ఎనర్జీ స్టోరేజీ ప్రాజెక్టులు, జియోథర్మల్, గ్రీన్ హైడ్రోజన్, హైబ్రిడ్ వంటి పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల ఏర్పాటును ప్రోత్సహించే లక్ష్యంతో రూపొందించిన 'తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025'ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈ ప్రాజెక్టులకు సంబంధించిన పరికరాలు, యంత్రాల తయారీ పరిశ్రమలను ఏర్పాటు చేసి రెండేళ్లలో 50 మంది తెలంగాణ స్థానికులకు ఉద్యోగాలిస్తే రూ.5 లక్షల మొత్తాన్ని రిక్రూట్‌మెంట్ సహాయంగా అందజేయనున్నట్టు ప్రకటించింది. ఈ పాలసీని అమల్లోకి తెస్తూ ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా శనివారమే ఉత్తర్వులు జారీ చేశారు.

2035 నాటికి 50 మెగావాట్లకు గ్రీన్ ఎనర్జీ

రాష్ట్ర పునరుత్పాదక విద్యుత్ సరఫరా సామర్థ్యం (కాంట్రాక్టెడ్ కెపాసిటీ) ప్రస్తుతం 10,338.20 మెగావాట్లు ఉన్నది. దీనికి 2029-30 నాటికి సుమారు 20,000 మెగావాట్ల అదనపు సామర్థ్యాన్ని జోడించి మొత్తం 31,537 మెగావాట్లకు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2034-35 నాటికి అదనంగా మరో 18,526 మెగావాట్లు పెంచి మొత్తం సామర్థ్యాన్ని 50,063 మెగావాట్లకు చేర్చాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. పదేళ్లపాటు ఈ పాలసీ అమల్లో ఉంటుంది. పునరుత్పాదక విద్యుత్ రంగంలో భారీగా పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు ఉద్యోగావకాశాలను సృష్టించడం పాలసీ లక్ష్యమని ప్రభుత్వం తెలిపింది.

పరికరాల పరిశ్రమలకు 25 % పెట్టుబడి రాయితీ..

సౌర, పవన విద్యుత్ కేంద్రాల కోసం పరికరాలు, యంత్రాలు తయారుచేసే పరిశ్రమలు స్థాపిస్తే మూలధన పెట్టుబడిలో 25 శాతాన్ని పెట్టుబడి రాయితీగా ఇస్తామని పాలసీలో ప్రభుత్వం ప్రకటించింది. బ్యాటరీల తయారీ పరిశ్రమలు స్థాపిస్తే 20 శాతం పెట్టుబడి రాయితీ ఇస్తుంది. అయి తే ఇది రూ.30 కోట్ల గరిష్ట పరిమితికి లోబడి 5 ఏళ్లలో ఇస్తుంది. ఉత్పత్తులపై 7 ఏళ్లపాటు 100 శాతం రాష్ట్ర జీఎస్టీ ని రీయింబర్స్ చేస్తుంది. పరిశ్రమలు ఏర్పాటుచేసే భూ ములను వ్యవసాయేతర భూములుగా ఉచితంగా కన్వర్షన్ చేస్తుంది. 100 శాతం విద్యుత్ సుంకంతోపాటు ట్రాన్స్‌మి షన్, డిస్ట్రిబ్యూషన్ చార్జీలు, క్రాస్ సబ్సిడీలను 10 ఏళ్లపాటు తిరిగి చెల్లిస్తుంది. పారిశ్రామిక నీటి చార్జీలను 25 శాతం పదేళ్లపాటు తిరిగి చెల్లించనుంది. విద్యుత్ టారిఫ్‌లో యూనిట్‌పై ఒక రూపాయిని 10 ఏళ్లపాటు తిరిగి చెల్లిస్తుంది. రూ.2 లక్షల గరిష్ట పరిమితికి లోబడి 50 శాతం క్వాలిటీ సర్టిఫికేషన్ చార్జీలను, 50 శాతం పెటెంట్ చార్జీలను తిరిగి ఇస్తుంది. రూ.10 లక్షల గరిష్ట పరిమితికి లోబడి మహిళా ఎస్ఎస్ఈ పారిశ్రామికవేత్తలకు అదనంగా 25 శాతం పెట్టుబడి రాయితీని అందిస్తుంది. కాలుష్య రహిత ఉత్పాదనకు తీసుకునే చర్యలపై రూ.5 లక్షల గరిష్ట పరిమితికి లోబడి 25 శాతం వరకు రాయితీ ఇస్తారు. మెగా ప్రాజెక్టులకు రవాణా రాయితీ, స్టాంప్ డ్యూటీ, భూకేటాయింపులు వంటి అంశాల్లో ప్రత్యేక రాయితీలను ఇవ్వనుంది. డిస్కంలు కొనే సౌర, పవన, బ్యాటరీ స్టోరేజీ విద్యుత్‌లో 10 శాతాన్ని ఈ పరిశ్రమల నుంచే కొనుగోలు చేస్తామని గ్యారంటీ ఇచ్చింది.

స్టార్టప్‌ల ప్రోత్సాహానికి ఇన్‌క్యుబేషన్ కేంద్రం

పునరుత్పాదక ఇంధన రంగంలో పరిశోధనలను, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు తెలంగాణ జెన్‌కో/డిస్కంలలో ఇన్‌క్యుబేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్టు నూతన పాలసీలో ప్రకటించింది. అద్భుతమైన ఆలోచనలు, స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి రూ.50 కోట్ల ఇన్‌క్యుబేషన్ ఫండ్‌ను ఏర్పాటుచేయనుంది.

పాలసీలోని కీలక అంశాలు..

- విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు టారిఫ్ ఆధారిత కాంపిటీటివ్ బిడ్డింగ్ ద్వారా పునరుత్పాదక విద్యుత్ కేంద్రాల నుంచి విద్యుత్ కొనుగోళ్లకు బిడ్లను ఆహ్వానిస్తాయి.
- బిడ్డింగ్‌లో గెలిచిన సంస్థకు మార్కెట్ రేటులో 10 శాతం లీజు రేటుగా నిర్ణయించి భూములను కేటాయిస్తారు. అనంతరం ప్రతి రెండేళ్లకోసారి 5 శాతం లీజు ధరను ప్రభుత్వం పెంచనుంది.
- డెవలపర్లు రాష్ట్రంలో సౌర, పవన విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని ప్రైవేటు సంస్థలకు ఓపెన్ యాక్సెస్ ద్వారా విద్యుత్ అమ్ముకోవచ్చు. సొంత అవసరాలకూ వాడుకోవచ్చు. ఎకరాకు రూ.లక్ష ధరతో ఇలాంటి ప్రాజెక్టులకు ప్రభుత్వం 25 ఏళ్లు లేదా ప్రాజెక్టు జీవిత కాలానికి స్థలాలను కేటాయిస్తుంది. ఈ ప్రాజెక్టుల రిజిస్ట్రేషన్‌కు ప్రత్యేక పోర్టల్‌ను నిర్వహిస్తుంది.
- రాష్ట్రంలోని అన్ని సబ్‌స్టేషన్ల పరిధిలో కొత్త విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల ఏర్పాటుకు ఎంత సామర్థ్యం లభ్యత ఉందో.. ఆ మేరకు మాత్రమే అనుమతిస్తారు. అంతకు మించిన సామర్థ్యంతో విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేస్తే.. అందుకు అవసరమైన అదనపు ట్రాన్స్‌మిషన్ సామర్థ్యం వృద్ధి బాధ్యత డెవలపర్‌దే.
- సౌర, పంప్డ్ స్టోరేజీ విద్యుత్ ప్లాంట్లను రెండేళ్లలో, పవన విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం మూడేళ్లలో పూర్తి చేయాల్సి ఉంటుంది.
- జలాశయాలపై ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటు కోసం ఎకరాకు రూ.లక్ష ఏకకాల అద్దెతో 25 ఏళ్లకు నీటిపారుదల శాఖ తన భూములను లీజుకు ఇవ్వనుంది.
- సబ్‌స్టేషన్ల వారీగా స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ), రైతులు/సహకార సంఘాలు/పంచాయతీలు/రైతు సంఘాలు/నీటి వినియోగ సంఘాల ఆధ్వర్యంలో 500 కిలోవాట్ నుంచి 2 మెగావాట్ల సామర్థ్యంతో సౌర విద్యుత్ ప్లాంట్ల స్థాపనకు ఆసక్తి వ్యక్తీకరణను డిస్కంలు విడతలవారీగా ఆహ్వానించనున్నాయి. వారి నుంచి ఈఆర్సీ నిర్ణయించిన ధరకు విద్యుత్‌ను డిస్కంలు కొనుగోలు చేస్తాయి.

పీఎస్పీ ప్రాజెక్టులకు 45 ఏళ్ల లీజుకు స్థలాలు

పంప్డ్ స్టోరేజీ విద్యుత్ ప్రాజెక్టులకు ప్రభుత్వ భూములను 45 ఏళ్ల లీజుకు కేటాయిస్తారు. 45 ఏళ్ల తర్వాత ప్రాజెక్టును ప్రభుత్వానికి బదిలీ చేయాల్సి ఉంటుంది.

2029-30, 2034-35 నాటికి పునరుత్పాదక విద్యుత్ పెంపు లక్ష్యం (మెగావాట్లలో)

విద్యుత్ రకం	ప్రస్తుత సామర్థ్యం	2029-30 నాటికి లక్ష్యం	2034-35 నాటికి లక్ష్యం
సౌర విద్యుత్	7,889	19,874	26,374
డిస్ట్రిబ్యూటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ	771	4,330	8,242
పవన విద్యుత్	128	2,528	4,528
ఎనర్జీ స్టోరేజీ (పంప్డ్+ బ్యాటరీ)	1,600	3,805	7,917
జియో థర్మల్	(20 కేడబ్ల్యూ)	1,000	3,000
మొత్తం	10,338.20	31,537	50,063

భారీ ప్రోత్సాహకాలు..

- నాలా కన్వర్షన్ నుంచి మినహాయింపు.
- టీజీ-ఐపాస్ ద్వారా సింగిల్ విండో విధానంలో అనుమతులు
- మెగావాట్‌కు 4 ఎకరాల చొప్పున భూ గరిష్ఠ పరిమితి చట్టం నుంచి మినహాయింపు
- భూముల కొనుగోళ్లపై స్టాంప్ డ్యూటీ 100 శాతం తిరిగి చెల్లిస్తారు.
- పీసీబీ నుంచి ఎన్‌ఓసీ మినహాయింపు.
- నీటి చార్జీల రీయింబర్స్‌మెంట్.
- విద్యుత్ సుంకం మినహాయింపు (వినియోగం రాష్ట్రంలో ఉంటేనే)
- పారిశ్రామిక హోదా కల్పించి రాష్ట్ర పారిశ్రామిక విధానం కింద అందించే అన్ని రకాల ప్రోత్సాహకాలను వర్తింపజేస్తారు.
- వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్టుల కు 100 శాతం రాష్ట్ర జీఎస్టీని తిరిగి చెల్లిస్తారు.
- సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు సౌర, పవన విద్యుత్ వాడుకుంటే 8 ఏళ్లపాటు విద్యుత్ సుంకం మినహాయింపు ఇస్తారు.
- పీఎస్పీ ప్రాజెక్టులకు నీటి సుంకాన్ని తిరిగి చెల్లిస్తారు. డిస్కంలకు విద్యుత్ విక్రయిస్తే ప్రత్యేక ప్రోత్సాహకాలు
- సూపర్‌వైజేషన్ చార్జీల మినహాయింపు.
- సౌర, పంప్డ్ స్టోరేజీ, బ్యాటరీ స్టోరేజీ, ఇతర ప్రాజెక్టులకు 50 శాతం రాష్ట్ర జీఎస్టీని తిరిగి చెల్లిస్తారు.
- ఎస్‌హెచ్‌జీలు/గ్రామ సమాఖ్యలు ఏర్పాటు చేసే సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులతో పాటు వ్యక్తిగత, ఇందిరమ్మ గృహాలు, ప్రభుత్వ స్కూల్స్, కార్యాలయాలపై ఏర్పాటు చేసే రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టులకు 100% స్టేట్ జీఎస్టీని తిరిగి చెల్లిస్తారు.

ఈవీ చార్జింగ్ కేంద్రాలు	872 సంఖ్య	6 వేలు సంఖ్య	12 వేలు సంఖ్య
గ్రీన్ హైడ్రోజన్	-	418 కేటీపీఏ	554 కేటీపీఏ

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
ఆదివారం ॥ 12-1-2025

మన ముంగిళ్లకు పండగ కళ



నేలకు చుక్కలు


ఒకప్పటి రోజుల్లో ఇంటి ఇల్లాలు పొద్దున్నే లేవగానే చేసే పని... వాకిలి ఊడ్చి నీళ్ల చల్లి ముగ్గు వేయడం. వెసులుబాటును బట్టి, సందర్భాన్ని బట్టీ చిన్న ముగ్గెయ్యాలో... పెద్ద ముగ్గెయ్యాలో... చుక్కల ముగ్గు పెట్టాలో, గీతల ముగ్గు వెయ్యాలో ముందే అనుకునేవారు. ఇక సంక్రాంతి నెల వచ్చిందంటే పోటా పోటీలుగా ముగ్గులు వేసేవారు. పెద్ద ఎత్తున ముగ్గుల పోటీలు కూడా పెట్టేవాళ్లు. ముగ్గుల మీద కార్టూన్లు కూడా బాగానే పడేవి. ఇక ముగ్గులోకి దించటం, ముగ్గుపొయ్యటం లాంటి జాతీయాలు, ముత్యాల ముగ్గు లాంటి సినిమాల సంగతి సరేసరి. ముగ్గులు ఒకప్పుడు శుభాశుభ సంకేతాలుగా పనిచేసేవి. పూర్వం సాధువులు, సన్యాసులు, బ్రహ్మచారులు రోజూ ఇల్లిల్లూ తిరిగి భిక్ష అడిగేవారు. ఏ ఇంటి ముందైనా ముగ్గు లేదంటే ఆ ఇంటిలోకి అడుగుపెట్టేవారు కాదు. వారే కాదు యాచకులు కూడా ముగ్గు లేని ఇళ్ళకు వెళ్లేవారు కాదు! ఎందుకంటే, ఇంటి వాకిట్లో ముగ్గు లేదంటే అక్కడ అశుభం జరిగిందని గుర్తు. అందుకే మరణించిన వారికి శ్రాద్ధకర్మలు చేసే రోజున ఉదయం ఇంటిముందు ముగ్గు వేయరు. ధనుర్మాసంలో ప్రతి ఇంటిముందు తెల్లవారుఝామున ఇంటిముందు అందమైన ముగ్గులు వేసి ముగ్గు మధ్యలో గొబ్బెమ్మలు, గుమ్మడి పూలు ఉంచి వాటిని బియ్యం పిండి, పసుపు, కుంకుమ, పూలతో అలంకరించి పూజించడం ఆచారం. ఎందుకంటే గొబ్బెమ్మలను పూజించడం వల్ల మంచి జరుగుతుందని విశ్వాసం.

గొబ్బియల్లో... గొబ్బియల్లో

ముగ్గులకు ఎంత ప్రాధాన్యముందో, ముగ్గులలో పెట్టే గొబ్బిళ్లు లేదా గొబ్బెమ్మలకు కూడా అంతే ప్రాధాన్యతనిస్తారు తెలుగువాళ్లు. ఎందుకంటే గొబ్బెమ్మలు కృష్ణుడికి ఎంతో ఇష్టమైన గోపికా స్త్రీల రూపాలకి సంకేతంగా భావిస్తారు. ముగ్గు మధ్యలో పెట్టే పెద్ద గొబ్బెమ్మ గోదాదేవికి సంకేతం. ఆవు పేడని పవిత్రంగా భావిస్తారు. పేడతో చేసిన గొబ్బెమ్మలు ముగ్గుల మీద పెట్టడం సంప్రదాయంగా వస్తోంది. పెళ్లి కాని వాళ్ళు గొబ్బెమ్మలు పెడితే త్వరగా పెళ్లి అవుతుందని విశ్వాసం. గొబ్బెమ్మల చుట్టూ తిరుగుతూ గొబ్బియెల్లో గొబ్బియెల్లో.. అని పాట పాడుతూ సందడిగా నృత్యం చేస్తారు. కృష్ణుడి మీద గోపికలకి ఉన్న భక్తి తమకు రావాలని కోరుకుంటూ గొబ్బెమ్మలు పెడతారు.

గొబ్బెమ్మలు గోదాదేవితో సమానం కనుకే వాటిని కాలితో తొక్కరు. ఇంటి లోగిలి అందంగా ఉన్న ఇళ్ల మీద లక్ష్మీదేవి ఆశీస్సులు ఉంటాయని నమ్ముతారు. అలా అందంగా అలంకరించడం అనేది లక్ష్మీదేవిని తమ ఇంట్లోకి ఆహ్వానించినట్టేనని భావిస్తారు. శ్రీ కృష్ణుడి చుట్టూ గోపికలు ఎలా అయితే చేరి పాటలు పాడి సరదాగా నృత్యాలు చేస్తారో, అలాగే గొబ్బిళ్ళ చుట్టూ కూడా చేరి పాటలు పాడుతారు.


– డి.వి.ఆర్. భాస్కర్





ఎ. మహాలక్ష్మి
టాటానగర్,
బెంగళూరు

32 చుక్కలు,
6 వరసలు,
6 వచ్చేవరకు,
సరిచుక్క





చుండూరు తన్మయి
ఎ.ఎస్.రావ్ నగర్,
హైదరాబాద్

13 చుక్కలు,
7 వచ్చే వరకు,
మధ్య చుక్క





జి. అంజలీదేవి
మహబూబ్ నగర్

21 చుక్కలు, 3 వరుసలు
3 వచ్చే వరకు,
సరి చుక్క

తులసి మొక్క దగ్గర అష్టదళపద్మం వెయ్యాలి





నాయన రోజారాణి
గాజువాక, విశాఖపట్నం

25 చుక్కలు, 11 వరసలు
చుక్క వదిలి చుక్క, 11 వచ్చేవరకు

యజ్ఞయాగాదులలో యజ్ఞగుండం మీద నాలుగు గీతలతో కూడిన ముగ్గులు వేయాలి. దైవకార్యాలలో కూడా నాలుగు గీతలతో కూడిన ముగ్గులు వేయాలి.



ఎమ్. ధనలక్ష్మి
కల్లూరిపల్లి హౌసింగ్ బోర్డ్
కాలనీ, నెల్లూరు

15 చుక్కలు,
5 వరుసలు,
5 వచ్చే వరకు,
సరి చుక్క



నూతన వధూవరులు తొలిసారి భోజనం చేసే సమయంలో వారి చుట్టు పక్కల లతలు, పుష్పాలు, తీగలతో కూడిన ముగ్గులు వేయాలి.



23 చుక్కలు, 3 వరుసలు, 5 వచ్చేవరకు, సరి చుక్క




బి. రామలక్ష్మి
కల్లూరు, ఖమ్మం జిల్లా





డి. సుగుణ
సోమాజిగూడ,
హైదరాబాద్

25 చుక్కలు,
5 వరసలు,
5 వచ్చేవరకు





జి. లక్ష్మి,
వినన్నపేట

21 చుక్కలు, 11వచ్చే వరకు, చుక్క విడిచి చుక్క

నిత్యం ఇంటి ముందు, వెనుక భాగంలో, తులసి మొక్క దగ్గర, దీపారాధన చేసే ప్రదేశంలో ముగ్గు వేయాలి. ముగ్గు పాజిటివ్/దైవ శక్తులను ఇంట్లోకి ఆకర్షిస్తుంది.



బి.వి.ఎల్.బి. రాజేశ్వరి
గంగవరం,
పల్నాడు జిల్లా



15 చుక్కలు
8 వచ్చేవరకు
మధ్యచుక్క



19 చుక్కలు,
1 వచ్చే వరకు :
సరిచుక్క



చాపాకు ఇందుసాయి
సూళ్లూరుపేట,
నెల్లూరు జిల్లా

వచ్చాడు బసవన్న

ఉదయం పూట చెట్ల కొమ్మలపై మంచుపూలు స్వాగతం పలుకుతుండగా సన్నాయి రాగం మధురంగా వినిపిస్తుంది. చేగంట మోగుతుండగా బసవన్న పాట వినిపిస్తుంది... 'డూ డూ బసవన్నా ఇటురారా బసవన్నా/ఉరుకుతూ రారన్న రారన్న బసవన్నా/అమ్మవారికి దండం బెట్టు అయ్యగారికి దండం బెట్టు/రారా బసవన్నా... రారా బసవన్నా....'

గంగిరెద్దులు ఊళ్లోకి అడుగు పెడితే ఊరికి సంక్రాంతి కళ సంపూర్ణంగా వచ్చినట్లే. విశేషం ఏమిటంటే... గంగిరెద్దుల ముందు పెద్దలు చిన్న పిల్లలై పోతారు. 'దీవించు బసవన్నా' అంటూ పిల్లలు పెద్దలై భక్తి పారవశ్యంతో మొక్కుతారు. కాలం ముందుకు వెళుతున్న కొద్దీ ఎన్నో కళలు వెనక్కి పోతూ చరిత్రలో కలిసిపోయాయి. అయితే గంగిరెద్దుల ఆట అలా కాదు. కాలంతో పాటు నిలుస్తోంది. 'ఇది మన కాలం ఆట' అనిపిస్తోంది...

కొత్త కాలానికి... కొత్త చరణాలు


కాలంతో పాటు బసవన్న పాటలోకి కొత్త చరణాలు వస్తుంటాయి. సందర్భాన్ని బట్టి ఆ పాటలో చరణాలు భాగం అవుతుంటాయి. ఒక ఊళ్లో... సంక్రాంతి సెలవులకు వచ్చిన పిల్లాడు బైక్ యాక్సిడెంట్‌లో చనిపోయాడు. అది ఎన్నో సంవత్సరాల చేదు జ్ఞాపకం అయినా సరే, ఊళ్లో సంక్రాంతి రోజు ప్రతి ఇల్లు పండగ కళతో కళకళలాడినట్లు ఆ ఇల్లు కనిపించదు. జ్ఞాపకాల దుఃఖభారంతో కనిపిస్తుంది. ఆ భారం నుంచి ఆ ఇంటి వాళ్లను తప్పించడానికి బసవడు ఆడుతాడు పాడుతాడు. 'నవ్వించు బసవన్న నవ్వించు/అమ్మవారికి దండం పెట్టి నవ్వించు/అయ్యవారికి దండం పెట్టి నవ్వించు/ వాళ్ల హాయిగా ఉండేలా దీవించు

ఆ దీవెన ఎంతో పవర్‌ఫుల్

పండగపూట బసవన్న ఇంటిముందుకు రాగానే బియ్యం లేదా పాత బట్టలతో రావడం ఒక విషయం అయితే... భవిష్యత్ వాణి అడగడం, ఆశీర్వాదం ఒక మరో విషయం. గంగిరెద్దులాయన సంచిలో బియ్యం పోస్తు 'మా అబ్బాయికి ఈ సంవత్సరమన్నా ఉద్యోగం వస్తుందా బసవన్నా' అని అడుగుతుంది ఒక అమ్మ.

'అవును' అన్నట్లు తల ఆడిస్తుంది. 'మా తల్లే' అని కంటినిండా సంతోషంతో గంగిరెద్దు కాళ్లు మొక్కుతుంది ఆ అమ్మ. గంగిరెద్దుల ఆటలో విశేషం ఏమిటంటే, తెలుగు ప్రాంతాల్లో ఒక్కో చోట ఒక్కో రకమైన ప్రత్యేతలు ఉన్నాయి. ఉదాహరణకు శ్రీకాకుళం జిల్లా మందస ప్రాంతంలో గంగిరెద్దుల వారి పాటల్లో తత్వం ధ్వనిస్తుంది. సామాజిక విశ్లేషణ ఉంటుంది. ఉదా: 'దేవా! ఏమి జరుగుతున్నది ప్రపంచం/అహో! ఏం చిత్రం గున్నదీ ప్రపంచం/ పసుపురాత తగ్గిపోయి....పొడరు రాతలెక్కువాయె'...సంక్రాంతి రోజుల్లో బసవన్నల విన్యాసాలకు ప్రత్యేకంగా రంగస్థలం అక్కర్లేదు. ఊళ్లోకి అడుగుపెడితే... అణువణువూ ఆ కళకు రంగస్థలమే. మనసంతా ఉల్లాసమే. తరతరాల నుంచి ప్రతి తరానికి దివ్యమై అనుభవమే.

- బోణం గణేష్,
సాక్షి, అమరావతి



ఇంటి /గడప/గేటు ముందు ముగ్గులో భాగంగా గీసే రెండు అడ్డగీతలు ఇంటిలోనికి దుష్టశక్తులను రాకుండా నిరోధిస్తాయి. ఇంట్లో ఉన్న లక్ష్మీదేవి బయటకు వెళ్ళకుండా చూస్తాయి.

ముగ్గువేసి దానికి నాలుగువైపులా రెండేసి అడ్డగీతలు గీస్తే అక్కడ శుభకార్యాలు, మంగళకరమైన పనులు జరుగుతున్నాయని గుర్తు. పండుగల సమయంలో ఈ విధంగా ఖచ్చితంగా వేయాలి. ఏ దేవతపూజ చేస్తున్నా, దైవాన్ని ఉంచే పీట మీద మధ్యలో చిన్న ముగ్గు వేసినా, నాలుగు వైపులా రెండేసి గీతలను తప్పక గీయాలి.

పండుగ వచ్చిందికదా అని, నడవడానికి చోటు లేకుండా వాకిలంతా ముగ్గులతో నింపెయ్యకూడదు. ఎందుకంటే ముగ్గులను తొక్కకూడదు కదా..



సెమీస్‌లో సాత్విక్–చిరాగ్ జోడీ ఓటమి

కౌలాలంపూర్: కొత్త ఏడాదిని టైటిల్‌తో ప్రారంభించాలనుకున్న భారత బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టికి నిరాశ ఎదురైంది. మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–1000 టోర్నీలో సాత్విక్–చిరాగ్ జంట సెమీ ఫైనల్లో పరాజయం పాలైంది. శనివారం జరిగిన సెమీ ఫైనల్లో సాత్విక్–చిరాగ్ ద్వయం 10–21, 15–21తో కిమ్ వన్ హో–సియో సెయింగ్ జే (దక్షిణ కొరియా) జోడీ చేతిలో ఓడింది. 40 నిమిషాల పాటు జరిగిన ఈ పోరులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాత్విక్, మహారాష్ట్ర ప్లేయర్ చిరాగ్ స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేకపోయారు. గత ఏడాది ఈ టోర్నీలో ఫైనల్‌కు చేరిన భారత షట్లర్లు ఈ సారి సెమీస్‌తోనే ఇంటిదారి పట్టారు. 'గత మూడు మ్యాచ్‌లతో పోల్చుకుంటే ఈ మ్యాచ్‌ను మెరుగ్గా ఆరంభించలేకపోయాం. ఈ ఫలితం నుంచి పాఠాలు నేర్చుకుంటాం' అని సాత్విక్ అన్నాడు. తొలి గేమ్‌లో 6–11తో వెనుకబడిన సాత్విక్ జంట ఆ తర్వాత కోలుకోలేకపోయింది. రెండో గేమ్ ఆరంభంలో మంచి ఆటతీరు కనబర్చిన భారత జోడీ 11–8తో ఆధిక్యం చాటినా... చివరి వరకు అదే తీవ్రత కొనసాగించడంలో విఫలమై పరాజయం పాలైంది.

గ్రాండ్‌స్లామ్ ఓపెనింగ్ ఎవరిదో

- అల్కరాజ్, సినెర్‌లే ఫేవరెట్లు
- హ్యాట్రిక్ వేటలో సబలెంకా
- నేటి నుంచి ఆస్ట్రేలియన్ ఓపెన్
- ఉ. గం. 5:30 నుంచి 'సోనీ' నెట్ వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం

తెలుగు ఆటగాడు బొల్లిపల్లి రిత్విక్ చౌదరి తొలి సారి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో బరిలోకి దిగుతున్నాడు. పురుషుల డబుల్స్‌లో అమెరికాకు చెందిన ర్యాన్ సెగ్రెమన్‌తో జోడీ కట్టిన రిత్విక్ శుభారంభమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. భారత సంతతికి చెందిన అమెరికాకు ప్రాతినిధ్యం వహిస్తున్న నిశేష్ బసవరెడ్డి తొలి రౌండ్‌లో జొకోవిచ్‌తో తలపడనుండటం ఆసక్తి రేపుతోంది. మ్యాచ్‌కు ముందు నిశేష్ ఇటీవలి ఆటపై జొకోవిచ్ ప్రశంసలు కురిపించాడు.

కొత్త తరం చాంపియన్లు కార్లోస్ అల్కరాజ్, యానిక్ సినెర్ ఒక వైపు... ఆల్‌టైమ్ గ్రేట్, 24 గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల దిగ్గజం నొవాక్ జొకోవిచ్ ఇలా హేమాహేమీలంతా ఆరంభ గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌తో ఈ సీజన్‌కు గ్రాండ్ వెల్‌కమ్ చెప్పాలని పట్టుదలతో ఉన్నారు. మహిళల సింగిల్స్‌లో గత రెండేళ్లుగా విజేతగా నిలుస్తున్న డిఫెండింగ్ చాంపియన్ అరినా సబలెంక 'హ్యాట్రిక్' టైటిల్‌పై కన్నేయగా, స్వియాటెక్, కోకో గాఫ్‌లు కూడా ఈ సీజన్‌కు విజయంతో శుభారంభం పలకాలని చూస్తున్నారు.



జొకోవిచ్



సినెర్

మెల్‌బోర్న్: సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ కోసం రంగం సిద్ధమైంది. పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ యానిక్ సినెర్ (ఇటలీ) గత సీజన్ ఆఖరి గ్రాండ్‌స్లామ్ యూఎస్ ఓపెన్ విజయంతో జోరుమీదున్నాడు. 23 ఏళ్ల ఇటలీ సంచలనం డోపింగ్ మరక దరిమిలా ఎదురవుతున్న విమర్శలను టైటిల్ నిలబెట్టుకొని అధిగమించాలనే పట్టుదలతో ఉన్నాడు. మరోవైపు నాదల్ శకం తర్వాత స్పెయిన్ జైత్రయాత్రకు కొత్త చిరునామాగా అల్కరాజ్ ఎదిగాడు. 21 ఏళ్ల వయసులోనే ఇప్పటికే నాలుగు గ్రాండ్‌స్లామ్‌లను సాధించేశాడు. 2022లో యూఎస్ ఓపెన్, 2023లో ప్రతిష్టాత్మక వింబుల్డన్, గతేడాది వరుసగా ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్‌లను గెలుచుకున్నాడు. అయితే నాలుగు గ్రాండ్‌స్లామ్‌లనైతే గెలిచాడు.... కానీ ఆస్ట్రేలియన్ ఓపెన్ వెలితి మాత్రం అలాగే వుంది. ఇక్కడ గత సీజన్‌లో క్వార్టర్‌ఫైనల్లో నిష్క్రమించిన ఈ స్పెయిన్ స్టార్ బహుశా ఈ ఏడాది ఆ ముచ్చట తీర్చుకుంటాడేమో చూడాలి. మరో వైపు ఆల్‌టైమ్ గ్రేట్‌లలో ఒకరైన 37 ఏళ్ల సెర్బియన్ దిగ్గజం నొవాక్ జొకోవిచ్ 25వ రికార్డు గ్రాండ్‌స్లామ్‌పై దృష్టిపెట్టాడు. వీరితో పాటు 27 ఏళ్ల జర్మనీ స్టార్, రెండో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) గత సెమీఫైనల్ అంచెను దాటాలనే పట్టుదలతో ఉన్నాడు.



సబలెంక

జొకో గెలిస్తే రజతోత్సవమే!

గతేడాది సెర్బియన్ సూపర్ స్టార్ జొకోవిచ్ సెమీఫైనల్స్‌తో సరిపెట్టుకున్నాడు. అంతమాత్రాన 37 ఏళ్ల వెటరన్ ప్లేయర్‌లో సత్తా తగ్గిందంటే పొరబడినట్లే. తనకు బాగా అచ్చొచ్చిన ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పది టైటిళ్లు గెలిచిన నొవాక్ 11వ సారి విజేతగా నిలిస్తే గ్రాండ్‌స్లామ్‌ల రజతోత్సవాన్ని (25వ) మెల్‌బోర్న్‌లో జరుపుకుంటాడు. ఏడో సీడ్‌గా ఆసీస్ ఓపెన్ మొదలుపెట్టబోతున్న నొవాక్‌కు ఇక్కడ ఘనమైన రికార్డు ఉంది. 2011–13 హ్యాట్రిక్, 2019–21 హ్యాట్రిక్‌లు సహా 2008, 2015, 2016, 2023లలో విజేతగా నిలిచిన విశేషానుభవం సెర్బియన్ సొంతం. రష్యా స్టార్, ఐదో సీడ్ డానిల్ మెద్వెదెవ్ ఫైనల్‌కు వచ్చిన మూడుసార్లు టైటిల్ వేటలో చతికిలబడ్డాడు. రష్యన్ స్టార్ 2021, 2022లతో పాటు గత సీజన్‌లో సినెర్ చేతిలో అమీతుమీలో మూడో 'సారీ' టైటిల్‌ను కోల్పోయాడు. ఇప్పుడు ఫామ్‌లో ఉన్న సినెర్, అల్కరాజ్‌లను అధిగమించి విజేతగా నిలువడం అంత సులువైతే కాదు. ఆరో సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే), 9వ సీడ్ ఆంద్రీ రుబ్లెవ్ (రష్యా)లు సంచలన స్టార్లకు షాకిచ్చేందుకు సిద్ధమయ్యారు. తొలిరౌండ్లలో షెవ్‌చెంకో (కజకిస్తాన్)తో అల్కరాజ్, ఫ్రాన్స్ వైల్డ్‌కార్డ్ ప్లేయర్ లుకాస్ పొలీతో జ్వెరెవ్, నికోలస్ జెర్రీ (చిలీ)తో టాప్‌సీడ్ సినెర్ ఆసీస్ ఓపెన్‌ను ప్రారంభిస్తాడు.

హ్యాట్రిక్ వేటలో సబలెంక

మహిళల సింగిల్స్‌లో బెలారస్ స్టార్ ప్లేయర్ అరియానా సబలెంక 'హ్యాట్రిక్' కలను సాకారం చేసుకునే పనిలోవుంది. 26 ఏళ్ల ఈ టాప్‌సీడ్ గత రెండేళ్లుగా (2023, 2024లలో) టైటిళ్లను నిలబెట్టుకుంటోంది. ఈ సీజన్‌లో ఆమె... స్లోన్ స్టీఫెన్స్ (అమెరికా)తో తొలిరౌండ్ సమరానికి సిద్ధమైంది. మిగతా మేటి ప్లేయర్లలో 20 ఏళ్ల అమెరికన్ మూడో సీడ్ కోకో గాఫ్ సహచర ప్లేయర్ సోఫియా కెనిన్‌తో తలపడుతుంది. 2024 సీజన్‌లో ఆస్ట్రేలియన్, ఫ్రెంచ్ ఓపెన్‌లలో వరుసగా సెమీఫైనల్స్ చేరిన గాఫ్ ఈ సారి సత్తా చాటాలని గట్టి పట్టుదలతో ఉంది. పోలండ్ సూపర్‌స్టార్ 23 ఏళ్ల ఇగా స్వియాటెక్... చెక్ రిపబ్లిక్‌కు చెందిన కెటెరినా సినియకొవాతో ఆసీస్ ఓపెన్‌ను ఆరంభించనుంది. ఫ్రెంచ్ ఓపెన్ (2022, 2023, 2024) హ్యాట్రిక్ విజేతకు ఆస్ట్రేలియన్ ఓపెన్ మాత్రం కలిసిరావడం లేదు. ఇక్కడ కనీసం ఆమె క్వార్టర్ ఫైనల్ కూడా చేరలేకపోవడం గమనార్హం. మూడుసార్లు ప్రిక్వార్టర్ ఫైనల్లోనే ఇంటిదారి పట్టింది. గతేడాది అయితే మూడో రౌండ్‌నే దాటలేకపోయింది. ఇప్పుడు రెండో సీడ్‌గా ఆరంభ గ్రాండ్‌స్లామ్ పరీక్షకు సిద్ధమైంది.

షమీ పునరాగమనం

భారత టి20 జట్టులోకి ఎంపిక ● నితీశ్ రెడ్డి, తిలక్ వర్మకు చోటు

ఇంగ్లండ్‌తో సిరీస్‌కు టీమ్ ప్రకటన



షమీ

న్యూఢిల్లీ: సీనియర్ పేస్ బౌలర్ మొహమ్మద్ షమీ భారత జట్టులోకి 14 నెలల తర్వాత పునరాగమనం చేశాడు. ఇంగ్లండ్‌తో స్వదేశంలో జరిగే టి20 సిరీస్ కోసం సెలక్టర్లు శనివారం ఎంపిక చేసిన జట్టులో షమీకి చోటు లభించింది. ముందుగా కాలి మడమ, ఆపై మోకాలి గాయంతో బాధపడిన షమీ చాలా కాలంగా జాతీయ జట్టుకు దూరమయ్యాడు. 2023 నవంబర్ 19న ఆస్ట్రేలియాతో వన్డే వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ ఆడిన తర్వాత టీమిండియాకు ప్రాతినిధ్యం వహించలేదు. గాయంతో కోలుకొని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో రీహాబిలిటేషన్ తర్వాత దేశవాళీ క్రికెట్‌లోకి అడుగు పెట్టిన షమీ వరుసగా మూడు ఫార్మాట్‌లలో కూడా ఆడి మెరుగైన ప్రదర్శన కనబర్చాడు. రంజీ ట్రోఫీ, ముస్తాక్ అలీ టి20 టోర్నీలతో ప్రస్తుతం గురువారం విజయ్‌హజారే వన్డే టోర్నీ ప్రిక్వార్టర్ మ్యాచ్‌లో కూడా షమీ బరిలోకి దిగాడు. ఇటీవల ఆస్ట్రేలియాతో ముగిసిన ఐదు టెస్టుల బోర్డర్–గావస్కర్ ట్రోఫీ కోసం షమీని ఎంపిక చేసే అంశంపై చర్చ జరిగింది. అయితే పూర్తి ఫిట్‌గా లేకపోవడంతో అతడిని జట్టులోకి తీసుకునేందుకు సెలక్టర్లు ఆసక్తి చూపించలేదు. ఇప్పుడు దేశవాళీ క్రికెట్‌లో పెద్ద సంఖ్యలో ఓవర్లు బౌలింగ్ చేసిన తర్వాత షమీ ఫిట్‌గా ఉన్నట్లు తేలింది. నిజానికి భారత్ తరఫున నవంబర్ 2022 తర్వాత అతను టి20 మ్యాచ్ ఆడలేదు. ఈ ఫార్మాట్‌లో యువ పేసర్ల రాకతో షమీ దాదాపుగా జట్టుకు దూరమైపోయాడు. అయితే ఈ సిరీస్ తర్వాత ఇంగ్లండ్‌తోనే జరిగే వన్డే సిరీస్, ఆపై చాంపియన్స్ ట్రోఫీ కోసం జట్లను ఎంపిక చేయనున్న నేపథ్యంలో వాటికి ముందు టి20ల ద్వారా షమీ ఫిట్‌నెస్‌ను పూర్తి స్థాయిలో పరీక్షించాలని సెలక్టర్లు భావిస్తున్నారు. అందుకే ఈ ఫార్మాట్‌లో అతనికి చోటు లభించింది. సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలో 15 మంది సభ్యుల ఈ బృందం ఎంపికలో ఎలాంటి భారీ మార్పులు, సంచలనాలు చోటు చేసుకోలేదు. అయితే ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్ ఆడిన రిషభ్ పంత్, యశస్వి జైస్వాల్‌లకు విశ్రాంతినివ్వగా...గాయంపై స్పష్టత లేకపోవడంతో బుమ్రాను కూడా ఎంపిక చేయలేదు. భారత జట్టు తమ చివరి సిరీస్ ఆడిన టీమ్‌లో (దక్షిణాఫ్రికాతో) ఉన్న ఐదుగురు ఆటగాళ్లు తమ స్థానాలు నిలబెట్టుకోలేకపోయారు. రమణ్‌దీప్ సింగ్, జితేశ్ శర్మ, అవేశ్ ఖాన్, యశ్ దయాళ్, విజయ్‌కుమార్ వైశాక్‌లను పక్కన పెట్టిన సెలక్టర్లు ఆసీస్‌తో టెస్టులు ఆడిన నితీశ్, హర్షిత్, సుందర్, జురేల్‌లను ఈ టి20 టీమ్‌లోకి తీసుకున్నారు. భుజం గాయంతో బాధపడుతున్న రియాన్ పరాగ్‌నూ పక్కన పెట్టారు. ఈ నెల 22, 25, 28, 31, ఫిబ్రవరి 2న జరిగే ఐదు టి20 మ్యాచ్‌లలో ఇంగ్లండ్‌తో భారత్ తలపడుతుంది.

భారత జట్టు వివరాలు: సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అక్షర్ పటేల్ (వైస్ కెప్టెన్), సంజు సామ్సన్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్, నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, మొహమ్మద్ షమీ, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, వాషింగ్టన్ సుందర్, ధ్రువ్ జురేల్.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

ఓ బుజ్జి తల్లీ...



● సాయిపల్లవి, నాగచైతన్య

'గాలిలో ఊగిసలాడే దీపంలా ఊగిసలాడే నీ ఊసందక నా ప్రాణం... నల్లని మబ్బులు చుట్టిన చంద్రుడిలా చీకటి కమ్మెను నీ కబురందక నా లోకం...'' అంటూ భావోద్వేగంతో సాగుతుంది 'బుజ్జి తల్లీ..' పాట. నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటించిన తాజా ప్రేమ కథా చిత్రం 'తండేల్'. చందు మొండేటి దర్శకత్వంలో అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'బుజ్జి తల్లీ...' పాట వీడియోను శనివారం విడుదల చేశారు. శ్రీమణి సాహిత్యం అందించిన ఈ పాటను జావేద్ అలీ పాడారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల కానున్న 'తండేల్' చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించారు.

అలాంటి నటన నాకు రాదు

- హీరో వెంకటేశ్



"జీవితాన్ని హాయిగా.. సంతోషంగా జీవించాలి. అత్యాశలకు పోకూడదు. అతిగా ఆలోచించకూడదు. మన ఆలోచనలు సానుకూలంగానే ఉండాలి. అదే సమయంలో మనం ఏదైనా కోరుకుంటున్నప్పుడు ఆ పనిని నిజాయితీతో చేయాలి. క్రమశిక్షణగా ఉండాలి... కష్టపడాలి. అప్పుడు సాధ్యమౌతుంది. లైఫ్‌లో ఎప్పుడూ హోప్‌ను కోల్పోకూడదు. నా లైఫ్‌లో సినిమా ప్రమోషన్స్ అయినా, మరేదైనా నేను పెద్దగా ప్లాన్ చేసి చేయను. అలా ప్లాన్ చేసి చేస్తే అది యాక్టింగ్ అవుతుంది. అలాంటి నటన నాకు రాదు. వాస్తవానికి దగ్గరగా, సహజంగా ఓ ఫ్లోలో నా ధోరణిలో ముందుకు వెళ్తుంటాను" అన్నారు హీరో వెంకటేశ్. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం విలేకరులతో వెంకటేశ్ చెప్పిన సంగతులు.

● నా కెరీర్‌లో సంక్రాంతికి వచ్చిన మెజారిటీ సినిమాలు విజయం సాధించాయి. ఇప్పుడు 'సంక్రాంతి వస్తున్నాం' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం. ఈ పండక్కి పర్ఫెక్ట్ ఫిల్మ్. ఈ సినిమా కూడా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. సినిమాలో చిన్న క్రైమ్ ఎలిమెంట్ ఉంది. అయినా ఇది మంచి వినోదాత్మక చిత్రం. క్లైమాక్స్‌లో చాలా సర్‌ప్రైజ్‌లు ఉన్నాయి. పిల్లలు, పెద్దలు, యూత్... ఇలా అందరూ ఎంజాయ్ చేసే ఫిల్మ్ ఇది. సినిమాలోని కొన్ని సీన్స్‌లో సంక్రాంతి పండగ సన్నివేశాలు ఉన్నాయి. అందుకే ఈ మూవీకి 'సంక్రాంతికి వస్తున్నాం' అనే టైటిల్ పెట్టడం జరిగింది. ● నాది, దర్శకుడు అనిల్‌ది సూపర్‌హిట్ కాంబినేషన్. మాజీ పోలీసాఫీసర్, అతని మాజీ ప్రేయసి, అతని భార్య... మధ్యలో ఓ క్రైమ్‌స్టోరీ... ఇలా 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా లైన్ తను చెప్పగానే చాలా కొత్తగా అనిపించింది. మినిమమ్ గ్యారెంటీ సినిమా అని తెలిసిపోయింది. సినిమాలో కామెడీ రొటీన్‌గా ఉండదు. కొత్త కామెడీ స్టయిల్ ట్రై చేశాం. ఆడియన్స్‌కు నచ్చుతుందనే అనుకుంటున్నాం. అలాగే అనిల్‌తో నాకు మంచి ర్యాపో కుదిరింది. తనతో మూవీస్‌ని కంటిన్యూ చేయాలనుకుంటున్నాను. ఈ సినిమాలో హీరోయిన్స్ ఐశ్వర్యా రాజేశ్, మీనాక్షీ చౌదరి బాగా నటించారు. ఇద్దరి క్యారెక్టర్స్ క్రేజీగా ఉంటాయి. ● నాన్నగారు (నిర్మాత డి. రామానాయుడు) స్టోరీ సిట్టింగ్స్, మ్యూజిక్ సిట్టింగ్స్, సినిమా ప్రొడక్షన్ వంటి అంశాలను చర్చిస్తున్నప్పుడు నేను పాల్గొనేవాడిని. అయితే నేను అప్పటికి సినిమాల్లోకి రాలేదు. కెరీర్ స్టార్టింగ్‌లో ఇప్పటి ప్రముఖ సంగీత దర్శకులతో మ్యూజిక్ సిట్టింగ్స్ చేశాను. ఇక 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలోని 'బ్లాక్‌బస్టర్ పొంగల్' సాంగ్ విన్నప్పుడు ఈ సాంగ్ నేనే పాడాలనుకున్నాను... పాడాను. సాంగ్స్‌లో ఎక్కువగా ఇంగ్లిష్ పదాలే ఉన్నాయి కాబట్టి నాకు సులభంగా అయిపోయింది. అయితే మిగతా పాటలకు కూడా మంచి స్పందన వస్తుండటం చాలా సంతోషంగా ఉంది. ఈ మూవీ సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో చాలా కష్టపడ్డాడు. అలాగే కొంత గ్యాప్ తర్వాత రమణ గోగులగారు మా సినిమాలో పాట పాడటం హ్యాపీగా అనిపించింది. 'గోదారి గట్టు, మీనూ, బ్లాక్‌బస్టర్ పొంగల్...' పాటలు బ్లాక్‌బస్టర్ కావడం అనేది ఆడియన్స్ గొప్పతనం. ● 'సీతమ్మ వాకిట్లో..' చిత్రం నుంచి 'దిల్' రాజుగారితో నా జర్నీ కొనసాగుతోంది. వారి బ్యానర్‌లో నేను చేసిన సినిమాలన్నీ బాగా ఆడాయి. ఆయనకు మరిన్ని విజయాలు రావాలి. నా తర్వాతి సినిమా కోసం సురేష్ ప్రొడక్షన్, సితార, మైత్రీ, వైజయంతి మూవీస్ సంస్థల్లో కథల పై వర్క్ జరుగుతోంది. ఇక 'రానా నాయుడు 2' సిరీస్ మార్చిలో స్ట్రీమింగ్ కావొచ్చు.

పొగిడితే కళ్లతోనే కనిపెట్టేస్తారు

- దర్శకుడు బాబీ

"సెట్స్‌లో నేను ఫ్యాన్ బాయ్‌లా ఉండను. అలా ఉంటే కొన్ని పనులు మనం అనుకున్నట్లుగా సాగవు. సీనియర్ హీరోలు చిరంజీవి, బాలకృష్ణ గార్లతో వర్క్ చేశాను. ఇద్దరూ పని రాక్షసులు. వీరికి అపారమైన అనుభవం ఉంది. పొగడ్తలతో మాట్లాడితే మన అంతరంగాన్ని కళ్లతోనే కనిపెట్టేస్తారు. కాబట్టి నేను సెట్స్‌లో ఓ దర్శకుడిగా నిజాయితీతోనే ఉండాలనుకుంటాను. అప్పుడు మనపై గౌరవం పెరుగుతుంది. చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేశ్‌గార్ల వంటి సీనియర్ హీరోలతో సినిమాలు చేయడాన్ని అదృష్టంగా భావిస్తున్నాను" అన్నారు దర్శకుడు బాబీ కొల్లి. బాలకృష్ణ హీరోగా నటించిన చిత్రం 'డాకు మహారాజ్'. బాబీ కొల్లి దర్శకత్వంలో శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం నేడు (ఆదివారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో దర్శకుడు బాబీ చెప్పిన విశేషాలు...



● డాకు మహారాజ్‌గా సీతారామ్ ఎలా మారాడు? అన్నది ఈ సినిమా కథనం. బాలకృష్ణగారి ఇమేజ్, ఆయన సినిమాల పట్ల ప్రేక్షకుల్లో ఉండే అంచనాలను దృష్టిలో పెట్టుకునే 'డాకు మహారాజ్' కథ రాయడం జరిగింది. ఈ సినిమాలో బాలకృష్ణగారిని కొత్తగా చూపించే ప్రయత్నం చేశాం. 'నరసింహనాయుడు, సమరసింహారెడ్డి' చిత్రాల తర్వాత నాకు బాలకృష్ణగారి 'సింహా' అంటే చాలా ఇష్టం. 'సింహా'లో బాలకృష్ణగారు డాక్టర్ రోల్‌ను చాలా సెటిల్డ్‌గా చేశారు. ● 'డాకు మహారాజ్' చిత్రంలో హీరోయిన్స్ శ్రద్ధా శ్రీనాథ్, ప్రగ్యా జైస్వాల్‌ల పాత్రలతో పాటు ఓ చిన్న పాప రోల్ కూడా కీలకంగా ఉంటుంది. ఓ విధంగా ఈ పాప చుట్టూనే కథ తిరుగుతుంది. అయితే మరో హీరోయిన్ చాందినీ చౌదరి సీన్స్ కొన్ని ఎడిట్ చేయాల్సి వచ్చింది. ఈ విషయం ఆమెకు తెలియజేశాం. ఆమె ఏమీ అభ్యంతరం తెలుపలేదు. ఈ చిత్రంలో బాబీ డియోల్‌గారు మంచి రోల్ చేశారు. ● మంచి కథ రాసుకోవడం, సీరియస్ స్క్రీన్‌ప్లేని డీల్ చేయడంలో నేను బాగా చేస్తాననే పేరు తెచ్చుకోగలిగాను. కానీ విజువల్స్ పరంగా నా ప్రతిభ గురించి ఆడియన్స్ మాట్లాడుకునేలా చేయలేకపోయానేమో? అనే చిన్న ఆలోచన నాలో ఉండేది. అందుకే ఇప్పుడు 'డాకు మహారాజ్' సినిమా విజువల్స్ బాగున్నాయని అంటుంటే హ్యాపీగాఉంది. 'జైలర్' డీఓపీ విజయ్ కన్నన్‌గారు ఈ సినిమాకు వర్క్ చేశారు. విజయ్‌గారు కథను ఓన్ చేసుకుంటారు. అందుకే విజువల్స్ అంత బాగా వచ్చాయి.

ప్రేమకథ షురూ

అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వం వహించిన 'పుష్ప: ది రైజ్, పుష్ప 2: ది రూల్' చిత్రాలతో శ్రీకాంత్ విస్సా, ప్రశాంత్ బారాది మంచి రచయితలుగా పేరు తెచ్చుకున్నారు. నైజాం ఏరియాలో ఫిల్మ్ డిస్ట్రిబ్యూషన్ విభాగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకుంది రావు–శాన్ ఫిల్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ. కాగా సుకుమార్ టీమ్‌లోని రచయితలు శ్రీకాంత్ విస్సా, ప్రశాంత్ బారాదిలు తమ సంస్థకు ఓ కథను అందించనున్నట్లు రావు–శాన్ ఫిల్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రకటించింది. ఈ చిత్రాన్ని నిర్మించనున్న ప్రశాంత్ యర్రమిల్లి మాట్లాడుతూ– ''శ్రీకాంత్ విస్సా, ప్రశాంత్ బారాదిలతో ఓ అద్భుతమైన కథను 2026లో థియేటర్స్‌లో తీసుకొచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. లవ్, రొమాన్స్ ప్రధానాంశాలుగా ఈ కథ ఉంటుంది. త్వరలో నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు వెల్లడిస్తాం'' అని చెప్పారు.



● శ్రీకాంత్, ప్రశాంత్

ప్రేమ.. వినోదం

కిట్టు తాటికొండ, కశ్మీరా, రోహిత్, వైశాలి, సునీల్ రావినూతల, గోపీచంద్ కొండ ముఖ్య తారలుగా తెరకెక్కిన చిత్రం 'కరణంగారి వీధి'. దర్శకద్వయం హేమంత్, ప్రశాంత్ దర్శకత్వంలో అడవి అశోక్ నిర్మించిన ఈ చిత్రం త్వరలో రిలీజ్ కానుంది. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను నటుడు మురళీ మోహన్ విడుదల చేశారు. ''పల్లెటూరి నేపథ్యంలో సాగే చిత్రం ఇది. నిజ జీవితంలో చూసే వాస్తవ ఘటనలు ఉంటాయి'' అన్నారు హేమంత్. ''లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా 'కరణంగారి వీధి'ని రూపొందించాం'' అని ప్రశాంత్ తెలిపారు. ''ప్రేక్షకులు కోరుకునే అన్ని అంశాలున్న చిత్రమిది'' అన్నారు అడవి అశోక్. ''మధ్య తరగతి కుటుంబ కష్టాలను వినోదాత్మకంగా బాగా చిత్రీకరించారు డైరెక్టర్స్'' అని రోహిత్ పేర్కొన్నారు.



● రోహిత్, వైశాలి

అమెరికాలో సగం సినిమా

ఆదర్శ్ పుందిర్, అశ్రిత్ రెడ్డి, ప్రియాంకా సింగ్, పూజిత పుందిర్, రాజ్ గౌడ్, సునందిని, మధుసూదన్ కీలక పాత్రల్లో ఓ సినిమా రూపొందుతోంది. ఘంటసాల విశ్వనాథ్ దర్శకత్వం వహిస్తున్నారు. స్ప్లాష్ కలర్స్ మీడియా, అలీనియ అవిజ్ఞ స్టూడియోస్, సెటిల్ కింగ్ ప్రొడక్షన్స్‌పై వేణుబాబు నిర్మిస్తున్నారు. ఘంటసాల విశ్వనాథ్ మాట్లాడుతూ– ''టెక్నాలజీ, భావోద్వేగాలు, లింగ సమానత్వం నేపథ్యంలో ఈ మూవీ రూపొందుతోంది. డిసెంబరు 26న ఆరంభమైన ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ 50 శాతం పూర్తయింది. మిగతా సగభాగం షూటింగ్ కోసం అమెరికా వెళ్తున్నాం'' అన్నారు. ప్రియాంకా సింగ్ మాట్లాడుతూ– ''ఈ మూవీలో దర్శక–నిర్మాతలు నాకు చాలా మంచి పాత్ర ఇచ్చారు. ఈ రోజుల్లో ఇటువంటి సినిమాలు రావడం లేదు'' అని చెప్పారు. ''ఈ సినిమాలో టెక్నాలజీ అనేది కీలక పాత్ర పోషించబోతోంది'' అన్నారు ఆదర్శ్ పందిరి. ''లింగ సమానత్వంపై వినోదాత్మకంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది'' అని పూజిత పుందిర్, నటుడు అశ్రిత్ రెడ్డి చెప్పారు. కెమెరామేన్ దిలీప్ కుమార్ చిన్నయ్య మాట్లాడారు. ఈ చిత్రానికి సంగీతం: పవన్ చరణ్, జీవీ.



● ఆదర్శ్, ప్రియాంక, పూజిత, అశ్రిత్

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



క్రిస్టియన్ మాల / 30 / 5'10" / M.Tech/ Govt. జాబ్/Hyd / అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 8919759359 [HA-15404]

మాదిగ/ M.Tech(IIT) / C.Govt. Asst. మేనేజర్/ఇండియన్ బ్యాంక్/98000/- PM/5'10" ఎత్తు/28 సం॥ల వరుడికి వధువు కావలెను. Ph: 7780299703 [HA-15404]

మాల/ B.Tech / C.Govt. Asst. మేనేజర్/HPCL/1 Lakh PM/5'10" ఎత్తు/28 సం॥ల వరుడికి తగిన వధువు కావలెను. Ph: 7416584304 [HA-15404]

విశ్వబ్రాహ్మణ, గోల్డ్ స్మిత్/ 36Y/5'7"/ SSC/ 1st మ్యారేజ్/Hydలో సొంత ఇల్లు, సొంత బిజినెస్ గల వరునికి తగిన విశ్వబ్రాహ్మణ లేదా BC వధువు కావలెను. 9247306908. డైరెక్ట్ [HA-15405]

కాపు, డైవర్స్, కెనడా సిటిజన్, USA గ్రీన్‌కార్డ్ గల వరుడుకి 1 & 2 మ్యారేజి (కిడ్స్ లేని) వధువు కావలెను. కుల/ఆస్తి పట్టింపు లేదు. 98481 88297. [B-782091]

విడో / రెండవ సంబంధం / కులపట్టింపు లేదు / 45సం॥ / బిజినెస్ / జాబ్ / 60,000 / డైవర్స్ / పిల్లలు గల వరునికి వధువు కావలెను. డైరెక్ట్ : 9866025347 [G-795850]

వధువు కావలెను. డైరెక్ట్/కాపు/38 Yr./డైవర్స్/ 5'8"/MBA/6 Lak PA/సొంత ఇల్లు, పొలాలు గల వరుడికి సాంప్రదాయ కుటుంబం నుండి మొదటి వధువు కావలెను. సివిల్/గ్రూప్స్ ఆసక్తి ఉన్న పరిశీలించబడును. నో కట్నం, నో బ్రోకర్స్. 9398019432, 9440185014 [M-0983601]

క్రైస్తవ మాల 34 సం॥ 5'10" MD, GM Govt డాక్టర్ వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ గల వరుడుకు MBBS or PG Unmarried / డైవర్సీ డాక్టర్ వధువు కావలెను. No డౌరీ. డైరెక్ట్ సంప్రదించండి. సెల్ : 9441981671 [SCA25001031]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Citizen, BS, 27, 6' 2", Engineer, 120 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 11", SWE, 160 K, 15 Crores, H1, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Pune, BE (IIIT), MSc, 30, 5' 10", Analyst, 30 L P/A, 20 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 30, 5' 8", HR Specialist, 14 L P/A, 7 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Citizen, BS, MHA, 26, 5' 5", Project Manager, 33 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BS (UK), MS, MBA, 27, 5' 7", 50 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 26, 5' 5", Rich Family, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BDS, MDS, 29, 5' 6", Dental Doctor, 2 Crores, Hyd, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



www.avinashreddy.com
అవినాష్ రెడ్డి మ్యారేజెస్
(రెడ్డిలకు మాత్రమే)
D.V. Koti Reddy
690, Road No.3, Banjara Hills, (TV 9 : Opp. Colony) Hyderabad
98480 11818, 93933 11818

రెడ్డి BE, MS, 27, 5' 8", SWE, Amazon, 200 K, H1, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 33, 5' 8", Analyst, 120 K, 10 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, DM, 27, 5' 11", PG Doctor, Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Europe, BE, MS, 29, 5' 11", SWE, 6 Crores, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 7", Business Analyst, 90 K, 4 Crores, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 25, 5' 6", SWE, 2 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 29, 5' 4", PG Doctor, Rich Family, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, MBA, 31, 5' 6", Consultant 16 L P/A, Hyd, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

★

వైశ్య వరుడు RMP డాక్టర్ వరునికి వధువు కావలెను. కుల సంబంధము లేదు మరియు రెండో పెండ్లి వారు కూడా సంప్రదించవచ్చును.సెల్: 8790197318 [Y-1145857]

పద్మశాలి: వయస్సు: 30 yrs, ఎత్తు: 5.6 Own House & own cloth business గల వరునికి మంచి పద్మశాలి అమ్మాయి కావలెను. కట్నం ప్రసక్తి లేదు. సంప్ర॥ Jansi 7730883543. [W-1264187]

45 సం॥లు/BC/ ప్రభుత్వ టీచర్‌కు తగిన ప్రభుత్వ ఉద్యోగం చేయు వధువు కావలెను. సెల్ : 9347136270 / 7013012950 [WA-5527]

CNB / GOUD/ 45/ MBA/ Builder/ వరునికి వధువు కావలెను. Contact : Ph: 9866569411. [K- 1202413]

★★

సగర-ఉప్పర/5.6'/44 సం॥/Govt. జాబ్ / 1.30L P.M / వెల్‌సెటిల్డ్ వరునికి తగిన, వెల్ సెటిల్డ్ OC/BC కులానికి చెందిన వధువు కావలెను. డైరెక్ట్ : 9392814678, కర్నూలు. [A-1476]

క్షత్రియ రాజులు, 46 సం॥రాలు, గవర్నమెంట్ జాబ్, 2వ పెళ్ళి, సొంత ఇల్లు, Well setteled వరునకు మంచి గుణము, సాంప్రదాయకమైన వధువు కావలెను. 95734 28169 [B-1266960]

క్రైస్తవ మాల Legally Divorced 34 సం॥ 5'10" MD, Govt డాక్టర్ వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ గల వరుడుకు వధువు కావలెను. డైరెక్ట్ సం॥ 89853 15880 [O-787332]

వరుడు కావలెను



కుల, ఆస్తి పట్టింపు లేదు/జాబ్/వ్యాపారం/ ఫ్లాట్స్/4 కోట్ల ప్రాపర్టీ అందమైన వధువుకి 1వ, 2వ వరుడు కావలెను. ఇల్లరికం OK. అన్ని వయస్సుల వారికి సంబంధాలు కలవు. ముఖాముఖి కల్పించబడును. Ph : 9676096314 [H-783516]

రెడ్డి/2nd విడో/కుల, ఆస్తి పట్టింపు లేదు/డిగ్రీ, AGE: 32/బిజినెస్/అందమైన వధువుకు వరుడు కావలెను (ఇల్లరికం OK) అన్ని వయస్సుల వారికి 1st/2nd సంబంధాలు కలవు. Ph: 9032596676 [HA-15405]

కుల పట్టింపు లేదు/46y/విడో/Dept. Industries & Public Enterprises/ 1L PM/Own House/21 Acres Lands/కోట్ల ఆస్తులు గల వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. Ph: 7093142660 [H-783516]

రెడ్డి/విడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు/AGE: 35/ B.Com/Pvt.Job కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK) All Caste Marriages Available. Ph: 8121347478 [HA-15405]

FC/విడో/50y/5'4"/Govt.Employee/ సొంత ఇల్లు & రెంట్స్/కలిగిన వధువుకి మధ్యతరగతి వరుడు కావలెను. Ph: 7416249467 [H-783516]

రెడ్డి/విడో/49y / Govt. అకౌంటెంట్ రైల్వే/ సొంత అపార్ట్‌మెంట్స్/26 ఎకరాల కొబ్బరి తోట /3L/PM/ ఏ బాదరబందీలేని వధువుకు, వరుడు కావలెను. Caste No Bar. Ph: 7732054195 [H-783516]

రెడ్డి /కుల పట్టింపు లేదు/ 26Y/5'3"/ B.Tech/ పెద్ద స్థిరాస్తి కలిగి తండ్రి లేని ఏకైక వధువుకు మిడిల్ క్లాస్ వరుడు కావలెను. మీ ఫోటోలు వాట్సాప్‌లో సెండ్ చెయ్యండి. Ph: 9885492498 [HA-15404]

క్రిస్టియన్/24 / 5'5"/B.Tech (CSE) / A.P. Genco, Central Govt. Employee / 50,000/- PM/వెల్ సెటిల్డ్ అందమైన వధువుకు వరుడు కావలెను. Ph : 9346675639 [HA-15404]

రెడ్డి/2nd మ్యారేజ్/(కుల/ఆస్తి) ప్రసక్తి లేదు/30Y/ Q:B.Com/ Business & Propertys/అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం) OK. (అన్ని వయస్సుల వారికి 1st/2వ సంబంధాలు కలవు) Ph: 9059607176 [HA-15405]

కాపు/43 / 5'6" / డిగ్రీ/విడో / ఫెయిర్/C.Govt పెన్షనర్/ 8L PA/25Cr ప్రాపర్టీ బాగా స్థిరపడిన ఏకైక వధువుకి మ ంచి సాంప్రదాయ కుటుంబం వరుడు కావలెను. Ph: 9573943211, 8125132949 [HA-15405]

వేదికలు



శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM Est : 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st/ 2nd డైవ/విడో సంబంధాలై సం॥ S.రాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకులు: స్వర్గీయ S.శారదగౌడ్, Ph: 8790690309 [H-783516]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15403]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7032018248/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15403]

Kamma, Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Sravani, Ph: 7093969457 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-15403]

Brahmin పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-15403]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Sravani, Ph: 7093969457 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-15403]

Fast Settelement-సాఫ్ట్‌వేర్స్,సూపర్ స్పెషాలిటీ డాక్టర్స్, అబ్రాడ్,గ్రూప్ ఆఫీసర్స్, VIP వారికి 1st, 2nd పెళ్ళి సంబంధాలు చూడబడు ను. పూర్ణ మాట్రిమోని,తిరుపతి, 7093722724. [T-3233]

వాసవి విజయవాడ వారి ఆధ్వర్యంలో 26.01. 2025వ తేదీ ఉ॥ 10 గం॥లకు 66వ ఆర్యవైశ్య వధూవరుల ఉచిత వివాహ పరిచయ వేదిక మరియు మ॥ 2 గం॥లకు 21వ పునర్వివాహ పరిచయ వేదిక, విజయవాడ, కె.వి. ఎన్. కాలేజీలో జరుగును ✆ 99895 00130 [B-1110]

BARATH HOME FOODS & MARIAGE BUREAU అన్ని రకాల పెళ్లి సంబంధాలు చూడబడును. 1st & 2nd మ్యారేజెస్ విడో, సంప్రదించండి : 9059371296 [C-820516]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt., Doctors, MNC, Matches, Late & 2nd Matches కై సంప్రదించండి. 9704656103, 9533608887 (Whatsapp) [HA-1260]

పామాయిల్ సాగుతో ఎకరానికి ఏటా రూ.లక్ష నికరాదాయం

పామాయిల్ నిపుణుడు డాక్టర్ బీఎస్.రావు



సాక్షి, హైదరాబాద్: పామాయిల్ సాగుతో రైతులకు ఎకరానికి ఏటా కనీసం రూ.లక్ష నికరాదాయం వస్తుందని పామాయిల్ సాగు నిపుణుడు, తెలంగాణ ప్రభుత్వానికి సలహాదారు డాక్టర్ బీఎస్.రావు చెప్పారు. 'ఆయిల్ పామ్ సాగు, ప్రాసెసింగ్ ఆహార, ఆహారేతర రంగాల్లో ఉపయోగాలు' అనే అంశంపై తార్నాకలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో శనివారం సాయంత్రం జరిగిన చర్చాగోష్టిలో బీఎస్.రావు మాట్లాడారు. ఇతర పంటల్లో లేని విధంగా ఆయిల్‌పామ్‌లో రైతులకు నిరంతర ఆదాయం వస్తుందన్నారు. అయితే, 30 ఏళ్ల పాటు నీటి సమస్య ఉండదనుకున్న రైతులే పామాయిల్ సాగు చేపట్టాలని సూచించారు. సీసీఎంబీ విశ్రాంత ప్రిన్సిపల్ సైంటిస్ట్, అగ్రి-హార్టికల్చర్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ ఏపీ.రావు మాట్లాడుతూ వాతావరణ మార్పులు, నిపుణుల కొరత, పరిశోధనల లేమి కారణంగా పామాయిల్ సాగులో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఉద్యానశాఖ ఏడీ డాక్టర్ లహరి మాట్లాడుతూ తెలంగాణలో పామాయిల్ సాగు 29 జిల్లాల్లో జరుగుతోందన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ సీనియర్ శాస్త్రవేత్త అహ్మద్ ఇబ్రహిం మాట్లాడుతూ వంట నూనెలు ఎన్ని ఉన్నా దేనికి ఉండే ప్రత్యేకతలు దానికి ఉన్నాయని చెప్పారు. మళ్లీ మళ్లీ వంటనూనెలను మరిగించి వినియోగించటం ఆరోగ్యకరం కాదంటూ, ఎన్ఐఎన్ మార్గదర్శకాలను పాటించాలన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఎస్‌కే.పట్నాయక్ మాట్లాడుతూ వంట నూనెల రంగంలో ప్రతిబంధకాలను అధిగమిస్తే స్వావలంబనకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని చెప్పారు

ఫిబ్రవరి 2న లక్షమందితో మాలల శాంతిర్యాలీ



అభివాదం చేస్తున్న మాల సంఘాల జేఏసీ నాయకులు

పంజగుట్ట (హైదరాబాద్): మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2వ తేదీన నెక్లెస్‌రోడ్డు పీపుల్స్‌ప్లాజా గ్రౌండ్ నుంచి 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం వరకు 'రాజ్యాంగాన్ని రక్షించుకుందాం - రిజర్వేషన్లు కాపాడుకుందాం' నినాదంతో లక్ష మందితో శాంతి ర్యాలీ నిర్వహిస్తామని జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య తెలిపారు. మాలలు, మాల ఉపకులాల కులవృత్తుల ఆయుధమైన బరిసెలు, రాజ్యాంగాన్ని పట్టుకుని శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తామని, రిజర్వేషన్ ఫలాలు పొందుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను ఈ ర్యాలీలో భాగస్వాముల్ని చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఆయన శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జేఏసీ ప్రతినిధులు మాందాల భాస్కర్, మన్నె శ్రీధర్, గోపోజు రమేశ్ బాబు, ఎ.వెంకటేశ్, కిషన్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని మార్చాలని, రిజర్వేషన్లు ఎత్తివేయాలని చూస్తున్న బీజేపీ కుట్రలను తిప్పికొట్టేందుకే ఈ శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీలకు 25 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ప్రైవేట్ రంగంలో కూడా రిజర్వేషన్లు కల్పించాలని, బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ నుంచి హజ్ యాత్రకు 656 మంది



సాక్షి, న్యూఢిల్లీ: ఈ ఏడాది హజ్ యాత్రకు తెలంగాణ నుంచి 656 మంది వెళ్లనున్నారు. ఈమేరకు శనివారం కేంద్ర మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని హజ్ కమిటీ ఆఫ్ ఇండియా.. హజ్ యాత్రికుల రెండో వెయిటింగ్ లిస్టు విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 3,676 మందికి తాత్కాలికంగా సీట్లు కేటాయించినట్టు పేర్కొంది. ఈనెల 23వ తేదీలోపు రాష్ట్రాలు హజ్ కమిటీలకు ఒక్కొక్క యాత్రికుడికి రూ.2,72,300 చొప్పున చెల్లించాలని సూచించింది. హజ్ యాత్రకు సంబంధించిన పత్రాలు అందించేందుకు ఈనెల 25వ తేదీ గడువుగా పేర్కొంది. దేశవ్యాప్తంగా హజ్ యాత్రకు వెళ్లనున్న 3,676 మందిలో.. అత్యధికంగా మహారాష్ట్ర నుంచి 1,092 మంది ఉన్నారు. మరిన్ని వివరాలకు హజ్ కమిటీ ఆఫ్ ఇండియా డిప్యూటీ సీఈవో (ఆపరేషన్స్) మహ్మద్ నియాజ్ అహ్మద్‌ను 9650426727 నంబర్‌లో సంప్రదించాలని హజ్ కమిటీ ఆఫ్ ఇండియా సూచించింది.

'సరస్వతి' పుష్కరాలు ఘనంగా నిర్వహించాలి

అధికారులకు మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: సరస్వతి అంతర్వాహిని పుష్కరాలను ఘనంగా నిర్వహించాలని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ముక్తీశ్వర ఆలయం, గోదావరి సంగమ తీరంలోని పుష్కర ఘాట్లను కాశీ, హరిద్వార్, ప్రయాగ పుణ్యక్షేత్రాల స్థాయిలో అభివృద్ధి చేసేందుకు మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. మే 15 నుంచి 26 వ తేదీ వరకు నిర్వహించనున్న సరస్వతి నది అంతర్వాహిని పుష్కరాల ఏర్పాట్లను సమీక్షించేందుకు శనివారం సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన అధికారులతో మాట్లాడారు. పర్వదినాల సందర్భంగా చేసే ఏర్పాట్లలాగా కాకుండా శాశ్వత ప్రాతిపదికన నిర్మాణాలన్నింటినీ అత్యాధునిక వసతులతో రూపొందించాలని సూచించారు. సరస్వతి పుష్కరాలు దేశంలో మరెక్కడా జరగవని, కాళేశ్వరం సంగమ స్థలంలో మాత్రమే వందల ఏళ్లుగా నిర్వహిస్తున్నారని వెల్లడించారు. పుష్కరాల ఏర్పాట్లు, స్నాన ఘట్టాల ఆధునీకరణ, శానిటేషన్ పనుల కోసం కేటాయించిన రూ.25 కోట్ల నిధులను సద్వినియోగం చేసి కాళేశ్వరం ప్రతిష్ట నలుదిశలా వ్యాపించేలా కృషి చేయాలని అన్నారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల కూడలిలో గోదావరి, ప్రాణహిత నదులు, అంతర్వాహినిగా సరస్వతి కలిసే చోటు అత్యంత పవిత్రమైన సంగమమని ఆయన గుర్తు చేశారు.

రోడ్లను పునర్‌నిర్మించి, భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని, పుష్కరాల నిర్వహణ కోసం ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఫిబ్రవరి ఏడు నుంచి 19 వరకు నిర్వహించే కుంబాభిషేక ఉత్సవాలకు కూడా ఘనంగా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. హెలికాప్టర్ జాయ్ రైడ్ల కోసం హెలిపాడ్లకు మరమ్మతులు చేయాలన్నారు. అలాగే కాళేశ్వరంలో ఆర్టీసీ బస్‌స్టేషన్ ఉన్న ప్రదేశంలో అత్యాధునిక నూతన బస్‌స్టేషన్‌ను నిర్మించాలని ఆదేశించారు.

మావోయిస్టు సోమయ్య లొంగుబాటు

- ముగిసిన 32 ఏళ్ల అజ్ఞాతవాసం
- రూ.8 లక్షల రివార్డు అందజేసిన ఎస్పీ



సోమయ్యకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ

భూపాలపల్లి అర్బన్: మావోయిస్టు జిల్లా కమిటీ కార్యదర్శి, సౌత్ బస్తర్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న మచ్చ సోమయ్య అలియాస్ సమ్మయ్య అలియాస్ సురేందర్ అలియాస్ సతీశ్ లొంగిపోయినట్లు ఎస్పీ కిరణ్‌ఖరే తెలిపారు. ఈ మేరకు శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన తెలిపిన వివరాలివి. భూపాలపల్లి మండలం పంబాపూర్ గ్రామానికి చెందిన మచ్చ సోమయ్య 32 ఏళ్ల క్రితం అప్పటి పీపుల్స్‌వార్ కార్యక్రమాలకు ఆకర్షితుడై.. మహదేవ్‌పూర్ ఏరియా కమిటీలో చేరారు. ఇప్పటి వరకు పార్టీలోనే కొనసాగుతున్న ఆయన తీవ్రవాద వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి పలు నేరాల్లో నిందితునిగా ఉన్నారు. వయోభారం, తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సోమయ్య ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో పెరిగిన తీవ్రవాద వ్యతిరేక కార్యకలాపాల కారణంగా వైద్యం అందుబాటులో లేక ఇబ్బంది పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న పునరావాస పథకాల వైపు ఆకర్షితుడై.. కుటుంబ సభ్యులతో కలిసి జీవించడానికి లొంగిపోయారు. సోమయ్యపై రూ.8 లక్షల రివార్డు ఉండగా.. ఆ మొత్తాన్ని ఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బోనాల కిషన్, స్థానిక డీఎస్పీ సంపత్‌రావు, ఎస్ఐ సుధాకర్ పాల్గొన్నారు.

మహిళా శిశు సంక్షేమంలో తెలంగాణ ఆదర్శం

మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

సాక్షి, న్యూఢిల్లీ: మహిళా శిశు సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క చెప్పారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రాజస్తాన్‌లోని ఉదయపూర్‌లో కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణాదేవి అధ్యక్షతన శనివారం చింతన్ శివిర్ కార్యక్రమం జరిగింది. సదస్సుకు తెలంగాణ నుంచి మంత్రి సీతక్క, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమం కోసం తెలంగాణలో అమలవుతున్న ప్రత్యేక పథకాలు, సాధించిన పురోగతి, కేంద్రం నుంచి ఆశిస్తున్న సహకారంపై సీతక్క ప్రసంగించారు. తెలంగాణలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలను నడుపుతున్నట్లు చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా స్వయం సహాయక బృందాల మహిళలతో.. అంగన్‌వాడీ చిన్నారులకు రంగురంగుల యూనిఫామ్‌లను ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. మహిళ, శిశు సంక్షేమం విషయంలో కేంద్ర ప్రాయోజిత పథకాల్లో కేంద్ర ప్రభుత్వ వాటా పెరగాలని సీతక్క కోరారు.



జీవో 317 బాధితుల సమస్యలు పరిష్కరించండి

మంత్రి దామోదరను కలిసిన ఉద్యోగులు

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగుల స్థానికత అంశంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని జీవో 317 బాధిత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు శనివారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిశారు. జీవో 317 బాధితుల సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులు చేసిన నేపథ్యంలో స్థానికత అంశాన్ని పరిష్కరించాలని కోరారు. ఈ అంశంపై మంత్రి రాజనర్సింహ స్పందిస్తూ, రాష్ట్రపతి ఉత్తర్వుల్లో మార్పులు చేయాల్సిన ఆవశ్యకత ఉందని, ఈ మేరకు కేంద్ర ప్రభుత్వాన్ని త్వరలో కోరనున్నట్లు హామీ ఇచ్చారు. ఉత్తర్వుల్లో మార్పులు చేసిన తర్వాత స్థానికత అంశానికి పరిష్కారం దొరుకుతుందని వివరించారు. మంత్రిని కలిసిన వారిలో ఉద్యోగ సంఘం నేతలు విజయ్‌కుమార్, నాగేశ్వరరావు, సందీప్, మధుసూదన్ తదితరులున్నారు.

25 వరకు 'మన రాజ్యాంగం, మన ఆత్మ గౌరవం'



సాక్షి, హైదరాబాద్: భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా.. బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 25 దాకా దేశవ్యాప్తంగా 'మన రాజ్యాంగం, మన ఆత్మ గౌరవం' (సంవిధాన్ గౌరవ్ అభియాన్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పలు రాష్ట్రాల్లో శనివారమే ఇది ప్రారంభం కాగా.. తెలంగాణలో సంక్రాంతి పండుగ తరవాత ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఈనెల 11 నుంచి 25 దాకా చేపడుతున్న 'సంవిధాన్ గౌరవ్ అభియాన్'లో భాగంగా.. దేశంలోని అన్ని రాష్ట్రాల రాజధానులు, ప్రధాన నగరాల్లో 50 బహిరంగ సభలు నిర్వహించనున్నారు. అన్ని జిల్లా కేంద్రాలలో ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో 'మన రాజ్యాంగం, మన ఆత్మగౌరవం' అనే అంశంపై సదస్సులు ఉంటాయి. వీటితో పాటు పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు సహా అన్ని విద్యాసంస్థల్లో 'మన రాజ్యాంగం, మన ఆత్మగౌరవం' అనే అంశంపై క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తారు. బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో ఎస్సీ హాస్టళ్లు, కాలేజీలకు వెళ్లి భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవలు, రాజ్యాంగంపై పార్టీ నిబద్ధత గురించి యువతలో ప్రచారం చేస్తారు. కార్యక్రమంలో భాగంగా.. రాష్ట్రంలోని ఎస్సీ జనాభా అధికంగా ఉన్న జిల్లాల్లో ర్యాలీలు, సమావేశాలు జరుపుతారు. 25న 'మన రాజ్యాంగం, మన ఆత్మ గౌరవం' ముగింపు సందర్భంగా.. అన్ని మండలాల ప్రజలతో పార్టీ కార్యకర్తలు సమావేశమై భారత రాజ్యాంగంలోని ప్రవేశిక, ఆదేశిక సూత్రాలను చదివి వినిపించనున్నారు.


పశు వైద్య మౌలిక వసతులతోనే వ్యాధుల నియంత్రణ

నీతి ఆయోగ్ సభ్యుడు వినోద్.కె.పాల్



సాక్షి, హైదరాబాద్: భవిష్యత్తు మహమ్మారులను ఎదుర్కొనేందుకు పశువైద్య మౌలిక సదుపాయాలను మెరుగుపరచుకోవడం ఎంతైనా అవసరమని నీతి ఆయోగ్ సభ్యుడు (హెల్త్) ప్రొఫెసర్ వినోద్.కె.పాల్ అభిప్రాయపడ్డారు. ఇందుకోసం 100 రోజుల కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. కేంద్ర పశుసంవర్ధక శాఖ, ఇండియన్ ఇమ్యూనలాజికల్స్ లిమిటెడ్, జాతీయ పాడి అభివృద్ధి బోర్డు (ఎన్‌డీడీబీ)ల సంయుక్త ఆధ్వర్యంలో 'మహమ్మారులను ఎదుర్కొనే సన్నద్ధత-వ్యాక్సిన్ ఆవిష్కరణలు' అనే అంశంపై శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ వినోద్.కె.పాల్ మాట్లాడుతూ.. వ్యాధులను త్వరగా గుర్తించి వీలున్న మేరకు అత్యవసరంగా అరికట్టేలా పశు రోగ నిర్ధారణ సౌకర్యాలను బలోపేతం చేయాలని సూచించారు. జంతువుల నుంచి సంక్రమించే వ్యాధుల నివారణకు వ్యాక్సిన్లను ఆవిష్కరించాల్సి ఉందని చెప్పారు. సదస్సులో భాగంగా వ్యాక్సిన్ల ఆవిష్కరణ, పశుసంపద వృద్ధి, మహమ్మారులను ఎదుర్కొనే సన్నద్ధత, ముందస్తు వ్యాధి నివారణ, వైద్యరంగంలో కృత్రిమ మేధ, కణ, జన్యు చికిత్స వ్యాక్సిన్ల అభివృద్ధి తదితర అంశాలపై నిపుణులు చర్చించారు. సదస్సులో పశుసంవర్ధక శాఖ కార్యదర్శి అల్కా ఉపాధ్యాయ, కమిషనర్ అభిజిత్ మిత్రా, జాయింట్ సెక్రటరీ రాం శంకర్ సిన్హా, ఇండియన్ ఇమ్యునలాజికల్స్ లిమిటెడ్ ఎండీ డాక్టర్ కె.ఆనంద్‌కుమార్, సెంట్రల్ జూ అథారిటీ సభ్య కార్యదర్శి డాక్టర్ సంజయ్ శుక్లాలతో పాటు వైద్య రంగ నిపుణులు, వ్యాక్సిన్ పరిశ్రమ నిపుణులు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని దెబ్బతీసే కుట్ర: నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో వ్యవసాయాన్ని ఒక పథకం ప్రకారం దెబ్బతీసేందుకు కుట్ర జరుగుతోందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. గతంలో అనర్హులకు రైతుబంధు ఇచ్చారని ఆరోపించిన ప్రభుత్వ పెద్దలు.. ఇప్పుడు అందరికీ ఇస్తామని చెప్తున్నారని ఎద్దేవా చేశారు. లబ్ధిదారుల ఎంపిక కలెక్టర్ల మీద నెట్టి సాగు చేసే భూములకు మాత్రమే రైతు భరోసా ఇస్తామని మెలిక పెడుతున్నారన్నారు. బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో నిరంజన్‌రెడ్డి శనివారం మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు కింద 11 విడతల్లో రూ.73 వేల కోట్లు రైతులకు ఇవ్వగా రూ.25 వేల కోట్ల వృథా జరిగిందని కాంగ్రెస్ ఆరోపించిందని తెలిపారు.

దీనిపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసినా ఏడాది కాలంగా నివేదిక ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ కృషితో సాగు విస్తీర్ణం పెరిగి 1.57 కోట్ల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వచ్చినా ప్రభుత్వం కేవలం 47 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించిందని నిరంజన్‌రెడ్డి వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాలికి ముల్లు గుచ్చుకున్నా బీజేపీ కాపాడుతోందన్నారు. కేసీఆర్, బీఆర్ఎస్‌ను బలహీన పరచడమే లక్ష్యంగా బీజేపీ పనిచేస్తోందని నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గెల్లు శ్రీనివాస్ యాదవ్, చింతం సదానందం పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు మేధావుల మద్దతు

- వచ్చేనెల 7 వరకు అమలు చేయకుంటే దండోరా తడాఖా చూపిస్తాం
- మంద కృష్ణ మాదిగ హెచ్చరిక



ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు మేధావులు మద్దతు ప్రకటించారు. శనివారం ఉస్మానియా వర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో వర్గీకరణ అమలు కోసం మేధావుల సంఘీభావ సభ జరిగింది. ఓయూ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం దీనికి అధ్యక్షత వహించగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును తెలంగాణలో తక్షణమే అమలు చేయాలని, లేని పక్షంలో మాదిగల సత్తా చూపుతామని హెచ్చరించారు. దేశంలోనే తొలి సారిగా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను అమలు చేస్తామని అసెంబ్లీలో ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి ఇంత వరకు అమలు చేయ కుండా మాటతప్పారని ధ్వజమెత్తారు. ఫిబ్రవరి 7 వరకు వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆలోపు అమలు కాకుంటే వేయి గొంతులు-లక్ష డప్పుల నిరసనతో దండోరా తడాఖా చూపిస్తామన్నారు.

వర్గీకరణ అమలు చేయాలంటూ సీఎంకు లేఖ

అనంతరం ఎమ్మెల్సీ కోదండరాం, సామాజిక వేత్త ప్రొ.హరగోపాల్, అరుణోదయ నేత విమలక్క, లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారా యణ, జస్టిస్ చంద్రకుమార్, సీనియర్ సంపాదకుడు కె.శ్రీనివాస్, నందిని సిధారెడ్డి, దేశపతి శ్రీనివాస్, నల్లగొండ గద్దర్ తదితరులు మాట్లాడుతూ వర్గీకరణకు మద్దతు ప్రకటించారు. దీనిని అమలు చేయాలంటూ సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగలేఖ రాశారు. ప్రతిభ కంటే న్యాయం ముఖ్యమని, అందరికీ సమన్యాయం దక్కాలని, అన్యాయానికి గురైన వాళ్లు ప్రశ్నిస్తే సమాజం చైతన్యవంతమవుతుందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు.

విదేశాలకు వెళ్లేందుకు అల్లు అర్జున్‌కు కోర్టు అనుమతి

ప్రతి ఆదివారం పోలీసుల ఎదుట హాజరు నుంచి మినహాయింపు



సిటీ కోర్టులు: పుష్ప–2 బెనిఫిట్ షో సమయంలో ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న హీరో అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టులో ఊరట లభించింది. తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసులో ఇటీవల నాంపల్లి కోర్టు ఆయనకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. అయితే ప్రతి ఆదివారం చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో హాజరు కావాలని కోర్టు షరతు విధించింది. ఈ నేపథ్యంలో అల్లు అర్జున్‌కు ప్రతి ఆదివారం పోలీసుల ఎదుట హాజరును మినహాయించాలని, అదేవిధంగా విదేశాలకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ.. అల్లు అర్జున్ తరఫు న్యాయవాదులు నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై వాదనలు విన్న కోర్టు ఆయనకు పోలీసుల ఎదుట హాజరును మినహాయించడంతోపాటు విదేశాలకు వెళ్లేందుకు అవకాశం ఇస్తున్నట్లు పేర్కొంది.

ప్రత్యేక అతిథులుగా మరో 41 మంది..

గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు తెలంగాణ నుంచి జాబితా విడుదల చేసిన కేంద్రం

సాక్షి, న్యూఢిల్లీ: గణతంత్ర దినోత్సవానికి తెలంగాణ నుంచి ప్రత్యేక అతిథులుగా మరో 41 మందితో కూడిన జాబితాను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. గతంలో తెలంగాణకు చెందిన 31 మందితో జాబితా విడుదల చేసిన విషయం తెలిసిందే. జనవరి 26న ఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో జరిగే గణతంత్ర దినోత్సవ పరేడ్‌ను చూసేందుకు దేశ వ్యాప్తంగా 10 వేల మంది అతిథులను కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఆహ్వానించింది. శనివారం తెలంగాణకు చెందిన మరో 41 మంది ప్రత్యేక అతిథుల పేర్లను విడుదల చేసింది. ప్రధానమంత్రి యశస్వి పథకం, టెక్స్‌టైల్ (హస్తకళలు), గ్రామీణాభివృద్ధి, ప్రధానమంత్రి జన్‌మన్ సహా పలు పథకాలకు గణనీయంగా సహకరించిన వ్యక్తులను పరేడ్‌ను వీక్షించడానికి ప్రత్యేకంగా ఆహ్వానించారు.

ఫిట్స్ వస్తే.. సీటీ స్కాన్‌కు బయటకు పంపారు

- అంత డబ్బు లేదన్నా, పట్టించుకోని ఆస్పత్రి సిబ్బంది
- ఏడు గంటలు చలిలో వణుకుతూ గడిపిన బాధితురాలు
- బీజేపీ నేతల ఒత్తిడితో చివరకు వైద్యం



ఫిట్స్ వచ్చిన మహిళను భుజాలపై మోసుకొస్తున్న కుటుంబసభ్యులు

నిజామాబాద్ నాగారం: ఫిట్స్‌తో బాధపడుతూ నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వచ్చిన ఓ మహిళకు ఆస్పత్రి సిబ్బంది చుక్కలు చూపారు. ఫలితంగా ఆ మహిళ ఆస్పత్రి ప్రధాన గేటు వద్ద చలిలో వణుకుతూ, దోమల మధ్య ఏడు గంటలు గడపాల్సి వచ్చింది. వివరాల్లోకి వెళితే...రెంజల్ మండలం దండిగుట్టకు చెందిన కేతావత్ లక్ష్మికి ఫిట్స్ రాగా శుక్రవారం మధ్యాహ్నం జిల్లా జనరల్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యుడు సీటీ స్కానింగ్ చేసుకొని రావాలని సూచించారు. రోగి, బంధువులు ఆస్పత్రిలోని సీటీ స్కానింగ్ విభాగం వద్దకు వెళితే..అక్కడి సిబ్బంది స్కానింగ్ చేయకుండా ప్రైవేట్ సెంటర్‌కు వెళ్లాలని సూచించారు. తమ వద్ద అంతగా డబ్బులు లేవని రోగి కుటుంబ సభ్యులు చెప్పినా, స్కానింగ్ సిబ్బంది పట్టించుకోలేదు. సాయంత్రం 4 గంటల వరకు అక్కడే ఉన్న రోగిని, బంధువులను ఆస్పత్రి సిబ్బంది బయటకు వెళ్లగొట్టారు. దీంతో రోగితోపాటు ఆమె భర్త, పిల్లలు, బంధువులు ఆస్పత్రి ప్రధాన గేట్ బయట రాత్రి 11 గంటల వరకు చలిలో వణుకుతూ గడిపారు. మరో వైపు రోగికి ఫిట్స్ వస్తూనే ఉన్నాయి. విషయం తెలుసుకున్న కొందరు బీజేపీ నాయకులు బాధితుల వద్దకు వచ్చారు. ఆస్పత్రి వద్ద ధర్నాకు దిగి నిరసన చేపట్టారు. దీంతో పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది రోగిని, బంధువులను లోనికి అనుమతించారు. స్ట్రెచర్‌ను తీసుకొచ్చే సిబ్బంది పట్టించుకోకపోవడంతో రోగిని బంధువులే భుజాలపై వేసుకుని ఆస్పత్రిలోకి మోసుకెళ్లారు. అనంతరం వైద్యులు రోగికి చికిత్స అందించి శనివారం సీటీ స్కానింగ్ తీశారు.

నల భీముల ‘వంట’ పండింది



- వంటల్లో చేయితిరిగిన వారికి పండుగే పండుగ
- కొత్త అల్లుళ్ల స్పెషల్స్‌కు ప్రత్యేక నియామకాలు
- నాన్‌వెజ్ మాస్టర్లకు భారీ డిమాండ్
- సహాయకులకూ బంపర్ ఆఫర్లు
- ఏపీలో సంక్రాంతికి స్వస్థలాలకు వచ్చిన వారికీ ఆదాయ మార్గాలు

కేవలం నాలుగు రోజులు వంట పని. ఉదయం సుమారు 500 మందికి టిఫిన్.. 1,500 నుంచి 2 వేల మందికి నాన్ వెజ్ వంటకాలతో మధ్యాహ్న, రాత్రి భోజనం.. సాయంత్రం స్నాక్స్. ఇవన్నీ చేయడానికి ఆరేడుగురు వంట మేస్త్రీలు, మాస్టర్లు, మహిళలు సహా పదిమందికి పైగా సహాయకులు. రోజుకు కనీసం రూ.50 వేల చొప్పున సంక్రాంతి పండుగ మొత్తం రూ.2 లక్షలకు మించి వెచ్చించే తరుణమిది. కృష్ణా జిల్లా గన్నవరం మండలం సూరంపల్లి-మాదలవారిగూడెం సమీపంలో కోడి పందేల బరివద్ద ఏర్పాట్ల కోసం ఉంగుటూరు మండలం ఇందుపల్లికి చెందిన వారితో కుదుర్చుకున్న ఒప్పందమిది.

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: వంటల్లో చేయితిరిగిన నలభీములకు సంక్రాంతి పండుగ వేళ రాష్ట్రవ్యాప్తంగా డిమాండ్ ఏర్పడింది. ముఖ్యంగా ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు తదితర ఉమ్మడి జిల్లాల్లో ఏర్పాటవుతున్న బరుల వద్ద పైతరహా ఒప్పందాలు జరిగాయి. సంప్రదాయ పిండి వంటలు, తీపి పదార్థాలు చేయడంలోనూ అనుభవజ్ఞుల పంట పండుతోంది. నాన్ వెజ్ వంటకాల్లో ప్రావీణ్యం ఉన్న ఒక్కో వంట మాస్టర్‌కు రోజుకు రూ.4 వేల నుంచి రూ.10 వేల వరకు సమకూరుతోంది. నగరాలు, పట్టణాల్లోని హోటళ్లలో పనిచేస్తున్న మాస్టర్లు కొందరు స్వస్థలాలకు వెళ్లి వస్తామంటూ తాత్కాలిక ఒప్పందాలు కుదుర్చుకుని వెళుతున్నారని ఆయా హోటళ్ల నిర్వాహకులు, యజమానులు చెబుతున్నారు.

కొత్త అల్లుళ్లు, బంధుమిత్రుల కోసం

సంక్రాంతికి ఇంటికొచ్చిన కొత్త అల్లుళ్లు, బంధువులు, స్నేహితులకు వివిధ రకాల విందు భోజనాలు ఏర్పాటు చేయాలని సంపన్నవర్గాల వారు తహతహలాడుతుంటారు. అల్లుళ్లకు మర్యాదలు చేయడంలో గోదారోళ్ల స్టైలే వేరు. కృష్ణా, గుంటూరు వాళ్లదీ అదే తీరు. వందల రకాలు వడ్డించడం వారికొక సరదా. గతేడాది ఏలూరు జిల్లాలో కొత్త అల్లుడికి 379 రకాల పదార్థాలు వడ్డించిన కుటుంబం వార్తల్లో నిలిచింది. వంద రకాలకు పైగా స్వీట్లు, నలభై రకాలకు మించి స్నాక్స్, నలభై రకాల కూరలు, ఇరవై రకాల చట్నీలు.. ఇలా విభిన్న పదార్థాలు విస్తరిలో వడ్డించి తమ ప్రేమాభిమానాలను చాటుకున్నారు. ఇలాంటివి పలు చోట్ల చోటుచేసుకున్నట్లు వార్తలు వచ్చాయి. మటన్, చికెన్, రొయ్యలు, పీతలు, కొరమీను, మెత్తళ్లు, నల్లసందువా తదితర చేపలతో వెరైటీలు చేయగలిగిన వారిని సంపన్న కుటుంబాల వారు రోజుకు లేదా గుంపగుత్తగా రూ.వేలల్లో చెల్లించి నియమించుకుంటున్నారు. వారం నుంచి పక్షం రోజుల వరకు ఇళ్లల్లోనే ఉండి కావాల్సిన వెరైటీ వంటలు చేయాల్సి ఉంటుంది. రోజుకు వేతనం రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు చెల్లిస్తున్నారని, సహాయకుడికి రూ.వెయ్యి నుంచి రూ.1,500 వరకు చెల్లిస్తారని పాలకొల్లుకు చెందిన కేటరింగ్ నిర్వాహకుడు మజ్జి శ్రీనివాస్ వివరించారు.

దమ్ చేయడం తెలిస్తే..

మటన్, చికెన్ దమ్ బిర్యానీ చేయడంలో ఆరితేరిన వారికి మంచి డిమాండ్ ఉందని విజయవాడలో పలు హోటళ్లు నిర్వహిస్తున్న మనోహర్ ‘సాక్షి’కి చెప్పారు. ఏదైనా ఒక ఈవెంట్ కోసం 2 వేల మందికి స్పెషల్స్ చేయడానికి మాస్టర్ రూ.6 వేల నుంచి రూ.7 వేలు తీసుకుంటారని, సంఖ్య అంతకు మించితే మరో మాస్టర్‌కు అంతే మొత్తం చెల్లించాల్సి వస్తుంది. మాస్టర్లకు, వారి సహాయకులకు వసతి, భోజనం, రవాణా వసతి అదనం. వివాహాలు, ఈవెంట్ల కోసం రెండు రకాల వెరైటీ స్వీట్స్ చేసే వారికి కూడా మంచి డిమాండ్ ఉందని వివరించారు.

ఇందుపల్లి వంటవారు ప్రత్యేకం

వంటలు చేయడంలో కృష్ణా జిల్లా ఇందుపల్లి వారికి రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. కృష్ణాతో పాటు పొరుగు జిల్లాలు, రాష్ట్రాల వారు కూడా ముఖ్య కార్యక్రమాలు ఉన్నప్పుడు ఇందుపల్లి వంటలకు ప్రాధాన్యమిచ్చి పిలిపించుకుంటారు. సంక్రాంతి సందర్భంగా అనేక ప్రాంతాల వారి నుంచి పిలుపులు వచ్చాయని ఇందుపల్లి ఎంపీటీసీ సభ్యుడు, వంట మేస్త్రీ అయిన కూరాకుల వెంకట్రామయ్య తెలిపారు. తమ బృందం కూడా నాలుగు రోజుల వంటలకు ఒప్పందం కుదుర్చుకుందన్నారు. అలాగే పాలకొల్లు బంగారుచెరువు గట్టు ప్రాంతంలో దాదాపు వంద మంది వరకు కేటరింగ్ నిర్వాహకులు ఉన్నారు. ఇప్పటికే వీరిలో చాలామంది సంక్రాంతి కోడి పందేల బరులు, సంపన్నుల ఇళ్లు, అతిథి గృహాలు, విల్లాల వద్ద ప్రత్యేక వంటలు చేసేందుకు ఒప్పందాలు కుదుర్చుకుని వెళ్లిపోయారు.

➤ కాకినాడ జిల్లా వేళంగి గ్రామం కూడా వంట మేస్త్రీలకు ప్రసిద్ధి. ఇక్కడ 150 మందికి పైగానే వంట మేస్త్రీలు ఉంటారు. రాష్ట్రంలోని నలుమూలలకు వెళ్లి విభిన్న రకాల వంటలు వండి వడ్డిస్తుంటారు. సంక్రాంతి పండుగ సందర్భంగా వీరికీ డిమాండ్ ఎక్కువగా ఉంది.

➤ భీమవరం సమీపంలోని చినఅమిరంలో ఆర్డర్లపై పిండి వంటలు తయారుచేసే వారున్నారు. ఎన్ని వెరైటీలు కావాలన్నా సమయానికి అందజేస్తారు. కాళ్ల మండపం కోపల్లె, తణుకు మండలం వేల్పూరు గ్రామాల్లో పిండి వంటలు తయారు చేసే మహిళలు ఎక్కువ. సంక్రాంతి రోజుల్లో ఆర్డర్లపై దేశ విదేశాల నుంచి వచ్చిన వారికి పిండి వంటలు సిద్ధం చేసి ఇస్తుంటారు.

➤ వంటలు చేయడంలో ఆరితేరిన మేస్త్రీలు, సహాయకులకు ఇంతగా డిమాండ్ పెరగడానికి మరో కారణం కూడా ఉంది. ప్రావీణ్యమున్న పలువురు పండుగ సమయంలో తమ కుటుంబీకులు, స్నేహితులతో గడపడానికి ప్రాధాన్యం ఇస్తుంటారు. ఎంత డబ్బులు ఇస్తామన్నా వంట పనికి వెళ్లరు. దీంతో పనికి సిద్ధపడేవారు కొద్దిరోజులకే జాక్‌పాట్ కొట్టినట్టే.

ఆన్‌లైన్ బుకింగ్‌పై అప్రమత్తంగా ఉండండి

- కుంభమేళాలో పాల్గొనే భక్తులకు టీజీసీఎస్‌బీ హెచ్చరిక
- నకిలీ వెబ్‌సైట్లు, లింకులను భక్తులు తెరవొద్దు
- యూపీ సర్కార్ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచన

సాక్షి, హైదరాబాద్: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరగనున్న మహాకుంభమేళాకు వెళ్లాలనుకునే భక్తులందరూ ఆన్‌లైన్ బుకింగ్‌లపై జాగ్రత్తగా వ్యవహరించాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) సూచించింది. ఆన్‌లైన్‌లో హోటల్, ధర్మశాల, గెస్ట్‌హౌస్ బుకింగ్‌ల సమయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. 45 రోజులపాటు జరిగే ఈ కుంభమేళాకు లక్షలాది మంది సందర్శకులు రానున్నందున యాత్రికులను మోసం చేయడానికి సైబర్ నేరస్తులు నకిలీ వెబ్‌సైట్లు, లింక్‌లను సృష్టించే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. ఎలాంటి రిజర్వేషన్ లేకుండానే తగ్గింపు ధరలకే వసతిని అందిస్తామంటూ మోసగాళ్లు భక్తులను ఆకర్షిస్తారని.. హోటళ్లు, ధర్మశాల, టెంట్ సిటీలకు ముందస్తు చెల్లింపులను వసూలు చేయడానికి మోసపూరిత వెబ్‌సైట్‌లు, నకిలీ బుకింగ్ లింక్‌లను ఏర్పాటు చేసే అవకాశం ఉందని పేర్కొంది.

టీజీసీఎస్‌బీ సూచనలు..

➤ అధికారిక మార్గాల్లోనే వసతిని బుక్ చేసుకోండి. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ద్వారా ధ్రువీకరించబడిన సంప్రదింపు నంబర్లు, వెబ్‌సైట్‌లను ఉపయోగించండి. ఈ అధికారిక వెబ్‌సైట్ https://kumbh.gov.in/en/Wheretostaylist అందుబాటులో ఉంది.

➤ అసాధారణంగా తక్కువ ధరలకు వసతిని అందించే తెలియని లింక్‌లు లేదా ప్రకటనలపై క్లిక్ చేయవద్దు.

➤ తెలియని ఖాతాలకు లేదా అనధికారిక బుకింగ్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ముందస్తు చెల్లింపులు చేయవద్దు.

➤ అధికారికంగా క్రాస్-చెక్ చేయడం లేదా రాష్ట్ర అధికారులను నేరుగా సంప్రదించడం ద్వారా ఏదైనా వసతి లేదా సర్వీస్ ప్రొవైడర్ ప్రామాణికతను ధ్రువీకరించుకోండి.

➤ వ్యక్తిగత లేదా ఆర్థిక సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పంచుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండండి.

➤ ఒకవేళ మోసానికి గురైనట్లయితే వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు కాల్ చేయడం ద్వారా లేదా www. cybercrime. gov. inలో అధికారిక సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌ను సందర్శించి ఫిర్యాదు చేయండి.

➤ సైబర్ భద్రతపై మరింత సమాచారం కోసం.. tgcsb.tspolice.gov.inని సందర్శించండి.

ప్రాణం కాపాడిన ఆర్టీసీ డిపో మేనేజర్

- ప్రయాణికురాలికి గుండెపోటు
- సీపీఆర్ చేయడంతో క్షేమం..

జగిత్యాల క్రైం: ఆర్టీసీ డిపో మేనేజర్ సమయస్ఫూర్తితో ఒక ప్రయాణికురాలి ప్రాణం నిలబడింది. జగిత్యాల ఆర్టీసీ బస్టాండ్‌లో ఒక ప్రయాణికురాలికి గుండెపోటు రావడంతో అక్కడే ఉన్న డిపో మేనేజర్ సునీత సత్వరమే స్పందించి ఆమెకు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు. అనంతరం 108అంబు లెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. మల్లాపూర్ మండలం సిర్పూర్ గ్రామానికి చెందిన ఉర్సు మమత కూతురు శివనందిని పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని గురుకులం పాఠశాలలో చదువుతోంది. సంక్రాంతి సెలవులకు ఆమెను తీసుకుని జగిత్యాలకు చేరింది. మల్లాపూర్‌కు వెళ్లే బస్సు కోసం వెళ్తున్న సమయంలో.. మమత స్పృహతప్పి కిందపడిపోయింది. వెంటనే అక్కడే ఉన్న డిపో మేనేజర్ సునీత ఆమెకు సీపీఆర్ చేశారు. అనంతరం 108 అంబులెన్స్‌లో జగిత్యాల ఆస్పత్రిలో చేర్పించారు.



చికిత్స పొందుతున్న మమత

తనకంటూ ఓ కుటుంబం ఉండాలని..

మూడేళ్ల బాలుడి కిడ్నాప్.. విజయవాడలో నిందితుడి అరెస్ట్



తండ్రితో మూడేళ్ల బాబు విక్కీ

మహబూబ్‌నగర్ క్రైం: పెళ్లయినా పిల్లలు పుట్టరని తెలుసుకొని.. ఎలాగైనా తనకంటూ ఒక కుటుంబం ఉండాలని భావించిన ఓ వ్యక్తి.. సమీప బంధువు కుమారుడిని కిడ్నాప్ చేశాడు. రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలను మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు శనివారం వెల్లడించారు. జడ్చర్ల మండల పరిధిలోని కొత్తతండాకు చెందిన పాత్లవత్ లాలు కొన్ని రోజులుగా జిల్లాకేంద్రంలోని పద్మావతి కాలనీలో ఉంటూ మేస్త్రీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే లాలు వద్ద సమీప బంధువు ఖిల్లాఘనపురం మండలం తిర్మాలయి పల్లికి చెందిన సభావత్ రాజు రెండు నెలలగా మేస్త్రీ పని చేస్తున్నాడు. అయితే సభావత్ రాజుకు లైంగిక సమస్యలు ఉండటంవల్ల పెళ్లి కాదని, ఒకవేళ పెళ్లి అయినా పిల్లలు పుట్టరని తెలుసుకున్నాడు. దీంతో ఎలాగైనా తనకంటూ ఒక కుటుంబం ఏర్పాటు చేసుకోవాలని భావించి పథకం ప్రకారం.. లాలు కొడుకు మూడేళ్ల విక్కీని చాక్లెట్లు, ఇతర తినుబండారాలు ఇప్పిస్తూ దగ్గర చేసుకున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 8వ తేదీన సాయంత్రం 4 గంటల ప్రాంతంలో పద్మావతి కాలనీ అంగన్‌వాడీ సెంటర్ దగ్గరకు వెళ్లి అక్కడే ఉన్న విక్కీని స్కూటీపై ఎక్కించుకుని జడ్చర్లకు తీసుకువెళ్లాడు. ఆ తర్వాత రాజుకు పరిచయం ఉన్న సావిత్రిని కలిసి, జరిగిన విషయం చెప్పకుండా ఆమెను కూడా తీసుకుని విజయవాడ వెళ్లాడు. రాజు వాడుతున్న మొబైల్ ఫోన్ ఆధారంగా పోలీసులు నిందితుడు విజయవాడలో ఉన్నట్లు గుర్తించారు. శుక్రవారం రాత్రి ప్రత్యేక టీం రాజును అరెస్టు చేసి బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

అబ్బురపరిచే పతంగులు... నోరూరించే స్వీట్లు

- రేపటి నుంచి అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్
- స్వీట్స్ ఫెస్టివల్‌లో నోరూరించనున్న 1000 రకాల స్వీట్స్..
- వివరాలు వెల్లడించిన మంత్రి జూపల్లి



పతంగులను ప్రదర్శిస్తున్న మంత్రి జూపల్లి, స్మితా సబర్వాల్

సనత్‌నగర్ (హైదరాబాద్): గగనతలాన పతంగుల సయ్యాట ఒకవైపు..దాదాపు వెయ్యి రకాల మిఠాయిల ప్రదర్శన మరోవైపు.. తమకిష్టమైన సంప్రదాయ స్వీట్స్‌ను లొట్టలేసుకుని తింటూ..వయ్యారాలు ఒలకబోస్తూ నింగి వైపు దూసుకుపోయే గాలిపటాలను తిలకిస్తూ నగరవాసులు మధురానుభూతులను ఆస్వాదించేందుకు వేళయ్యింది. ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ కైట్స్ ఫ్లైయర్స్ నగరానికి చేరుకుని పతంగుల ఫెస్టివల్‌కు మరింత జోష్ తీసుకువచ్చేందుకు సిద్ధమయ్యారు. ఇంకోవైపు ఒకటి కాదు..రెండు కాదు..29 రాష్ట్రాలకు చెందిన వెయ్యి రకాల సంప్రదాయ వంటకాలను ఒకచోటకు చేర్చి నగరవాసుల జిహ్వాచాపల్యాన్ని తీర్చేందుకు ఆయా రాష్ట్రాల మగువలు రెడీ అయ్యారు. ఈ నెల 13 నుంచి 15 వరకు మూడు రోజులపాటు జరిగే అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్స్ ఫెస్టివల్-2025కు మరోసారి సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ వేదికగా నిలవనుంది. ఇందుకు పర్యాటక శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు శనివారం బేగంపేట టూరిజం ప్లాజాలో జరిగిన సన్నాహక సమావేశానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరై ఫెస్టివల్ వివరాలను వెల్లడించారు.

హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచేలా..

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేలా అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సంక్రాంతి పండుగ రోజుల్లో పతంగులు ఎగురవేసే సంప్రదాయాన్ని కొనసాగించే విధంగా తెలంగాణ పర్యాటక శాఖ తరుపున గత ఏడేళ్లుగా కైట్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తూ వస్తున్నట్లు చెప్పారు. అలాగే వివిధ రాష్ట్రాలకు చెందిన వారు దాదాపు 1000 రకాల స్వీట్లను ఇక్కడ ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు.

కైట్ ఫెస్టివల్ తెలంగాణ ప్రత్యేకత: స్మితా సబర్వాల్

పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ మాట్లాడుతూ, కైట్ ఫెస్టివల్‌లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు హస్తకళలు, చేనేత వస్త్రాల స్టాల్స్ ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. సందర్శకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జీహెచ్ఎంసీ, పోలీసు, ఇతర శాఖల అధికా రులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. కార్యక్ర మంలో పర్యాటక శాఖ సంచాలకులు జెండగే హనుమంతు కొండిబా, భాషా, సాంస్కృతిక సంచాలకులు మామిడి హరికృష్ణ, కైట్ ఫెస్టివల్ కన్సల్టెంట్ పవన్ సోలంకి, క్లిక్ కన్వీనర్ లిబి బెంజిమన్, దేశీయ, అంతర్జాతీయ కైట్ ఫ్లైయర్స్, వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.



మురళీకృష్ణుడిగా నృసింహుడు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు శనివారం రెండవ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఉదయం శ్రీస్వామి వారిని మురళీకృష్ణుడి (శ్రీవేణుగోపాలస్వామి)గా, రాత్రి గోవర్ధనగిరిధారిగా అలంకరించారు. అలంకార సేవలను ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఈవో భాస్కర్‌రావు, ప్రధానార్చకులు, అధికారులు పాల్గొన్నారు.



విధుల్లో ప్రాణాలకు తెగించి..

విద్యుత్ తీగలకు మరమ్మతు చేస్తున్న సెస్ సిబ్బంది

సిరిసిల్ల: ఇదేదో సర్కస్ ఫీట్ అనుకునేరు. విద్యుత్ సిబ్బంది తమ విధుల్లో భాగంగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఇలా పనిచేస్తున్నారు. సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్‌లో శనివారం ‘సెస్’ సిబ్బంది నిచ్చెనపై నిల్చుని విద్యుత్ తీగకు మరమ్మతు చేస్తున్నారు. కరెంట్ తీగ తెగిపోకుండా మరో వైర్‌తో బైండింగ్ చేస్తున్నారు. పిల్లలు పతంగులు ఎగురవేస్తుండటంతో వాటి దారాలు విద్యుత్ తీగలకు చుట్టుకొని సరఫరాలో అంతరాయం కలుగుతోంది. కొన్ని సమయాల్లో విద్యుత్ తీగలు బలహీనపడి తెగిపోయే పరిస్థితి ఏర్పడుతుంది. ఇలాంటి స్థితిలోఉన్న తీగలను గుర్తించిన ‘సెస్’ సిబ్బంది నాగరాజు, శోభన్, ఎల్లారెడ్డి ఇలా నిచ్చెనను పట్టుకుంటే వెంకటేశ్ దానిపై నిల్చుని బైండింగ్ పనిచేస్తూ కనిపించారు.



చౌటుప్పల్‌లో జాతీయ రహదారిపై విజయవాడ మార్గంలో రాత్రివేళ వాహనాల బారులు

‘ఊరు’కుతున్న వాహనాలు

- సంక్రాంతి ప్రయాణాలతో రద్దీ..
- టోల్‌ప్లాజాల వద్ద వాహనాల బారులు

చౌటుప్పల్, చౌటుప్పల్ రూరల్, కేతేపల్లి/అలంపూర్: సంక్రాంతి పండుగ ప్రభావం టోల్‌ప్లాజాలపై పడింది. సంక్రాంతి సెలవులతో.. ఊళ్లకు వెళ్లే వారి వాహనాలతో హైవే నిండిపోయింది. ఆంధ్రప్రదేశ్ వైపు ప్రజలు భారీగా వెళ్తుండడంతో హైదరాబాద్-విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారిపై విపరీతమైన వాహనాల రద్దీ నెలకొంది. శుక్రవారం ప్రారంభమైన ఈ రద్దీ.. శనివారానికి మరింత పెరిగింది. హైవేపై ట్రాఫిక్ నిలిచిపోకుండా మొబైల్ పెట్రోలింగ్ ఏర్పాటు చేశారు. పంతంగి టోల్‌ప్లాజాలో విజయవాడ వైపు వెళ్లే వాహనాలను 11 విండోలు తెరిచి పంపిస్తున్నారు. కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద 8 విండోలు తెరిచారు. ఫాస్టాగ్ లేని వాహనాలను.. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నగదు కౌంటర్ ద్వారా పంపిస్తున్నారు. భారీగా వస్తున్న ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు వీలుగా పోలీసు, ఆర్టీసీ సిబ్బందిలో పాటు ప్రత్యేక సిబ్బందిని టోల్ ఏజెన్సీ నిర్వాహకులు నియమించారు. పంతంగి టోల్‌ప్లాజా వద్ద శనివారం తెల్లవారుజాము నుంచి రాత్రి 10 గంటల వరకు విజయవాడ వైపు సుమారు 95 వేల వాహనాలు వెళ్లాయి. గత సంవత్సరం సంక్రాంతి సమయంలో సుమారు 75 వేల వాహనాలు వెళ్లాయి. గత యేడాదితో పోల్చుకుంటే 20 వేల వాహనాలు అదనంగా వెళ్లాయి. అలంపూర్ చౌరస్తా సమీపంలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాలకు ఫాస్టాగ్ ఉన్నప్పటికీ స్కానింగ్ ప్రక్రియలో కొంత జాప్యం జరగడం, ఫాస్టాగ్ స్టిక్కర్లలో సమస్యలు ఉండటం తదితర కారణాలతో టోల్ దాటడానికి ఆలస్యమవుతోంది.

భారీగా పెరిగిన విమాన చార్జీలు



సాక్షి, హైదరాబాద్: సంక్రాంతి సందర్భంగా ప్రయాణికుల రద్దీ పెరగడంతో విమానాలకు సైతం అనూహ్యమైన డిమాండ్ నెలకొంది. హైదరాబాద్ నుంచి విశాఖ, విజయవాడ, తదితర రూట్లలో పలు ఎయిర్‌లైన్స్ విమాన చార్జీలను భారీగా పెంచాయి. శని, ఆదివారాల్లో విమాన చార్జీల మోత కనిపించింది. సాధారణ రోజుల్లో హైదరాబాద్ నుంచి విశాఖకు రూ.3,500 నుంచి రూ.4,000 వరకు చార్జీ ఉంటుంది. కానీ శని, ఆదివారాల్లో ఇది ఏకంగా రూ.13,409 నుంచి రూ.17,475 వరకు చేరడం గమనార్హం. అలాగే బెంగళూర్ నుంచి విశాఖకు కూడా ఇదే స్థాయి డిమాండ్ కనిపించింది. హైదరాబాద్ నుంచి విజయవాడకు రూ.10,296 వరకు చార్జీలు పెరిగాయి.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

మల్లన్నకే ప్రత్యేకం ‘బండారి’

- నిర్వికార నిరహంకారుడు ఐనవోలు మల్లికార్జునుడు
- శతాబ్దాల సంప్రదాయం.. ఘనమైన చరిత్ర
- జనపదుల సంస్కృతే మల్లన్న ఆచారం
- పరంపరానుగతంగా కాపాడుకుంటున్న భక్తులు
- నేడు బ్రహ్మోత్సవాలు ప్రారంభం


గర్భాలయంలో శ్రీమల్లికార్జునుడు

ఐనవోలు: కాకతీయుల రాజధాని ఓరుగల్లులో జాతరలకు ప్రత్యేక స్థానం ఉంది. రెండేళ్లకోసారి సమ్మక్క, సారలమ్మ జాతర, ఏటా సంక్రాంతి నుంచి ఉగాది వరకు మల్లన్న జాతరలు వైభవంగా జరుగుతాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మల్లన్న జాతరలు 13 ప్రదేశాల్లో జరుగుతాయి. ఐనవోలు మండల కేంద్రంలో జరిగే మల్లన్న జాతరకు విశిష్టత ఉంది. ఇక్కడి ఆలయం పురాతనమైనదే కాకుండా చారిత్రకంగా ప్రత్యేకతను నిలుపుకొంది. జాతర సందర్భంగా ఆలయంలో భక్తులు సమర్పించే బోనాలు, మొక్కుబడులు, ఒగ్గు పూజారులు వేసే పట్నాలు, అర్చకులు చేసే పూజలు.. భక్తుల నమ్మక వ్యవస్థ గత సంస్కృతిని ప్రతిబింబిస్తాయి. మల్లన్న దేవుని మీద, ఆలయ చరిత్రపై ఉన్న మౌఖిక కథనాలు ప్రత్యేకత చాటుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఐనవోలు గ్రామం వర్ధన్నపేట మండల పరిధిలో ఉండేది. జిల్లా, మండలాల పునర్విభజనలో భాగంగా ఐనవోలును నూతన మండలంగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇది హనుమకొండ జిల్లా పరిధిలో ఉంది. వరంగల్ బస్టాండ్ నుంచి 16 కిలోమీటర్ల దూరంలో ఆలయం ఉంది. తెలంగాణ రాష్ట్రం నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక తదితర ప్రాంతాలు, విదేశాల నుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. భక్తులు బోనం, పట్నం, వరం పట్టడం తదితర మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. ఆది, బుధవారాలు మల్లన్నకు ప్రీతికరమని పండితులు చెబుతారు. కాగా, మకర సంక్రాంతి నుంచి ఉగాది వరకు జాతర జరుగుతుంది. ఆది, బుధవారాలు ఎక్కువ సంఖ్యలో భక్తులు హాజరవుతారు. మిగిలిన రోజుల్లో సైతం భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. జనవరి 12 నుంచి మార్చి 30 వరకు సంక్రాంతి జాతర, బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.

బండారి పసుపు విశిష్టత

తెల్లబొట్టు (విభూది) పెటుకున్న వారితో మరణం ఉండకూడదని మణిమల్లాసురులనే రాక్షసులు బ్రహ్మ నుంచి వరం పొందారు. దీంతో ఆ రాక్షసులను సంహరించేందుకు మల్లికార్జునస్వామి పసుపు(బండారి) బొట్టు పెట్టుకుని గజ్జెలలాగు తొడిగి జాలి ముసుగు వేసుకుని కొరడా, త్రిశూలం, ఢమరుకంతో ప్రత్యక్షమై రాక్షసులను సంహరించాడని భక్తుల నమ్మకం. దీంతో ఆలయంలో బండారికి ప్రాధాన్యం ఏర్పడింది. భక్తులు బండారిని తీసుకొచ్చి.. కొంత స్వామి వారికి సమర్పించి.. కొంత వెంట తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తోంది.

పట్నం మల్లన్నకే ప్రత్యేకం

శైవ ఆగమం ప్రకారం ఆలయంలో తమ్మల్ల, బ్రాహ్మణులు పూజలు నిర్వహిస్తున్నారు. పూర్వాచారం ప్రకారం స్వామి వారి మేలుకొలుపు ఒగ్గు పూజారులతోనే ప్రారంభమవుతుంది. పవళింపు సేవలు సైతం వీరితోనే ముగుస్తాయి. మల్లన్న ఆలయంలో ఒగ్గు పూజారులకు విశిష్ట స్థానం ఉంది. కర్ణాటకలో పుట్టిన ఖండేలు రాయుడు కర్ణాటక నుంచి మహారాష్ట్ర వరకు పరిపాలించాడని, ఆయన ఇద్దరి భార్యల్లో బలిజ మేడలమ్మ కర్ణాటక ప్రాంత వాసి కాగా, గొల్లకేతమ్మ మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్ వాసిగా చెబుతారు. వీరే మల్లన్న క్షేత్రంలో ఉన్నట్లు ప్రజల భావనగా ఉంది. అందుకే గొల్ల, కురుమ, బలిజలకు ప్రాధాన్యం ఏర్పడింది. వీరే ఒగ్గు కథలు, పట్నాలు వేస్తూ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

శివసత్తుల విన్యాసాలు

జాతరలో ఆద్యంతం శివసత్తుల పూనకాలే కనిసిస్తాయి. శివసతులనే శివసత్తులుగా పిలుస్తున్నారు. శివునికి నాట్యమంటే ఇష్టం. స్త్రీలు శివుడిని కల్యాణం చేసుకునే సంప్రదాయం ఉంది. ఇక్కడ మహిళలు బోనం ఎత్తుకుని నృత్యాలతో పూనకాలు చేస్తుంటారు. పురుషులు కూడా మహిళల వేషధారణలో నృత్యం చేస్తూ తన్మయత్వం పొందడం గమనార్హం.

వరం పట్టడం.. టెంకాయ బంధనం

శివుడి వాహనం నంది. కోరికలు తీరితే భక్తులు కోడె(నంది)ను కడతారు. ఆలయం వెనుక భాగంలో వరం పడతారు. సంతానం కోసం టెంకాయ బంధనం, తొట్టెను కడతారు. ఎలాంటి దుష్టశక్తులు పట్టి పీడించకూడదని స్వామి వారికి మొక్కుకుంటారు. కొబ్బరికాయ, పసుపు, కుంకుమ, జాకెట్ ముక్కతో ముడుపు కడతారు. కోరికలు తీరిన తర్వాత ముడుపులు విప్పి మొక్కులు చెల్లిస్తారు.

ఒడి బియ్యం.. శావలు

పసుపు, నూనెతో కలిపిన బియ్యమే ఒడి బియ్యం. పోక, కర్జూర, గొల్లకేతమ్మ, బలిజమేడలమ్మ అమ్మవార్లకు చీరలు, గాజులు, జాకెట్ ముక్కలను, స్వామి వారికి దోతి, కండువాను సమర్పిస్తూ ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకుంటారు. గండాలు తీరితే గండ దీపం పెడుతారు. తలపై దీపం పెట్టుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తారు. కొంతమంది కోరికలు తీరితే స్వామి వారికి శావ తీస్తారు. స్వామి వారి బేల విగ్రహాలు రథంలో ఉండగా భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణగా తిప్పడాన్నే శావ తీయడం అంటారు. కొంతమంది భక్తులు తలనీలాలు సమర్పిస్తారు.

పుట్టమట్టికి ప్రాధాన్యం

స్వామి వారు పుట్టమట్టి రూపంలోనే మొదట కొలువయ్యాడని ఇక్కడి గొల్ల, కురుమలు, యాదవుల నమ్మకం. దీంతో మల్లన్నను ఇలవేల్పుగా భావించే గొల్ల, కురుమలు జాతరకు ముందు తమ ఇళ్లలో పుట్టమట్టితో మల్లన్న గద్దెలు నిర్మించుకుంటారు. రోజూ రాత్రి గద్దెలకు ప్రత్యేక పూజలు చేస్తారు. జాతర జరిగే రోజులు మద్యం, మాంసాహారం ముట్టకుండా స్వామివారి దర్శనం చేసుకుంటారు. బండారి రాసుకున్న భక్తులు కాకతీయుల నృత్య మండపంలో కొరడాల మధ్య నాట్యం చేయడం జాతరలో ప్రత్యేకం.

పట్నంలో రకాలు

పట్నంలో ప్రధానంగా చెలక పట్నం, నజరు పట్నం ఉంటాయి. పెద్దపట్నం మాత్రం మహాశివరాత్రి నాడు నిర్వహిస్తారు. చెలకపట్నం అంటే.. భక్తులు ఆలయ ప్రాంగణంలో విడిది చేసే ప్రాంతంలో వేసేది. నజరు పట్నం స్వామి వారి ఎదురుగా ప్రతినెల మాస శివరాత్రి రోజు వేస్తారు. పట్నాలు మూడు రకాలుగా ఉన్నప్పటికీ.. చేయించుకునే వారి పూర్వీకులను స్తుతించడం, స్వామివారిని కీర్తించడం, కల్యాణం చేయడం ప్రధానంగా కనిపిస్తుంది. పట్నాలు వేసిన భక్తులు బోనాలు వండి స్వామి వారికి నైవేద్యం సమర్పిస్తారు.

బోనాల సమర్పణ

కుంభాకారంలో ఉండే పాత్రల్లో బియ్యం, పాలు, బెల్లం, వంకాయ, గుమ్మడికాయ, చిక్కుడు కాయ, కాకరకాయతో పరమాన్నం వండుతారు. పచ్చి పులుసుతో కలిపి స్వామి వారికి నివేదన చేస్తారు. ఒగ్గు పూజారులు పాటల రూపంలో ఢమరుక నాధాల మధ్య దీవెనలు అందిస్తారు.

తెల్లవార్లూ ప్రభబండ్ల ప్రదక్షిణ

ఏటా సంక్రాంతి పర్వదినం రోజు ప్రభ బండ్లు (ఎడ్ల బండ్లు) ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయడం ఆనవాయితీ. పరిసర ప్రాంతాల ప్రజలు సంక్రాంతి సమయంలో రైతులు మొదటి పంటను తీసుకున్న తర్వాత ఉత్సాహంగా తమ ఎడ్లబండ్లతో ఆలయానికి చేరుకుంటారు. మార్నేని వంశస్తులు రథాన్ని అందంగా అలంకరించి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఆలయానికి చేరుకుంటారు. ఆలయ తూర్పు కీర్తితోరణం నుంచి ప్రదక్షిణ ప్రారంభమవుతుంది. మిగిలిన గ్రామాల నుంచి వచ్చిన ఎడ్లబండ్లు దానిని అనుసరిస్తాయి. రాత్రి ప్రభబండ్ల ముందు భక్తులు కోలాటాలు, నృత్యాలు చేస్తూ తెల్లవారే వరకు ప్రదక్షిణ చేస్తారు.


దక్షిణం వైపు నుంచి ఆలయం

బీఆర్‌ఎస్ కార్యాలయంపై దాడి దుర్మార్గం

సాక్షి, హైదరాబాద్: భువనగిరి జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ నేతల దాడిని ఖండిస్తున్నామని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య జీవన్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ దూదిమెట్ల బాలరాజ్‌యాదవ్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, తుంగబాలు శనివారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు ప్రజా సమస్యలపై ప్రశ్నించినందుకు.. సమాధానం చెప్పలేక దాడులు చేయించడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో విమర్శలు, ప్రతివిమర్శలు సహజమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ వచ్చాక దాడులు, విద్వేష విష సంస్కృతులు, అక్రమ నిర్బంధాలు నిత్యకృత్యమయ్యాయని ఆరోపించారు.

గాంధీభవన్‌లో చేనేతల సంబురాలు

రేవంత్ చిత్రపటానికి పాలాభిషేకం

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి చేనేత రంగానికి నిధులు కేటాయించడంపై టీపీసీసీ చేనేత సెల్ హర్షం వ్యక్తం చేసింది. టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరి శ్రీనివాస్ పిలుపు మేరకు శనివారం గాంధీభవన్‌లో చేనేత సంబురాలు నిర్వహించారు. తెలంగాణ నేతన్న పొదుపు పథకం, తెలంగాణ నేతన్న భరోసా పథకం, తెలంగాణ నేతన్న భద్రతా పథకాలకు రూ.163 కోట్లు కేటాయించడంపై చేనేత విభాగం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మస్నా రవి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు సంగిశెట్టి జగదీశ్వర్, పున్న గణేశ్, తలాటి రమేశ్, భోగ జగదీశ్ నేత, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ బాలె, చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు పెంచాకే స్థానిక ఎన్నికలు

సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచినట్టయితే.. పంచాయతీ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, జెడ్పీ చైర్మన్లుగా అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వివరించారు. డెడికేషన్ కమిషన్ రిపోర్ట్‌తో సహా అసెంబ్లీలో చట్టం చేస్తే.. రాబోయే కాలంలో ప్రభుత్వానికి ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు.

పసుపు చేను గాలి.. పసికూనలకు లాలి

నిజామాబాద్ జిల్లా ఆలూర్ మండల కేంద్రంలో పసుపు తవ్వకాలు ప్రారంభమయ్యాయి. మహారాష్ట్ర నుంచి వచ్చిన పురుష కూలీలు పసుపు తవ్వుతుండగా, మహిళలు పసుపును గంపల్లో ఎత్తుతున్నారు. వారి పిల్లలకు పసుపు చేనులోనే ఉయ్యాలలు ఏర్పాటు చేసి లాలిస్తుంటే.. మరికొందరి పిల్లలు చేనులోనే ఆడుకుంటున్న దృశ్యాలివి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్


పసుసు చేనులో ఉయ్యాలలో పడుకున్న చిన్నారి


బిడ్డను ఎత్తుకుని పసుపు తోడుతున్న కూలి


పసుపు చేనులో ఆడుకుంటున్న చిన్నారులు

పండుగ ముందే ధరల దడ



సంకాంత్రి పండుగ ముందే నిత్యావసరాల ధరల పెరుగుదలపై ప్రజలు మండిపడుతున్నారు. సగం సరుకులు కూడా కొనలేకపోతున్నామని వాపోతున్నారు.

-సాక్షి, నెట్‌వర్క్

సరుకుల ధరలు భారీగా పెరిగాయి..

గతేడాదితో పోలిస్తే బియ్యం. గోధుమ పిండి, వంటనూనెలు, బెల్లం, చక్కెర, నెయ్యి వంటి వాటి ధరలు భారీగా పెరిగాయి. నూనె ధరలు మరికాస్త పెరిగాయి. వంట నూనెల కొనుగోళ్లు తగ్గాయి. ధరలు పెరగటం వల్ల ప్రజలు పిండివంటలు తగ్గించారు. సామాన్య ప్రజలు అయితే పండుగ సరుకులు కొనటానికి వెనకాడుతున్నారు. గత ఏడాది కన్నా ఈ ఏడాది లాభాలు తగ్గాయి. తెచ్చిన ధరలకు నిత్యావసర సరుకులు విక్రయిస్తున్నాం

– కుసుమ తారాబాయి, తిలక్‌రోడ్డు, వరంగల్

అన్ని రకాల పిండివంటలు చేసుకోలేకపోయాం..

సంక్రాంతి పండుగ మూడు రోజులు జరుపుకుంటాం. పాఠశాల లకు సెలవులు రావడంతో మూడు రోజులముందే బంధువులు ఇంటికి వచ్చారు. వారు వచ్చేలోపే అన్ని సిద్ధం చేసి ఉంచాలనే ఆలోచనతో పిండివంటల తయారీలో మునిగిపోయాం. సరుకుల ధరలు పెరగడంతో అన్ని రకాల పిండివంటలు చేయలేకపోతున్నాం.

– బి.రమేష్, ఫోర్ట్ రోడ్డు, వరంగల్

నిత్యావసర ధరలు తగ్గించాలి..

పండుగ చేసుకోవాలనుకుంటు న్నా.. పెరిగిన ధరలతో ఏమి కొనేటట్టు లేదు. ప్రస్తుతం వ్యవసాయానికి పెట్టుబడులు పెట్టడంతో ఆశించినంతగా చేతిలో ఆదాయం లేకపోవడంతో కూడా గ్రామాల్లో పండుగ వాతావరణం కళ తప్పింది. ప్రభుత్వం నిత్యావసర ధరలను అదుపు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలి.

– గొట్టిముక్కల సాంబరాజు, వేలేరు, హనుమకొండ జిల్లా

గిరాకీ లేదు, సరుకులు తేలే..

రోజుకు 7 నుంచి 8 ట్రిప్పులు నడిచే ఆటో ఇప్పుడు జీరో టికెట్ వల్ల సగానికి పడిపోయింది. ఫైనాన్స్‌కు సరిపోయే డబ్బులు కూడా వస్తలేవు. సంక్రాంతి పండుగకు నాలుగు రోజుల ముందుగానే బిజీగా ఉండాల్సిన సమయంలో గిరాకీ లేక కాలక్షేపం చేస్తున్న. ఒకప్పుడు అన్నీ ఖర్చులు పోను రోజుకు రూ.1,200, రూ.1,400 వచ్చేవి.. ఇప్పుడు రూ.400 మిగలడం లేదు. గత ఏడాది పండుగతో పోల్చితే, ఈసారి ఏమాత్రం లాభం లేదు. ఇంట్లో కనీసం సరుకులు కూడా తేలేదు.

– కె.ప్రభాకర్, ఆటోడ్రైవర్, జనగామ

పండుగ గిరాకీ ఈసారి అంతంత మాత్రమే..

సంక్రాంతి పండుగ వాతావరణం పల్లెల్లో అంతంత మాత్రంగానే కనిపిస్తోంది. కిరాణా షాపుల్లో గిరాకీ కూడా ఇప్పుడిప్పుడే పుంజుకుంటుంది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి తక్కువే. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో ప్రజలు కూడా పిండి వంటలపై ఆసక్తిని తగ్గించుకున్నారు. అరకొరగా చేసుకుంటున్నారు. దీంతో గిరాకీ మామూలుగానే ఉంటుంది.

– కొయ్యడ రవీందర్, ఓ మార్ట్ యాజమాని, వేలేరు

సగానికి పడిపోయింది

సంక్రాంతి సీజన్‌లో రోజుకు రూ.70 వేల వరకు సరుకులు అమ్మేది. ఈ ఏడాది పండుగ సీజన్‌లో రోజుకు రూ. 35 వేల వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. గతంతో పోల్చితే ధరలు పెరగడం ఒక కారణం అయితే మాల్స్, సూపర్ మార్కెట్‌లతోపాటు ఆన్‌లైన్‌తో మా గిరాకీ పూర్తిగా పడిపోయింది.

చంద్రశేఖర్, కిరాణా షాప్ యజమాని, సిద్దిపేట

ధరలు పెరిగిపోయాయి....

నిత్యావసర సరుకుల ధరలు భాగా పెరిగిపోయాయి. దీంతో ఖర్చు ఎక్కువైంది. పప్పులు, నూనెలకు ధరలు పెరగడంతో పిండివంటలు చేసుకోవాలంటేనే భయమేస్తుంది. మాది పెద్ద కుటుంబం...మా పిల్లల కోసం సంక్రాంతికి అప్పాలు చేయాలి. ఇతర ఖర్చులు తగ్గించుకొని గతేడాది కంటే తక్కువగా అప్పాలు చేసుకుంటున్నాం.

– చంద్రకళ, సిద్దిపేట


భారతరత్న మాజీ ప్రధాని, శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి వర్ధంతి సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

మాంజాపై 2017లోనే నిషేధం



సాక్షి, హైదరాబాద్: నైలాన్, సింథటిక్‌తో తయారు చేసిన లేదా పూత పూసిన మాంజాపై జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) 2017లో నిషేధం విధించింది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ప్రధాన కార్యదర్శులు ఈ మేరకు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించింది. అంతేకాదు, ఇలాంటి దారం దిగుమతిని కూడా నిషేధించాలని స్పష్టం చేసింది.

సీపీసీబీ ఉత్తర్వులివి..

ఎన్‌జీటీ ఆదేశాన్ని పాటిస్తూ జల (నివారణ మరియు నియంత్రణ) చట్టం-1974, వాయు (నివారణ మరియు నియంత్రణ) చట్టం-1981లోని సెక్షన్ 18(1) (బీ) కింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సీపీసీబీ) రాష్ట్రాలకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు..

- గాలిపటం ఎగురవేయడానికి వినియోగించే చైనా మాంజా, నైలాన్, సింథటిక్ మెటీరియల్, గ్లాస్-కోటెడ్ దారం తయారీ, అమ్మకం, నిల్వ, కొనుగోలు, వాడకం నిషేధం
- దేశంలో ఎక్కడ చైనా మాంజా, నైలాన్, సింథటిక్, గ్లాస్-కోటెడ్ దారాన్ని తయారు చేయకూడదు.
- రేయాన్, టైర్ కార్డ్, పాలిస్టర్ ఫిల్మెంట్ నూలుతో సహా సింథటిక్ ఫైబర్ తయారీ యూనిట్లు తమ ఉత్పత్తులను చెల్లుబాటయ్యే వినియోగదారులకు మాత్రమే సరఫరా చేయాలి. ఎవరికి పడితే వారికి ఇష్టారాజ్యంగా విక్రయించొద్దు. చైనా మాంజా, నైలాన్, సింథటిక్, గ్లాస్-కోటెడ్ దారాన్ని తయారు చేయడం లేదని ప్రతీ ఏడాది స్వీయ ప్రకటన సమర్పించాలి.
- చైనా మాంజా, నైలాన్, సింథటిక్, గ్లాస్-కోటెడ్ దారం తయారీ, అమ్మకం, నిల్వ, కొనుగోలు, వాడకంపై నిషేధాన్ని వార్తాపత్రికలు, ఇతర మీడియాలో విస్తృత ప్రచారం ఇవ్వాలి.

క్లుప్తంగా...

శ్రీగిరిలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి అంకురార్పణ చేశారు. శనివారం ఉదయం 8.45 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఆగమ శాస్త్రానుసారంగా ఉత్సవ ప్రారంభ క్రతువులు జరిపించారు. బ్రహ్మోత్సవ ప్రారంభ సూచికంగా దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు దంపతులు, అధికారులు, ఆలయ అర్చకులు, వేద పండితులు సంప్రదాయబద్ధంగా యాగశాల ప్రవేశం చేశారు. అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా ప్రారంభ పూజలను నిర్వహించారు. సంక్రాంతి బ్రహ్మోత్సవాలకు సాయంత్రం 5.30 గంటలకు అంకురార్పణ చేశారు. అలాగే ముక్కోటిదేవతలను, సకల సృష్టిని బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించేందుకుగాను ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కాణిపాకంలో ఎలక్షన్ కమిషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ



కాణిపాకం: రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ చక్రవర్తి శనివారం చిత్తూరు జిల్లా కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామిని దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆశీర్వచన మండపంలో పండితులు ఆశీర్వచనాలు చేసి ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

వైఎస్సార్ జిల్లా డీఈఓపై చర్యలు తీసుకోవాలి..

కమిషనర్ స్కూల్ ఎడ్యుకేషన్‌కు ఉపాధ్యాయ సంఘాల ఫిర్యాదు

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయులకు తీవ్రంగా దుర్భాషలాడుతూ, మానసిక క్షోభకు గురిచేస్తున్న వైఎస్సార్ జిల్లా విద్యాశాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్ రెడ్డి, ఎస్టీయూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, ఎస్ఎల్‌టిఏ రాష్ట్ర అధ్యక్షుడు అంకాల కొండయ్య , ఎస్టియు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి , ఎస్సీసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీ.వీ. సుబ్బారెడ్డిలు కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విజయరామరాజుకు ఫిర్యాదు చేశారు. ఈ డీఈవో మాకొద్దంటూ జిల్లాలోని 27 ఉపాధ్యాయ సంఘాలు ముక్తకంఠంతో విబేధిస్తునాయని, ఈమెపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఉద్యమ కార్యాచరణకు సైతం సిద్ధమయ్యాయన్నారు. జనవరి 9 నుంచి 12 వరకు జిల్లాలోని ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను కలిసి వినతి పత్రాలు సమర్పించడం, 23, 24 తేదీల్లో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జిలతో నిరసన కార్యక్రమాలు, 28, 29 తేదీల్లో రోజంతా నల్ల బ్యాడ్జీలతో బోధన చేయాలని, ఫిబ్రవరి ఒకటో తేదీన డీఈవో కార్యాలయం ముట్టడించాలని, 3,4 తేదీల్లో గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించాలని, 5 నుంచి 14వ తేదీ వరకు రిలే నిరాహార దీక్షలు , 19న మాస్ క్యాజువల్ లీవ్, మార్చి 1 నుంచి ఆమరణ నిరాహార దీక్షలు చేపట్టేలా ఉద్యమ కార్యాచరణ ప్రకటించాయని తెలియజేశారు.

నెల్లటూరులో శాతవాహనుల కాలంనాటి వస్తువుల గుర్తింపు



చిల్లకూరు: తిరుపతి జిల్లా గూడూరు సమీపంలో ఉన్న నెల్లటూరు ప్రాంతంలో శాతవాహనుల కాలంనాటి ఆనవాళ్లు కనిపించినట్లు తిరుపతిలోని ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలకు చెందిన గెస్ట్ లెక్చరర్ శనివారం తెలిపారు. గత వారంలో గూడూరు ఎస్‌కే ఆర్ కళాశాలలో జరిగిన హిస్టరీ కాంగ్రెస్‌కు హాజరైన సమయంలో ఈ ప్రాంతంలో పలు ప్రాచీనమైన విషయాలు ఉన్నాయని గుర్తించి అందులో భాగంగా గూడూరుకు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న నెల్లటూరును ఎంపిక చేసుకుని అక్కడ ఉన్న కోట దగ్గర పరిశోధనలు చేయడం జరిగిందన్నారు. అక్కడ ఉన్న కోట ఉపరితల భాగంలో పూసలు, చేతి గాజుముక్క, ఎరుపు రంగు కుండ పెంకులు, నలుపురంగు కుండ, పెంకులు, ఇటుక, గ్రూవుడ్ టైల్స్, టెర్రకోట పైపు ముక్క, క్రుసిబిల్, జార్‌లెగ్స్, జంతువుల ఎముకలు మొదలైనవి గుర్తించామని తెలిపారు. ఇవి సూళ్ళూరుపేట నియోజకవర్గంలోని గొట్టిప్రోలు ప్రాంతంలో దొరికిన పురాతన వస్తువులతో పోలి ఉన్నాయని అన్నారు. ఈ వస్తువులు శాతవాహన కాలానికి చెందినవై ఉండవచ్చని అన్నారు. ఈ ప్రాంతంలో ఏపీ పురావస్తు విభాగం రక్షిత కట్టడాల జాబితాలో ఉందన్నారు. ఇక్కడ దొరికిన అరుదైన వస్తువులను విజయవాడకు చెందిన మ్యూజియం విభాగం అధికారికి అప్పగిస్తామన్నారు.

వనం నుంచి జనంలోకి..



జీవించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉన్నట్లుగానే వన్యసంరక్షణ చట్టం ప్రకారం అడవి జంతువులకు స్వేచ్ఛగా జీవించే హక్కు కూడా ప్రభుత్వం కల్పించింది. అయితే ఇటీవలి కాలంలో అడవి విస్తీర్ణం తగ్గుతుండడం, ఆ ప్రాంతాల్లో తాగునీటి వసతి తగ్గడంతో దాహార్తి తీర్చుకొనేందుకు పలు మూగజీవులు జనారణ్యంలోకి వచ్చి ప్రాణాలు కోల్పోతున్నాయి.

- దాహార్తి తీర్చుకునేందుకు వస్తున్న వన్యప్రాణులు
- రోడ్డుపై వాహనాలు ఢీకొనికొన్ని..
- కుక్కల దాడిలో మరికొన్ని బలి
- సంరక్షణ చర్యలు అత్యవసరం

ఆత్మకూరు: నెల్లూరు జిల్లా ఆత్మకూరు అటవీ శాఖ రేంజ్ పరిధిలో పెంచలకోన, ఉదయగిరి ప్రాంతాలను కలుపుకొని 1.57 లక్షల హెక్టార్ల అటవీ విస్తీర్ణం ఉంది. పెంచలకోన అభయారణ్యంలో చిరుతలు ఉన్న విషయం తెలిసిందే. అప్పుడప్పుడు ఆహారం, తాగునీటి కోసం అవి జనారణ్యంలోకి కూడా వస్తున్నాయి. చుక్కల దుప్పిలు, జింకలు లాంటి మూగజీవాలు కూడా దాహార్తి తీర్చుకునేందుకు అటవీ సమీప గ్రామాల్లోకి వచ్చి కుక్కల దాడికి గురై ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. నాలుగు నెలల వ్యవధిలో మర్రిపాడు, అనంతసాగరం, సంగం మండలాల పరిధిలో 8 జంతువులు ఇలా జనారణ్యంలోకి వచ్చి మూడు ప్రాణాలు కోల్పోగా, ఐదింటిని ఆయా గ్రామస్తులు కాపాడి అటవీ శాఖ అధికారుల సహకారంతో తిరిగి అడవుల్లో వదిలేశారు.

- నాలుగు నెలల క్రితం బద్వేల్ నుంచి నెల్లూరుకు వెళ్తున్న కారుపై కదిరినాయుడుపల్లి సమీపంలో నెల్లూరు – ముంబై రహదారిలో చిరుతపులి దాడి చేయడంతో వాహనం ముందు భాగం దెబ్బతింది. దాడికి పాల్పడిన జంతువు పరారైంది.
- అనంతరం కొద్ది రోజులకు కదిరినాయుడుపల్లి అటవీ ప్రాంతంలోనే అడవుల్లో సంచరించే బేస్ క్యాంపు సిబ్బందిపై రెండు ఎలుగుబంట్లు దాడికి పాల్పడ్డాయి. సిబ్బంది అప్రమత్తం కావడంతో అవి పారిపోయాయి. ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి.
- రెండు నెలల క్రితం పడమటినాయుడుపల్లి గ్రామ శివారు మాగాణి పొలాల్లో దాహార్తి తీర్చుకొనేందుకు వచ్చిన చుక్కల దుప్పి నేలబావిలో పడింది. సమీపంలోని రైతులు గమనించి అటవీ శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు దానిని రక్షించి తిరిగి అడవిలోకి వదిలేశారు.
- మరో సంఘటనలో పడమటినాయుడుపల్లి గ్రామంలోకి దాహార్తి తీర్చుకొనేందుకు వచ్చిన చుక్కల దుప్పిపై కుక్కలు దాడి చేయడంతో మృత్యువాతపడింది.
- అనంతసాగరం మండలం మంచాలపల్లి గ్రామంలోకి వచ్చిన చుక్కలదుప్పి రోడ్డు దాటుతూ గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందిన ఘటన మూడు నెలల క్రితం జరిగింది.



నెల్లూరు - ముంబయి రహదారికి సమీపంలో వెలుగొండ అడవిలో సంచరిస్తున్న పులులు (ఫైల్)

మానవత్వంతో వ్యవహరించాలి



ఇటీవల కాలంలో అడవుల విస్తీర్ణం తగ్గుతుండడం, అడవిలో తాగునీటి వనరులు తగ్గిపోవడంతో పలు జంతువులు రోడ్లపైకి వస్తున్నాయి. ఇలా వస్తున్న జంతువుల పట్ల ప్రతి ఒక్కరూ మానవత్వంతో వ్యవహరించి వాటిని కాపాడాలి. నా వంతుగా ప్రతి ఏటా వేసవి నాలుగు నెలల పాటు నెల్లూరు – ముంబయి రహదారికి సమీపంలోని అటవీ ప్రాంతంలో కొంత లోపలి వైపునకు ట్యాంకర్‌తో నీళ్లు తీసుకువెళ్లి తొట్టెల్లో నింపిస్తున్నాను.

– డి.శ్రీలత, పంచాయతీ కార్యదర్శి, మర్రిపాడు

సంరక్షణ మన బాధ్యత



ప్రతి ఒక్కరూ అవకాశం ఉన్నంత మేర అడవి జంతువుల పట్ల దయతో వ్యవహరించాలి. దారి తప్పి అడవి సమీప గ్రామాల్లోకి వస్తే వాటిని కాపాడి అటవీ శాఖ అధికారులకు తెలిపి తిరిగి అడవిలోకి వదిలేలా సహకరించాలి. నా వంతుగా మా గ్రామ సమీపంలోకి వచ్చిన అడవి దుప్పులు, జింకలను కుక్కలబారిన పడకుండా రక్షించి పలుమార్లు తిరిగి అడవి ప్రాంతంలోకి పలువురి సహకారంతో వదిలేశా. జంతువుల సంరక్షణకు అందరూ కృషి చేయాలి.

– మదుపూరు సుబ్బారాయుడు, జంతు ప్రేమికుడు, మర్రిపాడు



బోటులో సోలార్ డిస్టిలేషన్ మెషిన్ ఏర్పాటు చేస్తున్న ప్రసన్న

బోటులోనే మంచినీటి తయారీ

- సోలార్ డిస్టిలేషన్ మెషిన్ రూపొందించిన యువతి
- ఆవు మూత్రం నుంచీ మంచినీరు తీయొచ్చు
- రోజ్ వాటర్, జాస్మిన్ వాటర్ సైతం ఇదే మెషిన్ నుంచి
- ఉప్పాడలో ప్రయోగాత్మకంగా పరిశీలన

పిఠాపురం: విద్యుత్ అవసరం లేకుండా సౌరశక్తిని ఒడిసిపట్టి తక్కువ ఖర్చుతో సముద్రపు నీటిని మంచినీటిగా మార్చే సోలార్ డిస్టిలేషన్ పరికరాన్ని ఓ యువతి రూపొందించారు. రోజుల తరబడి సముద్రంలో చేపల వేట సాగించే మత్స్యకారులు మంచినీటి కోసం పడే ఇబ్బందులను తొలగించేందుకు దీనిని ఆవిష్కరించినట్టు వైఎస్ ప్రసన్న చెప్పారు. హైదరాబాద్ బిట్స్ పిలానీ క్యాంపస్‌లో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ప్రసన్న పీహెచ్‌డీ పరిశోధనలో భాగంగా ఈ పరికరాన్ని తయారు చేశారు. దీంతో ఎలాంటి మురికి నీటినైనా మంచినీటిగా మార్చుకోవచ్చని చెప్పారు. పరిశోధనలో భాగంగా తాను తయారు చేసిన యంత్రాన్ని ఇటీవల కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ వద్ద సముద్రంలో ప్రయోగాత్మకంగా బోటులో అమర్చి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం ఇంట్లో కూడా నీటిశుద్ధి పరికరాలను అమర్చుకోవడం సాధారణంగా మారిపోయిందన్నారు. ఇప్పటివరకూ అందుబాటులోకి వచ్చిన అనేక నీటిశుద్ధి యంత్రాలు అధిక ఖర్చుతో కూడుకున్నవన్నారు. ఈ నేపథ్యంలో అతి తక్కువ ఖర్చుతో విద్యుత్ అవసరం లేకుండా ఎక్కడైనా.. ఎప్పుడైనా నీటిని శుద్ధి చేసుకునే యంత్రాన్ని తయారు చేయాలనే పట్టుదలతో సోలార్ డిస్టిలేషన్ మెషిన్ తయారు చేశానని ప్రసన్న చెప్పారు. సముద్రంలో రోజుల తరబడి చేపల వేట సాగించే మత్స్యకారులకు అందుబాటులోకి తీసుకురావాలన్న ఉద్దేశంతో ప్రయోగాత్మకంగా పరిశీలించేందుకు వచ్చానన్నారు. ఈ యంత్రం విజయవంతంగా పని చేస్తోందన్నారు.

గోమూత్రం నుంచి సైతం..



తన ప్రొఫెసర్ సందీప్ ఎస్.దేశ్‌ముఖ్ ప్రోత్సాహంతో దీనిని తయారు చేశానని ప్రసన్న తెలిపారు. ఎక్కడ కావాలన్నా ఈ యంత్రాన్ని అమర్చుకోవచ్చన్నారు. ఒక రోజుకు ఒక కుటుంబానికి అవసరమైనంత నీరు ఇందులో తయారవుతుందని చెప్పారు. ఈ యంత్రం ద్వారా రోజ్ వాటర్, జాస్మిన్ వాటర్, అత్తరు వంటి వాటితో పాటు ఆవు మూత్రాన్ని శుద్ధి చేసి గోమాత ఆర్కా (దీనిని ఆయుర్వేద మందుల తయారీలో ఉపయోగిస్తారు) తయారు చేయవచ్చని వివరించారు. గోమూత్రాన్ని ఒకసారి వేస్తే గోమాత ఆర్కా వస్తుందని, మూడుసార్లు వేస్తే పూర్తిగా శుద్ధి జరిగి మంచినీటిగా మారుతుందని చెప్పారు. ప్రభుత్వం సహకరిస్తే ఈ మెషిన్‌ను అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తానన్నారు. ఇప్పటివరకూ చాలా పరికరాలు అందుబాటులోకి వచ్చినా ఎటువంటి అదనపు ఖర్చు, వృథా లేకుండా రూపొందించిన మొట్టమొదటి చిన్న పరికరం ఇదేనని ఆమె చెప్పారు.

గుమ్మడి కాయలతో గిరిజనులకు విడదీయరాని బంధం ఉంది. ఒకప్పుడు వారికి నిత్యవంటకంగా ఉండే గుమ్మడి ఇప్పుడు మంచి ఆదాయ వనరుగా మారింది. సహజసిద్ధంగా కాయడం వల్ల వీటికి మంచి డిమాండ్ ఉంది. వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేసి తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. సంక్రాంతి పండగ నాడు వీటి వినియోగం ఎక్కువకావడంతో మన్యంలోని వారపు సంతల్లో అమ్మకాలు జోరందుకున్నాయి.



హుకుంపేట మండలం మఠం గ్రామంలో జామచెట్టుకు వేలాడదీసిన గుమ్మడికాయలు

గుమ్మడికి పండగే



తీగలవలసలో పాదును కాసిన గుమ్మడికాయ

- రుచిలో మేటి
- ప్రతి ఇంటా నిత్య వంటకం
- పుణ్యక్షేత్రాల్లోని నిత్యాన్నదానంలో వినియోగం
- ఇంటిపెరటితోపాటు కొండపోడులో సాగు
- మన్యం నుంచి నాలుగు రాష్ట్రాలకు ఎగుమతి
- వారపు సంతల్లో అమ్మకాల జోరు

మన్యం పండ్లకు నాలుగు రాష్ట్రాల్లో ఖ్యాతి



సాక్షి,పాడేరు: అల్లూరి జిల్లా మన్యంలో గిరిజనులు గుమ్మడిని ప్రత్యేకంగా సాగు చేయరు. ఇంటి పెరట్లో, ఖాళీ స్థలాలు, కొండపోడు భూముల్లో విత్తనాలు చల్లుతారు. పాదుకు 20 నుంచి 30 కాయల వరకు కాస్తాయి. చాలామంది గిరిజనులు గుమ్మడి కాయను నిత్య వంటకానికి ఉపయోగిస్తున్నారు. ఎంతో ఇష్టంగా తినడం వల్ల ఇంటికి వచ్చే అతిథులకు గుమ్మడి కూర వండి పెడుతుంటారు. లేత పిందెలతో కొంతమంది కూర తయారు చేస్తుంటారు.

- గుమ్మడిలో పోషక విలువలు ఎక్కువ ఉన్నందున వినియోగం పెరిగింది. కొంతమంది గిరిజనులు పిందె దశలో ఒక్కొక్కటి రూ.20 నుంచి రూ.30కు విక్రయిస్తున్నారు. బాగా పండిన కాయను రూ.50 నుంచి రూ.80కు అమ్ముతున్నారు. ఎటువంటి పెట్టుబడి పెట్టకుండా ఒక్కొక్క గిరిజనుడు రూ.2వేల వరకు ఆదాయం పొందుతున్నారు.
- ఏజెన్సీలో జరుగుతున్న వారపు సంతల్లో గుమ్మడి అమ్మకాలు జోరందుకున్నాయి. ఈ ప్రాంతం నుంచి నాలుగు రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. మంగళవారం జి.మాడుగుల, బుధవారం కించుమండ, చింతపల్లి, గురువారం గుత్తులపుట్టు, మజ్జిగరువు, శుక్రవారం పాడేరు, అరకు వారపు సంతల్లో గుమ్మడికాయల వ్యాపారం భారీగా జరిగింది. వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేశారు.

పుణ్యక్షేత్రాలకు..

తిరుమల తిరుపతి, సింహాచలం, అన్నవరం, శ్రీశైలం వంటి పుణ్యక్షేత్రాల్లోని నిత్యాన్నదానంకు మన్యం గుమ్మడికాయలను వినియోగిస్తున్నారు. స్థానికంగా కొనుగోలు చేసి దేవస్థానాలకు సరఫరా చేస్తుంటారు. సేంద్రియ పద్ధతిలో గిరిజనులు సాగు చేయడం వల్ల దేశవాళి గుమ్మడికాయలు మంచి రుచికరంగా ఉంటాయి. అందువల్ల మార్కెట్లలో కూడా మంచి డిమాండ్ ఉంది.

పండగ సీజన్‌లో..: సంక్రాంతి సీజన్‌లో వినియోగం ఎక్కువగా ఉన్నందున వ్యాపారులు గిరిజనుల వద్ద పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. దీంతో వారు మంచి ధర పొందుతున్నారు. ప్రస్తుతం సీజన్ మొదలవడంతో గిరిజనులు అమ్మకాల్లో నిమగ్నమయ్యారు. వారపు సంతల్లో వ్యాపారం జోరందుకుంది.

గుమ్మడి బంధం

సంక్రాంతి పండగతో గుమ్మడి కాయకు సంబంధం ఉంది. మకర సంక్రాంతి రోజున సూర్యుడు మకరరాశిలో ప్రవేశిస్తాడు. మకర రాశికి అధిపతి శని భగవానుడు. ఆ రోజు తెలకపిండి నలుగుతో స్నానం చేసి శనీశ్వరుని ప్రీతి కోసం నువ్వులు, గుమ్మడి కాయలు దానం చేయడం మైదాన ప్రాంతాల్లో పూర్వం నుంచి ఆనవాయితీగా వస్తోంది. గుమ్మడి పండు భూమండలానికి ప్రతీక. దీనిని పేదలకు, బ్రాహ్మణులకు దానం చేస్తే భూదేవితో పాటు శ్రీమహా విష్ణువు అనుగ్రహం లభిస్తుందని ప్రజల విశ్వసిస్తుంటారు.

పోషక విలువలెన్నో..

- గుమ్మడికాయను తరచూ తీసుకోవడం వల్ల ఎముకల దృఢత్వానికి కావాల్సిన కాల్షియం పుష్కలంగా అందుతుంది. దీనివల్ల కీళ్లనొప్పులు, మోకాళ్లనొప్పులు, బోలు ఎముకల వ్యాధి వంటి రోగాలు దరి చేరవు. ఫైబర్ జీర్ణ వ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి దోహదపడుతుంది. కంటి ఆరోగ్యం మెరుగుకు ఉపయోగపడుతుంది. విటమిన్ సి, యాంటీ బాక్టీరియల్ గుణాలు పుష్కలంగా ఉన్నందున రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో ఉపయోగపడుతుంది. శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను కరిగించడమే కాకుండా, అధిక బరువును నియంత్రణలోకి తెస్తుందని పోషణ నిపుణులు చెబుతున్నారు.

నిత్య వంటకం

గిరిజనులంతా గుమ్మడికాయలను ఏడాది పొడవునా దాచుకుంటూ నిత్య వంటకంగా వినియోగిస్తుంటారు.అలాగే ఇంటికి వచ్చే చుట్టాలు, బంధువులకు కూడా వీటి వండి పెడుతారు. సంక్రాంతి, ఇతర పండగల సమయంలోను గుమ్మడికాయలను కోసి గ్రామాల్లో ఒకరికొకరు పంచుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ముదిరిన గుమ్మడికాయలు పాడవకుండా ఉండేలే ఇంటి పరిసరాల్లో ఉండే జామ, మామిడి, పనసవంటి చెట్లకు వేలాడదీసి భద్రపరుస్తారు. చెట్టుకు కట్టిన గుమ్మడికాయలను దొంగిలించే పరిస్థితి కూడా ఉండదు.



పాడేరులో వ్యాపారులు కొనుగోలు చేసిన గుమ్మడికాయలు

రూ.50 ధరకు అమ్మా



ఇంటి పరిసరాలతో పాటు కొండపోడులో గుమ్మడి విత్తనాలు చల్లాం. దిగుబడి బాగానే ఉంది. గుమ్మడికాయలను పిందెల సమయం లోనే వంట వండుకు తిన్నాం. బాగా పండిన తరువాత అరకు సంతలో రెండు దఫాలుగా అమ్మాం. ఒక్కొక్క కాయ రూ.50కు విక్రయించగా రూ.వెయ్యి ఆదాయం వచ్చింది. కొన్ని కాయలను తిండి అవసరాలకు దాచుకున్నాం.

– వంతాల చంపా, నందివలస, దుంబ్రిగుడ మండలం

గ్రామాల్లోకి వచ్చి కొంటున్నారు



గతంలో గుమ్మడికాయలను అమ్మేవారిమి కాదు. వ్యాపారులు గ్రామాలకే వచ్చి గుమ్మడికాయలను కొంటుండడంతో పాదులు ఎక్కువ వేస్తున్నాం. గుమ్మడికాయలు సాగు చేయడం ద్వారా వచ్చే నగదును తమ అవసరాలకు ఉపయోగించుకుంటాం. గుమ్మడితో తమకు విడదీయరాని బంధం ఉంది. ఆచార సంప్రదాయంలో భాగంగా పండిస్తుంటాం.

– కిల్లో కమలమ్మ, జోడిగుడ, హుకుంపేట మండలం

పెరుగుతున్న వినియోగం



సహజసిద్ధంగా పండుతున్న గుమ్మడి పండ్లను నాలుగు రాష్ట్రాల్లో ఎక్కువగా వినియోగిస్తున్నారు. గతంలో తెలుగు రాష్ట్రాల్లో మార్కెట్లకు మాత్రమే ఎగుమతి చేసేవాళ్లం. ఇప్పుడు ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో రాష్ట్రాల్లో వినియోగం భాగా పెరిగింది. పోషక విలువలు ఎక్కువగా ఉండటంతో ఆయా రాష్ట్రాల ప్రజలు కూడా వంటకాల్లో వినియోగించేందుకు ఆసక్తి చూపుతున్నారు. అందువల్ల మార్కెట్లలో పోటీపడి కొనుగోలు చేస్తున్నాం.

– వెంకట అప్పారావు, గుమ్మడి వ్యాపారి, పాడేరు

కొబ్బరికి ఊపిరి పోయండి

- నేడు కోకోనట్ బోర్డు వ్యవస్థాపక దినోత్సవం
- రావులపాలెంలో నిర్వహణ
- ప్రోత్సాహకాలు కోరుతున్న కొబ్బరి రైతులు

సాక్షి, అమలాపురం: కొబ్బరి సాగు విస్తీర్ణంలో మన రాష్ట్రం నాలుగో స్థానంలో ఉంది. కొబ్బరి కాయల సగటు ఉత్పత్తిలో మొదటి స్థానంలో నిలిచింది. కానీ కొబ్బరి అభివృద్ధి బోర్డు (సీడీబీ) ద్వారా అందుతున్న ఫలాలు అందుకోవడంలో మాత్రం ఆఖరి స్థానంలో నిలుస్తోంది. కొబ్బరి సాగు విస్తరణ, తెగుళ్ల వంటి వాటి నివారణ, సాగులో సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్ అవకాశాలు పెంపొందించడం వంటి కార్యక్రమాలు చేపట్టేందుకు ఏర్పాటు చేసిన కొబ్బరి అభివృద్ధి బోర్డు (సీడీబీ) ఏర్పడి ఆదివారం నాటికి 45 ఏళ్లు. కేరళలోని కొచ్చి కేంద్రంగా దీనిని ఏర్పాటు చేశారు. 45 ఏళ్లు అవుతున్న నేపథ్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలోని కాస్మోపాలిటన్ రిక్రియేషన్ క్లబ్ (సీఆర్‌సీ) వద్ద సీడీబీ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న సదస్సులో సీడీబీ ఉన్నతాధికారులు, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో పాటు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి రైతులు పాల్గొంటున్నారు.

సీడీబీ రీజనల్ సెంటర్ ఏర్పాటుచేయాలి


రాష్ట్రంలో సుమారు 3.10 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగవుతోందని అంచనా. సీడీబీ ఏర్పాటు చేసి ఇన్నేళ్లవుతున్నా దేశంలో కొబ్బరి సాగులో నాలుగో స్థానంలో ఉన్న మన రాష్ట్రానికి పెద్దగా ప్రయోజనం చేకూరడం లేదు. రాష్ట్రంలో సీడీబీకి సంబంధించి కేవలం స్టేట్ సెంటర్ మాత్రమే ఉంది. ఈ ప్రాంత రైతులు రాష్ట్రంలో సీడీబీ రీజినల్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. సీడీబీ పరిధిలో కొబ్బరి అధికంగా పండే కేరళ, తమిళనాడు, కర్ణాటకతో పాటు కొబ్బరి సాగు అంతగా జరగని అస్సాం, బిహార్‌లో సైతం రీజినల్ సెంటర్లున్నాయి. కానీ ఏపీలో మాత్రం లేదు. దీనిని ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నా స్పందన లేదు. రాష్ట్రంలో గోదావరి జిల్లాల్లో వరి తరువాత అతి ఎక్కువ సాగు విస్తీర్ణంలో కొబ్బరి సాగు జరుగుతోంది. రెండు దశాబ్దాలుగా కొబ్బరి సాగు సంక్షోభాలతో కొట్టుమిట్టాడుతోంది. దిగుబడి తగ్గిపోవడం, తెగుళ్ల దాడి, మార్కెటింగ్ అవకాశాలు అంతంత మాత్రంగా ఉండడం వంటి కారణాలతో కొబ్బరి సాగు గిట్టుబాటు కావడం లేదు. దీనిని అధిగమించాలంటే సీడీబీ సహకారం కావాలని రైతులు కోరుతున్నారు. సీడీబీలో రాష్ట్ర రైతుల ప్రాతినిధ్యం తొలి నుంచీ చాలా తక్కువగా ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ఇక్కడి రైతులను బోర్డులోకి తీసుకోవాలని కోరుతున్నారు.




మళ్లీ చలిగాలుల విజృంభణ

అరకులోయ, హుకుంపేటలలో 4.9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు

సాక్షి, పాడేరు/చింతపల్లి (అల్లూరి జిల్లా) : అల్లూరి జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు మళ్లీ తగ్గాయి. చలి గాలులు విజృంభిస్తున్నాయి.సాయంత్రం నుంచే చలిగాలులు తీవ్రంగా ఉండడంతో పాటు అర్ధరాత్రి నుంచి పొగమంచు దట్టంగా కురుస్తోంది.ఉదయం 10గంటల వరకు మంచు తెరలు వీడటం లేదు. మరోవైపు ఏజెన్సీలో కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. శనివారం అరకులోయ, హుకుంపేటలలో 4.9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్టు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్, వాతావరణం విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 8.2 డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 9 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 10.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు, జి.మాడుగులలో 7.4 డిగ్రీలు, అనంతగిరిలో 7.6 డిగ్రీలు,పెదబయలులో 8.2 డిగ్రీలు,ముంచంగిపుట్టులో 9.0 డిగ్రీలు కొయ్యూరులో 10.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి, ఉదయం వేళల్లో మంచు అధికంగా కురుస్తుండడంతో లైట్లు వేసుకుని వాహనాలు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. సాయంత్రం 4 గంటలు నుంచి చలి గాలులు వీస్తుండంతో వృద్ధులు, చిన్నారులు బయటకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారు.



Gold Memories




రుద్రవీణ

ఓ అద్భుతమైన సామాజిక ప్రయత్నం

చిరంజీవిని ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో ఎంపిక చేసే ముందు పరీక్షించిన వారిలో దర్శకులు కె.బాలచందర్ కూడా ఉన్నారట. అందుకే బాలచందర్ తెరకెక్కించిన 'ఇది కథ కాదు, 47 రోజులు, ఆడవాళ్ళూ మీకు జోహార్లు' వంటి సినిమాల్లో చిరంజీవి విలక్షణమైన పాత్రలలో కనిపించారు. ఆ గురుభక్తితోనే చిరంజీవి నిర్మాతగా తన తొలి సొంత సినిమాకు బాలచందర్‌ను దర్శకుడిగా ఎంచుకున్నారు. చిరంజీవి సమర్పకునిగా నాగబాబు నిర్మాతగా ఉన్న ఈ సినిమా (రుద్రవీణ)కు సహనిర్మాతగా పవన్ కల్యాణ్ వ్యవహరించారు. అందుకే టైటిల్స్‌లో ఆయన పేరు కొణిదల కల్యాణ్ కుమార్ అని కనిపిస్తుంది.

అద్భుతమైన ప్రయత్నం

నిజానికి అప్పటికే చిరంజీవి సినిమా అంటే బ్రేక్ డ్యాన్సులు, ఫైట్స్‌కు పెట్టింది పేరు. అటువంటిది ఆయన వాటిని పక్కన పెట్టి సాధారణ నటుడిలా సినిమా కథలో ఒదిగిపోయి చేసిన ఒక అసామాన్య చిత్రం 'రుద్రవీణ'. మసిబట్టిన సాంప్రదాయాలకు, మసకబారిన సిద్ధాంతాలకు ఎదురొడ్డి నిలిచి చాందసాన్ని ఛేదించే అద్భుతమైన ఓ సామాజిక ప్రయత్నం ఈ సినిమా. అందుకే చిరంజీవికి నచ్చిన టాప్ టెన్ సినిమాల్లో 'రుద్రవీణ'దే అగ్ర



తాంబూలం. వాస్తవానికి ఈ సినిమాకు పేరు పెట్టడాని కంటే ముందు... గణపతి శాస్త్రి బిలహరి రాగంలో నిష్ణాతుడైనందున బిలహరి అని పేరు పెట్టాలనుకున్నారు. ఆ రోజుల్లో రాగాల పేర్లతో చాలా సినిమాలొచ్చాయి. 'శివరంజని, శంకరాభరణం, ఆనంద భైరవి' వంటివి అలా వచ్చినవే. అందువల్ల బిలహరి అని ముందుగా అనుకున్నా... చివరికి ఆ పేరు వద్దనుకుని గణపతి శాస్త్రి స్వభావం రుద్రావతారమే కాబట్టి 'రుద్రవీణ' అని పెట్టారు.

జాతీయ అవార్డు సాధించిన సినిమా

1988 మార్చి 4న రిలీజైన ఈ సినిమాలో ప్రతీ పాత్ర చాలా సహజంగా ఉంటుంది. ప్రతీ వ్యక్తిని ప్రశ్నించే విధంగా ఉంటుంది. 'రుద్రవీణ' ఓ క్లాసిక్. 70 రోజుల పాటు చిత్రీకరణ జరుపుకున్న ఈ సినిమాను ఎక్కువగా మద్రాసు, కాంచీపురం, కుర్తాళం, శ్రీనగర్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించారు. అప్పట్లో ఈ సినిమాకు సుమారు 80 లక్షల వ్యయమైంది. ఆ సమయానికి చిరంజీవికి బీభత్సమైన మాస్ ఇమేజ్ ఉంది. చిరంజీవి అంటేనే మాస్‌కు మరో పేరులా సాగుతున్న రోజుల్లో ఆయన కమర్షియల్ సినిమాల నడుమ 'రుద్రవీణ' నిలబడలేకపోయింది. కానీ, జాతీయ స్థాయిలో జాతీయ సమైక్యతను ప్రబోధించే నర్గీస్ దత్ ఉత్తమ చిత్రం పురస్కారాన్ని అందుకుంది. ఇళయరాజాకు జాతీయ ఉత్తమ సంగీత దర్శకుడు పురస్కారం లభించింది. ఇది ఆయనకు మూడో జాతీయ పురస్కారం. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఉత్తమ గాయకుడిగా ఇది నాలుగో పురస్కారం. రాష్ట్ర స్థాయిలో నంది అవార్డుల్లో ఈ సినిమా ఉత్తమ నటుడిగా జ్యూరీ పురస్కారం దక్కించుకోగలిగింది. గణేశ్ పాత్రోకి మాటల రచయితగా నంది పురస్కారాన్ని తీసుకువచ్చింది 'రుద్రవీణ'.

వాణిజ్యపరంగా పరాజయం పాలైన ఈ సినిమాకు రూ. 6 లక్షలు నష్టం వాటిల్లిందట. కానీ 'రుద్రవీణ' పలికించిన రాగాలు మాత్రం సినీ ప్రియులను అలరించాయి. అదే సంవత్సరం బాలచందర్ ఈ సినిమాను తమిళంలో 'ఉన్నాల్ ముడియుమ్ తంబి'గా కమల్‌హాసన్, శివాజీ గణేశన్‌తో రీమేక్ చేశారు. అయితే 'రుద్రవీణ'పై అప్పట్లో చాలా వివాదాలు నడిచాయి. ముఖ్యంగా ఈ సినిమా 1984లో దర్శకుడు మాదాల రంగారావు తెరకెక్కించిన 'జనం మనం' సినిమా కథను యాజ్ ఇట్ ఈజ్‌గా తీశారని అప్పట్లో పెద్ద రచ్చ జరిగింది. తన చిత్రాన్ని కాపీ కొట్టి దర్శకుడు బాలచందర్ 'రుద్రవీణ'ని తెరకెక్కించాడని... 13 రీళ్ల వరకు రెండు సినిమాలు ఒకేలా ఉంటాయని మాదాల రంగారావు ఆరోపించారు. ఈ విషయంపై ఆయన ప్రెస్‌మీట్ పెట్టి 'రుద్రవీణ' టీమ్‌కి వార్నింగ్ కూడా ఇచ్చారు. విషయాన్ని కోర్టు



వరకు తీసుకెళ్లకుండా చిరంజీవిపై ఉన్న గౌరవం కారణంగా సామరస్యంగా పరిష్కరించుకుందామని చెప్పారు. చివరికి ఈ వివాదం ఏమైందనే విషయం ఎవరికీ తెలీదు. ఇప్పుడున్నట్టు మీడియా ఆ రోజుల్లో ఉండి ఉంటే విషయం ఇంకెంత చర్చకు దారి తీసేదో.

ఏది ఏమైనా ఆర్థికంగా ఈ చిత్రం ఆశించిన ఫలితం



సాధించకపోయినా, వివాదాలు ఎదురైనా.. అవన్నీ పక్కన పెడితే 'రుద్రవీణ' ఓ క్లాసిక్.

– దాచేపల్లి సురేష్‌కుమార్

రాజా సాబ్ వాయిదా?



• ప్రభాస్

ప్రభాస్ హీరోగా నటిస్తున్న ప్రస్తుత చిత్రాల్లో 'రాజా సాబ్' ఒకటి. ఈ హారర్ కామెడీ చిత్రానికి మారుతి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో మాళవికా మోహనన్, నిధీ అగర్వాల్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కాగా 'రాజా సాబ్' సినిమాను ఏప్రిల్ 10న రిలీజ్ చేయనున్నట్లుగా, చిత్రయూనిట్ ఆల్రెడీ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే కొన్ని కారణాల వల్ల ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదల కావడం లేదని, కొత్త విడుదల తేదీపై త్వరలోనే చిత్రయూనిట్ ఓ ప్రకటన చేయనుందని తెలిసింది. ఈ సినిమాకు తమన్ సంగీతం అందిస్తున్నారు. కాగా ఈ సంక్రాంతి సందర్భంగా 'రాజా సాబ్' సినిమాకు చెందిన ఓ అప్‌డేట్‌ని ఇవ్వడానికి యూనిట్ సన్నాహాలు చేస్తోందట. బహుశా ఈ మూవీ నుంచి కొత్త పోస్టర్ రావొచ్చని సమాచారం.

ఆనందమానందమాయే...



• శార్వరీ

బ్రహ్మానందం, ఆయన తనయుడు రాజా గౌతమ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బ్రహ్మ ఆనందం'. ప్రియా వడ్లమాని, ఐశ్వర్యా హోలక్కల్ హీరోయిన్లుగా చేశారు. ఈ చిత్రం ద్వారా ఆర్‌వీఎస్ నిఖిల్ దర్శకునిగా పరిచయమవుతున్నారు. 'మళ్లీ రావా, ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ, మసూద' వంటి హిట్ చిత్రాలు తీసిన స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రాహుల్ యాదవ్ నక్కా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. శాండిల్య పీసపాటి సంగీతం అందించిన 'బ్రహ్మ ఆనందం' నుంచి 'ఆనందమానందమాయే...' లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు మేకర్స్. సాయి కిరణ్ సాహిత్యం అందించిన ఈ పాటని మనీషా ఈరబత్తిని, యశ్వంత్ నాగ్ ఆలపించారు. ''ఆనందమానందమాయే...' క్యూట్ లవ్ సాంగ్. హీరోపై తన ప్రేమను హీరోయిన్ అందంగా వివరిస్తుంటే, హీరో మాత్రం తనకు డబ్బు మీదున్న ప్రేమ, అవసరాన్ని పాటగా పాడుకుంటున్నారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమేరా: మితేష్ పర్వతనేని.



• ప్రియ, రాజా గౌతమ్

బిజీ బిజీ



• కాజల్

'ది ఇండియా స్టోరీ'లో భాగం అయ్యారు హీరోయిన్ కాజల్ అగర్వాల్. శ్రేయాస్ తల్పాడే హీరోగా చేతన్ డీకే దర్శకత్వంలో 'ది ఇండియా స్టోరీ' అనే మూవీ రానుంది. ఈ చిత్రంలోనే హీరోయిన్‌గా నటించనున్నారు కాజల్ అగర్వాల్. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ ముంబైలో ప్రారంభమైంది. ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ ముంబై షెడ్యూల్‌లోనే కాజల్ అగర్వాల్ కూడా పాల్గొంటున్నారని సమాచారం. అలాగే ఈ సినిమాను ఈ ఏడాది ఆగస్టు 15న రిలీజ్ చేయనున్నట్లుగా ప్రకటించారు మేకర్స్. ''ఓ పవర్‌ఫుల్ స్టోరీ... ఇప్పటి వరకు ఎవరూ ఇలాంటి కథ చెప్పలేదు'' అని మేకర్స్ పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో జరుగుతున్న మోసాలు, పురుగుల మందులు అమ్మే సంస్థల మోసాల నేపథ్యంలో ఈ మూవీ ఉంటుందనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తోంది. ఇక ఈ సినిమా కాకుండా సల్మాన్ ఖాన్ హీరోగా నటిస్తున్న 'సికందర్'లో కాజల్ అగర్వాల్ ఓ లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ మూవీలో రష్మికా మందన్నా హీరోయిన్. ఈ ఏడాది రంజాన్ సందర్భంగా ఈ మూవీ రిలీజ్ కానుంది. అలాగే కాజల్ అగర్వాల్ ఇప్పటికే పూర్తి చేసిన హిందీ మూవీ 'ఉమ' రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఇంకా కమల్‌హాసన్ హీరోగా చేసిన 'ఇండియన్ 3' చిత్రంలో కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటించారు. ఈ చిత్రం కూడా ఈ ఏడాదే రిలీజ్‌కు ముస్తాబు అవుతోంది. ఇలా ఈ ఏడాది బిజీ బిజీగా ఉండటంతో పాటు వరుస సినిమాల రిలీజ్‌లతో కాజల్ వెండితెరపై సందడి చేస్తారనుకోవచ్చు.

త్రిప్తీ దిమ్రీ ఔట్... శ్రీశార్వరీ ఇన్

బాలీవుడ్‌లో 'ఆషికీ' మూవీ ఫ్రాంచైజీకి మంచి క్రేజ్ ఉంది. ఈ ఫ్రాంచైజీ నుంచి వచ్చిన 'ఆషికీ, ఆషికీ 2' చిత్రాలు సూపర్ హిట్స్‌గా నిలిచాయి. ఈ రెండు సినిమాలను టీ సిరీస్, విశేష్ ఫిల్మ్స్ నిర్మించాయి. హిట్ ఫ్రాంచైజీ కావడంతో 'ఆషికీ 3'ని కూడా మేకర్స్ ప్రకటించారు. అయితే 'ఆషికీ 3'ని 2022లో అధికారికంగా ప్రకటించారు. కానీ ఈ సినిమా ఇంకా సెట్స్‌పైకి వెళ్లలేదు. ఈ ఏడాది సెట్స్‌పైకి తీసుకుని వెళ్లాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రంలో కార్తీక్ ఆర్యన్, త్రిప్తీ దిమ్రీలను హీరో హీరోయిన్లుగా, దర్శకుడిగా అనురాగ్ బసును అనుకుంటున్నారట మేకర్స్. కానీ ఇప్పుడు టీ సిరీస్–విశేష్ ఫిల్మ్స్ ప్రతినిధుల మధ్యలో 'ఆషికీ 3' గురించి విభేదాలు తలెత్తాయని టాక్. దీంతో ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లడానికి మరికొంత సమయం పడుతుందని బాలీవుడ్‌లో ప్రచారమవుతోంది. తాజాగా ఈ సినిమా నుంచి హీరోయిన్‌గా త్రిప్తీ దిమ్రీ కూడా తప్పుకున్నారని సమాచారం. ఈ ప్లేస్‌ను బాలీవుడ్ యంగ్ బ్యూటీ శార్వరీ భర్తీ చేశారని భోగట్టా. మరి... 'ఆషికీ 3'లో శార్వరీ భాగం అయ్యారా? ఈ సినిమా ఈ ఏడాదే సెట్స్‌కు వెళ్తుందా? అనే విషయాలపై క్లారిటీ రావాలంటే మరికొంత సమయం వేచి ఉండాల్సిందే.

న్యాయం కోసం సామాన్యుడి పోరాటం

ఓ బ్యాంక్ చేసే చిన్న పొరపాటు ఓ సామాన్యుడి జీవితాన్ని తలకిందులు చేస్తే అతనెలా స్పందించాడు? న్యాయం కోసం ఎలాంటి పోరాటం చేశాడు? అనే కథాంశంతో రూపొందిన చిత్రం 'హిసాబ్ బరాబర్'. అశ్విన్ ధీర్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో నీల్ నితిన్, కృతీ కుల్హారి ఇతర పాత్రల్లో నటించారు. జీ 5 రూపొందించిన ఈ సినిమా ఈ నెల 24 నుంచి జీ 5లో తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ప్రీమియర్ కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు అశ్విన్ ధీర్ మాట్లాడుతూ– ''సమాజంలోని అవినీతి, మోసాలను ఓ సామాన్యుడు ఎలా ఎదుర్కొన్నాడనే కథాంశంతో రూపొందిన 'హిసాబ్ బరాబర్' అందర్నీ ఆలోచింపజేస్తుంది. సామాజిక అంశాలతో పాటు ప్రేక్షకులకు కావాల్సిన డ్రామా, కామెడీ, ఎమోషన్స్ అన్నీ ఉంటాయి. మాధవన్, నీల్ నితిన్, కృతీ కుల్హారి వంటి వారు తమదైన నటనతో మెప్పిస్తారు'' అన్నారు. ఆర్. మాధవన్ మాట్లాడుతూ–''జీ 5లో నేను చేసిన తొలి సినిమా ఇది. ఈ చిత్రంలో రైల్వే డిపార్ట్‌మెంట్‌లో చిరు ఉద్యోగి అయిన రాధే మోహన్ శర్మ పాత్రలో నటించటాన్ని ఎంజాయ్ చేశాను. ఈ పాత్ర నాకు సవాల్‌గా అనిపించింది. ఇలాంటి వాస్తవ కథనాలతో మరిన్ని సినిమాలు రావాలని కోరుకుంటున్నాను'' అని చెప్పారు. ''హిసాబ్ బరాబర్' చిత్రంలో మిక్కీ మెహతా అనే బ్యాంకర్ పాత్రతో మెప్పిస్తాను. నటుడిగా నాకు సవాల్ విసిరిన పాత్ర ఇది. మాధవన్, నాకు మధ్య పోటాపోటీగా ఉండే సన్నివేశాలు ప్రేక్షకులను మెప్పిస్తాయి'' అని నీల్ నితిన్ పేర్కొన్నారు. ''అన్ని అంశాలను మేళవించి తెరకెక్కించిన ఎంటర్‌టైనర్ మూవీ ఇది'' అన్నారు కృతీ కుల్హారి.



• మాధవన్

బిజినెస్ రీల్

జియోఫైబర్ కస్టమర్లకు యూట్యూబ్ ప్రీమియం ఫ్రీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రిలయన్స్ జియోఎయిర్‌ఫైబర్, జియోఫైబర్ పోస్ట్‌పెయిడ్ కస్టమర్లకు యూట్యూబ్ ప్రీమియం సేవలను ఉచితంగా ఆఫర్ చేస్తోంది. అర్హత కలిగిన వినియోగదార్లు వారి ప్లాన్ ప్రయోజనాలలో భాగంగా 24 నెలల పాటు యూట్యూబ్ ప్రీమియం కాంప్లిమెంటరీ సబ్‌స్క్రిప్షన్‌ను అందుకుంటారు. రూ.888, రూ.1,199, రూ.1,499, రూ.2,499, రూ.3,499 ప్లాన్స్‌కు ఇది వర్తిస్తుందని కంపెనీ ప్రకటించింది.

లక్ష్మీ డెంటల్‌కు రూ.314 కోట్లు



న్యూఢిల్లీ: ఆర్బిమెడ్ ప్రమోట్ చేస్తున్న లక్ష్మీ డెంటల్ తాజాగా యాంకర్ ఇన్వెస్టర్ల నుండి రూ.314 కోట్లకు పైగా అందుకుంది. ఆదిత్య బిర్లా సన్ లైఫ్ మ్యూచువల్ ఫండ్, ఐసీఐసీఐ ప్రూడెన్షియల్ ఎంఎఫ్, హెచ్‌డీఎఫ్‌సీ ఎంఎఫ్, కోటక్ ఎంఎఫ్, మిరే అసెట్ ఎంఎఫ్, టాటా ఎంఎఫ్, బిర్లా సన్‌లైఫ్ ఇన్సూరెన్స్, మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్, అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ, నోమురా, గోల్డ్‌మన్ సాక్స్, అల్ మెహ్వార్ కమర్షియల్స్ ఇన్వెస్ట్‌మెంట్స్, నాటిక్సిస్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ తదితర 31 కంపెనీలు వీటిలో ఉన్నాయి. యాంకర్ ఇన్వెస్టర్లకు లక్ష్మీ డెంటల్ ఒక్కొక్కటి రూ.428 చొప్పున 73.39 లక్షల షేర్లు కేటాయించింది. కంపెనీ ఐపీవో జనవరి 13న ప్రారంభమై 15న ముగియనుంది. ఇష్యూ ధరల శ్రేణి రూ.407–428గా నిర్ణయించారు. ఐపీవోలో భాగంగా రూ.138 కోట్ల విలువైన తాజా షేర్లను జారీ చేస్తారు. రూ.560 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు విక్రయించనున్నారు.

సన్‌టెక్ రియల్టీ బుకింగ్స్ 40% వృద్ధి

న్యూఢిల్లీ: సన్‌టెక్ రియల్టీ డిసెంబర్ త్రైమాసికంలో బుకింగ్స్ 40% వృద్ధి చెంది రూ.635 కోట్లుగా నమోదయ్యాయి. ఇళ్లకు డిమాండ్ కొనసాగడం కలిసొచ్చినట్లు కంపెనీ తెలిపింది. గతేడాది ఇదే క్యూ3లో బుకింగ్స్ రూ.455 కోట్లుగా ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్–డిసెంబర్ మధ్య కంపెనీ బుకింగ్స్ 34% పెరిగి రూ.1,661 కోట్లకు చేరాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఇది రూ.1,237 కోట్లుగా ఉంది. ముంబై కేంద్రంగా పనిచేసే సన్‌టెక్ రియల్టీ దేశంలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్స్‌లో ఒకటి.

ఆ రంగాల్లో ప్రపంచ ఛాంపియన్ కావాలి

- అప్పుడు అభివృద్ధి చెందిన దేశంగా భారత్
- జీ20 భారత షెర్పా అమితాబ్ కాంత్

న్యూఢిల్లీ: ఉదయించే రంగాల్లో (ఇప్పుడు ప్రగతి బాటలో నడుస్తున్న) భారత్ ప్రపంచ ఛాంపియన్‌గా అవతరించాలని, అప్పుడే 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించగలదని జీ20లో భారత షెర్పా అమితాబ్ కాంత్ అన్నారు. లేదంటే 32 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని కూడా అందుకోలేమన్నారు. 'భారత్ క్లైమేట్ ఫోరమ్ 2025' కార్యక్రమంలో భాగంగా మాట్లాడుతూ.. యూఎస్, యూరప్, భారత్ తయారీ అవకాశాలను కోల్పోయాయని, వాటి ఆర్థిక వ్యవస్థలపై దీని తాలూకూ ప్రభావం గణనీయంగా ఉందన్నారు. సోలార్ ప్యానెళ్ల తయారీలో భారత కంపెనీలు 5–7 ఏళ్లు వెనుకనున్నట్టు చెప్పారు. ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీలు) తయారీదారుగా మారలేకపోతే అంతర్జాతీయంగా ఈవీ మార్కెట్‌ను కోల్పోవాల్సి వస్తుందన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం పరంగా భారత్ గొప్పగా సాధించిందేమీ లేదంటూ, ఇప్పటికీ క్లీన్ టెక్నాలజీని దిగుమతి చేసుకుంటున్నట్టు చెప్పారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

12-1-2025

విశాఖ	520-00
చిత్తూరు	523-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515-00
విజయవాడ	515-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	490-00
వరంగల్	492-00
రిటైల్ ధర	5.50

ఈక్విటీ ఫండ్స్‌లోకి

పెట్టుబడుల ప్రవాహం



- డిసెంబర్‌లో రూ.41,156 కోట్లు
- నవంబర్‌తో పోల్చితే మారిన పరిస్థితి
- 2024 మొత్తం మీద రూ.3.94 లక్షల కోట్లు
- డెట్ ఫండ్స్‌కు అమ్మకాల సెగ
- టాప్‌లేపిన సిప్ పెట్టుబడులు

న్యూఢిల్లీ: ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ పథకాలు డిసెంబర్ నెలలో దుమ్మురేపాయి. అక్టోబర్ నెలలో నికరంగా 14 శాతం మేర పెట్టుబడులను కోల్పోయిన ఈక్విటీ ఫండ్స్.. తిరిగి డిసెంబర్ నెలలో రూ.41156 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాయి. అక్టోబర్ నెలలో నికర ఈక్విటీ పెట్టుబడులు రూ.35,943 కోట్లతో పోల్చి చూస్తే 15 శాతం పెరిగాయి. వరుసగా 46వ నెలలోనూ ఈక్విటీ ఫండ్స్‌లో సానుకూల పెట్టుబడులు నమోదయ్యాయి. ఈక్విటీలోని అన్ని విభాగాల పథకాల్లోకి నికర పెట్టుబడులు వచ్చాయి. 2024 మొత్తం మీద ఈక్విటీ పథకాల్లో ఇన్వెస్టర్లు రూ.3.94 లక్షల కోట్లను పెట్టుబడి పెట్టారు. 2023తో పోల్చితే 144 శాతం అధికం. మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) ఈ మేరకు గణాంకాలను విడుదల చేసింది. ఎప్పటి మాదిరే మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ పథకాలు తమ జోరును కొనసాగించాయి. ఈ రెండు విభాగాల పట్ల ఇన్వెస్టర్లలో ఆసక్తి ఏ మాత్రం తగ్గలేదు. థీమ్యాటిక్/సెక్టోరల్ ఫండ్స్‌కు సైతం డిమాండ్ కొనసాగింది. డిసెంబర్‌లో డెట్ ఫండ్స్ నుంచి నికరంగా రూ.1.3 లక్షల కోట్లు బయటకు వెళ్లిపోయాయి. దీంతో మొత్తం మీద మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ నుంచి డిసెంబర్‌లో రూ.80,355 కోట్లను ఇన్వెస్టర్లను వెనక్కి తీసుకున్నారు. ఫలితంగా పరిశ్రమ నిర్వహణలోని పెట్టుబడుల విలువ (ఏయూఎం) నెలవారీగా 1.7 శాతం తగ్గి డిసెంబర్ చివరికి రూ.66.9 లక్షల కోట్లకు పరిమితమైంది.

విభాగాల వారీగా..

- స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ ఫండ్స్‌కు డిమాండ్ కొనసాగుతూనే ఉంది. స్మాల్ క్యాప్ ఫండ్స్‌లోకి రూ.4,667 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. మిడ్‌క్యాప్ ఫండ్స్‌లోకి రూ.5,093 కోట్లు వచ్చాయి. నవంబర్ నెలతో పోల్చి చూస్తే స్మాల్‌క్యాప్‌లోకి 13 శాతం, మిడ్‌క్యాప్ ఫండ్స్‌లోకి 4 శాతం అధికంగా పెట్టుబడులు వచ్చాయి. ఇన్వెస్టర్లు అధిక రాబడుల కోసం వీటిని ఎంపిక చేసుకుంటున్నట్టు కనిపిస్తోంది.
- లార్జ్‌క్యాప్ పథకాలు రూ.2,010 కోట్ల పెట్టుబడులను రాబట్టాయి. నవంబర్‌లో వచ్చిన రూ.2,500 కోట్లతో పోల్చితే 20% తగ్గాయి.
- సెక్టోరల్, థీమ్యాటిక్ ఫండ్స్ అత్యధికంగా రూ.15,331 కోట్లను ఆకర్షించాయి. నవంబర్‌లో వచ్చిన రూ.7,658 కోట్లతో పోల్చితే రెట్టింపయ్యాయి.
- డిసెంబర్‌లో 33 కొత్త మ్యూచువల్ ఫండ్ పథకాలు (ఎన్ఎఫ్‌వో) మార్కెట్లోకి వచ్చాయి. ఇవి ఇన్వెస్టర్ల నుంచి రూ.13,643 కోట్లను రాబట్టాయి. నవంబర్‌లో మొత్తం 18 ఎన్ఎఫ్‌వో ఇష్యూలు రాగా, అవి సమీకరించిన మొత్తం రూ.4,000 కోట్లు కావడం గమనార్హం. ఏకంగా మూడింతలకుపైగా పెరిగినట్టు తెలుస్తోంది.
- ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్‌లోకి రూ.4,770 కోట్లు వచ్చాయి. నవంబర్‌లో వచ్చిన రూ.5,084 కోట్లతో పోల్చితే స్వల్పంగా తగ్గాయి. మల్టీక్యాప్ ఫండ్స్ 15 శాతం తక్కువగా రూ.3,075 కోట్లను ఆకర్షించాయి.
- లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్స్‌లో రూ.3,811 కోట్ల పెట్టుబడులు నమోదయ్యాయి.
- గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ రూ.640 కోట్లను ఆకర్షించాయి. 2024 సంవత్సరం మొత్తం మీద గోల్డ్ ఫండ్స్‌లోకి రూ.11,226 కోట్ల పెట్టుబడులు రావడం గమనార్హం.

సిప్ పెట్టుబడుల్లో వృద్ధి

సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో డిసెంబర్‌లో ఈక్విటీ పథకాల్లోకి రూ.26,459 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇది ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి. నవంబర్ నెల సిప్ పెట్టుబడులు రూ.25,320 కోట్లతో పోల్చి చూస్తే 5 శాతం పెరిగాయి. అన్ని మ్యూచువల్ ఫండ్స్ సంస్థల నిర్వహణలోని సిప్ పెట్టుబడుల విలువ రూ.13.63 లక్షల కోట్లకు చేరింది.

ఇన్వెస్టర్లలో నమ్మకానికి నిదర్శనం

"ఎన్ఎఫ్‌వోలు, సిప్ పెట్టుబడులు, ఏక మొత్తంలో కొనుగోళ్లు నికర పెట్టుబడుల ప్రవాహానికి తోడ్పడ్డాయి. పెట్టుబడులు బలంగా రావడం మ్యూచువల్ ఫండ్స్ పట్ల ఇన్వెస్టర్లలో ఉన్న నమ్మకానికి నిదర్శనం" అని కోటక్ మహీంద్రా ఏఎంసీ నేషనల్ సేల్స్ హెడ్ మనీష్ మెహతా తెలిపారు. మార్కెట్ అస్థిరతల్లోనూ సిప్ పెట్టుబడులు బలంగా కొనసాగడం అన్నది దీర్ఘకాల పెట్టుబడుల పట్ల ఇన్వెస్టర్లలో ఉన్న నమ్మకాన్ని తెలియజేస్తున్నట్టు మిరే అసెట్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ డిస్ట్రిబ్యూషన్ హెడ్ సురంజన బోర్తకుర్ పేర్కొన్నారు.

నా భార్యను చూడటం నాకు చాలా ఇష్టం

మహీంద్రా చైర్మన్ ఆనంద్ మహీంద్రా



న్యూఢిల్లీ: 'నా భార్య అద్భుతమైనది. ఆమెను తదేకంగా చూడటం నాకు ఇష్టం' అని మహీంద్రా అండ్ మహీంద్రా చైర్మన్ ఆనంద్ మహీంద్రా అన్నారు. వారానికి 90 గంటలు పని చేయాలంటూ ఎల్‌అండ్‌టీ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు పెద్ద చర్చకు దారితీసిన నేపథ్యంలో మహీంద్రా తాజాగా చేసిన కామెంట్ ఆసక్తి రేపుతోంది. పని గంటల పరిమాణాన్ని నొక్కి చెప్పడం తప్పు అని ఆనంద్ మహీంద్రా స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో జరిగిన నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో ఆయన మాట్లాడారు. 'మనం పని నాణ్యతపై దృష్టి పెట్టాలి. ఎంత సమయం పని చేశామన్నది కాదు. కాబట్టి 40 గంటలా, 70 గంటలా, 90 గంటలా కాదు. మీరు ఏ అవుట్‌పుట్ చేస్తున్నారు అన్నది ముఖ్యం. 10 గంటలు అయినా మీరు ప్రపంచాన్ని మార్చవచ్చు' అని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో సమయం గడిపినంత మాత్రాన తాను ఒంటరిగా ఉన్నట్టు కాదని ఆనంద్ మహీంద్రా చెప్పారు. ఎక్స్ వేదికగా 1.1 కోట్ల మంది నుంచి అభిప్రాయాలను తెలుసుకుంటున్నట్టు వివరించారు.

జనవరి 17న ఈఎంఏ పార్ట్‌నర్స్ ఐపీఓ

ధరల శ్రేణి రూ.117-124

EMA PARTNERS

న్యూఢిల్లీ: లీడర్‌షిప్ హైరింగ్ సేవల్లో ఉన్న ఈఎంఏ పార్ట్‌నర్స్ ఐపీఓ జనవరి 17న ప్రారంభమై 21న ముగియనుంది. ఇష్యూ ధరల శ్రేణి రూ.117–124గా కంపెనీ నిర్ణయించింది. గరిష్ఠ ధర వద్ద రూ.76.01 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా 53.34 లక్షల తాజా ఈక్విటీలను జారీ చేయనుంది. ఆఫర్ ఫర్ సేల్ ద్వారా ప్రమోటర్లు క్రిష్ణన్ సుదర్శన్, సుబ్రమణియన్‌లు 7.96 లక్షల షేర్లను విక్రయించనున్నారు. క్యూఐబీలకు 50%, ఎన్ఐఐలకు 15%, రిటైల్ ఇన్వెస్టర్లకు 35% వాటా కేటాయింపు జరిగింది. ఐపీఓ పూర్తయిన తర్వాత ఎన్ఎస్ఈ ఎమర్జ్ ప్లాట్‌ఫామ్‌లో షేర్లు లిస్ట్ కానున్నాయి. సమీకరించిన నిధులను రుణాల చెల్లింపులకు, ఐటీ విభాగపు మౌలిక అభివృద్ధికి, నాయకత్వ బృందాన్ని పెంచుకునేందుకు వినియోగిస్తామని కంపెనీ తెలిపింది. ఈ ఇష్యూకు బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్‌గా ఇండోరియంట్ ఫైనాన్షియల్ సర్వీసెస్, రిజిస్ట్రార్‌గా బిగ్‌షేర్ సర్వీసెస్ వ్యవహరిస్తున్నాయి.

నెలకు కనీసం రూ.7,500 పెన్షన్ ఇవ్వండి

ఆర్థికమంత్రికి ఈపీఎస్-95 ప్రతినిధి బృందం విజ్ఞప్తి



న్యూఢిల్లీ: గౌరవంగా జీవితాన్ని వెల్లదీసేందుకు నెలకు కనీసం రూ.7,500 పెన్షన్ ఇవ్వాలని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు ఈపీఎస్–95 పెన్షనర్ల ప్రతినిధి బృందం విజ్ఞప్తి చేసింది. ఆర్థిక మంత్రితో ప్రతినిధి బృందం సమావేశమై, నెలకు కనీసం రూ.7,500 పెన్షన్‌తో పాటు డియర్‌నెస్ అలవెన్స్ (డీఏ) కోసం ఎప్పటి చేస్తున్న డిమాండ్‌ను నెరవేర్చాలని విజ్ఞప్తి చేసింది. రిటైర్మెంట్ ఫండ్ బాడీ ఈపీఎఫ్ఓ నిర్వహించే ఈపీఎస్–95 లేదా ఎంప్లాయిస్ పెన్షన్ స్కీమ్ 1995 కింద ప్రస్తుతం నెలకు కనీస పెన్షన్ రూ.1,000 మాత్రమే ఉంది. తాజా భేటీపై ఈపీఎస్–95 నేషనల్ అగిటేషన్ కమిటీ ఒక ప్రకటన విడుదల చేస్తూ, డిమాండ్లను సమీక్షించి సానుకూలంగా పరిష్కరించనున్నట్లు ఆర్థికమంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపింది. దేశ వ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేట్ సంస్థలు, ఫ్యాక్టరీల్లో పనిచేసిన 78 లక్షలకుపైగా పెన్షనర్ల పరిస్థితిని ఆర్థికమంత్రికి వివరించినట్లు ఈపీఎస్–95 నేషనల్ అగిటేషన్ కమిటీ నేషనల్ ప్రెసిడెంట్ కమాండర్ అశోక్ రౌత్ తెలిపారు.

రూ.5,000 డిమాండ్ సరికాదు..

కనీసం రూ.5,000 పెన్షన్ డిమాండ్ చేసే కొన్ని కార్మిక సంస్థలపై ఆయన విమర్శలు చేశారు. ఇది పెన్షనర్ల ప్రాథమిక అవసరాలకు పట్టించుకోకపోవడమేనని, అన్యాయమైన ప్రతిపాదన అని అభిప్రాయపడ్డారు. "గౌరవమైన జీవితం కోసం కనీసం రూ.7,500 అవసరం,' అని ఆయన స్పష్టం చేశారు.

హామీ ఇచ్చారు.. నెరవేర్చాలి..!

నెలకు రూ.1,000 పెన్షన్‌ను రూ.7,500కు పెంచాలని, డీఏతో పాటు పెన్షనర్, వారి జీవిత భాగస్వామికి ఉచిత వైద్య చికిత్సను అందించాలని పెన్షనర్లు గత 7–8 సంవత్సరాలుగా ఆందోళన చేస్తున్న విషయాన్ని కమాండర్ అశోక్ రౌత్ ప్రస్తావించారు. 'ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పెన్షనర్ల డిమాండ్లను పూర్తి మానవతా దృక్పథంతో పరిగణిస్తామని చెప్పారు. ఈ హామీ మాకు ఆశ కలిగిస్తోంది. కానీ ప్రభుత్వం సంకల్పపూర్వకంగా స్పందించి రాబోయే బడ్జెట్‌లో కనీసం రూ.7,500 పెన్షన్‌ను డీఏతో ప్రకటించాలి' అన్నారు.

జూపిటర్ అమ్మకాలు 70 లక్షల యూనిట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టీవీఎస్ మోటార్ కంపెనీ మరో ఘనతను సాధించింది. కంపెనీ తయారీ జూపిటర్ స్కూటర్ 70 లక్షల యూనిట్ల మార్కును చేరుకుంది. హోల్‌సేల్‌గా కంపెనీ 2024 నవంబర్ నాటికి 71,40,927 యూనిట్లను విక్రయించింది. 2013 సెప్టెంబర్ నుంచి సంస్థ మొత్తం 1.14 కోట్ల స్కూటర్ల అమ్మకాలను నమోదు చేసింది. ఇందులో జూపిటర్ వాటా ఏకంగా 62 శాతం ఉంది. స్కూటర్స్ విభాగంలో సెగ్మెంట్లో దేశంలో రెండవ స్థానంలో ఉన్న జూపిటర్ 110, 125 సీసీ ఇంజన్ సామర్థ్యంలో లభిస్తోంది. 2024 మార్చి నాటికి 80,000 జూపిటర్ స్కూటర్లను కంపెనీ ఎగుమతి చేసింది. 2016 జూన్ నాటికి 10 లక్షల యూనిట్ల మార్కును సాధించింది. 2017 సెప్టెంబర్ నాటికి 20 లక్షల యూనిట్ల అమ్మకాలను సాధించింది. 2022 సెప్టెంబర్ నాటికి 50 లక్షల యూనిట్లను తాకింది. మరో 10 లక్షల యూనిట్లకు ఏడాది, ఆ తర్వాతి 10 లక్షలకు 14 నెలల సమయం తీసుకుంది. భారత స్కూటర్స్ పరిశ్రమలో రెండవ స్థానం దక్కించుకున్న టీవీఎస్‌కు 25 శాతం వాటా ఉంది. 2023–24లో 8,44,863 జూపిటర్ స్కూటర్స్ రోడ్డెక్కగా.. 2024–25 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–నవంబర్‌లో ఈ సంఖ్య 7,01,360 యూనిట్లు ఉంది. ప్రస్తుతం 110 సీసీలో నాలుగు, 125 సీసీలో మూడు వేరియంట్లలో జూపిటర్ లభిస్తోంది.

క్యూ3 ఆర్థిక ఫలితాలు

డీమార్ట్ క్యూ3 లాభం రూ.723 కోట్లు



న్యూఢిల్లీ: డీమార్ట్ పేరుతో స్టోర్లను నిర్వహిస్తున్న అవెన్యూ సూపర్‌మార్ట్స్ డిసెంబర్ త్రైమాసికంలో రూ.723.50 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గతేడాది ఇదే క్వార్టర్‌లో నమోదైన లాభం రూ.690.41 కోట్లతో పోలిస్తే ఇది 4.8 శాతం అధికంగా ఉంది. టర్నోవర్ 17.68% పెరిగి రూ.15,972.55 కోట్లకు చేరింది. గతేడాది ఇదే క్యూ3లో రూ.13,572.47 కోట్లుగా ఉంది. వార్షిక ప్రాతిపదికన పీఏటీ మార్జిన్ 4.5% నుంచి 5.1 శాతానికి చేరింది. మొత్తం వ్యయాలు 18.52 శాతం ఎగసి రూ.15,002 కోట్లకు చేరాయి. ఆన్‌లైన్ ఆర్డరింగ్ సర్వీసెస్ తొలి 9 నెలల్లో 21.5% వృద్ధి సాధించింది. ఎఫ్ఎంసీజీ విభాగంలో అధిక డిస్కౌంట్లు టర్నోవర్‌పై ప్రభావాన్ని చూపాయని అవెన్యూ సూపర్‌మార్ట్స్ సీఈవో నెవిల్ నోరాన్హా తెలిపారు. కంపెనీకి దేశవ్యాప్తంగా మొత్తంగా 2024 డిసెంబర్ 31 నాటికి 387 స్టోర్లను కలిగి ఉంది.

డీమార్ట్‌కు కొత్త సీఈవో అన్షుల్ అసావా

డీమార్ట్ తన ఉన్నత స్థాయి యాజమాన్య పదవుల్లో మార్పులు చేపట్టింది. కొత్త సీఈవోగా అన్షుల్ అసావాను ఎంపిక చేసుకుంది. ఈ ఏడాది మార్చిలో డీమార్ట్‌లో చేరతారు. 2026 ఫిబ్రవరి 1న ఆయన కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. అంత వరకు అన్షుల్‌కు ప్రస్తుత ఎండీ, సీఈవో నెవిల్ నోరాన్హా సహకారం అందిస్తారు. అన్షుల్‌కు యూనిలీవర్‌లో 30 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉంది. ప్రస్తుతం థాయిలాండ్ యూనిలీవర్ అధిపతిగా, గ్రేటర్ ఆసియా గృహ సంరక్షణ వ్యాపార విభాగానికి జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. రెండు దశాబ్దాలుగా డీమార్ట్‌కు సేవలు అందిస్తున్న నెవిల్ నోరాన్హా పదవీ కాలం 2026 జనవరితో ముగియనుంది.


జస్ట్ డయల్ లాభం 43 శాతం జంప్



న్యూఢిల్లీ: లోకల్ సర్చ్ ఇంజన్ జస్ట్ డయల్ డిసెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం 42.7 శాతం ఎగసి రూ.131.3 కోట్లు సాధించింది. పన్నుకు ముందు లాభం 23.35 శాతం దూసుకెళ్లి రూ.149 కోట్లు నమోదైంది. ఎబిటా రూ.86.6 కోట్లు, ఎబిటా మార్జిన్ 735 బీపీఎస్ పెరిగి 30.1 శాతం ఉంది. వ్యయాలు 1.55 శాతం తగ్గి రూ.215 కోట్లకు వచ్చి చేరాయి. టర్నోవర్ 8.4 శాతం అధికమై రూ.287 కోట్లు నమోదైంది. ఒక త్రైమాసికంలో కంపెనీకి ఇదే అత్యధిక టర్నోవర్. యాక్టివ్ లిస్టింగ్స్ డిసెంబర్ 31 నాటికి 14.2 శాతం వృద్ధి చెంది 4.75 కోట్లకు చేరాయి. 12.9 లక్షల లిస్టింగ్స్ డిసెంబర్ త్రైమాసికంలో కొత్తగా తోడయ్యాయి.

స్టార్టప్‌లతో బడా కార్పొరేట్లు కలిసి పని చేయాలి

సవాళ్ల పరిష్కారానికి కృషి చేయాలి • డీపీఐఐటీ కార్యదర్శి భాటియా సూచన



న్యూఢిల్లీ: వ్యాపార సవాళ్లు, ఇతర సమస్యలను పరిష్కరించుకునేందుకు పెద్ద కార్పొరేట్ సంస్థలు, అంకుర సంస్థలతో కలిసి పని చేయాలని పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) కార్యదర్శి అమర్‌దీప్ సింగ్ భాటియా సూచించారు. ఔత్సాహిక వ్యాపారవేత్తలు వృద్ధిలోకి వచ్చేందుకు కూడా ఇది తోడ్పడగలదని ఆయన పేర్కొన్నారు. ఇందుకోసం ఇప్పటికే పలు పెద్ద కంపెనీలు ముందుకొచ్చాయని, అవగాహన ఒప్పందాలు కూడా కుదుర్చుకున్నాయని చెప్పారు. స్టార్టప్ ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించిన పదో ఏట.. మరిన్ని అంకుర సంస్థలతో కలిసి పని చేసేలా కంపెనీలను ప్రోత్సహించే అవకాశం ఉందని భాటియా చెప్పారు. కొన్ని పనులను స్టార్టప్‌లకు ఔట్‌సోర్స్ చేయడం, కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టేందుకు వాటితో కలిసి పనిచేయడం, మెంటార్‌షిప్ ద్వారా సహాయపడటం, ల్యాబ్‌లు.. టెస్టింగ్ కేంద్రాలకు యాక్సెస్ ఇవ్వడం తదితర మార్గాల్లో ఇది ఉండొచ్చని పేర్కొన్నారు. మరోవైపు, విదేశాల నుండి భారత్‌కి తమ ప్రధాన కార్యాలయాలను మార్చుకోవాలనుకునే స్టార్టప్‌ల కోసం సదరు ప్రక్రియను కార్పొరేట్ వ్యవహారాల శాఖ వేగవంతం చేసినట్లు భాటియా చెప్పారు. అంకుర సంస్థలకు ప్రోత్సాహమిచ్చేందుకు 2016 జనవరి 16న కేంద్ర ప్రభుత్వం స్టార్టప్ ఇండియా కార్యక్రమాన్ని ఆవిష్కరించింది. దీని కింద, వివిధ దశల్లోని అంకుర సంస్థల కోసం స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ స్కీమ్, ఫండ్ ఆఫ్ ఫండ్స్ ఫర్ స్టార్టప్స్, క్రెడిట్ గ్యారంటీ స్కీమ్ ఫర్ స్టార్టప్స్ అనే మూడు స్కీములను అమలు చేస్తోంది. 1.5 లక్షల స్టార్టప్‌లను డీపీఐఐటీ గుర్తించింది.

మహిళకు సముచిత గౌరవం ఇచ్చిన భారత్ నాగరికత

ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ: భారతీయుల జీవితంలోని వివిధ రంగాలలో మహిళలు పోషించే పాత్రను భారతీయ జీవన దృక్కోణం ద్వారా చూడాల్సిన అవసరం ఉందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. పశ్చిమ దేశాల దృక్కోణం నుండి భారతీయ మహిళల ఔన్నత్యాన్ని ఎంతమాత్రం చూడరాదని ఆమె స్పష్టం చేశారు. భారతీయ నాగరికత ఎల్లప్పుడూ మహిళలకు సముచితమైన గౌరవాన్ని ఇస్తుందని, పాశ్చాత్య దేశాలు అంచనాలకు భిన్నంగా వారిని ఎల్లప్పుడూ సమానంగా చూస్తుందని ఆమె ఇక్కడ జరిగిన పుస్తక విడుదల కార్యక్రమంలో అన్నారు. "శక్తి: మహిళలు, జెండర్ అండ్ సొసైటీ ఇన్ ఇండియా – పెర్స్పెక్టివ్స్ ఆన్ ఫెమినిజం' పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహాభారతం వంటి ఇతిహాసాలను ఉటంకించారు. ఈ సందర్భంగా ప్రాచీన భారతదేశంలో మహిళలు పోషించిన పాత్రను వివరించారు. ఈ సందర్భంగా ఆమె ఏమన్నారంటే..

- స్త్రీ పరాక్రమాన్ని ఉపయోగించుకోవడాన్ని మన ధర్మం అంగీకరించింది. మన ధర్మం స్త్రీ పాత్రను కాదనలేదు. ఇది స్త్రీ లేదా పురుషుడన్న విషయాన్ని చూడదు. ఆచరించే ధర్మాన్ని చూస్తుంది. చాలా సార్లు స్త్రీలు ఆ ధర్మాన్ని ఆచరించడానికి తెరపైకి వచ్చారు. ఈ విషయాన్ని పశ్చిమ దేశాలు చూడలేదు. కాబట్టి, మనం ఈ రక్షణాత్మక మనస్తత్వం నుండి బయటపడాలని నేను గట్టిగా సిఫార్సు చేస్తున్నాను.
- ఇక్కడ మహాభారతాన్ని ప్రస్తావించాలి. ద్రౌపదికి అన్యాయం జరిగినప్పటికీ, ఆమె తన ఆత్మ గౌరవాన్ని కాపాడుకుంటూ సొంత మార్గంలో తనను తాను నిరూపించుకుంది. తాను సాధించాలనుకున్నది సాధించింది.
- భారత్ మహిళ ఔన్నత్యం చరిత్ర పుటల్లో రికార్డు అయ్యింది. ఏదీ ఫిల్టర్ కాలేదు. జరిగిన అన్యాయాన్ని రాయడానికి ఎప్పుడూ సిగ్గుపడలేదు. మన నాగరికత ఎప్పుడూ విషయాలు ఉన్నట్లుగా చెప్పడానికి దూరంగా ఉండదు.
- మహిళలపై ఆధునిక సాహిత్యాన్ని పరిశీలిస్తే, పాశ్చాత్య స్త్రీవాద దృక్పథం తగిన విధంగా లేదు. మనల్ని మనం నిర్వచించుకోవడానికి వారి పదజాలాన్ని ఉపయోగిస్తాము. ఇది ఎంతమాత్రం సరికాదు.
- భారత్ సాంస్కృతిక విలువలు, మహిళల పట్ల తమ విశిష్టమైన ప్రవర్తన పట్ల దేశ ప్రజలు గర్వపడాలి.

సిరీస్ విజయంపై గురి

నేడు ఐర్లాండ్‌తో భారత మహిళల రెండో వన్డే ● ఉదయం 11 గంటల నుంచి స్పోర్ట్స్18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



రాజ్‌కోట్: స్వదేశంలో వరుస విజయాల జోరు కొనసాగిస్తున్న భారత మహిళల క్రికెట్ జట్టు మరో పోరుకు సిద్ధమైంది. యంగ్ ప్లేయర్లు సత్తా చాటడంతో ఐర్లాండ్‌పై తొలి వన్డేలో ఘన విజయం సాధించిన స్మృతి మంధన సారథ్యంలోని భారత జట్టు... ఆదివారం రెండో వన్డే ఆడనుంది. మొదటి మ్యాచ్‌లో ప్రతీక రావల్, తేజల్ హసబ్నిస్ అర్ధ శతకాలతో సత్తా చాటడంతో సునాయాసంగా గెలుపొందిన టీమిండియా... ఈ మ్యాచ్‌లోనూ సమిష్టిగా రాణించి మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్ పట్టేయాలని చూస్తోంది. శుక్రవారం జరిగిన తొలి వన్డేలో బౌలింగ్, బ్యాటింగ్‌లో ఆకట్టుకున్న భారత జట్టు... ఫీల్డింగ్‌లో మాత్రం తీవ్రంగా నిరాశ పరిచింది. సులువైన క్యాచ్‌లను సైతం జారవిడిచి ప్రత్యర్థికి భారీ స్కోరు చేసే అవకాశం ఇచ్చింది. ఈ మ్యాచ్‌లో ఫీల్డింగ్‌పై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరముంది. హర్మన్‌ప్రీత్ కౌర్ గైర్హాజరీలో స్మృతి మంధన మరోసారి జట్టును నడిపించనుండగా... ప్రతీక రావల్ ఫామ్ కొనసాగించాలని చూస్తోంది. గత మ్యాచ్‌లో ఎక్కువసేపు నిలవలేకపోయిన హర్లీన్ డియోల్, జెమీమా రోడ్రిగ్స్ కూడా మంచి ఇన్నింగ్స్‌లతో ఆకట్టుకుంటే టీమిండియాకు తిరుగుండదు. తేజల్, రిచా ఘోష్, దీప్తి శర్మతో బ్యాటింగ్ లైనప్ బలంగా ఉంది. ఇక బౌలింగ్ విషయానికి వస్తే టిటాస్ సాధు, సయాలీ, సైమా ఠాకూర్, ప్రియా మిశ్రా, దీప్తి శర్మ కీలకం కానున్నారు. ఏడాది స్వదేశంలో వన్డే ప్రపంచకప్ జరగనున్న నేపథ్యంలో రిజర్వ్ బెంచ్ సత్తా పరీక్షించుకునేందుకు ఈ సిరీస్ ఉపయోగపడనుంది. మరోవైపు తొలి మ్యాచ్‌లో బ్యాటింగ్‌లో ఆకట్టుకొని ఆత్మవిశ్వాసం నింపుకున్న ఐర్లాండ్ అదే జోష్‌లో సిరీస్ సమం చేయడంతో పాటు... భారత్‌పై తొలి విజయం సాధించాలని చూస్తోంది.



నిశాంత్

ప్రొఫెషనల్ బాక్సర్‌గా నిశాంత్ దేవ్

న్యూఢిల్లీ: భారత యువ బాక్సర్ నిశాంత్ దేవ్ ప్రొఫెషనల్ బాక్సర్‌గా కెరీర్ ప్రారంభించనున్నాడు. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం నెగ్గిన నిశాంత్ దేవ్... పారిస్ ఒలింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించాడు. 24 ఏళ్ల నిశాంత్ ఈ నెల 25న ప్రొఫెషనల్ కెరీర్ ప్రారంభించనున్నాడు. ఈ మేరకు ఎడ్డీ హెర్న్ మ్యాచ్‌రూమ్‌తో ఒప్పందం జరిగింది. లాస్ వెగాస్‌లో నిశాంత్ తొలి బౌట్ ఆడనుండగా... ప్రత్యర్థి ఎవరనేది తేలాల్సి ఉంది. 'ప్రొఫెషనల్ బాక్సర్‌గా కెరీర్ ప్రారంభించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. మ్యాచ్‌రూమ్ బాక్సింగ్‌తో జత కట్టడం చాలా సంతోషంగా ఉంది. 25న లాస్‌వెగాస్‌లో జరగనున్న తొలి బౌట్‌లో ప్రత్యర్థిపై విజయం సాధించేందుకు ప్రయత్నిస్తా' అని నిశాంత్ సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించాడు. ప్రపంచ ప్రొఫెషనల్ బాక్సింగ్ చాంపియన్‌గా మారడమే తన ముందున్న లక్ష్యమని... భారత్ నుంచి ఇప్పటి వరకు ఏ బాక్సర్ సాధించని ఘనత అందుకునేందుకు కృషి చేస్తానని నిశాంత్ పేర్కొన్నాడు. జాతీయ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో రెండు సార్లు విజేతగా నిలిచిన నిశాంత్ ప్రస్తుతం మాజీ ప్రొఫెషనల్ బాక్సర్ రోనాల్డ్ సిమ్స్ వద్ద శిక్షణ పొందుతున్నాడు. 'సిమ్స్ ఆధ్వర్యంలో కఠోర సాధన చేస్తున్నా. ఆటలో ఉన్నత స్థాయికి చేరడం కోసం ఎంత కష్టమైన భరిస్తా. అమెచ్యూర్ కెరీర్‌లో మంచి విజయాలు సాధించా. పారిస్ ఒలింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించడంతో పాటు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పతకం నెగ్గా. ఇప్పుడు ప్రొఫెషనల్ కెరీర్‌లోనూ అదే కొనసాగించాలని భావిస్తున్నా' అని నిశాంత్ అన్నాడు.

సెమీస్‌లో మహారాష్ట్ర, కర్ణాటక

అర్షిన్ కులకర్ణి, దేవదత్ పడిక్కల్ సెంచరీలు ● నేడు మరో రెండు క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు



అర్షిన్



పడిక్కల్

వడోదర: దేశవాళీ వన్డే టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీలో మహారాష్ట్ర, కర్ణాటక జట్లు సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లాయి. శనివారం జరిగిన మూడో క్వార్టర్ ఫైనల్లో పంజాబ్‌పై మహారాష్ట్ర 70 పరుగుల తేడాతో విజయం సాధించగా... బరోడాపై కర్ణాటక 5 పరుగుల తేడాతో గెలుపొందింది. పంజాబ్‌తో మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన మహారాష్ట్ర జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 275 పరుగులు చేసింది. యువ ఓపెనర్ అర్షిన్ కులకర్ణి (137 బంతుల్లో 107; 14 ఫోర్లు) సెంచరీతో కదంతొక్కగా... అంకిత్ బావ్నె (85 బంతుల్లో 60; 7 ఫోర్లు) హాఫ్‌సెంచరీ చేశాడు. ఆఖర్లో వికెట్ కీపర్ నిఖిల్ (29 బంతుల్లో 52 నాటౌట్, 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు అర్ధశతకం సాధించడంతో మహారాష్ట్ర మంచి స్కోరు చేయగలిగింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (5), సిద్ధేశ్ వీర్ (0), రాహుల్ త్రిపాఠి (15) విఫలమయ్యారు. పంజాబ్ బౌలర్లలో టీమిండియా పేసర్ అర్ష్‌దీప్ సింగ్ 3, నమన్ రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో పంజాబ్ జట్టు 44.4 ఓవర్లలో 205 పరుగులకు ఆలౌటైంది. తాజా సీజన్‌లో రికార్డు స్కోర్లు తిరగరాసిన పంజాబ్ ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్ సింగ్ (14), అభిషేక్ శర్మ (19) ఎక్కువసేపు నిలవకపోవడంతో పంజాబ్‌కు మెరుగైన ఆరంభం లభించలేదు. అన్‌మోల్‌ప్రీత్ సింగ్ (77 బంతుల్లో 48; 3 ఫోర్లు, 1 సిక్స్) పోరాడినా ఫలితం లేకపోయింది. రమణ్‌దీప్ సింగ్ (2), నేహల్ వధేర (6), విఫలమయ్యారు. చివర్లో అర్ష్‌దీప్ సింగ్ (39 బంతుల్లో 49; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపులు ఓటమి అంతరాన్ని తగ్గించేందుకే పరిమితమైంది. మహారాష్ట్ర బౌలర్లలో ముఖేశ్ చౌధరీ 3 వికెట్లు, ప్రదీప్ రెండు వికెట్లు పడగొట్టారు. సెంచరీతో పాటు ఒక వికెట్ తీసిన అర్షిన్ కులకర్ణికి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

కర్ణాటకను గెలిపించిన పడిక్కల్

విజయ్ హజారే టోర్నీలో నాలుగుసార్లు టైటిల్ గెలిచిన కర్ణాటక జట్టు... హోరాహోరీగా సాగిన నాలుగో క్వార్టర్ ఫైనల్లో బరోడాను మట్టికరిపించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటక 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 281 పరుగులు చేసింది. కెప్టెన్ మయాంక్ అగర్వాల్ (6) విఫలం కాగా... దేవదత్ పడిక్కల్ (99 బంతుల్లో 102; 15 ఫోర్లు, 2 సిక్స్‌లు) 'శత'క్కొట్టాడు. అనీశ్ (64 బంతుల్లో 52; 4 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్‌సెంచరీతో మెరిశాడు. బరోడా బౌలర్లలో రాజ్ లింబానీ, అతిత్ సేత్ చెరో 3 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనలో తుదికంటా పోరాడిన బరోడా... చివరకు 49.5 ఓవర్లలో 276 పరుగులు చేసింది. ఓపెనర్ శాశ్వత్ రావత్ (126 బంతుల్లో 104; 9 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ చేయగా... అతిత్ సేత్ (56; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకం సాధించాడు. కెప్టెన్ కృనాల్ పాండ్యా (30) ఫర్వాలేదనిపించాడు. బరోడా విజయానికి చివరి 5 ఓవర్లలో 44 పరుగులు అవసరం కాగా... ప్రధాన ఆటగాళ్లు క్రీజులో ఉండటంతో విజయం ఖాయమనిపించింది. అయితే టీమిండియా పేసర్ ప్రసిధ్ కృష్ణ కట్టుదిట్టమైన బంతులతో బరోడా బ్యాటర్లను కట్టడి చేశాడు. 47వ ఓవర్‌లో సెంచరీ హీరో శాశ్వత్ రావత్‌తో పాటు మహేశ్ పిటియా (1)ను ఔట్ చేశాడు. ఇక ఆఖరి ఓవర్‌లో విజయానికి 12 పరుగులు అవసరం కాగా... బరోడా 7 పరుగులు మాత్రమే చేయగలిగింది. కర్ణాటక బౌలర్లలో ప్రసిధ్ కృష్ణ, వాసుకి కౌశిక్, అభిలాశ్, శ్రేయస్ గోపాల్ తలా 2 వికెట్లు పడగొట్టారు. పడిక్కల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఆదివారం జరగనున్న క్వార్టర్ ఫైనల్స్‌లో గుజరాత్‌తో హర్యానా, విదర్భతో రాజస్థాన్ తలపడతాయి.



హైదరాబాద్ తూఫాన్స్ గెలుపు

హాకీ ఇండియా లీగ్

రూర్కెలా: హాకీ ఇండియా లీగ్‌లో హైదరాబాద్ తూఫాన్స్ జట్టు మూడో విజయం ఖాతాలో వేసుకుంది. శనివారం హోరాహోరీగా సాగిన పోరులో హైదరాబాద్ తూఫాన్స్ షూటౌట్‌లో సూర్మా హాకీ క్లబ్‌పై విజయం సాధించింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు 1-1తో సమంగా నిలవగా... విజేతను నిర్ణయించేందుకు నిర్వహించిన షూటౌట్‌లో 4-3 గోల్స్ తేడాతో హైదరాబాద్ జట్టు విజయం సాధించింది. మ్యాచ్‌లో హైదరాబాద్ తూఫాన్స్ జట్టు తరఫున అమన్‌దీప్ లక్రా (40వ నిమిషంలో) గోల్ సాధించగా... సూర్మా హాకీ క్లబ్ తరఫున నికోలస్ డెల్లా (8వ ని.లో) ఏకైక గోల్ కొట్టాడు. ఆట ఆరంభంలోనే సూర్మా హాకీ క్లబ్ గోల్ సాధించి ఆధిక్యంలోకి వెళ్లగా... మూడో క్వార్టర్‌లో హైదరాబాద్ జట్టు స్కోరు సమం చేసింది. ఆ తర్వాత ఇరు జట్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో షూటౌట్ అనివార్యమైంది. సడన్ డెత్‌లో గోల్‌కీపర్ డొమినిక్ డిక్సన్ చక్కటి ప్రతిభ కనబర్చడంతో తూఫాన్స్‌కు బోనస్ పాయింట్ లభించింది. తాజా సీజన్‌లో 5 మ్యాచ్‌లాడి 3 విజయాలు, 2 పరాజయాలు మూటగట్టుకున్న హైదరాబాద్ తూఫాన్స్ 7 పాయింట్లతో పట్టిక ఐదో స్థానంలో కొనసాగుతోంది. శనివారమే జరిగిన మరో మ్యాచ్‌లో యూపీ రుద్రాస్ జట్టు 3-1 గోల్స్ తేడాతో ఢిల్లీ ఎస్జీ పైపర్స్‌పై విజయం సాధించింది. యూపీ రుద్రాస్ తరఫున ఫ్లోరిస్ (30వ నిమిషంలో), కాన్ రసెల్ (43వ ని.లో), టంగ్యూ కసిన్స్ (54వ ని.లో) తలా ఒక గోల్ కొట్టగా... ఢిల్లీ జట్టు తరఫున జాక్ వెటన్ (29వ ని.లో) ఏకైక గోల్ సాధించాడు. లీగ్‌లో భాగంగా ఆదివారం జరగనున్న మ్యాచ్‌లో వేదాంత కళింగ లాన్సర్స్‌తో హైదరాబాద్ తూఫాన్స్ తలపడుతుంది.

నేటి నుంచి మహిళల లీగ్

మహిళల హాకీ ఇండియా లీగ్ (డబ్ల్యూహెచ్ఐఎల్)కు నేడు తెరలేవనుంది. గతంలో కేవలం పురుషుల కోసమే ఈ లీగ్ నిర్వహించగా... ఈ ఏడాది నుంచి మహిళల కోసం కూడా ప్రత్యేకంగా పోటీలు జరుపుతున్నారు. పురుషుల లీగ్ రూర్కెలాలో జరుగుతుండగా... మహిళల లీగ్ మ్యాచ్‌లు రాంచీలో నిర్వహించనున్నారు. మహిళల విభాగంలో ఢిల్లీ ఎస్జీ పైపర్స్, ఒడిశా వారియర్స్, బెంగాల్ టైగర్స్, సూర్మా హాకీ క్లబ్ జట్లు టైటిల్ కోసం పోటీపడుతున్నాయి. ఈ నెల 26న జరగనున్న ఫైనల్‌తో మహిళల లీగ్ ముగియనుంది. ఆదివారం జరగనున్న తొలి పోరులో ఢిల్లీ ఎస్జీ పైపర్స్‌తో ఒడిశా వారియర్స్ జట్టు తలపడనుంది.

శ్రీలంకకు ఊరట విజయం

● ఆఖరి వన్డేలో గెలుపు
● 2-1తో సిరీస్ న్యూజిలాండ్ కైవసం



ఆక్లాండ్: తొలి రెండు మ్యాచ్‌ల్లో పరాజయాలతో ఇప్పటికే సిరీస్ కోల్పోయిన శ్రీలంక జట్టు... న్యూజిలాండ్ పర్యటనను విజయంతో ముగించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శనివారం జరిగిన ఆఖరి వన్డేలో శ్రీలంక 140 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌ను చిత్తుచేసింది. కాగా, తొలి రెండు వన్డేల్లో నెగ్గిన న్యూజిలాండ్ 2-1తో సిరీస్ కైవసం చేసుకుంది. ఈ పర్యటనలో భాగంగా శ్రీలంక జట్టు టి20 సిరీస్‌లో 1-2తో ఓటమి పాలైంది. నామమాత్ర పోరులో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 290 పరుగులు చేసింది. పతుమ్ నిసాంక (42 బంతుల్లో 66; 6 ఫోర్లు, 5 సిక్స్‌లు), కుశాల్ మెండిస్ (48 బంతుల్లో 54; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), జనిత్ లియనాగే (52 బంతుల్లో 53; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ శతకాలతో సత్తా చాటగా, కమిందు మెండిస్ (46; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఆకట్టుకున్నాడు. న్యూజిలాండ్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ 4, సాంట్నర్ రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్య ఛేదనలో న్యూజిలాండ్ జట్టు 29.4 ఓవర్లలో 150 పరుగులకు ఆలౌటైంది. మార్క్ చాప్‌మన్ (81 బంతుల్లో 81; 10 ఫోర్లు, 1 సిక్స్) ఒంటరి పోరాటం చేయగా... తక్కినవాళ్లు విఫలమయ్యారు. విల్ యంగ్ (0), రచిన్ రవీంద్ర (1), డారిల్ మిషెల్ (2), టామ్ లాథమ్ (0), గ్లెన్ ఫిలిప్స్ (0), బ్రాస్‌వెల్ (13), సాంట్నర్ (2) ఒకరి వెంట ఒకరు పెవిలియన్‌కు చేరారు. దీంతో 21 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన కివీస్ ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు. శ్రీలంక బౌలర్లలో అసిత ఫెర్నాండో, మహీశ్ తీక్షణ, ఇషాన్ మలింగ తలా మూడు వికెట్లు పడగొట్టారు. అసిత (3/26)కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', హెన్రీకు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి.

మోహన్ బగాన్ 'టాప్' షో



బెంగళూరు: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో మోహన్ బగాన్ జోరు కొనసాగుతోంది. శనివారం జరిగిన పోరులో మోహన్ బగాన్ జట్టు 1-0 గోల్స్ తేడాతో ఈస్ట్ బెంగాల్ జట్టుపై విజయం సాధించింది. మోహన్ బగాన్ తరఫున జామియా మెక్‌లారెన్ (2వ నిమిషంలో) ఏకైక గోల్ సాధించాడు. మోహన్ బగాన్‌కు ఇది 'హ్యాట్రిక్' విజయం కాగా... తాజా సీజన్‌లో 15 మ్యాచ్‌లాడి 11 విజయాలు, 2 పరాజయాలు, 2 'డ్రా'లతో 35 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టిక అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఈస్ట్ బెంగాల్ జట్టు 9వ పరాజయంతో 14 పాయింట్లు సాధించి పట్టిక 11వ స్థానంలో ఉంది. మరో మ్యాచ్‌లో మొహమ్మదాన్ ఎఫ్‌సీ 1-0 గోల్స్ తేడాతో బెంగళూరు ఫుట్‌బాల్ క్లబ్‌పై గెలుపొందింది. మొహమ్మదాన్ జట్టు తరఫున మిర్జాలోల్ కసిమోవ్ (88వ నిమిషంలో) ఏకైక గోల్ సాధించాడు. వరుసగా రెండో మ్యాచ్‌లో ఓడినా బెంగళూరు జట్టు పాయింట్ల పట్టికలో రెండో స్థానంలోనే కొనసాగుతోంది. లీగ్‌లో భాగంగా ఆదివారం జరగనున్న మ్యాచ్‌లో ముంబై సిటీతో జంషెడ్‌పూర్ జట్టు తలపడనుంది.



అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన జై షాను శనివారం ముంబైలో బీసీసీఐ ప్రత్యేకంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో జై షాతో ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు వి.చాముండేశ్వరనాథ్.

మ్యాథ్స్ మహారాణి

ప్రపంచంలోనే అత్యంత ఆసక్తికరంగా మ్యాథ్స్ చెప్పే టీచర్‌గా ఘనత

బిగ్ ఇంటర్నెట్ మ్యాథ్స్ పోటీలో గెలిచిన తొలి ఆఫ్రికన్ యువతరంగం

గణితం అంటేనే ఆమడదూరం పరిగెత్తేవాళ్లు మనలో చాలా మందే ఉన్నారు. మొదట్లో గణితంపై పెద్దగా ఆసక్తి చూపని ఓ అమ్మాయి ఇప్పుడు ఏకంగా ప్రపంచంలోనే అత్యంత ఆసక్తికరంగా గణితాన్ని విడమరిచి చెప్పే లెక్కల టీచర్‌గా చరిత్ర సృష్టించారు. ఇటీవల జరిగిన ప్రఖ్యాత గణిత పాఠాల పోటీ 'బిగ్ ఇంటర్నెట్ మ్యాథ్-ఆఫ్'లో ఘనా దేశానికి చెందిన 35 ఏళ్ల ఏంజెలా తబిరి 16 మందిని వెనక్కునెట్టి ప్రపంచవిజేతగా జయకేతనం ఎగరేసింది. ఈ పోటీలో నెగ్గిన తొలి ఆఫ్రికన్‌గా, అందులోనూ తొలి ఆఫ్రికన్ మహిళగా చరిత్ర సృష్టించారు. సమస్యల పరిష్కారంపై ఉన్న మక్కువే తనను మ్యాథ్స్ వైపు నడిపించించిందని తబిరి చెబుతున్నారు. తన విజయం మరింత మంది ఆఫ్రికన్ మహిళలు గణితాన్ని అభ్యసించేందుకు ప్రేరణగా నిలుస్తుందని నమ్ముతున్నారు.

ఘనా మ్యాథ్స్ క్వీన్

డాక్టర్ తబిరి ఆఫ్రికన్ ఇనిస్టిట్యూట్ ఫర్ మ్యాథమేటికల్ సైన్సెస్(ఎయిమ్స్)లో అణు బీజ గణితం బోధించడంలో నిపుణురాలిగా పేరు సాధించారు. ఇంతటి ఘనత సాధించిన ఘనా దేశస్తురాలి గణితపర్వం ఒక ప్రణాళికాబద్ధంగా మొదలుకాలేదు. ఘనాలో పారిశ్రామికరంగానికి కేంద్ర స్థానంగా ఉన్న రాజధాని నగరం అక్రా సమీపంలోని టిమా నౌకాపట్టణంలోని అష్మాన్ మురికివాడలో ఆమె పెరిగారు. నలుగురు తోబుట్టువులతో ఇల్లు ఎప్పుడూ సందడిగా ఉండేది. ఇది సంతోషాన్నిచ్చినా చదువుకోవడానికి మాత్రం ఇబ్బంది ఉండేది. స్థానిక యూత్ కమ్యూనిటీ సెంటర్‌లో చదువుకునేవారు. తన ఇద్దరు సోదరీమణుల్లాగే యూనివర్సిటీలో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ చేయాలనుకుంది. అందుకు సరిపడా విద్యా గ్రేడ్స్ లేకపోవడంతో బదులుగా గణితం, ఆర్థిక శాస్త్రాన్ని ఎంచుకుంది. అదే ఆమెకు కలిసొచ్చింది. గణిత సూత్రాలు ఆమెను విశేషంగా ఆకట్టుకున్నాయి. చివరకు గణితాన్నే తన కెరీర్‌గా ఎంచుకున్నారు. 2015లో స్కాట్లాండ్‌లోని గ్లాస్గో విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేసేందుకు స్కాలర్‌షిప్ సైతం సంపాదించారు. 1950వ దశకంలో అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసాలో పనిచేసిన నల్లజాతి అమెరికన్ మహిళా గణిత శాస్త్రవేత్తల జీవితగాథలున్న 'హిడెన్ ఫిగర్స్'సినిమా చూశాక ఎంతో స్ఫూర్తి పొందానని ఆమె తెలిపారు. ''ప్రపంచ వేదికపై నల్లజాతి మహిళల కథ నాకెంతో స్ఫూర్తిదాయకం. ముఖ్యంగా కేథరిన్ జాన్సన్ నుంచి ఎంతో ప్రేరణ పొందా. ఇది నా జీవితంలో కీలక మలుపు''అని ఆమె అన్నారు.

మహిళల్లో గణిత అధ్యయనాన్ని పెంచేందుకు..

గణితంలో డాక్టరేట్ అందుకున్న తబిరి లాభాపేక్షలేని సంస్థ 'ఫెమ్ ఆఫ్రికా మ్యాథ్స్'నడిపిస్తున్నారు. అత్యంత వెనుకబడిన వర్గాల్లోని ఆఫ్రికన్ బాలికలు, మహిళల గణిత కలలను సాకారం చేసుకోవడానికి తబిరి తన పూర్తి మద్దతు పలికారు. హైస్కూల్ విద్యార్థులకు ఉచితంగా ఆన్‌లైన్‌లో పాఠాలు బోధిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ మహిళా గణిత శాస్త్రవేత్తలతో ఇంటర్వ్యూలు చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. ఇప్పుడామె సేవలు ఘనా, సెనెగల్, కామెరూన్, రువాండా దేశాలకూ విస్తరించాయి. ఘనాలోని ఉన్నత లేదా మాధ్యమిక పాఠశాల బాలికలకు మార్గదర్శకం చేసే 'గాళ్స్ ఇన్ మ్యాథమెటికల్ సైన్సెస్'ప్రోగ్రామ్‌కు తబిరి అకడమిక్ మేనేజర్ వ్యవహరిస్తున్నారు. ''హైస్కూల్లో గణితం చదివే బాలికలు, బాలుర సంఖ్య దాదాపు సమానంగా ఉందని, విశ్వవిద్యాలయ స్థాయిలో అది తగ్గిపోతోంది. ఈ పరిస్థితిని మార్చడానికి ప్రయత్నిస్తున్నా''అని ఆమె అన్నారు. ఆధునిక క్వాంటమ్ మెకానిక్స్ 100వ వార్షికోత్సవం సందర్భంగా 2025ను 'ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ క్వాంటమ్ సైన్స్ అండ్ టెక్నాలజీ'గా ఐక్యరాజ్యసమితి ప్రకటించాలనే ప్రతిపాదనలకు మెక్సికో మద్దతుతో ఘనా తరఫున నాయకత్వం వహిస్తున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్



నిజ జీవిత సమస్యల పరిష్కారానికి..

''పిల్లలు తమ పాఠశాల పాఠాలను ఊరికే నేర్చుకోకుండా ఉన్నత లక్ష్యాల సాధనకు పనిముట్టుగా వాడుకోవాలి''అని తబిరి వ్యాఖ్యానించారు. ప్రపంచంలోనే అత్యంత పిన్న వయస్కులైన ఆఫ్రికా జనాభా 2040 నాటికి ప్రపంచంలోనే అతిపెద్ద శ్రామిక శక్తిగా అవతరిస్తుందని ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. అలాంటి పాఠశాల విద్యార్థులకు క్వాంటమ్ సైన్స్‌ను పరిచయం చేయడంలో తొలి అడుగుగా 'క్వాంటమ్ రోడ్ షో'ను నిర్వహించాలని ఆమె భావిస్తున్నారు. యునెస్కోతో కలిసి పనిచేస్తున్న తబిరి వివిధ ఆఫ్రికా దేశాలకు చెందిన సుమారు 40 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు జూలైలో ఎయిమ్స్–ఘనాలో వారం రోజుల పాటు 'క్వాంటమ్ హ్యాకథాన్'ను నిర్వహించనున్నారు. తాము ఎదుర్కొంటున్న సవాళ్లను, నిజ జీవిత సమస్యలను పరిష్కరించడానికి క్వాంటమ్ నైపుణ్యాలను ఉపయోగించాలని కోరుకుంటున్నామని చెబుతున్నారు. తబిరి విజయం కేవలం ఆమె వ్యక్తిగత విజయం కాదు. ఆఫ్రికన్ భవిష్యత్ తరాల గణిత శాస్త్రవేత్తలకు, ముఖ్యంగా ఆఫ్రికన్ మహిళలకు ఆశాదీపంగా మారింది.

ప్రాంక్ అని చెప్పి నిజమైన పెళ్లి..

రద్దు చేయాలంటూ కోర్టుకెక్కిన మహిళ

రీల్స్, ఇన్‌స్టాగ్రామ్ ప్రపంచాన్ని ఏలుతున్న కాలంలో ఏది నిజమో? ఏది అబద్ధమో? తెలియడం లేదు. ఆస్ట్రేలియాలోని ఓ మహిళకు ఇలాంటి సమస్యే ఎదురైంది. సోషల్ మీడియాలో ఫాలోవర్స్‌ను పెంచుకోవడానికి అతను ఏర్పాటు చేసిన 'ఫేక్ వెడ్డింగ్'నిజమని తేలడంతో ఆమె కోర్టుకెక్కాల్సి వచ్చింది. చివరకు జడ్జి ఆ పెళ్లిని రద్దు చేశారు. వివరాల్లోకి వెళ్తే... మెల్‌బోర్న్‌లో ఉంటున్న ఓ మహిళకు 2023 సెప్టెంబర్‌లో ఆన్‌లైన్ డేటింగ్ వేదికపై ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. అది కాస్తా ప్రేమగా మారింది. అదే ఏడాది డిసెంబర్‌లో ఆమెకు అతను ప్రపోజ్ చేశాడు. ఆమె అంగీకరించింది. రెండు రోజుల తర్వాత సిడ్నీలో ఓ వైట్‌పార్టీ ఉందని, అక్కడికి అందరూ తెలుపు రంగు దుస్తుల్లో వస్తారని చెప్పారు. ఆమె కూడా అలాగే రెడీ అయి వెళ్లింది. తీరా అక్కడికెళ్లి చూస్తే.. ఫోటోగ్రాఫర్, ఫోటోగ్రాఫర్ స్నేహితుడు తప్ప మరెవరూ లేరు. ఇదేంటని ప్రశ్నిస్తే... తన ఇన్‌స్టాగామ్‌లో ఫాలోవర్స్ పెరగడం కోసం ప్రాంక్ వెడ్డింగ్ నిర్వహిస్తున్నానని, అందుకు సహకరించాలని ఆమెను కోరాడు. అప్పటికే అతనికి 17,000 మందికి పైగా ఫాలోవర్లు ఉన్నారు. అతని వివరణ ఆమెకు సబబుగానే తోచింది. సాయం చేసినట్లవుతుందని ఫేక్ పెళ్లికి అంగీకరించింది. సివిల్ మ్యారేజ్ కోర్టులో జరిగితేనే పెళ్లి చెల్లుబాటవుతుందని నమ్మింది. అదే విషయాన్ని తన స్నేహితురాలితో పంచుకుంది. అదే నిజమైతే వారు ముందుగా వివాహం నోటీసు ఇవ్వాల్సి ఉంటుందని స్నేహితురాలు కూడా చెప్పడంతో.. ఇది ఉత్తుత్తి పెళ్లే అని నమ్మింది.

కట్ చేస్తే.. రెండు నెలల తరువాత, ఆస్ట్రేలియాలో శాశ్వత నివాసం కోసం ఆమె చేసిన దరఖాస్తులో తనను డిపెండెంట్‌గా చేర్చాలని అతను కోరాడు. పెళ్లి కానిది ఎలా కుదురుతుందని ఆమె ప్రశ్నించగా.. సిడ్నీలో జరిగిన వివాహ వేడుక నిజమైనదని బాంబు పేల్చాడు. వివాహ ధృవీకరణ పత్రాన్ని కూడా చూపించాడు. ఆమె సంతకాన్ని ఫోర్జరీ చేసి.. వివాహానికి నెలముందే అతను నోటీసులు ఇచ్చాడని అర్థమైంది. అతను మొదటినుంచి అబద్ధం చెప్పాడని, తనను మోసం చేశాడని ఆమె కోర్టుకెక్కింది. పెళ్లి వేడుకలో తాను నటించానే తప్ప.. అది నిజం కాదని కోర్టుకు తెలిపింది. మహిళ వాంగ్మూలాన్ని నమ్మిన మెల్‌బోర్న్ జడ్జి 2024 అక్టోబర్‌లో వీరి వివాహాన్ని రద్దు చేస్తూ తీర్పు ఇచ్చారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

అస్సాం గని ప్రమాదం..

మరో మూడు మృతదేహాలు వెలికితీత

గువాహటి: అస్సాంలోని దిమా హసావో జిల్లాలో ఈ నెల 8న చోటుచేసుకున్న గని ప్రమాదంలో గల్లంతైన మరో ముగ్గురి మృతదేహాలను అధికారులు వెలికితీశారు. ఉమ్‌రంగ్సు వద్ద గనిలోకి అకస్మాత్తుగా వరద నీరు ప్రవేశించిన ఘటనలో మొత్తం 9 మంది గల్లంతైనట్లు అధికారులు తెలిపారు. వీరిలో ఒక మృతదేహాన్ని బుధవారం వెలికితీశారు. దీంతో, మొత్తం నలుగురి మృతదేహాలను వెలికి తీసినట్లయింది. ఆర్మీ, , ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సహాయక చర్యలు కొనసాగుతున్నాయని సీఎం హిమంత బిశ్వ శర్మ తెలిపారు. దాదాపు 340 అడుగుల లోతున్న క్వారీ నుంచి నీటి తోడివేత కోసం ఓఎన్‌జీసీ, కోల్ ఇండియా సంస్థల నుంచి ప్రత్యేక యంత్రాలను తెప్పించారు. ప్రమాదం చోటుచేసుకున్న గనిని 12 ఏళ్ల క్రితమే మూసి వేశారని సీఎం చెప్పారు.



తీగల వారధి మబ్బుల్లోనే ఉన్నట్టుంది కదూ..! యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో యమునా నదిపై ఉన్న నైనీ వంతెన ఇది. శనివారం ఉదయం దట్టంగా మంచు కురుస్తున్న వేళ.. డ్రోన్ కెమెరాకు చిక్కిందిలా..!

పదిలక్షల మంది వలసదారులకు ఉపశమనం

- టెంపరరీ ప్రొటెక్టెడ్ స్టేటస్ (టీపీఎస్)ను పొడిగించిన బైడెన్
- టీపీఎస్ రక్షణలను రద్దు చేయాలన్న యోచనలో ట్రంప్



వాషింగ్టన్: పదవి నుంచి దిగిపోవడానికి ముందు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. వలసదారులకు టెంపరరీ ప్రొటెక్టెడ్ స్టేటస్‌ను పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వెనిజులా, ఎల్ సాల్వడార్, ఉక్రెయిన్, సూడాన్ దేశాలకు చెందిన వారికి వర్క్‌పర్మిట్లను 18 నెలలపాటు పొడిగించారు. ఈ మేరకు యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్‌ఎస్) ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయా దేశాలకు చెందిన దాదాపు పది లక్షల మందికి ఉపశమనం లభించనుంది. ఈ రక్షణ ఇప్పటికే అమెరికాలో ఉన్న ప్రజలకు మాత్రమే పరిమితం. ప్రస్తుత రక్షణ గడువు ముగిసినప్పటి నుంచి మరో 18 నెలల పాటు బహిష్కరణ నుంచి ఉపశమనం లభిస్తుంది. బైడెన్ 2021లో అధికారం చేపట్టినప్పటి నుంచి టీపీఎస్‌కు అర్హులైన వలసదారుల సంఖ్యను బాగా పెంచారు. స్వదేశంలో ప్రకృతి వైపరీత్యాలు, సాయుధ పోరాటం లేదా ఇతర అసాధారణ సంఘటనలతో ప్రభావితమైన ప్రజలకు వర్తింపజేసే ఈ హోదా ఇప్పుడు అమెరికాలో ఉన్న 17 దేశాలకు చెందిన 1 మిలియన్ కంటే ఎక్కువ మందికి వర్తిస్తుంది. అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్.. జనవరి 20న బాధ్యతలు చేపట్టున్నారు. వెంటనే వలసదారులను ఆయా దేశాలకు తిప్పి పంపిస్తానని పలు మార్లు ప్రకటించారు. తన మొదటి పదవీ కాలంలోనూ టీపీఎస్ నమోదును ముగించడానికి ప్రయత్నించారు. కానీ యూఎస్‌కోర్టులు ఆ యన చర్యలను అడ్డుకున్నాయి. ఆయన మరోసారి శ్వేతసౌధానికి వస్తే టీపీఎస్ రక్షణలను రద్దు చేస్తారని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ట్రంప్ అధికారంలోకి వచ్చాక దేశంలో పనిచేసే అవకాశాన్ని కోల్పోతామని వలసదారులు భయపడుతున్నారు. వారిని రక్షించడానికి మరింత కృషి చేయాలని వలస న్యాయవాదులు, డెమొక్రటిక్ చట్టసభ సభ్యులు బైడెన్‌ను కోరారు. ట్రంప్ ప్రమాణ స్వీకారానికి ముందే పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఫలితంగా అధ్యక్షుడు శుక్రవారం ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ పొడిగింపులు లక్షలాది మందికి మద్దతు ఇవ్వడంతోపాటు ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి ఉపయోగపడతాయని అడ్వకెసీ గ్రూప్ అధ్యక్షుడు టాడ్ షూల్టే అన్నారు. టీపీఎస్‌ను నికరాగ్వా, ఇతర దేశాలకు విస్తరించాలని బైడెన్‌ను కోరారు. టీపీఎస్ ద్వారా ప్రయోజనం పొందినవారిలో వెనిజులాకు చెందినవారే సుమారు 600,000 మంది ఉన్నారు. 1,900 మంది సుడానీలు, 104,000 మంది ఉక్రేనియన్లకు ఉపశమనం లభించింది. ఈ కార్యక్రమంలో అతిపెద్ద జనాభా వెనిజులాదే. 2021లో వెనిజులా వాసులకు బైడెన్ ప్రభుత్వం మొదట టీపీఎస్ హోదాను ఇచ్చింది.

సవాళ్లు విసురుతున్న డార్క్‌వెబ్, క్రిప్టో కరెన్సీ

- కఠిన చర్యలతో వీటిని అడ్డుకోవాలి: అమిత్ షా

న్యూఢిల్లీ: డార్క్ వెబ్, క్రిప్టో కరెన్సీ, ఆన్‌లైన్ మార్కెట్, డ్రోన్లు దేశానికి సవాళ్లు విసురుతూనే ఉన్నాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. కఠిన చర్యలతో వీటిని అడ్డుకోవాలన్నారు. దేశం నుంచి గానీ దేశంలోకి గానీ ఒక కిలో డ్రగ్స్‌ను కూడా అక్రమ రవాణా కానివ్వబోమని స్పష్టం చేశారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ) ఆధ్వర్యంలో శనివారం 'డ్రగ్ ట్రాఫికింగ్ అండ్ నేషనల్ సెక్యూరిటీ'అంశంపై జరిగిన ప్రాంతీయ సదస్సుకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డ్రగ్స్ నెట్‌వర్క్‌లను గుర్తించి ఛేదించడంతోపాటు ఉగ్రవాదంతో లింకులున్న ఇటువంటి వాటిని ధ్వంసం చేయడంలో ప్రభుత్వం విజయవంతమైందని చెప్పారు. జమ్మూకశ్మీర్, పంజాబ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లలో నడిచే నార్కో–టెర్రరిజమ్ ముఠాలను నిర్వీర్యం చేయడాన్ని ప్రధాన విజయంగా ఆయన అభివర్ణించారు. అయినప్పటికీ డార్క్ వెబ్, క్రిప్టో కరెన్సీ, ఆన్‌లైన్ మోసాలు, డ్రోన్ల కట్టడిపై ఇప్పటికీ సవాలుగానే మారిందని వివరించారు. దేశ భద్రత, అభివృద్ధి కోసం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు, సాంకేతిక నిపుణులు కలిసికట్టుగా కృషి చేసి ఈ సమస్యలకు సాంకేతిక పరిష్కారాన్ని కనుగొనాలని నొక్కి చెప్పారు. గత పదేళ్లలో పట్టుబడిన డ్రగ్స్ ఏడింతలు పెరిగాయన్న అమిత్ షా.. ఒక్క 2024లోనే రూ.16,914 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకోగలిగామని వివరించారు. ఈ విషయంలో ఈశాన్య భారతంలోని 8 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలపై దృష్టి పెట్టామని చెప్పారు.

పెన్ డే అని రాసుకుంటారా ?

- 80 మంది అమ్మాయిలు షర్ట్ విప్పాల్సిందే
- బ్లేజర్స్ మీదనే ఇంటికి తిరిగి పంపిన ప్రిన్సిపల్
- జార్ఖండ్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఘటన

ధన్‌బాద్: పరీక్షలు పూర్తవడంతో 'పెన్ డే'పేరిట షర్ట్‌లపై పెన్నులతో రాసుకున్న పదో తరగతి విద్యార్థినులను ఆ ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపల్ దారుణంగా శిక్షించిన ఘటన జార్ఖండ్‌లో ఆలస్యంగా వెలుగుచూసింది. మొత్తం 80 మంది అమ్మాయిల షర్ట్‌లను బలవంతంగా వారితోనే విప్పదీయించి అందర్నీ బ్లేజర్ (కోటు) మీదనే ఇంటికి పంపించేసిన ఉదంతం ధన్‌బాద్ జిల్లాలోని డిగ్‌వాడియా పట్టణంలో జరిగింది. విషయం తెల్సుకుని జిల్లాయంత్రాంగం వెంటనే విచారణకు ఆదేశించింది. జోరాపోఖార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ప్రముఖ పాఠశాలలో ఈ ఉదంతం చోటుచేసుకుందని వివరాలను ధన్‌బాద్ డెప్యూటీ కమిషనర్ మాధవీ మిశ్రా వెల్లడించారు. స్నేహితులకు సందేశాల పేరిట చొక్కాలను పెన్ను గీతలతో నింపేయడమేంటంటూ ప్రిన్సిపల్ పట్టరాని ఆవేశంతో విద్యార్థినులను కోప్పడి షర్ట్‌లను తీసేయాలని ఆజ్ఞాపించాడు. పిల్లలు క్షమాపణలు చెప్పినా వినిపించుకోలేదు. బలవంతంగా వారితోనే తీయించి ఇంటికి పంపేశారు. అవమానంగా భావించిన కొందరు విద్యార్థినులు తమ తల్లిదండ్రులకు చెప్పడం, వారు పోలీసులకు ఫిర్యాదుచేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దర్యాప్తు కోసం జిల్లా యంత్రాంగం ఒక కమిటీని ఏర్పాటుచేసింది. ఈ కమిటీలో ఒక సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్, జిల్లా విద్యాధికారి, జిల్లా సామాజిక సంక్షేమాధికారి, సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ఉంటారు. ప్రిన్సిపల్ ఘటన సిగ్గుమాలిన, దురదృష్టకర చర్య అని ఝరియా ఎమ్మెల్యే రాగిణి సింగ్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

మదురో అరెస్ట్‌కు ఆధారాలిస్తే 215 కోట్ల రివార్డు



వాషింగ్టన్: వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను అరెస్ట్ చేసేందుకు వీలుగా బలమైన సాక్ష్యాధారాలను అందించిన వారికి రూ. 215 కోట్ల నగదు బహుమతి ఇస్తామని అమెరికా ప్రకటించింది. అధ్యక్షుడిగా మదురో మూడోసారి ప్రమాణ స్వీకారం చేసిన శుక్రవారం రోజే అమెరికా ఈ ప్రకటన చేయడం గమనార్హం. వెనిజులా అంతర్గత శాఖ మంత్రి డియోస్డాడో కాబెల్లో అరెస్ట్ కోసం తగిన ఆధారాలిచ్చినా తగు నగదు బహుమతి ముట్టజెప్తామని అమెరికా మరో ప్రకటన చేసింది. రక్షణ మంత్రి వ్లాదిమిర్ పాడ్రినోకు సంబంధించిన ఆధారాలిస్తే రూ. 130 కోట్ల నజరానా ఇస్తామని పేర్కొంది. మరోవైపు 15 మంది వెనిజులా ఉన్నతాధికారులపై బ్రిటన్ ఆంక్షలు విధించింది. వీరిలో న్యాయమూర్తులు, భద్రతా దళాల సభ్యులు, సైనికాధికారులు ఉన్నారు. వీళ్లంతా వెనిజులాలో ప్రజాస్వామ్యం, న్యాయపాలన, మానవహక్కుల ఉల్లంఘనలకు పాల్పడ్డారని పేర్కొంది. మదురో పాలన మోసపూరితమైనదని బ్రిటన్ విదేశాంగ కార్యదర్శి డేవిడ్ లామీ విమర్శించారు. మదురోవి సిగ్గుమాలిన చర్యలని కెనడా విదేశాంగ మంత్రి మెలానీ జోలీ అభివర్ణించారు. ఆంక్షలు సైతం విధించారు. ప్రజాస్వామ్య ప్రక్రియను దెబ్బతీయడం, పౌరులపై అణచివేతను కెనడా సహించబోదని జోలీ స్పష్టం చేశారు.

నార్కో టెర్రరిజం అభియోగాలు

అమెరికాను కొకైన్‌తో ముంచెత్తుతున్నారంటూ 2020లో మదురోతోపాటు ఇతర వెనిజులా ఉన్నతాధికారులపై అమెరికా నార్కో టెర్రరిజం నేరాభియోగాలు మోపింది. అమెరికన్ల ఆరోగ్యాన్ని దెబ్బతీసేందుకు మాదకద్రవ్యాలను ఆయుధంగా వాడుకుంటున్నారని ఆరోపించింది. ఈ ఆరోపణలను మదురో తోసిపుచ్చారు. వెనిజులాలో స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికలకు తాము మొదట్నుంచీ మద్దతు ఇస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. ఇందులోభాగంగా తాత్కాలికంగా వెనిజులాపై అమెరికా గత ఏడాది చమురు ఆంక్షలను సడలించింది. ఎన్నికల తర్వాత తాజాగా తిరిగి విధించింది. అయితే తమ దేశార్థికం కునారిల్లడానికి అమెరికా విధానాలు, ఆంక్షలే కారణమని మదురో మొదట్నుంచీ తీవ్ర ఆరోపణలు గుప్పిస్తుండటం తెల్సిందే.

మూడోసారి పగ్గాలు

మదురో శుక్రవారం మూడోసారి అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాబోయే కాలంలో శాంతి, సౌభాగ్యం, సమానత్వం, నూతన ప్రజాస్వామ్యం దిశలో దేశాన్ని నడిపిస్తానని ఈ సందర్భంగా మదురో వ్యాఖ్యానించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం కట్టుదిట్టమైన భద్రత నడుమ సాగింది. కార్యక్రమానికి వెనిజులా మీడియాసహా విదేశీ పాత్రికేయులనూ అనుమతించలేదు. మదురో ప్రభుత్వానికి ఇరాన్, చైనా, రష్యాసహా కొన్ని దేశాలు మద్దతు పలుకుతున్నాయి. క్యూబా, నికరాగ్వా అధ్యక్షులు మాత్రమే ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. ఎన్నికల పర్వం మొదలైన నాటి నుంచి అన్యాయంగా నిర్బంధంలో మగ్గిపోతున్న నేతలు, వ్యక్తులను తక్షణం మదురో విడుదల చేయాలని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ శుక్రవారం డిమాండ్‌చేశారు. జూలై 28 ఎన్నికల ఫలితాలను వెనిజులా ప్రతిపక్షాలు తిరస్కరించాయి. అమెరికాతో సహా అనేక దేశాలు వ్యతిరేకించాయి. వెనిజులా వామపక్ష పొరుగు దేశాలైన బ్రెజిల్, కొలంబియాతో సహా పలు దేశాలు ఎన్నికల ఫలితాలను తిరస్కరించాయి. బహిష్కృత ప్రతిపక్ష అభ్యర్థి ఎడ్మండో గొంజాలెజ్‌ను చట్టబద్ధ అధ్యక్షుడిగా గుర్తిస్తున్నట్లు ప్రకటించాయి. గొంజాలెజ్ సెప్టెంబర్‌లో వెనిజులా నుంచి పారిపోయి స్పెయిన్‌లో తలదాచుకుంటున్నారు. మదురో ప్రభుత్వం అతని కోసం అరెస్టు వారెంట్ జారీ చేసింది. అతని అరెస్ట్‌కు సాయపడే సాక్ష్యాధారాలను అందించిన వారికి లక్ష డాలర్ల రివార్డ్ సైతం ప్రకటించింది.

కనౌజ్ రైల్వే స్టేషన్‌లో.. కూలిన నిర్మాణంలో ఉన్న భవనం

- 23 మంది కార్మికులకు గాయాలు
- శిథిలాల కింద చిక్కుకున్న మరికొందరు

కనౌజ్: ఉత్తరప్రదేశ్‌లోని కనౌజ్ రైల్వే స్టేషన్‌లో శనివారం మధ్యాహ్నం నిర్మాణంలో ఉన్న ఓ భవనం కుప్పకూలింది. సుమారు 25 మంది కార్మికులు శిథిలాల కింద చిక్కుకుని ఉంటారని అధికారులు తెలిపారు. కనీసం 23 మంది ఘటనలో గాయపడగా ఆరుగురిని శిథిలాల నుంచి బయటకు తీశారు. శిథిలాల కింద చిక్కుకున్న వారి జాడ కనుగొనేందుకు అధికారులు డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. భవనం కూలిన చోట పెద్ద ఎత్తున చెలరేగిన దుమ్ముధూళిలో జనం హాహాకారాలు చేస్తున్నట్లున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమయ్యాయి. విరిగిన బీమ్‌ల మధ్య చిక్కుకున్న వారిని బయటకు తీస్తున్న దృశ్యాలు కూడా అందులో ఉన్నాయి. ఘటనలో భవనం పైకప్పు కూలిందని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని అధికారులు తెలిపారు. ఘటనలో ఎవరూ ప్రాణాలు కోల్పోలేదన్నారు. క్షతగాత్రుల్లో ముగ్గురికి మాత్రం తీవ్ర గాయాలయ్యాయన్నారు. కనౌజ్ రైల్వే స్టేషన్‌లో కొత్త టెర్మినల్‌లో భాగమైన వెయిటింగ్ హాల్‌నిర్మాణం సమయంలో ఘటన చోటుచేసుకుందన్నారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో పాలుపంచుకుంటున్నాయని చెప్పారు. నిర్మాణంలో ఉన్న భవనం కూలిన ఘటనపై దర్యాప్తునకు ఆదేశించామని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు.

29 మందితో బీజేపీ రెండో జాబితా

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు 29 మందితో బీజేపీ శనివారం రెండో జాబితాను విడుదల చేసింది. ఆప్ మాజీ నేత కపిల్ మిశ్రాను కరవాల్ నగర్ నుంచి బరిలోకి దింపింది. అలాగే ఢిల్లీ మాజీ సీఎం మదన్‌లాల్ ఖురానా కుమారుడు హరీష్ ఖురానాను మోతీనగర్ అభ్యర్థిగా ప్రకటించింది. రెండు విడతల్లో కలిపి బీజేపీ ఇప్పటిదాకా 58 నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించింది. 70 స్థానాలున్న ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి 5న పోలింగ్ జరగనున్న విషయం తెలిసిందే. ఫిబ్రవరి 8న ఓట్ల లెక్కింపు చేపడతారు.

స్థానిక ఎన్నికల్లో ఒంటరి పోరు

శివసేన(ఉద్ధవ్) నేత సంజయ్ రౌత్ సంచలన ప్రకటన

- ఎంవీఏలోని కాంగ్రెస్ సహకరించడం లేదని ఆరోపణలు
- కూటమిలో తమ కార్యకర్తలకు అవకాశాలు దక్కడం లేదని వెల్లడి
- ఎంవీఏలో ముదిరిన విభేదాలకు గట్టి సంకేతమంటున్న విశ్లేషకులు



నాగ్‌పూర్: మహారాష్ట్రలోని ప్రతిపక్ష కూటమి మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ)లో లుకలుకలు మరోసారి ప్రస్ఫుటమయ్యాయి. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయంపై కూటమి నేతలు పరస్పరం దుమ్మెత్తి పోసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఎంవీఏలోని కీలక భాగస్వామ్య పార్టీ శివసేన(ఉద్ధవ్) సంచలన ప్రకటన చేసింది. రాష్ట్రంలో మరికొద్ది నెలల్లో జరిగే స్థానిక ఎన్నికల్లో తాము ఒంటరిగానే పోటీ చేస్తామని ఆ పార్టీ నేత సంజయ్ రౌత్ స్పష్టం చేశారు. ఉమ్మడిగా ఉండి పోటీ చేస్తే కూటమి భాగస్వామ్య పక్షాల కార్యకర్తలకు అవకాశాలు రావడం లేదని వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితుల్లో సంస్థాగతంగా బలోపేతం అవ్వాల్సిన విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఒంటరిగా బరిలోకి దిగాలని నిర్ణయించామన్నారు. ముంబై, థానె, నాగ్‌పూర్ తదితర మున్సిపల్ కార్పొరేషన్లతోపాటు జిల్లా పరిషత్, పంచాయతీ ఎన్నికల్లో సైతం సొంతంగానే బరిలోకి దిగాలనే నిర్ణయానికి తమ పార్టీ అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే సానుకూలంగా ఉన్నట్లు రౌత్ వివరించారు. ప్రతిపక్ష ఇండియా కూటమి, మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ) రూపంలోని మైత్రి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు మాత్రమే పరిమితమని రౌత్ స్పష్టం చేశారు.

కాంగ్రెస్ తీరు సరికాదు

ఎంవీఏ, ఇండియా కూటమిలోనీ ముఖ్య భాగస్వామ్య పక్షమైన కాంగ్రెస్ పార్టీ సభ్య పార్టీలకు ఏమాత్రం సహకరించడం లేదని రౌత్ ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయంపై కాంగ్రెస్ పార్టీ నేత విజయ్ వడెట్టివార్ భాగస్వామ్య పక్షాలను నిందిస్తున్నారని తెలిపారు. ఏకాభిప్రాయం, సర్దుకుపోవడం వంటి వాటిపై విశ్వాసం లేని వారికి కూటమిలో కొనసాగే అర్హత లేదని రౌత్ విమర్శించారు. ఇక ఇండియా కూటమి విషయానికొస్తే..లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత ఒక్క దఫా కూడా సమావేశం కాలేకపోయిందన్నారు. ఇండియా కూటమికి కన్వీనర్‌ను కూడా నియమించుకోలేకపోవడం మంచి విషయం కాదన్నారు.

ఎవరికీ మంచిది కాదు: ఎన్‌సీపీ(శరద్)

శివసేన (ఉద్ధవ్) పార్టీ నిర్ణయంపై ఎంవీఏ భాగస్వామ్య పక్షమైన ఎన్‌సీపీ(శరద్) స్పందించింది. 'ఒంటరిగానే ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటే అది శివసేన(ఉద్ధవ్) పార్టీ ఇష్టం. మేం అడ్డుకోబోం. బలవంతంగా ఎవరినీ కలుపుకోం. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కూడా మేం కలిసి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అది సరైన నిర్ణయంగా మేం భావించడం లేదు. కానీ, ఈ నిర్ణయం ప్రభావం ఎంవీఏ కూటమిలోని మూడు భాగస్వామ్య పక్షాల గెలుపు అవకాశాలపైనా పడుతుంది'అని ఆ పార్టీ నేత జితేంద్ర ఔహద్ చెప్పారు.

మేం పట్టించుకోం: సీఎం ఫడ్నవీస్

స్థానిక ఎన్నికల్లో సొంతంగానే పోటీ చేయాలన్న శివసేన(ఉద్ధవ్) నిర్ణయాన్ని బీజేపీకి చెందిన సీఎం ఫడ్నవీస్ తోసిపుచ్చారు. 'ఎంవీఏ కూటమి పోటీలో ఉన్నా లేకున్నా మేం పట్టించుకునేది లేదు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కట్టుబడి ఉంటాం. వచ్చే అన్ని ఎన్నికల్లోనూ ప్రజలు మాకే మద్దతుగా ఉంటారనే నమ్మకం మాకుంది'అని ఆయన చెప్పారు. ఇటీవలి కాలంలో శివసేన(ఉద్ధవ్) వర్గం బీజేపీ వైపు మొగ్గ చూపుతోందంటూ వస్తున్న వార్తలపై ఆయన స్పందిస్తూ..రాజకీయాల్లో ఏమైనా జరగొచ్చునంటూ వ్యాఖ్యానించారు.

సంబంధాల బలోపేతానికి సమగ్ర విధానాలు

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

కేంద్ర - రాష్ట్ర సంబంధాలు

రాజమన్నార్ కమిటీ (1969)

కేంద్ర-రాష్ట్ర సంబంధాలను సమగ్రంగా అధ్యయనం చేయడానికి తమిళనాడు ప్రభుత్వం జస్టిస్ రాజమన్నార్ కమిటీని 1969లో నియమించింది. ఇందులో పి.సి. చంద్రారెడ్డి, డాక్టర్ లక్ష్మణ్ స్వామి మొదలియార్ సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ 1971 మే 27న తన అధ్యయన నివేదికను సమర్పించింది.

రాజమన్నార్ కమిటీ భారత్‌లోని ఏకకేంద్ర ధోరణులకు 4 కారణాలు తెలిపింది. అవి:

1. భారత రాజ్యాంగం కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక అధికారాలు ఇవ్వడం.
2. కేంద్రం, రాష్ట్రంలో ఒకే రాజకీయ పార్టీ పాలన.
3. తగినన్ని ఆర్థిక వనరులు లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఆధారపడటం.
4. కేంద్ర ప్రణాళిక రూపకల్పన, ప్రణాళిక సంఘం అధీకృత పాలన.

సూచనలు

- కేంద్ర-రాష్ట్ర సంబంధాల విషయంలో తలెత్తే వివాదాలను పరిశీలించడానికి ఒక అంతర్రాష్ట్ర మండలిని ఏర్పాటు చేయాలి.
- రాష్ట్రాల అవసరాలకు సంబంధించిన బిల్లులను అంతర్రాష్ట్ర మండలి అనుమతితోనే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి.
- కేంద్ర, ఉమ్మడి జాబితాల్లోని పాలనా పరమైన అంశాలను పునఃపరిశీలించడానికి ఒక ఉన్నత స్థాయి సంఘాన్ని ఏర్పాటు చేయాలి.
- రాజ్యసభలో అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం ఇవ్వాలి.
- రాజ్యసభకు 12 మందిని నియమించే రాష్ట్రపతి అధికారాన్ని రద్దు చేయాలి.
- కేంద్ర మంత్రి మండలిలో అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలి.
- పార్లమెంట్ చేసే అన్ని రాజ్యాంగ సవరణలను 2/3వ వంతు మెజార్టీతో రాష్ట్ర శాసనసభ ఆమోదించాలి.
- పన్నుల విధింపునకు సంబంధించిన అవశేష అధికారాలను రాష్ట్రాలకు ఇవ్వాలి.
- ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయం కింద రాష్ట్రాలకు అందించే ఆర్థిక సహాయం ఆర్థిక సంఘం సూచనలకు అనుగుణంగా ఉండాలి.
- రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలన విధించడానికి అవకాశమిచ్చే రాజ్యాంగ అధికరణలు 356, 357, 365లను రద్దు చేయాలి.
- రాష్ట్రాల్లో ఉన్నత స్థాయి (హైకోర్టు) న్యాయమూర్తుల తొలగింపు ప్రక్రియలో శాసనసభ అభిప్రాయాన్ని కూడా తీసుకోవాలి.
- అఖిల భారత సర్వీసులైన ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లను రద్దు చేయాలి.

రాజమన్నార్ కమిటీ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించలేదు. ఈ కమిటీ సిఫార్సులపై దేశవ్యాప్తంగా తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. దేశంలో వేర్పాటువాద శక్తులు బలపడుతుంటే జాతి నిర్మాణం, జాతీయ సమైక్యత కోసం కృషి చేయడానికి; విద్య, వ్యవసాయం, మౌలిక సదుపాయాలు,ఉత్పత్తి రంగాలను బలోపేతం చేసి సామాన్య మానవుడి సమస్యలను తీర్చడానికి ప్రయత్నాలు చేయాల్సి ఉండగా.. కేవలం రాష్ట్రాలకు అనుకూలంగా, ప్రాంతీయతత్వాన్ని ప్రోత్సహించే విధంగా సిఫార్సులు చేయడం సరికాదని పేర్కొన్నారు.



సర్కారియా కమిషన్‌ను కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై నియమించిన మొదటి కమిషన్‌గా పేర్కొంటారు. ఇందిరాగాంధీ హయాంలో కేంద్ర ప్రభుత్వం రంజిత్‌సింగ్ సర్కారియా అధ్యక్షతన ఈ కమిషన్‌ను నియమించింది. ఇది కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై విస్తృత అధ్యయనం చేసి సమగ్ర నివేదిక సమర్పించింది. అనేక అంశాలపై లోతైన విశ్లేషణ, వివరణాత్మక పరిశీలన చేసింది. స్ఫూర్తివంతమైన సంబంధాలను నెలకొల్పడానికి, సమాఖ్య వ్యవస్థను బలోపేతం చేయడానికి దోహదపడే సూచనలిచ్చింది. దేశ సమగ్రత, ఐక్యతకు తోడ్పడే సిఫార్సులు చేసింది.

ఆనందపూర్ సాహెబ్ తీర్మానం (1973)

1973లో పంజాబ్‌లోని ఆనందపూర్ సాహెబ్ ప్రాంతంలో అకాలీదళ్ పార్టీ సమావేశమై కేంద్ర-రాష్ట్ర సంబంధాల విషయంలో ఒక తీర్మానం చేసింది. దీన్నే 'ఆనందపూర్ సాహెబ్ తీర్మానం' అంటారు. ఇందులో కేంద్ర ప్రభుత్వ పరిధి ప్రధానంగా రక్షణ, అంతర్జాతీయ సంబంధాలు, కమ్యూనికేషన్లు, కరెన్సీ తదితర అంశాల వరకే పరిమితం కావాలని, భారత్‌లో నిజమైన సమాఖ్య వ్యవస్థ స్ఫూర్తి తేవాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు.

సూచనలు

- పంజాబ్ నుంచి తీసుకున్న ప్రాంతాలను ఇతర రాష్ట్రాల్లో చేర్చినా, వాటిని తిరిగి పంజాబ్‌కు అప్పగించాలి.
- బహిరంగ ప్రదేశాల్లో మత్తు పానీయాలు సేవించడం, ధూమపానాన్ని నిషేధించాలి.
- పంజాబ్ వెలుపల నివసించే అల్ప సంఖ్యాక వర్గాలకు(సిక్కులు) అన్ని రకాల రక్షణలు కల్పించాలి. వారి పట్ల ఎలాంటి వివక్ష చూపకూడదు.
- రక్షణ, విదేశీ వ్యవహారాలు, తంతి-తపాలా, కరెన్సీ, నాణేలు, రైల్వేలు మినహా మిగతా పాలనా పరమైన అంశాలన్నింటినీ కేంద్ర ప్రభుత్వ పరిధి నుంచి తప్పించి రాష్ట్రాలకు బదిలీ చేయాలి.
- మాజీ సైనికులకు పునరావాస సౌకర్యాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలి.

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ తీర్మానం (1977)

కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం 1977లో ఒక విజ్ఞాపన పత్రం సమర్పించింది. ముఖ్యాంశాలు..

- భారత రాజ్యాంగంలో 'యూనియన్' అనే పదాన్ని తొలగించి 'సమాఖ్య' పదాన్ని చేర్చాలి.
- నూతన రాష్ట్రాల ఏర్పాటు ప్రక్రియలో సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలి.
- కేంద్ర ప్రభుత్వ అధికార పరిధిని తగ్గించాలి.
- రాజ్యసభకు కూడా లోక్‌సభతో సమానంగా అధికారాలను బదలాయించాలి.
- రాష్ట్రపతి పాలన, ఆర్థిక అత్యవసర పరిస్థితి లాంటి అధికారాలను తొలగించాలి.
- జాతీయ అభివృద్ధి మండలి పేరును జాతీయ ఆర్థికాభివృద్ధి మండలిగా మార్పు చేసి దాని అస్థిత్వాన్ని బలోపేతం చేసి పరిరక్షించాలి.
- త్రి భాషా సూత్రాన్ని అమలు చేయడానికి గట్టి ప్రయత్నం చేయాలి.
- ఆదాయ పన్నుపై సర్వీస్ చార్జీలను ప్రత్యేక సందర్భాల్లోనే విధించాలి.
- ఆర్థిక సంఘంలో సభ్యులుగా ఆర్థిక నిపుణులనే నియమించాలి.
- దేశంలోని అన్ని రాష్ట్రాలతో సంప్రదించి ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీస్, ఇండియన్ హెల్త్ సర్వీసు, ఇండియన్ ఎడ్యుకేషన్ సర్వీసులను ఏర్పాటు చేయాలి.
- మంత్రులపై విచారణ కమిషన్ ఏర్పాటు చేసే సందర్భంలో పార్లమెంట్ అనుమతి తీసుకోవాలనే నిబంధన విధించాలి.
- రాష్ట్రాల్లో శాసనమండలి ఏర్పాటు, రద్దు విషయంలో పార్లమెంట్ నిర్ణీత సమయంలోనే తన అభిప్రాయం వ్యక్తం చేయాలి.
- ప్రణాళిక సంఘం, ఆర్థిక సంఘం మధ్య విధుల విభజన హేతుబద్ధంగానే ఉంది కాబట్టి దీన్ని కొనసాగిస్తూ పరిపుష్టం చేయాలి.
- దేశ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా జాతీయ స్థాయి కార్యక్రమాలను ప్రాంతీయ భాషల్లో ప్రచారం చేయాలి.
- ఉమ్మడి జాబితాలో పేర్కొన్న అంశాలపై పార్లమెంట్ చట్టం చేసేటప్పుడు రాష్ట్రాలను తప్పనిసరిగా సంప్రదించాలి.
- కేంద్ర ప్రభుత్వ బలగాలను రాష్ట్ర ప్రభుత్వాల అనుమతి లేకుండా పంపించవద్దు.
- గవర్నర్ నియామకం చేపట్టేటప్పుడు సంబంధిత రాష్ట్ర ముఖ్యమంత్రిని విధిగా సంప్రదించే విధంగా రాజ్యాంగ సవరణ చేయాలి.
- టెలివిజన్, రేడియోలకు స్వయం ప్రతిపత్తి అవసరం లేదు కాబట్టి వాటి పనితీరును వికేంద్రీకరించాలి.
- అంతర్రాష్ట్ర మండలి వ్యవస్థను పునర్ వ్యవస్థీకరించాలి.
- అంతర్రాష్ట్ర మండలిని శాశ్వత ప్రాతిపదికపై ఏర్పాటు చేయాలి.
- రాష్ట్ర ప్రభుత్వాలకు కార్పొరేషన్ పన్నులో వాటా కల్పించాలి.
- భాషాపరమైన అల్ప సంఖ్యాక వర్గాల వారికి ప్రత్యేక కమిషన్ నియమించి అభివృద్ధిని సమీక్షిస్తూ ఉండాలి.

సర్కారియా కమిషన్ (1983)

కేంద్ర - రాష్ట్ర సంబంధాలను అధ్యయనం చేయడానికి 1983 జూన్ 9న కేంద్ర ప్రభుత్వం రంజిత్‌సింగ్ సర్కారియా అధ్యక్షతన కమిషన్‌ను నియమించింది. ఇందులో బి.శివరామన్, ఎస్.ఆర్. సేన్ సభ్యులుగా; ఆర్.ఎం.సుబ్రహ్మణ్యం కార్యదర్శిగా; ఎల్.ఎస్. సిన్హా రాజ్యాంగ సలహాదారుడిగా వ్యవహరించారు. ఈ కమిషన్ 247 సిఫార్సులతో సుమారు 5000 పేజీల నివేదికను 1987 అక్టోబర్ 27న కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. కేంద్ర ప్రభుత్వం సుమారు 230 సిఫార్సులపై నిర్ణయాలు తీసుకొని 170 సిఫార్సులను అమలు చేసింది.

ముఖ్యమైన సిఫార్సులు

కేంద్ర - రాష్ట్ర ఆర్థిక సంబంధాలు

కార్పొరేట్ పన్నును కేంద్ర-రాష్ట్రాలు పంచుకునేలా రాజ్యాంగాన్ని సవరించాలని సర్కారియా కమిషన్ సిఫార్సు చేసింది. తగిన రీతిలో పన్ను, ఎక్సైజ్ సుంకాలు పంచుకోవడంలో మార్పులు చేయాలని పేర్కొంది. అధికరణ 269ని సవరించి ప్రభుత్వ ప్రసార సంస్థల్లో వ్యాపార ప్రకటనలపై పన్ను విధించి దాన్ని పూర్తిగా రాష్ట్రాలకు ఇవ్వాలని సూచించింది. వృత్తి పన్ను, వాణిజ్య పన్నుల పరిమితిని పెంచాలని, ఆదాయ పన్ను మీద అదనపు సుంకం, పరిమిత ప్రయోజనాలకు పరిమిత గడువునే విధించాలని సిఫార్సు చేసింది.

రైల్వే ప్రయాణికుల చార్జీలపై పన్ను ప్రాతిపదికగా రాష్ట్రాలకు గ్రాంటులు ఇవ్వాలని సిఫార్సు చేసింది. ఖనిజాల రాయల్టీ రేట్లను ప్రతి నాలుగేళ్లకు కాకుండా రెండేళ్లకే సమీక్షించాలని సూచించింది. ఆర్థిక సంఘం నిర్ణయాలు తీసుకునే ముందు రాష్ట్రాలను సంప్రదించాలని సలహా ఇచ్చింది. సిఫార్సులను అమలు చేయడంలో ఆలస్యం చేయకూడదని కూడా పేర్కొంది.

కేంద్ర - రాష్ట్ర శాసన సంబంధాలు

- కేంద్ర జాబితాలోని ఎంట్రీ 97ను సవరించి అవశిష్ట అంశాలను (పన్నులు కాకుండా) ఉమ్మడి జాబితాలోకి మార్చాలని సూచించింది. ఉమ్మడి జాబితా విషయంలో కేంద్ర ప్రభుత్వం దేశ ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకొని ఏదైనా నూతన చట్టాన్ని రూపొందించేటప్పుడు రాష్ట్రాలను తప్పక సంప్రదించాలని సూచించింది. ఈ విషయంలో మంచి సంప్రదాయాలను నెలకొల్పాలని పేర్కొంది.
- రాష్ట్ర విధానసభ, విధాన మండలి ఏర్పాటుకు లేదా రద్దుకు ఆమోదించిన తీర్మానాన్ని రాష్ట్రపతి సహేతుక కాల వ్యవధిలో అనుమతించాలని, కేంద్ర ప్రభుత్వ సూచనలతో పాటు పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని సిఫార్సు చేసింది. పార్లమెంట్ దాన్ని ఆమోదించవచ్చు లేదా తోసిపుచ్చవచ్చు. ఆ శాసనం పార్లమెంట్ ఆమోదం పొందితే, కేంద్ర ప్రభుత్వం దాని అమలుకు చర్యలు తీసుకోవాలి.

అవసరమైతే అధికరణ 169ని దీనికి అనుగుణంగా సవరించాలని సూచించింది.

- రాష్ట్రానికి సంబంధించిన బిల్లులను గవర్నర్ కేంద్రం పరిశీలనకు పంపించడం గురించి సర్కారియా కమిషన్ సవివరమైన సూచనలు చేసింది. నిర్ణీత కాలంలో బిల్లులను పరిశీలించడంతో పాటు సాధారణ పరిస్థితుల్లో బిల్లును ఆమోదించాలని, విధానపర లోపాలున్నాయని లేదా త్వరలో సమగ్ర బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోతున్నామనే నెపంతో తిరస్కరించకూడదని కమిషన్ సూచించింది. బిల్లును తిరస్కరించడానికి కారణాలను సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేయాలి.

కేంద్ర - రాష్ట్ర పరిపాలనా సంబంధాలు

- అధికరణం 159ని సవరించి గవర్నర్ నియామకంలో రాష్ట్ర ముఖ్యమంత్రిని సంప్రదించేలా చూడాలని సర్కారియా కమిషన్ సూచించింది. గవర్నర్‌గా నియమించే వ్యక్తికి కింద పేర్కొన్న లక్షణాలు ఉండాలని కమిషన్ సిఫార్సు చేసింది.
  1. ఏదైనా ఒక రంగంలో ప్రముఖ వ్యక్తిగా ఉండాలి.
  2. రాష్ట్రేతర వ్యక్తి అయుండాలి.
  3. రాజకీయాల్లో ఎక్కువగా పాల్గొనని, ముఖ్యంగా.. ఆ ప్రాంత రాజకీయాలతో పెద్దగా సంబంధం లేని వ్యక్తి అయుండాలి.

  కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి చెందిన వ్యక్తిని ఇతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు గవర్నరుగా పంపవద్దని కూడా సర్కారియా కమిషన్ సూచించింది.
- గవర్నర్ నియామకంలో ఉప రాష్ట్రపతి, లోక్‌సభ స్పీకర్, ప్రధానమంత్రిని సంప్రదించడం మంచిదని కమిషన్ సూచన. గవర్నర్లను పదవీకాలం పూర్తయ్యే వరకూ కొనసాగించాలని, ఒకవేళ ముందే తొలగిస్తే.. ఏ కారణం వల్ల అలా చేస్తున్నారో తెలపాలని పేర్కొంది. తగిన వివరణ ఇవ్వడానికి గవర్నర్‌కు అవకాశం కల్పించాలని సిఫార్సు చేసింది.
- గవర్నర్ ఇచ్చిన వివరణను రాష్ట్రపతి, స్పీకర్, పదవీ విరమణ చేసిన ఉన్నత న్యాయమూర్తితో కూడిన సలహా సంఘం పరిశీలించాలని కమిషన్ పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ ముందు ఆ గవర్నర్ తొలగింపునకు సంబంధించి వ్యాఖ్య చేయాలని సూచించింది. అలాంటి వ్యక్తి పదవీ విరమణ తర్వాత గవర్నర్, ఉప రాష్ట్రపతి పదవులు తప్ప ఎలాంటి కేంద్ర, రాష్ట్ర పదవులను చేపట్టకుండా, రాజకీయాల్లోకి రాకుండా అనర్హత విధించాలని సూచించింది. పదవీ విరమణ ప్రయోజనాలు ఏర్పరచాలని తెలిపింది. అధికరణం 163లో ఉన్న గవర్నర్ వివేచనాత్మక అధికారాన్ని ఏ మాత్రం మార్చకూడదని, ఆ అధికారాన్ని ఎలా ఉపయోగించాలనే విషయంలో మార్గదర్శక సూత్రాలు ఏర్పర్చడం సాధ్యం కాని పని అని తెలిపింది.

Sivani is a wiser girl than Bhavani



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

జనరల్/ బేసిక్ ఇంగ్లీష్

విశేషణాలు (Adjectives)

వాడుకలో కొన్ని ముఖ్య నియమాలు

Rule 1:

కొన్ని క్రియలను adverbsతో modify చేయలేం. వీటిని verbs of incomplete predication అంటాం. అంటే వీటి అర్థం Complete అవడానికి ఏదైనా Complement అవసరం. ఈ క్రియలకు Adjectivesను complementగా వాడతారు.

Verbs: 'be' దాని రూపాలు (is, am, are, was, were), become, seem, appear, taste, smell, round, feel, turn, get, grow, keep, look, make, prove etc.

'Her voice sounds...' ఈ వాక్యానికి అర్థం లేదు. sounds how? అని ప్రశ్నిస్తే sweet, bitter, harsh. ఇలా ఏదో ఒక adjective complement అవసరం.

Ex: 1) She appears sad.
2) His statements sounds queer.
3) He feels sick.
4) The flowers smell sweet.
5) You have grown wise.
6) She looked dainty.
7) Seema is smart.

Rule: 2

కొన్ని adjectivesని comparative, superlative degreesలో చెప్పకూడదు. ఈ adjectives వాటికవే absolute conditionని తెలియజేస్తాయి.

Such adjectives are: perfect, excellent, unique, ideal, extreme, complete, eternal, supreme, etc.

Ex:1) I have never seen a more complete book on English figures of speech.('more' అవసరం లేదు)
2) Happiness is the chiefest aim of life. (chiefest తప్పు.'chief'అని రాయాలి)
3) Each person's fingerprints are most unique. ('most' అవసరం లేదు)
4) Most extreme poverty still exists in many parts of India ('most' అవసరం లేదు)

Rule: 3

-orతో అంతమయ్యే కింది comparatives లాటిన్ భాష నుంచి వచ్చాయి. వీటిని to తో ప్రయోగిస్తాం. thanతో కాదు.

Ex:1) Abdul is inferior to Amar in intelligence. (inferior than... అని రాయొద్దు)
2) Sunanda is senior to me.
3) All his friends are junior to him.
4) This incident took place prior to the fire accident.
5) The U turn is posterior to their deceptive win. (happened or existed later something else).

అలాగే -or తోనే అంతమయ్యే మరికొన్ని Comparative రూపాలు వాటి Comparative forceను కోల్పోతాయి. వాటిని మామూలు Positive Adjectives గానే వాడతాం. వీటిని Comparative, Superlative forms లేకుండానే ప్రయోగిస్తాం.

Ex:1) The interior walls of the house are painted white.
2) The exterior walls of the house are studded with mosai.
3) His words are of minor/major importance.

రెండు లేదా అంతకంటే ఎక్కువ వస్తువులను లేదా వ్యక్తులను పోల్చినప్పుడు thanను వాడుతాం. ఎంపిక చేసిన వాటి గురించి చెప్పేటప్పుడు ofను Comparative adjectivesగా తీసుకుంటాం.

Ex:1) Yogesh is more deceptive than Tabu.
2) Sivani is a wiser girl than Bhavani.

Note: Double comparative, double Superlativesను వాడొద్దు.

Ex:1) She is more wiser than her Sister(ఇది తప్పు. పై వాక్యంలో moreను తొలగించాలి)

కానీ సాహిత్యంలో Shakespeare లాంటి మహామహులు దీనికి మినహాయింపుగా అంగీకరించాలి.

Ex:1) The most Kindest Brutus.
2) The honester (in stead of 'more honest') attitude.

more hotter, most poorest ఇలా చాలా ప్రయోగాలు ఆయన సాహిత్యంలో మనకు కనిపిస్తాయి. మొత్తం మీద 'lesser'అనే ప్రయోగం వాడుకలో ఉంది. మంచి రచయితలు ఈ పదాన్ని స్వాగతిస్తున్నారు.

Ex:1) He chose the lesser of the two evils.

అలాగే Prefer, preferable అనే పదాలు Comparative force ని కలిగి ఉన్నాయి. వీటిని 'to'తో ప్రయోగిస్తాం.'than'తో కాదు. 'more' అనే పదాన్ని వీటితో వాడొద్దు.

Ex: 1) He has his own scheme he thinks preferable to that of his own brother.

ఎక్కడ 'fewer' అవసరమో అక్కడ 'less' వాడకూడదు. ఎందుకంటే 'less' quantityని, 'fewer' number ని denote చేస్తాయి. 'few' కు comparative.. fewer.

Ex:1) Fewer women wear hats these days.
2) There are fewer (not 'less') tigers than there were a hundred years ago.
3) I don't accept less than (not' fewer) a thousand for my each article. (here, a thousand rupees. Though 'rupees' are countable, indicating number, it is considered a Sum of amount).
4) This is a less bad (or less bad a) solution than I thought possible

'older' and 'oldest'లను persons, things రెండింటికీ వాడొచ్చు. కానీ elder and eldest వ్యక్తులకు మాత్రమే వాడాలి. ప్రత్యేకించి ఒకే కుటుంబ సభ్యులకు మాత్రమే.

'older, oldest' refer both to age and time while 'old, elder, eldest' refer to age only.

Ex:
1) Babu is older than Jagan.
2) Pandu is my elder brother.
3) Patricia is the eldest of the Vicar's family.
4) This is the oldest tree in the garden (not 'eldest tree')

In the sense of 'one who is older than another'.

5) Respect your elders.
6) He is elder to me (not 'elder than I').

'few' and 'a few' have different meanings. 'few' is negative and equivalent to hardly any, not many.

Ex: 1) Many are called but few are chosen.
2) Few people or persons can keep a secret.

'A few' is positive and equivalent to 'some'.

Ex:1) There are a few books in the old library.
2) I have a few friends.

' The few' denotes 'not many'. It has both a positive and a negative meaning.

Ex:1) The few are rich, the many are poor.
2) He lost the few thousands he had.
3) The money he lost was not much (Negative).

He lost all the money he had (Positive) ఇలాగే little, a little, the little ప్రయోగం కూడా.

'Little' means 'hardly any' or 'not much'.

It has a negative meaning.

Ex:1) There was little food left in the bowl.
2) There is little hope of his execution of promises made to the people.
3) 'A little' denotes 'some at least'. It has positive meaning.
4) Here is a little hope of his recovery.
5) I have a little money.
6) A little knowledge is always dangerous.

'the little' denotes 'the small quantity'. It has both a positive and a negative meaning.

Ex: 1) I spent the little money I had (నా దగ్గర ఉన్న కొంచెం డబ్బులు నేను ఖర్చు పెట్టేశాను).

It means:

The money I had wasn't much(negative).

I spent all the money I had (positive).

'Later' is the opposite of 'earlier' It refers to 'Time'.

Latest 'means ' recent', last up to now only'.

దీనికి మూడు రూపాలు:

'Late - later - latest.

'Last' mean 'final' or 'last-of all'

దీనికి 3 రూపాలు.

later - latter - last.

Practice Bits

1. Fill in the blank with suitable word.
There is no secret between her and ______
1) I 2) me
3) mine 4) he
2. Fill in the blank with correct pronoun.
______were you talking to?
1) To whom 2) Whom
3) Who 4) Whom
3. Supply suitable article.
He is______ heir of the property besides his cousin.
1) the 2) an
3) a 4) No article needed
4. He ______ (come) this morning. Supply the correct verb form.
1) came 2) will come
3) has come 4) is coming.
5. There ______ many a flower in the garden.
1) is 2) are
3) was 4) were
6. He died ______ a fatal blow.
1) from 2) of
3) with 4) for
7. His ruling is not ______ than the ruling of the past.
1) more better 2) much better
3) better 4) more fairer
8. ______ you please help me do this?
1) Would 2) Will
3) Could 4) Can
9. He is born ______ very rich parents.
1) to 2) of
3) by 4) for
10. One of my friends ______ saved the life of a boy.
1) have 2) are saved
3) has 4) has been
11. I______ my bed. I will just come.
1) am making
2) am doing
3) am setting
4) am arranging
12. Dad, ______ Mr Sastry is on line for you. Come soon.
1) No article 2) a
3) the 4) one
13. He completed reading______ books he had.
1) a few 2) few
3) the few 4) some
14. If I had money, I ______ you.
1) will lend 2) will be lending
3) would have lent
4) could have lent
15. I am looking forward______ you very soon.
1) to meet 2) to meeting
3) meet 4) to be met

Key

1) 2	2) 2	3) 2	4) 3
5) 1	6) 1	7) 3	8) 3
9) 2	10) 3	11) 1	12) 2
13) 3	14) 4	15) 2	

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

కులం ఆవిర్భావానికి మూలం ఏది?

భారతదేశంలో ఒక ప్రత్యేక రకమైన సామాజిక స్తరీకరణ (Social Stratification) కనిపిస్తుంది. దీన్ని 'కుల వ్యవస్థ'గా పేర్కొంటారు. ప్రపంచం మొత్తం మీద పరిశీలిస్తే కొన్ని ప్రాంతాల్లో కులం లక్షణాలు కనిపిస్తున్నప్పటికీ భారత్‌లోని కులవ్యవస్థ విశిష్టమైంది. హిందూ సామాజిక వ్యవస్థ కుల విధానంపై ఆధారపడి ఉంది. కులం అనేది ఏ మాత్రం సరళత లేని అంశంగా పరిణమించింది.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సోషియాలజీ

కులం - కులతత్వం

కులం అనే పదం 'Caste' అనే పోర్చుగీస్ పదం నుంచి ఉద్భవించింది. కాస్ట్ అంటే..

1) వారసత్వం
2) వంశ పారంపర్యంగా కలిగేది

అనే అర్థాలున్నాయి.

కుల వ్యవస్థ భారతీయ సామాజిక వ్యవస్థకు ఒక 'మూలస్తంభం'గా ఉంది. హిందూ సమాజం మినహాయించి మరే ఇతర సమాజంలోనూ కులాలు కనిపించవు. వివిధ పరిశోధకులు కులానికి సంబంధించి భిన్న రకాల నిర్వచనాలు ఇచ్చారు.

'కొన్ని సమూహాలు లేదా కుటుంబాలు కలిసి ఒకే పేరుతో, ఒకే విధమైన వంశానుక్రమంతో ఉండి వంశపారంపర్యంగా ఒకే విధమైన పేరుతో గుర్తింపు పొందడాన్ని కులం అంటారు' - **హెర్బర్ట్ రిస్లీ**

'కులం అంటే ఒక పరధీకృతమైన సమూహం (Closed Group)'

- **టి.ఎన్. మదన్, డి.ఎన్. మజుందార్**

'ఒక వర్గం (Single Group) కచ్చితంగా వారసత్వాన్ని పాటించినప్పుడు దాన్ని కులంగా పేర్కొనవచ్చు' - **సి.హెచ్. కూలే**

ఎమ్.ఎన్. శ్రీనివాసన్, హట్టన్ కులం ఆవిర్భావం గురించి పేర్కొన్నారు.

కులం ఆవిర్భావం

భారతదేశంలో సాహిత్య రచన ఆర్యుల కాలంలో (క్రీ.పూ. 1500 నుంచి క్రీ.పూ. 500 మధ్య) జరిగింది. ఈ సాహిత్యాన్ని ప్రధానంగా 8 రకాలుగా గుర్తించవచ్చు. **అవి:**

1) వేదాలు
2) బ్రాహ్మణాలు
3) అరణ్యకాలు
4) ఉపనిషత్తులు
- వేదాంగాలు
- పురాణాలు
- ఉపవేదాలు
- ఇతిహాసాలు

వేదాలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులను 'శృతి సాహిత్యం' అంటారు. అంటే 'అతి పవిత్రమైనవి' అని అర్థం. వీటినే 'అపౌరుషేయాలు'గా పేర్కొంటారు. అంటే దేవతలు రాసి ప్రజలకు ఇచ్చారు అని అర్థం.

వేదం అంటే 'నాలెడ్జ్ ' అని అర్థం. వేదాలు నాలుగు. **అవి:**

1) రుగ్వేదం
2) యజుర్వేదం
3) సామవేదం
4) అధర్వణ వేదం

రుగ్వేదంలో పదో అధ్యాయంలో 1028 శ్లోకాలు ఉన్నాయి. ఈ అధ్యాయంలోనే 'పురుష సూక్తం' గురించి ఉంది. సమాజాన్ని వర్ణం ఆధారంగా బ్రహ్మ నాలుగు రకాలుగా సృష్టించాడని 'పురుష సూక్తం'లో పేర్కొన్నారు.

వర్ణం అంటే రంగు అని అర్థం. వర్ణం ఆధారంగా బ్రహ్మ కింద పేర్కొన్న సామాజిక వర్గాలను సృష్టించాడని రుగ్వేదంలో తెలిపారు.

1) బ్రాహ్మణులు (తెలుపు)
2) క్షత్రియులు (ఎరుపు)
3) వైశ్యులు (పసుపు)
4) శూద్రులు (నలుపు)

ఈ వర్గీకరణలో మొదటి 3 వర్ణాలకు చెందినవారిని 'ద్విజులు' అంటారు. అంటే రెండుసార్లు (తల్లి గర్భం నుంచి, ఉపనయనం నుంచి) జన్మించినవారని అర్థం. శూద్రులకు ఉపనయనం లేదు. వీరికి కర్మకాండలు చేసే అర్హత కూడా లేదు.

ఆర్యుల సాహిత్యంలోని వేదాంగాలను ఆరు రకాలుగా వర్గీకరించవచ్చు.

అవి: 1) శిక్ష, 2) నిరుక్త, 3) వ్యాకరణం, 4) జ్యోతిషం, 5) ఛందస్సు, 6) కల్ప

'కల్ప' అనేది యజ్ఞయాగాదుల గురించి తెలుపుతుంది. ఇందులో మూడు రకాల సూత్రాలు ఉన్నాయి. వీటిలో గృహ సూత్రం ప్రధానమైంది.

గృహ సూత్రం: రాజు మోక్షం సాధించడానికి చేయాల్సిన 16 పౌరుశ కర్మల గురించి పేర్కొంటుంది. వీటిలో 11వ కర్మ 'ఉపనయనం' గురించి వివరిస్తుంది. ఈ కర్మ నిర్వహిస్తే మోక్షం పొందొచ్చని భావిస్తారు.

◆ శూద్రులతో పాటు స్త్రీలకు కూడా ఉపనయనం లేదు.

వర్ణ వ్యవస్థ నిర్మితి, ఆచరణ, వివరణ అంతా సమాజంలో సామరస్యం సాధించడానికే ఏర్పాటైంది. కానీ చాతుర్వర్ణ వ్యవస్థలో పైవర్ణంవారు కింది వర్ణం అయిన శూద్రులను 'దాసులు'గా చూడటం ప్రారంభించారు. ఆ తర్వాత క్రమంగా వివిధ వృత్తులు ఏర్పడ్డాయి.

కాలక్రమేణా బౌద్ధ, జైన మతాల ఆవిర్భావంతో సమాజంలో అనేక మార్పులు సంభవించాయి. అంతర్వర్ణ వివాహాలను అంగీకరించారు. అనులోమ, ప్రతిలోమ వివాహాలు కూడా జరిగాయి.

ఉన్నత వర్ణాలకు చెందిన పురుషుడు తక్కువ వర్ణాలకు చెందిన యువతిని వివాహం చేసుకోవడం 'అనులోమ వివాహం'. తక్కువ వర్ణంలోని పురుషుడు ఉన్నత వర్ణానికి చెందిన స్త్రీని వివాహం చేసుకోవడం 'ప్రతిలోమ (విలోమ) వివాహం'. ఈ విధంగా జరిగిన వివిధ రకాల వివాహాల కారణంగా 'వర్ణ సంకరం' ఏర్పడింది.

వర్ణ వ్యవస్థ పరివర్తన చెంది విస్తృతమవడం వల్ల జాతులు ఆవిర్భవించాయి. కాలక్రమేణా ఇవి కులాలుగా ఏర్పడ్డాయి. ఇలా ఏర్పడ్డ కులం తదనంతర కాలంలో అనేక ఉపకులాలుగా విభజితమైంది. ఈ విధంగా 'వర్ణ వ్యవస్థ' నుంచి 'కుల వ్యవస్థ' ఏర్పడింది.

కులం ఆవిర్భావ సిద్ధాంతాలు

హిందూ సమాజంలో కుల వ్యవస్థ ఒక ప్రత్యేక లక్షణం. ఇది ఎప్పుడు, ఏవిధంగా ప్రారంభమైందో స్పష్టంగా చెప్పలేనప్పటికీ కొంత మంది సామాజిక శాస్త్రవేత్తలు దీని పుట్టుక గురించి కొన్ని సిద్ధాంతాలు ప్రతిపాదించారు.



దైవాంశ సంభూత సిద్ధాంతం: దీని ప్రకారం కులవ్యవస్థ దైవాంశమైంది. హిందువులకు ప్రమాణం 'వేదం'. రుగ్వేదంలోని పురుష సూక్తంలో బ్రహ్మదేవుడు నాలుగు వర్ణాలను సృష్టించాడని పేర్కొన్నారు. భగవద్గీత కూడా అత్యంత ప్రాచీన గ్రంథం. హిందువులకు ప్రామాణికం. ఇందులో కృష్ణుడు తన వల్లే నాలుగు వర్ణాలు ఉద్భవించాయని చెప్పినట్లు పేర్కొన్నారు. విష్ణు పురాణం, వేదాల్లోనూ ఈ సిద్ధాంతం ప్రస్తావన ఉంది. దీన్ని శాస్త్రీయంగా అంగీకరించడానికి ఆధారాలు లేవు.

జాతి సిద్ధాంతం: ఈ సిద్ధాంతాన్ని హెర్బర్ట్ రిస్లీ అభివృద్ధి చేశాడు. ఇతడి ప్రకారం.. ఆర్యులు, ద్రావిడులు, మంగోలియన్ లాంటి వివిధ తెగల మధ్య సంఘర్షణలు తలెత్తినప్పుడు ప్రతి తెగ ప్రత్యేక లక్షణాలను కాపాడుకునే ఉద్దేశంతో ఒక సమూహంగా ఏర్పడి తర్వాత ఆ సమూహం 'కులం'గా మారింది. తమ వ్యక్తిత్వాన్ని కాపాడుకోవడానికి సమూహంలోని సభ్యులందరూ కట్టుబడి ఉండాల్సిన కొన్ని నియమాలను ఏర్పరచుకున్నారు. ఈ విధంగా అనేక కులాలు ఆవిర్భవించాయి.

వృత్తి సిద్ధాంతం: ఈ సిద్ధాంతాన్ని నెస్‌ఫీల్డ్ తెలిపాడు. ఇతడు కులం ఆవిర్భావానికి కారణం వృత్తి అని పేర్కొన్నాడు. వ్యవసాయం, పరిశ్రమల వల్ల జీవన క్రమంలో వచ్చిన మార్పుల ఆధారంగా కులాలు ఏర్పడ్డాయని ఈ సిద్ధాంతం వివరిస్తోంది. వ్యక్తులు నిర్వహించే వృత్తి ఆధారంగా ఒక స్థితి, ఒక ప్రత్యేకత ఏర్పడ్డాయి. లోహాల వినియోగం కంటే ముందు ఉన్న కులాలకు తక్కువ స్థాయి; లోహాలు, పరిశ్రమల ఆవిర్భావం తర్వాత ఉన్న వృత్తులకు 'ఉన్నత స్థాయి' ఉందని ఇతడు పేర్కొన్నాడు.

సంస్కార సిద్ధాంతం: దీన్ని ఎ.ఎం. హోకర్ట్ ప్రతిపాదించాడు. 'భారతదేశంలో మత సంస్కారాలకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. ఇందులో భాగంగా మంత్రాలు చదవడం, ప్రదేశాన్ని శుభ్రం చేయడం, అలంకరించడం, మేళతాళాలు వాయించడం మొదలైన వాటి వల్ల కులాలు ఏర్పడ్డాయి' అని ఇతడు వివరించాడు.

భౌగోళిక సిద్ధాంతం: ఈ సిద్ధాంతాన్ని గిల్బర్ట్ ప్రతిపాదించాడు. దీని ప్రకారం.. భారతదేశం సువిశాలమైంది. వివిధ రకాల వాతావరణ పరిస్థితులు, వనరులను, సముద్ర తీర ప్రాంతాలు, నదీ మైదానాలు, మెట్ట ప్రాంతాలు, పర్వత ప్రాంతాలు లాంటివి ఉన్నాయి. ఇక్కడ నివసించే ప్రజలు ఆయా ప్రదేశాల్లోని పరిస్థితులకు అనుగుణంగా తమ జీవన విధానాన్ని సర్దుబాటు చేసుకొని జీవిస్తారు. వ్యవసాయం, పశుపోషణ, చేపలు పట్టడం ఈ విధంగానే ఏర్పడ్డాయి. ఇలాంటి జన సమూహాలే 'కులాలు'గా ఆవిర్భవించాయి.

సాంస్కృతిక సిద్ధాంతం: దీన్ని ఎస్.పి. రాయ్, అతడి అనుచరులు ప్రతిపాదించారు. దీని ప్రకారం సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడానికి ఒక సమూహంలోని ప్రజలు ఆ సమూహాన్ని 'కులం'గా రూపొందించుకున్నారు.

మాదిరి ప్రశ్నలు

1. 'కులం' అనేది ఏ భాషా పదం నుంచి ఆవిర్భవించింది?
   ఎ) ఫ్రెంచ్ బి) లాటిన్
   సి) పోర్చుగీస్ డి) అరబిక్
2. 'కులవ్యవస్థ' దేని నుంచి ఉద్భవించింది?
   ఎ) వర్ణ వ్యవస్థ బి) వర్గ వ్యవస్థ
   సి) వృత్తి వ్యవస్థ డి) ఏదీకాదు
3. జతపరచండి.

1. జాతి సిద్ధాంతం	ఎ) హెర్బర్ట్ రిస్లీ
2. వృత్తి సిద్ధాంతం	బి) నెస్ ఫీల్డ్
3. సంస్కార సిద్ధాంతం	సి) ఎ.ఎం. హోకర్ట్
4. భౌగోళిక సిద్ధాంతం	డి) గిల్బర్ట్

   ఎ) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి
   బి) 4-ఎ, 3-బి, 2-సి, 1-డి
   సి) 1-ఎ, 2-డి, 3-బి, 4-సి
   డి) 1-సి, 2-ఎ, 3-డి, 4-బి
4. వర్ణ వ్యవస్థ ప్రస్తావన ఏ 'వేదం'లో కనిపిస్తుంది?
   ఎ) రుగ్వేదం బి) యజుర్వేదం
   సి) సామవేదం డి) అధర్వణ వేదం
5. 'ఉపనయనం' ఏ వర్ణం వారికి వర్తించదు?
   ఎ) తెలుపు బి) నలుపు
   సి) ఎరుపు డి) పసుపు
6. 'చతుర్వర్ణ వ్యవస్థ' ఎక్కడ పేర్కొన్నారు?
   ఎ) వేదాలు బి) అరణ్యకాలు
   సి) బ్రాహ్మణాలు డి) ఉపనిషత్తులు
7. కింద పేర్కొన్నవారిలో 'ద్విజులు' కానివారు?
   ఎ) బ్రాహ్మణులు బి) క్షత్రియులు
   సి) వైశ్యులు డి) శూద్రులు
8. 'చాతుర్వర్ణ వ్యవస్థ'లో పై స్థాయి వారు?
   ఎ) శూద్రులు బి) క్షత్రియులు
   సి) బ్రాహ్మణులు డి) వైశ్యులు
9. 'ఉపనయనం' గురించి ఎందులో పేర్కొన్నారు?
   ఎ) గృహ సూక్తం బి) శ్రేత సూక్తం
   సి) సుశువ సూక్తం డి) ఏదీకాదు
10. 'కులవ్యవస్థ' ఎప్పుడు ఆవిర్భవించింది?
   ఎ) 400 బి.సి. బి) 200 ఎ.డి.
   సి) 1000 ఎ.డి. డి) కచ్చితంగా చెప్పలేం


సమాధానాలు

1) సి; 2) ఎ; 3) ఎ; 4) ఎ; 5) బి; 6) ఎ; 7) డి; 8) సి; 9) ఎ; 10) డి.

A computer-intensive problem runs on..



CLASSIFICATION OF COMPUTERS



DIGITAL COMPUTER

A computer that performs calculations and logical operations with quantities represented as digits, usually in the binary number system.

(i) CLASSIFICATION BASED ON PURPOSE:

General purpose computers: These are designed to perform a range of tasks. They have the ability to store numerous programs, but lack in speed and efficiency.

Specific purpose computers: These are designed to handle a specific problem or to perform a specific task. A set of instructions is built into the machine.

(ii) CLASSIFICATION BASED ON SIZE AND PERFORMANCE WISE:

EMBEDDED COMPUTERS

It is a computer system with a dedicated function within a larger mechanical or electrical system, often with real-time computing constraints. Embedded systems are commonly found in consumer,cooking,industrial,automotive, medical, commercial and military applications such as microwave ovens, washing machines and dishwashers, include embedded systems to provide flexibility, efficiency and features.

MICRO COMPUTER OR PERSONAL COMPUTER

- **Desktop Computer:** a personal or micro-mini computer sufficient to fit on a desk.
- **Laptop Computer:** a portable computer complete with an integrated screen and keyboard. It is generally smaller in size than a desktop computer and larger than a notebook computer.
- **Palmtop Computer/ Digital Diary /Notebook /PDAs:** a hand-sized computer. Palmtops have no keyboard but the screen serves both as an input and output device.
- **Workstations**

A terminal or desktop computer in a network. In this context, workstation is just a generic term for a user's machine (client machine) in contrast to a "server" or "mainframe."

Mini Computer

It is a midsize computer in size and power, minicomputers lie between workstations and mainframes in general, a minicomputer is a multiprocessing system capable of supporting from 4 to about 200 users simultaneously.

Mainframe Computer

A very large and expensive computer capable of supporting hundreds, or even thousands, of users simultaneously. In some ways, mainframes are more powerful than supercomputers because they support more simultaneous programs. These are mainly used servers in banks.

Super Computer

The fastest and most powerful type of computer Supercomputers are very expensive and are employed for specialized applications that require immense amounts of mathematical calculations. For example, weather forecasting requires a supercomputer. Other uses of supercomputers include animated graphics, fluid dynamic calculations, nuclear energy research, and petroleum exploration.

ANALOG COMPUTER

An analog computer (spelt analogue in British English) is a form of computer that uses continuous physical phenomena such as electrical, mechanical, or hydraulic quantities to model the problem being solved

Hybrid Computer (Analog + Digital)

A combination of computers those are capable of inputting and outputting in both digital and analog signals. A hybrid computer system setup offers a cost effective method of performing complex simulations.

MODEL BITS

1. The product of two binary numbers (1011) and (1001) is____
   1) 1011001 2) 1010100
   3) 1100011 4) 100110
   5) None of these
2. MS -DOS is usually supplied on a
   1) Hard disk
   2) floppy disk or diskettes
   3) CD ROM 4) Cartridge tape
   5) None of these
3. When a key is pressed on the keyboard, which standard is used for converting the keystroke into the corresponding bits?
   1) EBCDIC 2) ASCII
   3) ANSI 4) ISO
   5) None of these
4. A thing present in real world in physical form is called ____
   1) DBMS 2) Keywords
   3) Modulation 4) Entity
   5) None of these
5. Programming language built into user programs such as Word and Excel are known as____?
   1) 4GLs
   2) Visual programming languages
   3) Object-oriented languages
   4) Macro languages
   5) None of these
6. A program that generally has more user-friendly interface than a DBMS is called a ____?
   1) form 2) repository
   3) back end 4) front end
   5) None of these
7. Antivirus software is an example of____
   1) a security utility
   2) an operating system
   3) business software
   4) an office suite
   5) None of these
8. System software is the set of programs that enables your computer's hardware devices and ____ software to work together.
   1) application 2) processing
   3) utility 4) management
   5) None of these
9. In a ring topology, the computer in possession of the______ can trasmit data.
   1) packet 2) token
   3) access method 4) data
   5) None of these
10. A computer-intensive problem runs on a ____.
   1) supercomputer
   2) mainframe 3) server
   4) super PC 5) None of these
11. The term _____ designates equipment that might be added to a computer system to enhance its functionality.
   1) peripheral device
   2) system add-one
   3) disk pack
   4) digital device
   5) None of these
12. A collection of interrelated files in a computer is a _____.
   1) file manager 2) field
   3) database 4) record
   5) None of these
13. When installing _____, the user must copy and usually decompress program files from a CD-ROM or other medium to the hard disk.
   1) programming software
   2) applications software
   3) applications hardware
   4) system hardware
   5) None of these
14. ____is the ability of an operating system to control the activities of multiple programs at the same time.
   1) Multitasking 2) Streamlining
   3) Multiuser 4) Simulation
   5) None of these
15. Which of the following computer language is a mathematically oriented languages used for scientific problems?
   1) FORTRAN 2) COBOL
   3) LISP 4) PROLOG
   5) APPLE
16. Which of the following terms is just the connection of personal networks that can be joined together?
   1) Virtual private network
   2) Internet 3) Intranet
   4) Extranet 5) None of these
17. For large network which topology is used?
   1) Star 2) Ring 3) Bus
   4) Mesh 5) None of these
18. A special high-speed line used by large corporations to support digital communications is known as:
   1) Satellite/ Air connection service lines
   2) Cable modems
   3) Digital subscriber lines
   4) T1, T2, T3 and T4 lines
   5) None of the above
19. A language that refers to the way people think mathematically is called as ____
   1) Functional language
   2) Cross-platform language
   3) Event driven programming language
   4) Object oriented language
   5) None of these
20. When you are typing the text in a document, you would need to hit the enter key at the end of every ______.
   1) line 2) sentence
   3) paragraph 4) word 5) file
21. _____ displays each slide of the PPT as a thumbnail and is used to re-arrange them.
   1) Slide Show 2) Slide Display
   3) Slide Design 4) Slide Layout
   5) Slide Sorter
22. If you want to find the Paste Special option, you would use the Clipboard group on the tab of PowerPoint _____
   1) Home 2) Slideshow
   3) Page Layout 4) Design
   5) Insert
23. In a pull down menu if you see that a command appears faded, it means that _____
   1) the command is not applicable to this document
   2) the command is not accessible at the moment
   3) there are no keystrokes equivalent to those commands.
   4) None of these
   5) All of these

KEY

1) 3 2) 2 3) 3 4) 4 5) 2
6) 4 7) 1 8) 1 9) 2 10) 1
11) 1 12) 3 13) 2 14) 1 15) 1
16) 3 17) 4 18) 4 19) 1 20) 3
21) 5 22) 1 23) 2